

'నా ప్రస్థానంలో ప్రతి మలుపూ జన జీవితంతో ముడిపడి ఉంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 352

బుధవారం 13-3-2024

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



పట్టాలపై జీవితం ఆరంభించా

రైలు పట్టాలపైనే తన జీవితాన్ని ప్రారంభించానన్న మోదీ - 6లో

పట్టాలెక్కిన సికింద్రాబాద్-విశాఖ రెండో వందేభారత్

వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధానమంత్రి మోదీ - 5లో



చనిపోయినా చిత్రవధ..

సోషల్ మీడియా వేధింపులకు తనువు చాలించిన గీతాంజలి మరణంపై పచ్చమూక తప్పుడు ప్రచారానికి పాల్పడుతోంది.

వివరాలు 10లో ▸



ఎవరికీ తలవంచేవాణ్ణి కాదు

లక్ష్మీనరసింహస్వామి ఆశీర్వచనం తీసుకోవడంలో భాగంగా కావాలనే కింద కూర్చున్నానని డిప్యూటీ సీఎం భట్టి తెలిపారు.

వివరాలు 3లో ▸



ఇకపై 'టీజీ'

రాష్ట్రంలోని వాహనాల రిజిస్ట్రేషన్‌కు ఇకపై టీజీ అని వాడనున్నారు. ఈ మేరకు కేంద్రం నోటిఫికేషన్ జారీ చేసింది.

వివరాలు 10లో ▸



ఖట్టర్ రాజీనామా

హరియాణా సీఎం పదవికి మనోహర్‌లాల్ ఖట్టర్ రాజీనామా చేయగా నూతన సీఎంగా నాయబ్ సైనీ ప్రమాణం చేశారు.

వివరాలు 6లో ▸

కాళేశ్వరంపై కమిషన్

జస్టిస్ పినాకిని చంద్రబోస్ నేతృత్వంలో జ్యుడీషియల్ విచారణకు కేబినెట్ నిర్ణయం

యాదాద్రి, భద్రాద్రి విద్యుత్ ప్లాంట్ల నిర్మాణంపైనా జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి అధ్యక్షతన మరో కమిషన్

రెండు కమిషన్లకూ 100 రోజుల గడువు

సీఎం రేవంత్ అధ్యక్షతన సమావేశమైన కేబినెట్

వివరాలు వెల్లడించిన మంత్రులు

కేబినెట్ కీలక నిర్ణయాలివీ..

- 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం
- త్వరలో అర్హులైన పేదలందరికీ తెల్లరేషన్‌కార్డులు
- రేషన్‌కార్డుతో ఆరోగ్యశ్రీ పథకాన్ని విడదీయాలని నిర్ణయం
- ఎస్‌హెచ్‌జీలకు ఓఆర్ఆర్ చుట్టూ 30 ఎకరాలు
- మహిళల సాధికారత కోసం 'తెలంగాణ మహిళా శక్తి'
- డీఎస్సీ 2008 క్వాలిఫైడ్ అభ్యర్థులకు కొలువులు
- ఓబీసీ, ఎస్సీ, ఎస్టీల కోసం కొత్తగా 16 కార్పొరేషన్లు

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుపై సుప్రీంకోర్టు మాజీ జడ్జి జస్టిస్ పినాకిని చంద్రబోస్ అధ్యక్షతన జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. జస్టిస్ చంద్రబోస్ గతంలో లోక్‌పాల్‌గా, ఏపీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తిగా వ్యవహరించారు. మరోవైపు యాదాద్రి, భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాల నిర్మాణం, ఛత్తీస్‌గఢ్ విద్యుత్ ఒప్పందంపై విచారణకు జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి అధ్యక్షతన మరో జ్యుడీషియల్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని కేబినెట్ తీర్మానించింది. నివేదికల సమర్పణకు గాను రెండు కమిషన్లకు 100 రోజుల గడువు విధించింది. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం సచివాలయంలో 2 గంటలకు పైగా సమావేశమైన కేబినెట్ పలు అంశాలపై చర్చించింది. కొత్త రేషన్‌కార్డులు, తొలివిడతలో 4.5 లక్షల ఇళ్ల నిర్మాణం లాంటి పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. సమావేశం అనంతరం మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో కలిసి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మీడియా సెంటర్‌లో విలేకరులకు వివరాలు వెల్లడించారు.

కాళేశ్వరంలో అవినీతిపై విచారణ: పొంగులేటి

కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి, అవకతవకలపైనా, ఎవరి ఒత్తిడితో ప్రాజెక్టును అలా కట్టారో అనే అంశంపై జస్టిస్ పినాకిని చంద్రబోస్ కమిషన్ విచారణ జరుపుతుందని పొంగులేటి తెలిపారు. టెండర్లు నిర్వహించకుండా నామినేషన్ల

మిగతా 3వ పేజీలో ▶



మహాలక్ష్మి స్వశక్తి మహిళా సదస్సులో ప్రసంగిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

ఐదేళ్లలో కోటి మంది మహిళా కోటీశ్వరులు

- తాను బాధ్యత తీసుకుంటున్నానన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- వడ్డీలేని రుణాల పథకాన్ని తిరిగి ప్రారంభిస్తున్నట్లు వెల్లడి
- మహాలక్ష్మి స్వశక్తి మహిళా సదస్సులో ప్రసంగం

2 లో

మంగళవారం బీఆర్ఎస్ 'కరీంనగర్ కదనభేరి' బహిరంగ సభకు హాజరైన ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న కేసీఆర్





తెలంగాణ ఆత్మగౌరవం ఢిల్లీ గద్దల వద్ద తాకట్టు

కరీంనగర్ కదనభేరిలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

- మూడు నెలల్లో సీఎం తొమ్మిదిసార్లు ఢిల్లీకి పోయిండు
- పవర్ బ్రోకర్స్, బేవార్స్ చానళ్లు ఎప్పుడూ ఉండేవే
- తగిలింది చిన్న దెబ్బ.. ఓర్చుకుని తట్టుకుందాం
- ఎన్నికల్లో బ్రేక్ కొట్టకపోతే సగం దేశానికి అగ్గి పెట్టేవాడిని
- సీఎం భాషతో తెలంగాణ సమాజానికి గౌరవం వస్తుందా
- బయటకు పోయినోళ్లే సలాములు కొట్టుకుంటూ తిరిగొస్తారు

కాళేశ్వరంలో రెండు పిల్లర్లు కుంగితే ప్రళయం వచ్చినట్లు ప్రచారం చేస్తున్నారు... రెండు రోజుల్లో టీవీ ముందు కూర్చుంటా.. ప్రతీ ఇంటికి వాస్తవాలు చేరేలా వివరిస్తా

సాక్షి ప్రతినిధి, హైదరాబాద్: 'ఎక్కువ పథకాలు వస్తాయనే ఆశతో కాంగ్రెస్‌కు.. తమాషాకు ఓటు వేస్తే వాళ్లు మాత్రం పదవులకు ఎక్కి దౌర్జన్యం, దోపిడీ చేస్తూ డబ్బు మూటలు గుంజుతున్నరు. ఢిల్లీకి సూట్ కేసులు పంపే పనిలో ముఖ్యమంత్రి, మంత్రులు బిజీగా ఉన్నరు. మూడు నెలల్లో ముఖ్యమంత్రి తొమ్మిదిసార్లు ఢిల్లీకి పోయిండు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఢిల్లీ పెద్దల గద్దల వద్ద తాకట్టుపెట్టి మన ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. దీనిపై ప్రజల పక్షాన్ని గళాన్ని వినిపించేందుకే బీఆర్ఎస్ అభ్యర్థులను పార్లమెంటుకు పంపాలి'అని భారత రాష్ట్ర సమితి అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పిలుపునిచ్చారు. లోక్‌సభ ఎన్నికల సన్నద్ధతలో భాగంగా మంగళవారం 'కరీంనగర్ కదనభేరి'పేరిట బీఆర్ఎస్ నిర్వహించిన బహిరంగ సభలో కేసీఆర్ ప్రసంగించారు. కరీంనగర్ ఎస్సార్ కాలేజీ మైదానంలో జరిగిన

మిగతా 3వ పేజీలో ▶

వారిది మజ్లిస్ ఎజెండానే



తెలంగాణలో ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తాం

- బీజేపీ రాష్ట్ర సోషల్ మీడియా వారియర్స్ సమావేశంలో అమిత్ షా

- వివరాలు 2లో

ఎంఐఎం ఎజెండా ప్రకారమే కాంగ్రెస్, బీఆర్ఎస్ నడుచుకుంటున్నాయి

ఆ మూడూ కుటుంబ పార్టీలే అని బీజేపీ అగ్రనేత అమిత్ షా ధ్వజం

- యూపీఏ హయాంలో కుంభకోణాల్లో మునిగితేలారో, లేదో రేవంత్‌రెడ్డి చెప్పాలి
- తెలంగాణను రజాకార్ల చెర నుంచి దూరం చేయగలిగేది బీజేపీనే
- రాష్ట్రంలో 12 లోక్‌సభ స్థానాల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలి
- పౌరసత్వ సవరణ చట్టం వల్ల ఏ ఒక్కరి పౌరసత్వం పోదు
- బీజేపీ పోలింగ్ బూత్ అధ్యక్షుల విజయ సంకల్ప సమ్మేళనంలో ప్రసంగం

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ ఎంఐఎం ఎజెండా ప్రకారమే నడుచుకుంటున్నాయని కేంద్ర హోంమంత్రి, బీజేపీ అగ్రనేత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ సర్కార్ మజ్లిస్‌కు భయపడి సభా సంప్రదాయాలు, నియమాలు తోసిరాజని అక్బరుద్దీన్‌ను ప్రొటెమ్ స్పీకర్ చేసిందన్నారు. ఓటుబ్యాంక్ రాజకీయాలకు పాల్పడే ఈ మూడు కుటుంబ పార్టీలు హైదరాబాద్ విముక్తి దినోత్సవాన్ని, సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆశయాలను నెరవేర్చగలవా అని ప్రశ్నించారు. అవినీతి పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్ తెలంగాణ ఆత్మగౌరవానికి ఏమాత్రం విలువ ఇవ్వవని ఆరోపించారు. మంగళవారం ఎల్బీ స్టేడియంలో బీజేపీ పోలింగ్ బూత్ అధ్యక్షుల విజయ సంకల్ప సమ్మేళనంలో అమిత్ షా ప్రసంగించారు. తెలంగాణ ట్యాగ్‌లైన్ అయిన నీళ్లు, నిధులు, నియామకాలను గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరే ఇప్పుడు కాంగ్రెస్ సర్కార్ కూడా అపహాస్యం చేస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ జవహర్‌లాల్ నెహ్రూ మొదలు రాహుల్ గాంధీ వరకు, బీఆర్ఎస్ కేసీఆర్ నుంచి కేటీఆర్, ఆ తర్వాతి తరాలు.. ఎంఐఎం

మిగతా 2వ పేజీలో ▶



ఇంతేసంగతి



బట్ట సరిపోలేదు! నీ బట్టలో నుంచి కట్ చేసి ఆయనకు కుట్టాను!

వైద్య కాలేజీల్లో 4,356 అధ్యాపక పోస్టుల భర్తీ!

రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ నిర్ణయం

- కాంట్రాక్టు, గౌరవ వేతనం పద్ధతిలో నియామకం.. 16న ఆయా ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఇంటర్వ్యూలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 26 ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 4,356 అధ్యాపక పోస్టులను కాంట్రాక్టు, గౌరవ వేతనం పద్ధతిలో భర్తీ చేయాలని వైద్య, ఆరోగ్యశాఖ నిర్ణయించింది. 3,155 పోస్టులను కాంట్రాక్టు, 1,201 పోస్టులను గౌరవ వేతనం పద్ధతిలో భర్తీ చేయనుంది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రొఫెసర్ పోస్టులు 498, అసోసియేట్ ప్రొఫెసర్ 786, అసిస్టెంట్ ప్రొఫెసర్ 1,459, ట్యూటర్ 412, సీనియర్ రెసిడెంట్స్ పోస్టులు 1,201 భర్తీ చేయనున్నారు. వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ వరకు అంటే ఏడాది కాలానికి వీరిని నియమిస్తారు. మెడికల్ కాలేజీల్లో జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ) తనిఖీలు చేయనున్నందున పోస్టులు తక్షణమే భర్తీ చేయాలని నిర్ణయించారు. అనాటమీ, ఫిజియాలజీ, బయో కెమిస్ట్రీ, ఫార్మకాలజీ, పాథాలజీ, మైక్రో బయాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్,

మిగతా 5వ పేజీలో ▶

టీడీపీ కూటమికి మైనారిటీలు, దళితులు ఓటేయరు

- గతంలో మోదీని టెర్రరిస్టుగా చంద్రబాబు అభివర్ణించారు
- ఇప్పుడు బీజేపీతో ఆయన ఎలా పొత్తుపెట్టుకుంటారు?
- ఏపీ సీఎం జగన్ నాకు మంచి మిత్రుడు
- అక్కడ పోటీపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు
- విలేకరుల సమావేశంలో ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ

10 లో








ప్రజలకు అభివాదం చేస్తున్న అమిత్ షా. చిత్రంలో ఈటల రాజేందర్, కె.లక్ష్మణ్, కిషన్‌రెడ్డి, డి.కె.అరుణ, బండి సంజయ్, జితేందర్‌రెడ్డి ● సభకు హాజరైన ప్రజలు

వారిది మజ్లిస్ ఎజెండానే

▶ మొదటి పేజీ తరువాయి

బడేమియా అసదుద్దీన్, చోటేమియా అక్బరుద్దీన్ అన్నట్టుగా తమ కుటుంబ ప్రయోజనాలే ధ్యేయంగా పని చేస్తున్నాయన్నారు. రైతులు, ఓబీసీలు, యువత, మహిళలు, పేదల అభ్యున్నతి గురించి ఆ పార్టీలకు ఏమాత్రం పట్టదన్నారు. బీజేపీ, ప్రధాని మోదీతోనే ఈ వర్గాల అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని, డెబ్బై ఏళ్ల తర్వాత తెలంగాణను రజాకార్ల చెర నుంచి దూరం చేయగలిగేది బీజేపీ మాత్రమేనని అమిత్‌షా చెప్పారు. మోదీని మూడోసారి ప్రధానిని చేయడం, దేశంలో బీజేపీ 400 సీట్లలో గెలవడం, తెలంగాణలో 12 సీట్లలో విజయం సాధించడం లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. తెలంగాణలో మోదీ పట్ల ప్రజల్లో ప్రేమ చూస్తుంటే వచ్చేసారి 400 సీట్లు ఖాయంగా వస్తాయని అనిపిస్తోందన్నారు.

రేవంత్‌కు అమిత్‌షా సవాల్

గతంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ హయాంలో బొగ్గు, కామన్వెల్త్‌గేమ్స్, 2 జీ, పంచకుల, అగస్టా విమానాలు ఇలా మొత్తం అవినీతి, కుంభకోణాల్లో మునిగితేలారో, లేదో చెప్పాలంటూ అమిత్ షా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరారు. పదేళ్ల యూపీఏ పాలనలో రూ.12 లక్షల కోట్ల అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని ధ్వజమెత్తారు. యూపీఏ హయాంలో తెలంగాణకు రూ.1.17 లక్షల కోట్లు వస్తే, మోదీ పదేళ్ల పాలనలో రూ.5 లక్షల కోట్లు వచ్చాయని చెప్పారు. రాహుల్‌ను ప్రధాని చేయాలని సోనియా, కేటీఆర్‌ను సీఎంను చేయాలని కేసీఆర్, పశ్చిమబెంగాల్లో తన మేనల్లుడిని సీఎంను చేయాలని మమతా బెనర్జీ, మహారాష్ట్రలో సుప్రియా సూలేను సీఎం చేయాలని శరద్‌పవార్, ఆదిత్యాథాక్రేను సీఎం చేయాలని ఉద్ధవ్ థాక్రే.. ఇలా కొడుకులు, కుమార్తెలు, అల్లుళ్లను పీఎంలు, సీఎంలు చేయాలని భావిస్తున్నారన్నారు. అవన్నీ సొంత ప్రయోజనాల పరిరక్షణకే పరిమితమైన పార్టీలని, మోదీ ప్రభుత్వం ఇందుకు పూర్తిగా విరుద్ధమని చెప్పారు. బీఆర్‌ఎస్‌ను భ్రష్టాచార్ రిష్తేదార్ సమితిగా అభివర్ణించిన అమిత్‌షా.. ఆ పార్టీ ఓఆర్ఆర్, కాళేశ్వరం ప్రాజెక్టు, ఢిల్లీ మద్యం కుంభకోణాల్లో వేలకోట్ల అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. అదే సమయంలో 23 ఏళ్లపాటు సీఎంగా, ప్రధానిగా (పదేళ్లుగా) పనిచేసిన మోదీపై 25 పైసల అవినీతికి పాల్పడినట్టుగా కూడా ప్రతిపక్ష పార్టీలు వేలెత్తి చూపలేకపోయాయని చెప్పారు. తెలంగాణలో అత్యధిక స్థానాల్లో విజయం కోసం శ్రమించాలని, కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు, మహిళలు, ఇతర రంగాల వారిని కలిసి కమలం గుర్తుకు ఓటేసేలా చైతన్యపరచాలని పార్టీ నేతలకు అమిత్ షా పిలుపునిచ్చారు.

సీఏఏ.. పౌరసత్వాన్ని ఇవ్వడానికే...

దేశంలో కొత్తగా అమల్లోకి తెచ్చిన పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)తో ఎవరి పౌరసత్వం తొలగించబోయేది లేదని అమిత్‌షా స్పష్టంచేశారు. ఈ చట్టం అమలుకు సంబంధించి తప్పుడు ఆరోపణలతో కొందరు కేంద్రంపై, బీజేపీపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. సీఏఏ పౌరసత్వాన్ని ఇచ్చేదే తప్ప తొలగించేది కాదన్నారు. దీని ద్వారా పాకిస్తాన్, బంగ్లాదేశ్, అఫ్ఘానిస్తాన్ వంటి దేశాల నుంచి భయంతో భారత్‌కు వలస వచ్చిన హిందువులు, సిక్కులు, బౌద్ధులకు మనదేశ పౌరసత్వం ఇస్తామని చెప్పారు. కొన్ని పార్టీలు ఓటు బ్యాంక్ రాజకీయాలు చేస్తూ వాస్తవాలను పక్కదారి పట్టిస్తున్నాయని, వీటిపై ప్రజల్లో అవగాహన కల్పించి లోక్‌సభ ఎన్నికల్లో కమలం గుర్తుకు ఓటేసేలా నేటి నుంచే ప్రచారం మొదలుపెట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఇప్పటికే 9 లోక్‌సభ స్థానాలకు ప్రకటించిన పార్టీ అభ్యర్థులు.. జి.కిషన్‌రెడ్డి (సికింద్రాబాద్), బండిసంజయ్ (కరీంనగర్), ధర్మపురి అర్వింద్ (నిజామాబాద్), ఈటల రాజేందర్ (మల్కాజిగిరి), బూర నర్సయ్యగౌడ్ (భువనగిరి), కొండా విశ్వేశ్వర్‌రెడ్డి (చేవెళ్ల), బీబీ పాటిల్ (జహీరాబాద్), పి.భరత్‌ప్రసాద్ (నాగర్ కర్నూల్), మాధవీలత (హైదరాబాద్)లను సభికులకు అమిత్‌షా పరిచయం చేశారు.

రాష్ట్రంలో ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తాం

- కాంగ్రెస్, బీఆర్‌ఎస్, ఎంఐఎంలు అవినీతి, కుటుంబ పార్టీలు: కేంద్ర హోంమంత్రి అమిత్‌షా
- రాహుల్ విదేశీ విశ్రాంతి పర్యటన చేయాల్సిందే
- బీజేపీ రాష్ట్ర సోషల్ మీడియా వారియర్స్ సమావేశంలో ప్రసంగం



భాగ్యలక్ష్మి దేవాలయంలో అమిత్ షా పూజలు

సాక్షి, మేడ్చల్ జిల్లా/చార్మినార్: తెలంగాణలో ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామని కేంద్ర హోం శాఖ మంత్రి, బీజేపీ అగ్రనేత అమిత్‌షా చెప్పారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్, ఎంఐఎం పార్టీల ఎజెండా ఒక్కటేనని, రాష్ట్రంలో ఈ మూడు పార్టీలు కలిసి పనిచేస్తున్నాయని ఆరోపించారు. ఆ మూడు పార్టీలు అవినీతి, కుటుంబ పార్టీలని దుయ్యబట్టారు. మంగళవారం సికింద్రాబాద్ ఇంపీరియల్ గార్డెన్‌లో బీజేపీ రాష్ట్ర సోషల్ మీడియా వారియర్స్ సమావేశంలో అమిత్‌షా మాట్లాడారు. తెలంగాణలో గత బీఆర్‌ఎస్ సర్కారు, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం మజ్లిస్ చేతిలో కీలు బొమ్మలన్నారు. బీజేపీని ఓడించడమే ఏకైక లక్ష్యంగా అవి పనిచేస్తున్నాయని ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ అవినీతి జాబితా పంపిస్తానని, దానిపై జవాబు చెప్పిన తర్వాతనే బీజేపీపై విమర్శలు చేయాలని హితవు పలికారు. ఎన్నికల తర్వాత రాహుల్ గాంధీ ఇటలీ వెళ్లి సేద తీరాల్సిందేనని ఎద్దేవా చేశారు. గత పదేళ్లలో కేంద్రం తెలంగాణకు రూ.10వేల కోట్లు సాయం చేసిందన్నారు. తెలంగాణ పార్లమెంట్ ఎన్నికలపై బీజేపీ అగ్రనాయకత్వం ప్రత్యేక దృష్టి సారించిందని అమిత్‌షా తెలిపారు. ఈ ఎన్నికల్లో బీజేపీ 12 సీట్లు గెలవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. సోషల్ మీడియా వారియర్స్ కేంద్ర ప్రభుత్వం అమలు చేసే పథకాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలన్నారు. బీఆర్‌ఎస్‌కు సీట్లు వచ్చినా.. రాకున్నా.. రాష్ట్రానికి ఉపయోగం లేదని, బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌కు ఓటేస్తే అది దుర్వినియోగం అవుతుందని చెప్పారు. దేశం సురక్షితంగా ఉండాలంటే మోదీని మళ్లీ ప్రధాని చేయాలని, మోదీతోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ప్రతీ సోషల్ మీడియా కార్యకర్త అప్రమత్తంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

హైదరాబాద్‌లో ఒవైసీని ఓడిస్తాం: కిషన్‌రెడ్డి

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అత్యధిక స్థానాల్లో గెలిస్తేనే.. తెలంగాణలో బలమైన పార్టీగా ఎదగగలదని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఈసారి హైదరాబాద్‌లో అసదుద్దీన్ ఒవైసీని ఓడిస్తామని చెప్పారు. జాతీయ, రాష్ట్ర పార్టీ ఏ నిర్ణయం తీసుకున్నా సోషల్ మీడియా వారియర్స్ ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ఇతర పార్టీల తప్పుడు ప్రచారాలను ఖండించాలని చెప్పారు. ఈ పదేళ్లలో మోదీ ప్రభుత్వం రాష్ట్రంలో రూ.10 లక్షల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టిందన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు ఈటల రాజేందర్, మహేశ్వర్‌రెడ్డి, ఎంవీఎస్ ప్రభాకర్, కాసం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

భాగ్యలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు

అమిత్ షా మంగళవారం సాయంత్రం చార్మినార్ భాగ్యలక్ష్మి దేవాలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కిషన్‌రెడ్డి, హైదరాబాద్ పార్లమెంటు బీజేపీ అభ్యర్థి మాధవి లత తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు గొర్రెలు కాదు

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానందగౌడ్



సాక్షి, హైదరాబాద్: గేట్లు తెరిస్తే కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లేందుకు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు గొర్రెలు కాదని కుత్బుల్లాపూర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానందగౌడ్ స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యల్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, వారికి సీఎం రేవంత్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే వివేకానందగౌడ్ మాట్లాడుతూ... సీఎం రేవంత్‌రెడ్డికి సొంత పార్టీపైనే పట్టులేకుండా భయంభయంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ పార్టీనేతలే మా ప్రభుత్వం ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి ఉందని చెబుతుంటే, కాంగ్రెస్ పార్టీలో నుంచే ఏక్‌నాథ్ శిందేలు వస్తారని బీజేపీ నేతలు అంటున్నారని విమర్శించారు. త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గతంలో వచ్చిన సీట్లు కూడా రావని సర్వేలు చెబుతున్నాయన్నారు. యాదాద్రి దేవాలయంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు జరిగిన అవమానంపై సీఎం సమాధానమివ్వాలని డిమాండ్ చేశారు. పార్టీలో చేరికలపై గేట్లు తెరవడం కాదని, ముందు మరమ్మతుతో మేడిగడ్డ ప్రాజెక్టు గేట్లు తీసి రైతులకు నీళ్లు ఇవ్వాలన్నారు.

అధికార యావతోనే అనవసర విమర్శలు: ఆది



సాక్షి, హైదరాబాద్: ప్రజా సంక్షేమ కార్యక్రమాలతో ప్రభుత్వం ముందుకు వెళ్తోందని, విపక్షం అనవసర విమర్శలు చేయొద్దని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మంగళవారం అసెంబ్లీ మీడియా హాల్‌లో ఆయన మాట్లాడుతూ, అధికార యావతో బావ బామ్మర్దులు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ వచ్చింది కరువచ్చిందని అనడంలో అర్థం లేదని, చలికాలంలో వర్షాలుండవన్న విషయం వారికి తెలియదా అని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడే మేడిగడ్డ నుంచి అనవసరంగా 10 టీఎంసీల నీటిని వదిలేశారని ఆయన ఆరోపించారు. అవసరమైతే కర్ణాటకతో సంప్రదించి నీటిని తెచ్చుకోడానికి సీఎం రేవంత్‌రెడ్డి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ప్రజలు తిరస్కరించినా నోటికొచ్చినట్లు మాట్లాడుతూ అధికారం తమదేనన్న భావనతో ఉన్నారని, ఇప్పటికైనా బావ బామ్మర్దులు తమ వైఖరిని మార్చుకోవాలని శ్రీనివాస్ హితవు పలికారు.

మీ పాలన సక్కగుంటె ప్రజలెందుకు వాత పెట్టారు

కేసీఆర్ వ్యాఖ్యలపై పొన్నం ఫైర్

సాక్షి, హైదరాబాద్: కరీంనగర్ కదనభేరి సభలో మాజీ సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఫైర్ అయ్యారు. ప్రజలు ఇచ్చిన షాక్‌తో కేసీఆర్ అప్పుడే గతం మర్చిపోయారని మంగళవారం ఒక ప్రకటనలో అన్నారు. 'మీ పాలనలో ఆడబిడ్డలు కుండలతో వచ్చి దాహమో రామచంద్ర అనలేదా? నాగార్జునసాగర్ కింద రైతాంగం క్రాప్ హాలిడే ప్రకటించిన సంగతి మర్చిపోయావా? మీ పాలన సక్కగా ఉంటే మొన్నటి ఎన్నికల్లో ప్రజలు కర్రు కాల్చి వాత ఎందుకు పెట్టేవారు? అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలు చూసి ఓర్వలేక ఓటమి భయంతో కేసీఆర్ వణికిపోతున్నారు. కరీంనగర్ సభ చప్పగా సాగింది. జనాలు వెళ్లిపోతున్నారనే సభ ముగించారని' ఎద్దేవా చేశారు.

ధర్మయుద్ధానికి సిద్ధం కావాలి

పార్టీ కార్యకర్తలకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పిలుపు

సాక్షి, హైదరాబాద్: త్వరలో జరగబోయే ధర్మయుద్ధానికి (లోక్‌సభ ఎన్నికలకు) పార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని కేంద్రమంత్రి బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. అందరూ కష్టపడి పనిచేసి ధర్మం, న్యాయం కోసం కృషిచేస్తున్న మోదీని మరోసారి ప్రధానిని చేయాలని కోరారు. మంగళవారం ఎల్‌బీ స్టేడియంలో జరిగిన బీజేపీ పోలింగ్ బూత్ అధ్యక్షుల విజయ సంకల్ప సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. ప్రతి పోలింగ్ బూత్ స్థాయిలో ఎన్నికలకు సిద్ధం కావాలని కార్యకర్తలకు సూచించారు. కాంగ్రెస్ ముఠా వందరోజుల్లో రాష్ట్రంలోని బిల్డర్స్, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, పరిశ్రమలు, కాంట్రాక్టర్ల దగ్గర రాహుల్ గాంధీ ట్యాక్స్ వసూలు చేస్తోందని ఆరోపించారు. 'మన అందరి ఎజెండా ఒకటే.. ఏప్రిల్‌లో జరగనున్న ఎన్నికల్లో తెలంగాణలో అత్యధిక ఎంపీ స్థానాలు గెలవాలి. గత పదేళ్లలో మోదీ సర్కార్ తెలంగాణ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించింది' అని కిషన్‌రెడ్డి చెప్పారు.

12 సీట్లు గెలుస్తాం : డీకే అరుణ

బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ మాట్లాడుతూ...'ఆరు నూరైనా.. తెలంగాణలో 12 సీట్లు గెలుస్తాం, కాషాయ జెండా ఎగరేస్తాం. తెలంగాణలో ఏ ప్రాంతానికి వెళ్లినా ఈసారి మోదీకే ఓటని ప్రజలు చెప్తున్నారు. కాంగ్రెస్ అరుగ్యారంటీలు అట్టర్ ప్లాప్ అయ్యాయి. తెలంగాణలో 17 సీట్లు గెలిస్తే రాహుల్ ప్రధాని అవుతాడా..? రాహుల్‌ను ప్రధాని అభ్యర్థిగా ఇండియా కూటమే ఒప్పుకోవడం లేదు. రాష్ట్రంలోకాంగ్రెస్ మోసపూరిత పాలనతో ప్రజలు విసుగు చెందుతున్నారు' అని అన్నారు. బీజేపీ పార్లమెంటరీబోర్డు సభ్యుడు డా.కె.లక్ష్మణ్ మాట్లాడుతూ.. 'రాబోయే 40 రోజులు పోలింగ్‌బూత్‌లకే కార్యకర్తలు పరిమితమై పార్టీ అభ్యర్థులను గెలిపించాలి. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ఎంఐఎంలను ఎదుర్కొనే సత్తా బీజేపీకే ఉంది. గ్యారంటీల పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలను మోసం చేస్తున్నారు' అని అన్నారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ మాట్లాడుతూ...'మేము రాముని పేరు చెప్పి బరాబర్ ఓట్లు అడుగుతాం. మీకు దమ్ముంటే బాబర్ పేరు చెప్పి ఓట్లు అడగండి' అని సవాల్ విసిరారు. 'అసలు కాంగ్రెస్ ప్రధాని అభ్యర్థి ఎవరు? ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు చుక్కలు చూపెడతారు. ఒక రెండు హామీలు నెరవేర్చి ఎన్నికల కోడ్ వస్తే కాలం గడపొచ్చని కాంగ్రెస్ సర్కార్ భావిస్తోంది' అని అన్నారు. నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి మాట్లాడుతూ...'రాష్ట్రంలో ఎక్కడ చూసినా మోదీకే ఓటేస్తామని జనం అంటున్నారు. వచ్చే నెల, నెలన్నర రోజుల్లో జరిగే ఎన్నికల్లో తెలంగాణ నుంచి బీజేపీ అత్యధిక సీట్లలో గెలిచేలా కృషిచేయాలి' అని చెప్పారు. బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ... రాష్ట్రాన్ని బీఆర్‌ఎస్ అప్పులకుప్పగా మారిస్తే, ఇచ్చిన హామీలను నెరవేర్చలేని పరిస్థితుల్లో కాంగ్రెస్ సర్కార్ ఉందన్నారు.

12 ఎంపీ సీట్లు గెలవబోతున్నాం!

- ఆ మేరకు సర్వే నివేదికలు అందాయి
- రాష్ట్ర పార్టీ నేతలతో కేంద్రమంత్రి అమిత్‌షా

సాక్షి, హైదరాబాద్: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో 12 ఎంపీ స్థానాల్లో గెలవబోతున్నట్టుగా తాము అంతర్గతంగా నిర్వహించిన సర్వేలో తేలిందని బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వెల్లడించినట్టు సమాచారం. బూత్ కమిటీల పనితీరు లోతుగా సమీక్షించి, అవి ఎలా పనిచేస్తున్నాయో పరిశీలించి లోపాలు, లోటుపాట్లు సరిచేసుకునేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో అన్ని పోలింగ్‌బూత్‌లలో విస్తృతంగా ప్రచారం చేయాలని, ప్రజలను కలిసి బీజేపీ, మోదీపాలనపై మద్దతు కూడగట్టి వచ్చే ఎన్నికల్లో ఓట్లు వేసేలా చూడాలన్నారు. రాష్ట్రంలోని అన్ని ఎంపీ సెగ్మెంట్ల పరిధిలో విస్తృతంగా పర్యటించేందుకు కార్లు, ఇతర వాహనాలపై ఆధారపడకుండా, ప్రతీరోజు బైక్‌లకు జెండాలు కట్టుకుని ఊరూరా తిరగాలని పిలుపునిచ్చారు. తమ పోలింగ్‌బూత్‌ల పరిధిలో ఇదేవిధంగా పనిచేస్తున్నామని చెప్పారు. వెంటనే ఒక్కో లోక్‌సభ సెగ్మెంట్ పరిధిలో 50 మందితో ఒక్కో కాల్‌సెంటర్ ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. తాను ఓ కాన్ఫరెన్స్‌కాల్‌తోనే మూడులక్షల మందితో సంభాషించి, పోలింగ్‌బూత్ కమిటీలకు దిశానిర్దేశం చేసినట్టు పార్టీ నేతలకు తెలిపారు. మంగళవారం సాయంత్రం ఓ స్టార్‌హోటల్‌లో పార్టీ ముఖ్యనేతలు, పార్లమెంట్ ప్రభారీలు, కన్వీనర్లు, పార్లమెంట్ పొలిటికల్ ఇన్‌చార్జ్‌లతో అమిత్‌షా ప్రత్యేకంగా భేటీ అయ్యారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఆయా పోలింగ్‌బూత్‌లలో చేపట్టాల్సిన కార్యాచరణ, సిద్ధం చేసుకోవాల్సిన వ్యూహాలపై రాష్ట్రనాయకులకు దిశానిర్దేశం చేశారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, పార్టీనేతలు డా.కె.లక్ష్మణ్, డీకే.అరుణ, ఈటల రాజేందర్, ఏపీ జితేందర్‌రెడ్డి, ఏలేటి మహేశ్వర్ రెడ్డి, కాటిపల్లి వెంకటరమణారెడ్డి, రామారావు పటేల్, ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమిత్‌షా మాట్లాడుతూ రాబోయే రెండునెలలు అన్ని పనులను పక్కనపెట్టి పార్టీ అభ్యర్థుల విజయానికి పనిచేయాలని చెప్పారు. పార్టీనేతలు మరింత ఎక్కువగా కష్టపడి పనిచేస్తే 12 సీట్లే కాదు 15 స్థానాలు కూడా గెలుచుకునే అవకాశాలున్నాయని తెలిపారు. ఇదేస్థాయిలో పనిచేస్తే 2029లో జరిగే శాసనసభ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ కచ్చితంగా అధికారంలోకి వచ్చితీరుతుందని నాయకులకు అమిత్‌షా స్పష్టం చేశారు.

అమిత్‌షాతో అరూరి రమేశ్ భేటీ

బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ అమిత్‌షాతో భేటీ అయ్యారు. కొంతకాలంగా ఆయన బీజేపీలో చేరి, వరంగల్ ఎంపీ స్థానం నుంచి పోటీచేస్తారనే ఊహాగానాలు సాగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. ముందుగా రాష్ట్రపార్టీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని, ఆ తర్వాత జాతీయ అధ్యక్షుడు జేపీనడ్డాలను కలిసి చేరిక తేదీపై నిర్ణయం తీసుకోవాలని అమిత్‌షా సూచించినట్టు తెలిసింది. త్వరలోనే రమేశ్ బీజేపీలో చేరే అవకాశాలున్నాయని, ఆయనకు వరంగల్ ఎంపీ టికెట్ దాదాపు ఖరారైనట్టేనని పార్టీ వర్గాల సమాచారం. వరంగల్ జిల్లాకు చెందిన బీజేపీ నేతలు, ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగతో కలిసి ఓ స్టార్ హోటల్‌లో అమిత్‌షాను కలిసినట్టు సమాచారం.

ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు పెద్దపీట

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

సాక్షి, హైదరాబాద్: ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు పెద్దపీట వేస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. మంగళవారం పెరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన స్వశక్తి మహిళా సదస్సులో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని 64 లక్షల మంది స్వయం సహాయక సంఘం సభ్యులకు రానున్న ఐదు సంవత్సరాల్లో లక్ష కోట్ల రూపాయల రుణాలు ఇప్పించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 2023 డిసెంబర్ 7 నుంచి మహిళలు తీసుకున్న రుణాలకు వడ్డీ కట్టాల్సిన అవసరం లేదని, ప్రభుత్వమే ఆ వడ్డీని చెల్లిస్తుందని చెప్పారు. గత ప్రభుత్వం చేసిన అప్పుల వల్ల రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ మహిళలను మహాలక్ష్మిలుగా గౌరవించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు.

వైఎస్ హయాంలోనే మహిళా సంఘాలు: కొండా సురేఖ

దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు మహిళల కన్నీళ్లు తుడిచేందుకు ఐకేపీలను ప్రారంభించారని తెలిపారు. ఐకేపీలతో పాటు మహిళల స్వయం సమృద్ధికి రాజశేఖర్ రెడ్డి ఎంతో కృషి చేశారని చెప్పారు. మళ్లీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలోనే మహిళలకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ.. మైక్రో ఫైనాన్స్ కంపెనీల నుంచి అప్పులు తీసుకున్న మహిళలు పడుతున్న బాధలను చూసి ఆనాడు వైఎస్సార్ పావలా వడ్డీ రుణాలు తీసుకొచ్చారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే మహిళలకు గౌరవం ఇచ్చే పార్టీ అని మంత్రి పొన్నం అన్నారు. 2006లో కాంగ్రెస్ ప్రభుత్వం పావలా వడ్డీ రుణాలను ప్రారంభిస్తే, కేసీఆర్ ప్రభుత్వం నిలిపివేసిందని మంత్రి శ్రీధర్‌బాబు విమర్శించారు.

ఐదేళ్లలో కోటి మంది మహిళా కోటీశ్వరులు

- తాను బాధ్యత తీసుకుంటున్నానన్న సీఎం రేవంత్
- వడ్డీలేని రుణాల పథకాన్ని తిరిగి ప్రారంభిస్తున్నట్లు వెల్లడి
- మహాలక్ష్మి స్వశక్తి మహిళా సదస్సులో ప్రసంగం





మహిళా సంఘాలకు చెక్ అందజేస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో స్పీకర్ ప్రసాద్ కుమార్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం, సురేఖ, పొంగులేటి, ఉత్తమ్, దామోదర, తుమ్మల. సభకు హాజరైన మహిళలు

సాక్షి, హైదరాబాద్: ఐదేళ్లలో రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే బాధ్యత తాను తీసుకుంటున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల్లో (ఎస్‌హెచ్‌జీలు) ప్రస్తుతం ఉన్న 63 లక్షల మంది మహిళలను కోటికి పెంచడమే కాకుండా ప్రతి ఒక్కరిని కోటీశ్వరులను చేయడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. గతంలో దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి మహిళలను లక్షాధికారుల్ని చేసే లక్ష్యంతో పావలా వడ్డీ రుణాలను ప్రారంభించారని, ఇప్పుడు ప్రతి మహిళను కోటీశ్వరురాలిని చేసే లక్ష్యంతో గత ప్రభుత్వ హయాంలో నిలిచి పోయిన వడ్డీలేని రుణాల పథకాన్ని తిరిగి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తే తెలంగాణ బంగారు తెలంగాణ, ధనిక తెలంగాణ, అభివృద్ధి చెందిన తెలంగాణ అవుతుందని, మహిళలు తమ పిల్లలను డాక్టర్లు, ఐఏఎస్‌లను చేసుకోగలరని అన్నారు. సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన 'మహాలక్ష్మి స్వశక్తి మహిళా సదస్సు'కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.

ఆడబిడ్డల ఆశీర్వాదంతోనే అధికారంలోకి..

'పదేళ్ల పాలనలో కేసీఆర్ తెలంగాణలో ఆడబిడ్డలను పట్టించుకోలేదు. పావలా వడ్డీ, సున్నా వడ్డీ ఇవ్వలేదు. అందుకే మా ఆడబిడ్డలు కంకణం కట్టుకుని ఎన్నికల్లో కేసీఆర్‌ను బండకేసి కొట్టారు. వంద మీటర్ల గొయ్యి తీసి పాతిపెట్టారు. ఆడబిడ్డల ఆశీర్వాదంతోనే రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. నేను సీఎం అయ్యా. అధికారంలోకి వచ్చిన వెంటనే గతేడాది సెప్టెంబర్ 17న సోనియాగాంధీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలు ప్రారంభించాం. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తే, ఇప్పటివరకు 23 కోట్ల మంది వినియోగించుకున్నారు. కానీ కేసీఆర్, హరీశ్, కవిత, కేటీఆర్ కిరాయి ఇచ్చి ఆటో డ్రైవర్లతో ధర్నాలు చేయిస్తున్నారు. ఎవరు అడ్డు వచ్చినా సరే.. మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కొనసాగిస్తాం. ఆనాడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రారంభించిన రాజీవ్ ఆరోగ్యశ్రీని కేసీఆర్ ఎటుగాకుండా చేశారు. మహిళలను కట్టెల పొయ్యి కష్టాల నుంచి గట్టెక్కించేందుకు గతంలో దీపం పథకం ద్వారా సోనియాగాంధీ రూ.400కే గ్యాస్ సిలిండర్ ఇస్తే, ప్రధాని నరేంద్ర మోదీ, కేసీఆర్ కలిసి దానిని రూ.1200కు పెంచి మళ్లీ కట్టెల పొయ్యికి మళ్లే పరిస్థితి కల్పించారు. అందుకే ఇప్పుడు రూ.500లకే మహిళలకు గ్యాస్ సిలిండర్ అందిస్తున్నాం. గృహలక్ష్మి పథకం ద్వారా పేదల ఇంటికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నాం..' అని రేవంత్ తెలిపారు.

టాటా, బిర్లాలతో పోటీ పడేలా చేస్తాం

'ఎస్‌హెచ్‌జీల మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం లేదనే విషయం నా దృష్టికి వచ్చింది. రాబోయే నెల రోజుల్లో శిల్పారామం పక్కన ఎస్‌హెచ్‌జీల మహిళలకు వంద స్టాళ్లు ఏర్పాటు చేస్తాం. మీరు తయారు చేసిన ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తాం. ఔటర్ రింగ్‌రోడ్డు చుట్టూ కూడా మహిళా ఉత్పత్తుల విక్రయానికి బజార్లు ఏర్పాటు చేస్తాం. టాటా, బిర్లాలు, అదానీ, అంబానీలతో పోటీ పడే విధంగా మహిళలు రాణించేలా కృషి చేస్తాం..' అని ముఖ్యమంత్రి చెప్పారు.

డబుల్ బెడ్‌రూం ఆశ చూపి మోసం చేశారు

'ఇందిరమ్మ ఇళ్లు ఎన్నికలు అయిపోయిన తరువాత ఇద్దామనుకున్నాం. కానీ మహిళల కోసం భద్రాద్రి రామచంద్ర స్వామి ఆశీస్సులతో ఈ పథకాన్ని ప్రారంభించుకున్నాం. కేసీఆర్ డబుల్ బెడ్‌రూం ఇళ్ల ఆశ చూపి మహిళలను మోసం చేసిండు. మేం మొత్తం రూ.22,500 కోట్లతో ఇల్లు కట్టుకునే పేదలకు రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించబోతున్నాం..' అని రేవంత్ తెలిపారు.

మోదీ, కేసీఆర్ కుట్రలు చేస్తున్నారు

'మా ప్రభుత్వాన్ని పడగొడతామంటూ కొందరు చిందులు వేస్తున్నారు. కేసీఆర్, మోదీలు కుట్రలు చేస్తున్నారు. ముఖ్యమంత్రి కుర్చీలో దొరలే కూర్చోవాలా? రైతు బిడ్డ కూర్చోకూడదా? నేనేం పాపం చేశా? మీ అవినీతి సొమ్ములో షేర్ అడిగానా? నేనేమన్నా అయ్య పేరు చెప్పుకొని, విరాసత్ రాయించుకొని ముఖ్యమంత్రి అయ్యానా? ఎవరి కుర్చీనైనా గుంజుకున్నానా? రేవంత్‌ను, ప్రభుత్వాన్ని పడగొడతామని ఎవరైనా వస్తే.. మా ఆడబిడ్డలు చీపురు కట్టలు మర్లేసి కొడతారు. కొద్దిరోజుల్లో 10 లక్షల మంది ఆడబిడ్డలతో కవాతు చేస్తాం. మా సైన్యం మీరే.. మా బలగం మీరే..' అని సీఎం అన్నారు.

అధికారం పోతుందని తెలిసినా సోనియా తెలంగాణ ఇచ్చారు

'కాంగ్రెస్ పార్టీ అంటేనే ఇందిరాగాంధీ, సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ. మేము ఒక మహిళ నాయకత్వంలో పని చేయడానికి గర్విస్తున్నాం. ప్రత్యేక రాష్ట్రం ఇవ్వడం వల్ల ఆంధ్రప్రదేశ్‌లో, కేంద్రంలో కాంగ్రెస్ అధికారం కోల్పోతుందని తెలిసినా 2004లో కరీంనగర్‌లో ఇచ్చిన మాట కోసం సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చారు..' అని రేవంత్ చెప్పారు.

స్టాళ్ల సందర్శన.. మహిళలతో సంభాషణ

సదస్సుకు ముందు ముఖ్యమంత్రి ఎస్‌హెచ్‌జీల మహిళలు ఏర్పాటు చేసిన వివిధ ఉత్పత్తులతో కూడిన స్టాళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు తమ ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని సీఎంను కోరారు.

విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ

'మహిళా శక్తి మహిళా ఉన్నతి - తెలంగాణ ప్రగతి' విజన్ డాక్యుమెంట్‌ను మంత్రివర్గ సహచరులతో కలిసి సీఎం ఆవిష్కరించారు. వచ్చే ఐదేళ్లలో బ్యాంకులు, స్త్రీ నిధి ద్వారా ఎస్‌హెచ్‌జీలకు సంబంధించిన రూ.లక్ష కోట్ల రుణాలను అనుసంధానించడం, వడ్డీ లేని రుణాలు పునరుద్ధరించడం, సంఘాల ఉత్పత్తులకు బ్రాండింగ్, మార్కెటింగ్ కల్పించడం, సంఘాలకు శిక్షణ, సంఘాల్లోని మహిళలకు రూ.పది లక్షల జీవిత బీమా, పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం సంఘాలతో నిర్వహణ లాంటి అంశాలు విజన్ డాక్యుమెంట్‌లో ఉన్నాయి. ఈ సదస్సుకు సీఎస్ శాంతికుమారి అధ్యక్షత వహించగా, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, సురేఖ, పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు ప్రసంగించారు. స్పీకర్ ప్రసాద్‌కుమార్, మంత్రులు జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వర్‌రావు, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రణాళికా మండలి ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

కేటీఆర్‌కు తీవ్ర జ్వరం

ఆ కారణంగానే కరీంనగర్ సభకు హాజరుకాలేదు



సాక్షి, హైదరాబాద్: తీవ్ర జ్వరం కారణంగానే కరీంనగర్‌లో జరిగిన బీఆర్‌ఎస్ భారీసభకు ఆ పార్టీ వర్కింగ్‌ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరుకాలేదు. ఈ మేరకు మంగళవారం ఆయన కార్యాలయ వర్గాలు ఒక ప్రకటన విడుదల చేశాయి. 'కొద్ది రోజులుగా సభలు, సమావేశాల్లో పాల్గొన్న కేటీఆర్ రెండు రోజులుగా తీవ్రమైన జ్వరం, ఫ్లూ లక్షణాలతో బాధపడుతున్నారు. మూడు రోజుల క్రితం కామారెడ్డిలో జరిగిన సమావేశం అనంతరం జ్వరంతో అస్వస్థతకు గురైన ఆయన ఇంకా పూర్తిగా కోలుకోలేదు. ఈ నేపథ్యంలోనే మంగళవారం కరీంనగర్‌లో జరిగిన సభకు హాజరు కాలేదు.'అని తెలిపాయి. తమ పర్యవేక్షణలో ఇంటి వద్దనే కేటీఆర్ చికిత్స తీసుకుంటున్నారని, రెండు రోజుల్లో పూర్తిగా నయం అవుతుందని కేటీఆర్‌కు వైద్యం చేస్తున్న డాక్టర్లు చెప్పినట్టు వెల్లడించాయి.

రెండు రిజర్వుడు, ఒక జనరల్ ఎంపీ స్థానాన్ని కేటాయించండి

కాంగ్రెస్ పార్టీకి దళిత, మాదిగ సంఘాల విజ్ఞప్తి... గాంధీభవన్‌లో ప్లకార్డులు పట్టుకుని ధర్నా

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో 80లక్షల మందికి పైగా జనాభా ఉన్న మాదిగ సామాజిక వర్గానికి రెండు ఎస్సీ రిజర్వుడు స్థానాలతో పాటు మరో జనరల్ స్థానాన్ని కేటాయించాలని పలు దళిత, మాదిగ సంఘాల ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీని కోరారు. ఈ మేరకు అంబేడ్కర్ సంఘాల సమాఖ్య, మాదిగ సంక్షేమ సంఘం, దళిత బహుజన సమితి, మహా ఎమ్మార్పీఎస్, మాదిగ జేఏసీ, మాదిగ శక్తి, తెలంగాణ ప్రజాసంఘాల జేఏసీ నేతలు మంగళవారం గాంధీభవన్‌లో ప్లకార్డులు పట్టుకుని ధర్నా నిర్వహించారు. అనంతరం ఏఐసీసీ కార్యదర్శి విష్ణునాథ్‌కు వినతిపత్రం అందజేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలో కీలకంగా పనిచేసిన తెలంగాణ ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ గజ్జెల కాంతంకు పెద్దపల్లి పార్లమెంటు స్థానాన్ని, ఉస్మానియా యూనివర్సిటీలో క్రియాశీలంగా పనిచేసిన పిడమర్తి రవికి వరంగల్ పార్లమెంటు స్థానాన్ని కేటాయించాలని ఈ వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో రాపోలు రాములు, గడ్డె యాదయ్య, గజివేలు మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీఓలు 'అవిశ్వాస' భేటీ నిర్వహించొచ్చు

ఎంపీపీ, వైస్ ఎంపీపీల పిటిషన్లలో హైకోర్టు తీర్పు



సాక్షి, హైదరాబాద్: మండల ప్రజాపరిషత్ అధ్యక్షులు, ఉపాధ్యక్షుల అవిశ్వాసాలపై ఆర్డీఓలు భేటీ నిర్వహించుకోవచ్చని హైకోర్టు తేల్చిచెప్పింది. కొత్త చట్టంలో నిబంధనలు లేవని, పాత చట్టం ప్రకారం ఆర్డీఓ నోటీసులు జారీ చేయడం చెల్లదని పిటిషనర్లు తప్పించుకోలేరని వ్యాఖ్యానించింది. కొత్త చట్టంలో నిబంధనలు లేనప్పుడు పాత చట్టమే వర్తిస్తుందని చెప్పింది. ఏప్రిల్ 2లోగా అవి శ్వాస సమావేశాలు నిర్వహించాలని అధికారు లను ఆదేశించింది. పలు మండలాల ఎంపీపీ లు, వైస్ ఎంపీపీలు దాఖలు చేసిన పిటిషన్లను కొట్టివేసింది. తమపై అవిశ్వాసాలు నిర్వహించేలా ఆర్డీఓలు నోటీసులు జారీ చేయడాన్ని సవాల్ చేస్తూ పలువురు మండల ప్రజాపరిషత్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు పిటిషన్లు దాఖలు చేశారు. ఆర్డీఓల నుంచి ఫారమ్-5 నోటీసులు పిటిషనర్లకు అందాయని.. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం 2018లోని సెక్షన్ 263 ప్రకారం ఆ నోటీసులు ఇచ్చే అధికారం ఆర్డీఓకు లేదన్నారు. ఆర్డీఓ జారీ చేసిన నోటీసులను కొట్టివేయాలని కోరారు. ఈ పిటిషన్లపై విచారణ చేపట్టిన న్యాయమూర్తి జస్టిస్ కె.శరత్ ఉత్తర్వులు వెలువరించారు. 'పిటిషన్లు విచారణార్హం కాదు. ఆర్డీఓ ఫారమ్-5 నోటీ సులు జారీ చేసి.. అవిశ్వాస తీర్మాన సమావేశం నిర్వహించొచ్చు. అవిశ్వాస తీర్మానాన్ని ఎదుర్కోకుండా ఏదో ఒక సాకుతో విచారణ నిలిపివేయా లని విజ్ఞప్తి చేస్తున్నట్టు పిటిషనర్ల వ్యవహారం ఉంది. 15 రోజుల ముందుగా నోటీసు ఇవ్వా లన్న గడువు కూడా సమర్థనీయం కాదు' అని తీర్పునిచ్చారు.

'భట్టి, సురేఖ పట్ల కులవివక్ష ప్రదర్శించారు'



సాక్షి, హైదరాబాద్: యాదాద్రి ఆలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, దేవాదాయ మంత్రి కొండ సురేఖ పట్ల ఆలయ నిర్వాహకులు వివక్ష ప్రదర్శించారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ముఖ్యమంత్రితో పాటు ఆలయాన్ని సందర్శించిన మంత్రుల్లో వీరిద్దరిని మాత్రమే వేరుగా చూశారని, ముఖ్యమంత్రి దంపతులకు, అగ్రవర్ణాలకు చెందిన ఇతర మంత్రులకు కుర్చీలు వేసి, వీరిద్దరిని మాత్రం చిన్న పీటల మీద కూర్చోబెట్టి కులవివక్ష ప్రదర్శించారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి సమక్షంలో వివక్ష ప్రదర్శించడం మరింత ఆందోళనకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



సభలో మాట్లాడుతున్న కేసీఆర్. చిత్రంలో బీఆర్‌ఎస్ నేతలు రసమయి, మధుసూదనాచారి, కడియం శ్రీహరి, బి.వినోద్, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మహమూద్ అలీ, లక్ష్మీకాంతరావు తదితరులు

ఆత్మగౌరవం ఢిల్లీ గద్దల వద్ద తాకట్టు

▶ మొదటి పేజీ తరువాయి

బహిరంగ సభలో పలు తాజా రాజకీయ అంశాలపై కేసీఆర్ తనదైన శైలిలో స్పందించారు.

తల మాసినోళ్ల దొంగ ప్రచారంతో భయపడొద్దు

'పవర్ బ్రోకర్స్, కొన్ని బేవార్స్ ఛానళ్లు ఎప్పుడూ ఉంటాయి. ఎక్కడో చోట ఒక్కరో ఇద్దరో తలకు మాసినోళ్లు పార్టీ నుంచి బయటకు వెళ్లి బీఆర్‌ఎస్ ఖతమైందని ప్రచారం చేస్తున్నారు. దొంగ ప్రచారాలకు భయపడకుండా ముందుకు సాగుదాం.. మీ బేవార్స్ ప్రచారాలు ఆపేయండి. కొద్ది రోజుల్లో మీరే సలాములు కొట్టుకుంటూ వస్తారు. నలుగురు పోతే పోయేదేమీ లేదు. ప్రజాశక్తిని కూడదీసి అద్భుత విజయాలు సాధించి తెలంగాణను తీర్చిదిద్దుకుందాం. గులాబీ జెండా ఎన్నడూ ఖతం కాదు. భూమి, ఆకాశం ఉన్నంత కాలం ఈ గులాబీ జెండా ఉండటం ఖాయం.'

సగం దేశానికి చిచ్చు పెట్టేవాడిని

'మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో నన్ను ఆగబట్టి బ్రేక్ కొట్టకపోతే ఈ పాటికి సగం దేశానికి అగ్గిపెట్టి చిచ్చు అంటించి మొత్తం భారతాన్ని చైతన్యం చేసేవాడిని. చిన్న దెబ్బతగిలింది ఫరవాలేదు.. ఓర్చుకుని తట్టుకుందాం. పేగులు తెగేదాకా కొట్లాడే శక్తి, ధైర్యం ఉంది. ప్రస్తుత ప్రభుత్వానికి బీఆర్‌ఎస్ అంకుశంలా ఉండాలి. బీఆర్‌ఎస్ గళమే తెలంగాణ గళం. తెలంగాణ బలంగా ఉండాలంటే బీఆర్‌ఎస్ బలంగా ఉండాలి. తెలంగాణ సోయి కలిగి ఉద్యమంలో పేగులు తెగేదాకా కొట్లాడినోళ్లు, చావు నోట్లో తలకాయ పెట్టి రాష్ట్రాన్ని తెచ్చిన వారికే తెలంగాణ గురించి కడుపు నొప్పి ఉంటుంది.

ఇలాంటి భాష గౌరవమా?

అధికారంలోకి వస్తే ఆరు చందమామలు, ఏడు సూర్యుళ్లను పెడతామని 420 హామీలు ఇచ్చిన కాంగ్రెస్ నేతలు ఇప్పుడు రైతుబంధు అడిగితే చెప్పుతో కొడతామంటున్నారు. ఆరు గ్యారంటీలు, నీళ్లు, కరెంటు అడిగితే సీఎం పండబెట్టి తొక్కుతా, పేగులు మెడకేసుకుంటా, పెండ ముఖానికి రాసుకుంటా, మానవబాంబు అవుతా అని అసహనంతో మాట్లాడుతున్నాడు. ఇలాంటి భాష తెలంగాణ సమాజానికి గౌరవాన్ని ఇస్తుందా. తెలంగాణ ఉద్యమ సమయంలో వ్యతిరేకించిన వారిని దద్దమ్మలు, సన్నాసులు అంటూ నిలదీశా. సీఎంగా ఏనాడూ ఇలాంటి దురుసు మాటలు ఉపయోగించలేదు. కొత్తగా ఏర్పడిన రాష్ట్రంలో భయంకర పరిస్థితులు ఉన్నా ఖజానా ఖాళీ, లంకె బిందెలు లేవు అని ఏనాడూ అనలేదు. కాంగ్రెస్‌కు అధికారం దక్కడంపై మాకు ఎలాంటి ఈర్ష్య లేదు. మంచిగా పనిచేసి మాతో పోటీ పడు'

4 నెలలు సమయం ఇవ్వాలనుకున్నా కానీ..

'తెలంగాణ దేశానికి తలమానికం చేయాలని ఎంతో కృషి చేశా. కరోనాలో ఖజానాలో డబ్బులు లేకున్నా రైతుబంధు ఆపలేదు. మిషన్ భగీరథ, నిరంతర కరెంటు ఇవ్వడం ఈ ప్రభుత్వంలోని చవట దద్దమ్మలకు చేతకావడం లేదు. కాంగ్రెస్‌కు మళ్లీ ఓటేస్తే ఆరు గ్యారంటీలకు ఎగనామం పెడతారు. ఇప్పటికే వరి ధాన్యానికి బోనస్ బోగస్‌గా మారింది. కర్రుకాల్చి వాత పెట్టకపోతే అహంకారం పెరుగుతుంది. చెప్పుతో నిజంగానే కొడతారు. బీజేపీ నుంచి నలుగురు ఎంపీలు గెలిచినా రాష్ట్రానికి నయాపైసా తేలేదు. కాంగ్రెస్‌కు నాలుగు నెలలు సమయం ఇవ్వాలని అనుకున్నా వారిని నిలదీయక తప్పడం లేదు.

పోలీసులకు రాజకీయాలు ఎందుకు

'గ్రామాల్లో మా కార్యకర్తలు సోషల్ మీడియాలో పోస్టులు పెడితే పోలీసులు బెదిరించడం సరికాదు. పోలీసులకు రాజకీయాలు ఎందుకు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదు. పదేళ్లు అధికారంలో ఉన్నపుడు కొన్ని కుక్కలు మొరిగినా ఏనాడూ దౌర్జన్యాలు చేయలేదు. మేము అధికారంలో ఉన్నపుడు ఇవే దౌర్జన్యాలు చేస్తే కాంగ్రెస్ వాళ్లు ఒక్కరూ మిగలేవారు కాదు'అని కేసీఆర్ హెచ్చరించారు. 2001లో తెలంగాణ కోసం పిడికెడు మందితో బయలుదేరిన తనను ఆకాశమంత ఎత్తుకు చేర్చారనీ, కార్యకర్తలే కథానాయకులై ముందుకు నడిపించారని కేసీఆర్ పేర్కొన్నారు. అదే స్ఫూర్తితో లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. కులం మతం జాతి ప్రసక్తి లేకుండా తెలంగాణ జాతిగా నిలబడి కలబడాలని పిలుపునిచ్చారు.

కాళేశ్వరంపై టీవీల్లో కూర్చుని వివరిస్తా

'మేడిగడ్డ బ్యారేజీ.. కాళేశ్వరంలోని వంద కాంపోనెంట్లలో ఒకటి. ఒకటి రెండు పిల్లర్లు కుంగితే ప్రళయం వచ్చినట్లు, దేశం బద్దలైనట్లు ప్రచారం చేస్తున్నారు. రెండు మూడు రోజుల్లో టీవీ ముందు కూర్చుని ప్రతీ ఇంటికి వాస్తవాలు చేరేలా వివరిస్తా. మేడిగడ్డ పేరిట కేసీఆర్‌ను బదనాం చేసే ప్రయత్నం జరుగుతోంది. ఒక పన్ను వదులైతే 32 పళ్లు రాలగొట్టుకుంటమా. కాళేశ్వరంలోని 300 పైచిలుకు పిల్లర్లలో రెండు కుంగితే కేసీఆర్‌ను బదనాం చేయాలనే చిల్లర రాజకీయం జరుగుతోంది. నా కళ్ల ముందే కరెంటు, సాగునీటి సమస్యలతో రైతుల కళ్లలో నీళ్లు, పంట పొలాలకు అగ్గి పెట్టడం వంటివి చూస్తున్నా. ఇప్పుడే రైతుల పరిస్థితి ఉంటే ఏప్రిల్, మే నెలల్లో పంట పొలాల సంగతేంటి'

కాళేశ్వరంపై కమిషన్

▶ మొదటి పేజీ తరువాయి

విధానంలో ఛత్తీస్‌గఢ్ నుంచి నేరుగా 1000 మెగావాట్ల విద్యుత్ కొనుగోలు చేసేందుకు గత ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుని ఆ విద్యుత్‌ను వాడుకోలేదని మంత్రి ఆరోపించారు. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంతో కుమ్మక్కై, గత ప్రభుత్వం దళారులకు చేసిన చెల్లింపులపై జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్ విచారణ జరుపుతుందని చెప్పారు. రాష్ట్రం ఏర్పడ్డాక గత 10 ఏళ్లలో ఇతర రంగాల్లో జరిగిన అవినీతికి సంబంధించి భవిష్యత్ కార్యాచరణను ఖరారు చేయడంపై మంత్రివర్గంలో చర్చించామని తెలిపారు.

రూ.22,500 కోట్లతో ఇళ్ల నిర్మాణం

ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద తొలి విడతలో ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇళ్లు చొప్పున రూ. 22,500 కోట్లతో మొత్తం 4.5 లక్షల ఇళ్ల నిర్మాణ ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఇళ్ల స్థలం కలిగిన పేదలు, నిరుపేదలకు వర్తింపజేస్తారు. గ్రామాల వారీగా సభలు ఏర్పాటు చేసి పార్టీలు, కులాలు, మతాలకతీతంగా, కాంగ్రెస్, కమ్యూనిస్ట్, పింక్ షర్ట్ వారు అని చూడకుండా, పైరవీలకు తావులేకుండా అర్హులను ఎంపిక చేస్తామని పొంగులేటి తెలిపారు.

త్వరలో 93 శాతానికి పైగా రైతులకు రైతుబంధు

ప్రస్తుత ప్రభుత్వం మహిళలను కోటీశ్వరుల్ని చేయాలని లక్ష్యంగా పెట్టుకుందని మంత్రి పొంగులేటి తెలిపారు. ఇందులో భాగంగా స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) మహిళల ఉత్పత్తులకు బ్రాండింగ్, మార్కెటింగ్ కల్పించడానికి వీలుగా ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటు కోసం అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్‌ఆర్) చుట్టూ 25 నుంచి 30 ఎకరాల స్థలాన్ని కేటాయించాలని మంత్రివర్గంలో నిర్ణయించినట్టు తెలిపారు. ఇక్కడి స్థలాన్ని జిల్లాల వారీగా మహిళా గ్రూపులకు కేటాయిస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నియోజకవర్గ స్థాయిల్లో విశాలమైన మినీ ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు చేయాలని తీర్మానించినట్టు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 84 శాతం రైతులకు రైతుబంధు ఇచ్చిందని, వచ్చే 2 రోజుల్లో 93 శాతానికి పైగా రైతులకు ఇవ్వాలని మంత్రివర్గంలో నిర్ణయించినట్లు పొంగులేటి తెలిపారు.

త్వరలో కొత్త రేషన్‌కార్డులు

అతి కొద్ది రోజుల్లోనే అర్హులైన పేదలందరికీ కొత్తగా తెల్లరేషన్‌కార్డులు జారీ చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. రేషన్ కార్డులుంటేనే ఆరోగ్యశ్రీ, ఇతర సంక్షేమ పథకాలు వర్తిస్తాయనే భావన ప్రజల్లో ఉందని, ఈ నేపథ్యంలో రేషన్‌కార్డుతో ఆరోగ్యశ్రీ పథకాన్ని విడదీసి అమలు చేయాలని భావిస్తున్నామని శ్రీధర్‌బాబు తెలిపారు. దీనిపై నివేదిక సమర్పించాలని పౌరసరఫరాల శాఖను ఆదేశించామన్నారు.

2008 డీఎస్సీ అభ్యర్థులకు లైన్‌క్లియర్

2008 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులకు మినిమమ్ పే స్కేల్ (టైమ్ పేస్కేల్) ఇచ్చి ఉద్యోగాల్లో తీసుకోవాలని మంత్రివర్గం నిర్ణయించింది. హైకోర్టు, సుప్రీంకోర్టుల నుంచి అభ్యర్థులు తమకు అనుకూలంగా తీర్పులు తీసుకువచ్చారని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. కాగా వేసవిలో తాగునీటి సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామని మంత్రి చెప్పారు. గత సెప్టెంబర్, అక్టోబర్ మాసంలో వర్షాలు పడక రిజర్వాయర్లలో నిల్వలు అడుగంటిపోయాయని పేర్కొన్నారు.

కొత్తగా 16 కార్పొరేషన్లు

మహిళల సాధికారత కోసం 'తెలంగాణ మహిళా శక్తి' అనే కొత్త కార్యక్రమాన్ని చేపట్టాలని రాష్ట్ర కేబినెట్ నిర్ణయించింది. సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయపరంగా మహిళలను ముందుకు తీసుకెళ్లేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించింది. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఓబీసీ, ఎస్సీ, బీసీ, ఎస్టీల కోసం మొత్తం 16 కార్పొరేషన్లను ఏర్పాటు చేయాలని కూడా ప్రభుత్వం నిర్ణయించింది. 1.యాదవ (కుర్మ), 2.మున్నురుకాపు, 3.పద్మశాలి, 4.పెరిక (పురగిరి క్షత్రియ), 5.లింగాయత్, 6.బలిజ, 7.గంగపుత్ర, 8.మేరా, 9.ముదిరాజ్ కార్పొరేషన్, 10.ఆర్య వైశ్య, 11.రెడ్డి కార్పొరేషన్, 12.మాదిగ, మాదిగ ఉపకులాలు, 13.మాల/మాల ఉపకులాలు, 14.కుమురం భీమ్ ఆదివాసి, 15. సంత్ సేవాలాల్ లంబాడి, 16.ఎరుకలు, ఇతర ఉపకులాల కోసం ఏకలవ్య.. కార్పొరేషన్లు ఏర్పాటు చేయనుంది.

ఈబీసీల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డు: పొన్నం

కులగణన నిర్వహణకు ప్రక్రియ ప్రారంభమైందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈబీసీల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని మంత్రివర్గం నిర్ణయించిందని చెప్పారు. ఆర్థికంగా ఎదగడానికి అవసరమైన సాంకేతికత జోడించడం కోసం కొత్త కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం ఎంబీసీ కార్పొరేషన్‌కు రూ.1,000 కోట్లు కేటాయించి రూ.ఒక్క కోటి కూడా ఖర్చు చేయలేదని విమర్శించారు. తాము కొత్త కార్పొరేషన్లకు నిధులు కేటాయిస్తామని, త్వరలో మంత్రి పొన్నం ప్రభాకర్ ఆయా వర్గాల వారితో సంప్రదింపులు జరిపి రెండు మూడు వారాల్లో కార్పొరేషన్లకు సంబంధించిన విధివిధానాలను రూపొందిస్తారని శ్రీధర్‌బాబు తెలిపారు. గీత కార్పొరేషన్ ద్వారా గీత కార్మికులకు త్వరలో రక్షణ పరికరాలను అందజేస్తామని, వాటితో చెట్లను ఎక్కితే కిందపడే ప్రమాదం ఉండదని, మరణాలూ ఉండవని పొన్నం చెప్పారు.

బీఆర్‌ఎస్ ఖాళీ అయింది: కోమటిరెడ్డి

సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులందరం కలిసి బృందంగా పనిచేస్తున్నామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. కేటీఆర్, హరీశ్, కేసీఆర్ ఈ రోజు మహిళలపై ప్రేమ ఒలకబోస్తున్నారని, అధికారంలోకి ఉన్నప్పుడు మాత్రం పట్టించుకోలేదని విమర్శించారు. కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి ప్రభుత్వానికి సలహాలు ఇవ్వడం ద్వారా ప్రతిపక్ష పాత్ర పోషించాలని సూచించారు. బీఆర్‌ఎస్ పార్టీ ఖాళీ అయిందని, జెడ్పీ/మున్సిపల్ చైర్మన్లు, కింది స్థాయి నేతలు ఆ పార్టీని వీడి కాంగ్రెస్, మరో పార్టీలో చేరుతున్నారని చెప్పారు.

నేను ఎవరికీ తలవంచేవాణ్ణి కాదు

- ఎవరో పక్కన కూర్చోబెడితే కూర్చొనేవాణ్ణి కాదు..
- యాదాద్రి ఘటనపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- లక్ష్మీ నరసింహస్వామికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలిపేందుకే కింద కూర్చున్నా
- ప్రభుత్వ ప్రణాళికలు, నిర్ణయాల రూపకల్పనలో కీలక పాత్ర పోషిస్తున్నా... సింగరేణి ఆధ్వర్యంలో కొత్తగా 1,600 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రాలు
- సింగరేణిలో 1,352 కొలువుల భర్తీకి త్వరలో నోటిఫికేషన్ ఇస్తామని వెల్లడి
- హైదరాబాద్‌లో సింగరేణి అతిథి గృహానికి శంకుస్థాపన



సింగరేణి అతిథి గృహ శంకుస్థాపనలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, విజయలక్ష్మి, వివేక్ తదితరులు..

సాక్షి, హైదరాబాద్/బంజారాహిల్స్: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి ఆశీస్సులతో సాధించిన పేదల ఇళ్ల విషయంలో మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేసుకుంటూ, ఆశీర్వచనం తీసుకోవడంలో భాగంగా కావాలనే తాను కింద కూర్చున్నానని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. పేదల ఇళ్ల కల నిజం కావడంతో ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేయడం కోసమే తాను ఆలయంలో చిన్న పీట మీద కూర్చున్నట్టు వెల్లడించారు. మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఆయన మంగళవారం హైదరాబాద్‌లోని ఎంబీటీ నగర్‌లో సింగరేణి అతిథి గృహం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ యాదగిరిగుట్ట ఆలయంలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక పూజల్లో తాను కింద కూర్చొని ఉండగా, సీఎం, ఇతర మంత్రులు కుర్చీల్లో కూర్చుని ఉండటంపై చెలరేగిన వివాదంపై వివరణ ఇచ్చారు. తమ కోరికలను మన్నించి ఆశీర్వదించి అవకాశం ఇచ్చిన నరసింహ స్వామికి మొక్కు చెల్లించుకుంటూ నిండు మనసుతో తమను ఆశీర్వదించాలని కోరుకున్నట్టు చెప్పారు. దురదృష్టవశాత్తు కొందరు ఆ ఫొటో తీసుకుని ట్రోల్ చేశారన్నారు. ఉప ముఖ్యమంత్రిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని శాసిస్తున్నానని, ఆర్థిక శాఖ, విద్యుత్ శాఖ, ప్రణాళిక శాఖలను నిర్వహిస్తూ రాష్ట్రంలో తీసుకునే అనేక ప్రణాళికలు, విధానపరమైన నిర్ణయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నానని వెల్లడించారు. 'నేను ఎవరికో తల వంచే వాడిని కాదు. ఎవరో పక్కన కూర్చోబెడితే కూర్చునేవాడిని అంతకన్నా కాదు. ఆత్మగౌరవాన్ని చంపుకునే వ్యక్తిని కాదు. మిత్రులు ఎవరైనా మానసిక క్షోభకు గురైతే అర్థం చేసుకోవాలి'అని అన్నారు.

పాదయాత్రలోనే గుట్టలో మొక్కుకున్నా...

'నేను పాదయాత్ర చేసినప్పుడు మార్గమధ్యంలో యాదగిరిగుట్టలో స్వామి వారిని దర్శించుకున్నా. రాష్ట్రంలో ప్రజలు అనేక బాధలు పడుతూ ఉన్నారు. ఇళ్లు లేని పేదలు, ఉద్యోగాలు లేని యువతీయువకులు.. వారాందరి బాధలు విన్న తర్వాత ఏదో ఒక విధంగా ఇందిరమ్మ రాజ్యాన్ని తెచ్చేలా ఆశీర్వదించి పంపించు అని స్వామివారిని మనస్ఫూర్తిగా కోరుకున్నా..'అని భట్టి తెలిపారు. దుర్మార్గపు ప్రభుత్వాన్ని వదిలించుకుని, ఇళ్లు ఇచ్చే ఇందిరమ్మ రాజ్యాన్ని తేవాలని ప్రజలు తనను కోరారన్నారు. అందుకే అప్పట్లో స్వామి వారిని మొక్కు కోరుకున్నట్టు తెలిపారు. సింగరేణి ఏరియాలో జీవో 76 ప్రకారం 2006లో దాదాపు 23 వేల మందికి ఇళ్ల స్థలాలను ఇచ్చామని, వాటిలో కట్టుకున్న ఇళ్లను క్రమబద్ధీకరిస్తామని ప్రకటించారు. సింగరేణి, జెన్‌కోలో స్థలాల్లోని ఇళ్లను క్రమబద్ధీకరిస్తామన్నారు.

మరో 1,600 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రాలు

సింగరేణి సంస్థలో ఇప్పటికే 489 కొలువుల భర్తీకి నోటిఫికేషన్లు జారీ చేయగా, మరో 1,352 కొలువుల భర్తీకి త్వరలో ప్రకటన వస్తుందని భట్టి విక్రమార్క ప్రకటించారు. సింగరేణి పరిధిలోని నాలుగు ఉమ్మడి జిల్లాల అభ్యర్థుల స్థానికత విషయంలో వచ్చిన సమస్యను పరిశీలించి పరిష్కరిస్తామని చెప్పారు. సింగరేణి ఆధ్వర్యంలో జైపూర్‌లో 1200 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రాలుండగా, కొత్తగా అక్కడ 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్లాంట్‌ను సంస్థ నిర్మిస్తుందన్నారు. కాలం చెల్లిన 62.5 మెగావాట్ల రామగుండం బీ-థర్మల్ విద్యుత్ కేంద్రం స్థానంలో మరో 800 థర్మల్ విద్యుత్ కేంద్రం నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నామని, ఈ స్థలాన్ని జెన్‌కో నుంచి సింగరేణికి బదిలీ చేస్తామని తెలిపారు.

ఎస్‌హెచ్‌జీలకు విద్యార్థుల యూనిఫామ్స్ ఆర్డర్

జీవో జారీచేసిన రాష్ట్ర ప్రభుత్వం



సాక్షి, హైదరాబాద్: పాఠశాల విద్యార్థుల యూనిఫామ్స్ కుట్టే పనులను ప్రత్యేకంగా మహిళాస్వయం సహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జీలు), వారి ఫెడరేషన్లకు కట్టబెడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. దీనికి సంబంధించిన అన్ని ఏర్పాట్లను జీహెచ్‌ఎంసీ కమిషనర్, అన్ని జిల్లాల కలెక్టర్లు చేపట్టాలని ఆదేశించింది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు యూనిఫామ్స్‌ను అందించే పాఠశాల విద్యాశాఖ, అన్ని రెసిడెన్షియల్ స్కూళ్లు, సంక్షేమ హాస్టళ్లు, ఇతర సంస్థలు ఈ పనులను ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు అప్పగించాలని సూచించింది. సంబంధిత శాఖలు యూనిఫామ్స్‌కు అవసరమైన క్లాత్ అందించాక 45 రోజుల వ్యవధిలో వాటిని కుట్టించి అందజేసే బాధ్యతను తీసుకోవాలని స్పష్టం చేసింది. మంగళవారం ఈ మేరకు పంచాయతీరాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీ చేశారు.

సీఎం రేవంత్‌రెడ్డితో కోకాకోలా కంపెనీ ప్రతినిధులు భేటీ


మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి కూడా..


సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మంగళవారం సీఎం క్యాంపు కార్యాలయంలో కోకాకోలా కంపెనీ ప్రతినిధులు కలిశారు. కార్యక్రమంలో హిందుస్తాన్ కోకాకోలా బేవరేజెస్ సీఈవో జువాన్‌పబ్లో రోడ్రిగ్జ్, కోకాకోలా ప్రతినిధుల బృందం పాల్గొంది. సీఎం రేవంత్‌ను మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి సీఎం క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్‌లో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ప్రచార దీక్షలో భాగంగా హస్తం గుర్తు చిహ్నాన్ని సీఎంకు ధరింపజేశారు.

డీఏఓ, హెచ్‌డబ్ల్యూఓ పరీక్షల షెడ్యూల్ విడుదల

- జూన్ 24 నుంచి హెచ్‌డబ్ల్యూఓ పరీక్షలు
- జూన్ 30న రెండు సెషన్లలో డీఏఓ పరీక్ష
- టీఎస్‌పీఎస్సీ వెల్లడి

సాక్షి, హైదరాబాద్: డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ (డీఏఓ- గ్రేడ్ 2), హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ (హెచ్‌డబ్ల్యూఓ) అర్హత పరీక్షల తేదీలను తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) విడుదల చేసింది. జూన్ 24వ తేదీ నుంచి హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ అర్హత పరీక్షలను నిర్వహించనుంది. ఈ పరీక్షలను సీబీఆర్‌టీ పద్ధతిలో నిర్వహించనున్నట్లు టీఎస్‌పీఎస్సీ స్పష్టం చేసింది. జూన్ 30న ఉదయం మధ్యాహ్నం రెండు సెషన్లలో డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ పరీ క్షలను నిర్వహించనుంది. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్లో అందు బాటులో ఉంచినట్లు కమిషన్ కార్యదర్శి నవీన్ నికోలస్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.







వృద్ధాప్యం వస్తుంది. అనారోగ్యం వస్తుంది. మరణం కచ్చితంగా వస్తుంది. ఇవి తప్పనిసరి అని తెలిసినప్పుడు వాటికోసం సిద్ధపడాలి. ఇవి తథ్యమని తెలుస్తున్నప్పుడు, జీవితాన్ని ఎలా జీవిస్తున్నామో చూసుకోవాలి.

– థానిస్సరో భిక్షు (బౌద్ధ ధర్మం)

సాక్షి

బుధవారం, 13 మార్చి 2024

మళ్లీ సీఏఏ రంగప్రవేశం!


రేపో మాపో లోక్‌సభ ఎన్నికల నగారా మోగబోతున్న తరుణంలో... ఎలక్టోరల్ బాండ్ల వివరాలను ఆరునూరైనా ఈనెల 15కల్లా బహిరంగపరచాలని సుప్రీంకోర్టు విస్పష్టంగా చెప్పిన కొన్ని గంటల్లో పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ) నిబంధనలపై సోమవారం సాయంత్రం నోటిఫికేషన్ విడుదలైంది. అఫ్గానిస్తాన్, పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లలో మైనారిటీలుగా వేధింపులకు లోనవుతూ మన దేశానికి వలసవచ్చిన హిందూ, సిక్కు, జైన, బౌద్ధ, క్రైస్తవ, పార్సీ మతస్తులకు త్వరితగతిన భారత పౌరసత్వం ఇవ్వటం సీఏఏ ప్రధాన ఉద్దేశమని పార్లమెంటులో బిల్లు పెట్టిన సందర్భంగా కేంద్రం ప్రకటించింది. ఇప్పుడు మరోసారి ఆమాటే చెప్పింది. ఈ మతస్తులు వరసగా అయిదేళ్లపాటు ఈ దేశంలో నివసిస్తే పౌరసత్వానికి దరఖాస్తు చేసుకోవచ్చు. 1955 నాటి పౌరసత్వ చట్టానికి ఈ సవరణలు తీసుకొచ్చారు. చట్టంలో ముస్లింలను మినహాయించినట్టు బాహాటంగానే కనబడుతోంది. కానీ శ్రీలంకలో మైనారిటీలైన హిందూ తమిళులనూ, మయన్మార్‌లోని మైనారిటీలు రోహింగ్యాలనూ, ఇంకా... హజరా, అహ్మదీయ వంటి ముస్లిం మైనారిటీ తెగలనూ సీఏఏ పరిగణనలోకి తీసుకోలేదు. ఈ తెగలు కూడా భారత పౌరసత్వం కోసం ఎప్పటిలా దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే కనీసం వారు పదకొండేళ్లపాటు ఈ దేశంలో నివసించాలి. ఆచరణలో పౌరసత్వం రావటానికి దశాబ్దాలు పడుతుందని వేరే చెప్పనవసరం లేదు. ముస్లిం దేశాల్లోని హిందువుల స్థితిగతులపై వున్న ఆరాటం లంక తమిళుల విషయంలో ఎందుకు లేకుండా పోయింది? అక్కడ వారు ఎదుర్కొంటున్న వివక్ష, హింస తక్కువేమీ కాదు.

చట్టం ముందు అందరూ సమానులేనని మన రాజ్యాంగం చెబుతోంది. రాజ్యం ఎవరికీ సమానత్వాన్ని నిరాకరించకూడదనీ, పౌరులందరికీ చట్టాలు సమంగా రక్షణ కల్పించాలనీ రాజ్యాంగంలోని 14వ అధికరణ చాటుతోంది. పౌరసత్వానికి దరఖాస్తు చేసుకున్నవారి విషయంలో ఆ స్ఫూర్తే కొనసాగాలి. కానీ సీఏఏ అందుకు విరుద్ధంగా కొన్ని మతాలవారిని ఉదారంగా చూడటం, మరికొందరిని దూరం పెట్టడం ఎంతవరకూ సమంజసం? ఈ చట్టాన్ని సవాలు చేస్తూ ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయూఎంఎల్) 2020లో పిటిషన్ దాఖలు చేసింది. కాలక్రమంలో మరో 200 పిటిషన్లు దానికి జత కలిశాయి. ఇందులో అస్సాంకు చెందిన అసోం గణపరిషత్, డీఎంకే, అస్సాం పీసీసీ మొదలుకొని అసదుద్దీన్ ఒవైసీ, మహువా మొయిత్రా, జైరాం రమేష్ వంటి నాయకులు కూడా వున్నారు. బిల్లు చట్టంగా మారాక దేశవ్యాప్తంగా అన్ని ప్రధాన నగరాల్లో, విశ్వవిద్యాలయాల్లో ఆందోళనలు మిన్నంటాయి. ఢిల్లీలోని జామియా మిలియా, అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ వంటిచోట్ల హింసాత్మక సంఘటనలు చోటుచేసుకున్నాయి. ఆందోళనల్లో వందమంది వరకూ మరణించగా, అనేకులు గాయపడ్డారు. వందలాదిమందిపై ఇప్పటికీ కేసులు కొనసాగుతున్నాయి. సోమవారం నోటిఫికేషన్ విడుదలయ్యాక ఈశాన్య రాష్ట్రాలైన అస్సాం, మేఘాలయ, త్రిపురల్లో ఆందోళనలు చెలరేగాయి. ఈ ఉద్యమాల వెనకున్న ఉద్దేశం వేరు. ఆల్ అస్సాం స్టూడెంట్స్ యూనియన్ వంటివి పరాయి దేశాల మైనారిటీలకు మనమెందుకు పౌరసత్వం ఇవ్వాలని ప్రశ్నిస్తున్నాయి. ఈ భారం తమపైనే పడుతుందని ఆందోళన పడుతున్నాయి. మరోపక్క సీఏఏ నోటిఫికేషన్ రాకపై గత కొన్ని నెలలుగా మీడియాలో కథనాలు వస్తూనే వున్నాయి. పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీని ఎదుర్కొనటానికి ఇది బ్రహ్మాస్త్రంగా ఉపయోగపడుతుందనీ, లేకుంటే దెబ్బతింటామనీ ఆ రాష్ట్ర బీజేపీ నేతలు చెబుతూ వస్తున్నారు. బెంగాల్‌లోని నాదియా, 24 పరగణాలు, తూర్పు బర్ద్వాన్, ఉత్తర బెంగాల్‌లోని మరికొన్ని ప్రాంతాలకు 1971లో బంగ్లా విముక్తి యుద్ధ సమయంలో బంగ్లాదేశ్ నుంచి వచ్చిన మతువా తెగ ప్రజలు హిందువులు. పౌరసత్వ చట్టానికి 2003లో చేసిన సవరణ కింద వారంతా శరణార్థులుగా కొనసాగుతున్నారు. ఓటుహక్కు వగైరాలున్నాయి. మొదట్లో సీపీఎంకూ, తర్వాత తృణమూల్‌కూ, ఇప్పుడు బీజేపీకీ వోటు బ్యాంకుగా వీరు ఉపయోగపడుతున్నారు. అస్సాంలోనూ బీజేపీకి అటువంటి ప్రయోజనాలే వున్నాయి. రామమందిరం, పౌరసత్వ సవరణ చట్టంవంటివి మాత్రమే ఎన్నికల్లో గట్టెక్కిస్తాయని నిజంగా బీజేపీ భావిస్తే అది ఆ పార్టీ బలహీనతను సూచిస్తుందే తప్ప బలాన్ని కాదు.

పొరుగు దేశాల బాధిత మైనారిటీల విషయంలో అనుసరించాల్సిన విధానాలను మాత్రమే సీఏఏ నిర్ధారించిందని, మైనారిటీల పౌరసత్వానికి దానివల్ల వచ్చే నష్టంలేదని, వారు భయపడాల్సిన పని లేదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా చెబుతున్నారు. సీఏఏ దానికదే సమస్యాత్మకం కాకపోవచ్చు. కానీ జాతీయ పౌర పట్టిక (ఎన్ఆర్‌సీ)ను దాంతో అనుసంధానిస్తే ఉత్పన్నమయ్యే సమస్యలు అన్నీ ఇన్నీ కాదని నిపుణులంటున్న మాట. అస్సాంలో ఎన్ఆర్‌సీ అమలయ్యాక ఏమైందో చూస్తే ఇది అర్థమవుతుంది. ఆ రాష్ట్రంలో దాదాపు 20 లక్షలమంది పౌరసత్వానికి అనర్హులయ్యారు. ఇందులో ముస్లింలతోపాటు హిందువులు కూడా వున్నారు. ఎన్ఆర్‌సీని ఏదోమేరకు అంగీకరించిన అస్సాంలో సీఏఏపై వ్యతిరేకత వుండటాన్ని, లంక తమిళులకు చట్టంలో చోటీయకపోవటంపై వున్న అసంతృప్తిని కేంద్రం పరిగణనలోకి తీసుకున్నట్టులేదు. చట్టం తీసుకురావటానికి ముందు అన్ని వర్గాలతోనూ చర్చించలేదు. ఉద్యమాల సమయంలో చర్చలకు సిద్ధమని ప్రకటించినా అవేమీ జరగలేదు. కనీసం నోటిఫికేషన్ విడుదలకు ముందైనా సందేహాలు పోగొట్టాల్సిన అవసరం గుర్తించకపోతే ఎలా? అసలు ఎన్నికలు ముంగిట పెట్టుకుని సమస్యాత్మకమైన ఈ తేనెతుట్టెను ఎందుకు కదిపినట్టు?

ఆంధ్రలో ‘చంద్ర’ కళాప్రదర్శన

అభిప్రాయం



టంకశాల అశోక్

చంద్రబాబు చూపుతున్న ధీమా నిజమే అయితే, ఒంటరిగా పోరాడి అధికారానికి రాగలనని నమ్మాలి. ఎవరితోనూ పొత్తు అవసరం లేదని భావించాలి. కానీ జరుగుతున్నదేమిటి? స్వయంగా చంద్రబాబే పొత్తుల కోసం వెంపర్లాడుతున్నారు. 2014 నాటి స్వల్ప మెజారిటీ భయం, 2019 నాటి ఘోర పరాజయ భయం చంద్రబాబు మానసిక స్థితిని, ఆలోచనలను ప్రభావితం చేయటం మొదలుపెట్టాయి. వయసురీత్యా బహుశా ఇవి ఆయనకు చివరి ఎన్నికలు కావచ్చు. తన వారసుడు సమర్థుడనే నమ్మకం టీడీపీ వాదులకే కలగటం లేదు. ఈసారి గెలవనట్లయితే అది పార్టీ పునాదుల కింద భూకంపం కాగలదు. ఏమి చేసైనా గెలవటమన్నది చంద్రబాబుకు జీవన్మరణ ప్రశ్నగా మారింది. మనకు కన్పిస్తున్నదంతా ఆ ప్రయత్నాలలో భాగమే.

జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఆంధ్రప్రదేశ్ సర్వనాశనమైందని దృఢమైన స్వరంలో ప్రకటిస్తూ వస్తున్న టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, ఒంటరిగా పోటీ చేసే ఆత్మవిశ్వాసం లేక బీజేపీ, జనసేనలతోపొత్తు కుదుర్చుకున్నారు. జనసేనతో పొత్తు కొంతకాలంగా ఉన్నదే కాగా, అది సరిపోదన్నట్లు ఇప్పుడు అకస్మాత్తుగా బీజేపీతోనూ అంగీకారం కుదిరింది. అందుకోసం పవన్ కల్యాణ్ ద్వారా నానా ప్రయత్నాలు చేశారు. జగన్ ప్రభుత్వంపై అంత వ్యతిరేకత ఉంటే చంద్రబాబుకు ఇన్నిన్ని పొత్తులు ఎందుకనేది ఎవరికైనా వెంటనే మనసుకు వచ్చే సందేహం.

2014లో రాష్ట్రం విడిపోయినపుడు వైఎస్సార్‌సీపీ ఒంటరిగా పోటీ చేయగా, ఒంటరిగా తలపడే ధైర్యం టీడీపీకి అప్పుడే లేకపోయింది. బీజేపీ మద్దతు కోరింది. పరోక్షంగా పవన్ మద్దతు తీసుకుంది. కొద్ది తేడాతో గెలిచి అధికారానికి వచ్చి ఎన్డీఏలో చేరింది. 2014 నుంచి 2019 వరకు చంద్రబాబు తన ఘనమైన పరిపాలనానుభవంతో మరెంతో ఘనంగా కొత్త రాష్ట్రాన్ని పాలించి, సర్వతోముఖాభివృద్ధి సాధించినట్లు టీడీపీ చెప్పుకొన్నది. అంతలో 2019 ఎన్నికలు రాగా, ఈ రికార్డులన్నింటి వల్ల ఈసారి చాలా పెద్ద మెజారిటీతో తిరిగి అధికారానికి రానున్నట్లు ప్రకటించింది. తీరా ఫలితాలు వెలువడినపుడు అంతా తలకిందులైంది. చాలా పెద్ద మెజారిటీ వైఎస్సార్‌సీపీకి రాగా, టీడీపీ చిత్తుగా ఓడింది. 2014లో మద్దతు ప్రకటించిన బీజేపీ 2019 వచ్చేసరికి దూరమైంది. 2019 ఓటమితో తమ వాస్తవ పరిస్థితి ఏమిటో బోధపడిన చంద్రబాబు కొంతకాలం కమ్యూనిస్టులతో, పవన్ కల్యాణ్‌తో దోబూచులాడి చివరకు పవన్ కల్యాణ్‌తో మైత్రిని స్థిరపరచుకున్నారు. కమ్యూనిస్టులతో మైత్రి అటూ ఇటూ సాగుతూ వస్తున్నది. ఇటీవలికి వచ్చేసరికి లెక్కలన్నీ వేసుకుని మరొకమారు ఎన్డీఏలో చేరుతున్నారు.

పొత్తులు సరే, కానీ పొత్తు ఏ విధంగా జరుగుతుందనే దానిని బట్టి ప్రజలు తమ అభిప్రాయాలు ఏర్పరచుకుంటారు. 2014లో బీజేపీ మద్దతు తీసుకున్న చంద్రబాబు అధికారానికైతే వచ్చారుగానీ, ఆ మద్దతు ఉన్నప్పటికీ మెజారిటీ చాలా స్వల్పం కావటంతోనే ఆయనకు అపుడే ఒరిజినల్ భయం మొదలైందనుకోవాలి. బీజేపీ మద్దతు కారణంగా ఎన్డీఏలో చేరి, ఆ ప్రాతిపదికపై మోదీ ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి ప్రత్యేక హోదాతో సహా కొన్ని సాధించగలనని ఆశించారు. కానీ వివిధ కారణాల వల్ల అది అంతగా సిద్ధించకపోగా రాష్ట్రంలో తీవ్ర నిరాశ ఏర్పడి విమర్శలు రాగా, వాటిని తట్టుకోలేక ఎన్డీఏ నుంచి బయటకు వచ్చారు. అన్నింటికన్నా ముఖ్యంగా తన పరిపాలన అస్తవ్యస్తంగా సాగి, అభివృద్ధి సంక్షేమాలు కన్పించక పోవటంతో ప్రజలలో వ్యతిరేకత తీవ్రంగా పెరగ సాగింది. 2014 గెలుపే స్వల్ప ఆధిక్యతతో కాగా, వ్యతిరేకత వల్ల ఓటర్లతో దూరం అప్పటి భయాన్ని అనేక రెట్లు పెంచింది. అయినా మళ్లీ బీజేపీకి దగ్గరయే



అవకాశం లేకుండా పోయింది. ఆ పార్టీని, మోదీని నానా మాటలతో దూషించారు గనుక. తానంటే నమ్మకం కుదరని కమ్యూనిస్టులు, జనసేన వేరే కూటమి పెట్టుకున్నాయి. అమరావతి కోసం భూసేకరణతో పాటు తన పరిపాలనా చర్యలనేకం ఎదురు తిరగగా 2019లో దారుణ పరాజయం ఎదురైంది. తన ఘనమైన సుదీర్ఘ పాలనానుభవం, మేధాశక్తి, రాజకీయ చాతుర్యం ఏవీ ఉపయోగపడలేదు.

ఆ విధంగా 2014 నాటి స్వల్ప మెజారిటీ భయం, 2019 నాటి ఘోర పరాజయ భయం కలిసి ఈ 2024 ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో చంద్రబాబు మానసిక స్థితిని, ఆలోచనలను ప్రభావితం చేయటం మొదలుపెట్టాయి. వయసురీత్యా బహుశా ఇవి ఆయనకు చివరి ఎన్నికలు కావచ్చు. తన వారసుడు సమర్థుడనే నమ్మకం టీడీపీ వాదులకే కలగటం లేదు. అటువంటి స్థితిలో ఈసారి గెలవనట్లయితే అది పార్టీ పునాదుల కింద భూకంపం కాగలదు. ఆ బృహత్ ప్రమాదం దృష్ట్యా ఏమి చేసైనా సరే గెలవటమన్నది చంద్రబాబుకు జీవన్మరణ ప్రశ్నగా మారింది. మనకు కన్పిస్తున్నదంతా ఆ ప్రయత్నాలలో భాగమే.

తన ప్రయత్నాలలో మొట్టమొదటిది జగన్ పాలనపై ఎడతెరిపి లేని తీవ్ర విమర్శలు. అది కూడా తీవ్రాతి తీవ్ర స్వరంతో. ఈ విమర్శలు, ఆరోపణలలోని నిజానిజాలు చంద్రబాబుకైనా తెలుసునో లేదో చెప్పలేము. ఈ సంకుల అధికార సమరంలో అటువంటి విచక్షణకు ఎంతమాత్రం తావు లేదు. కానీ తార్కికంగా ఆలోచించినపుడు ఒకటి అనిపిస్తుంది. ఉదాహరణకు, జగన్ పాలన అసమర్థమైనదని చంద్రబాబు చేస్తున్న ప్రసంగాల పట్ల స్వయంగా ఆయనకు నమ్మకం ఉన్నట్లయితే, రాబోయే ఎన్నికల విషయమై పూర్తి ధీమా ఏర్పడాలి. తాను ఒంటరిగా పోరాడి గొప్ప మెజారిటీతో గెలిచి అధికారానికి రాగలనని తిరుగులేని విధంగా నమ్మాలి. ఎవరితోనూ పొత్తు అవసరం లేదని భావించాలి. ఇతరులే తనతో పొత్తు కోసం ప్రయత్నించే స్థితి ఏర్పడాలి. అట్లా ఎవరైనా అడిగినా, వారి కోసం కొన్ని సీట్లు వదులు కోవటం ఎందుకని వారిని తిరస్కరించాలి.

కానీ జరుగుతున్నదేమిటి? స్వయంగా చంద్రబాబే ఇతరులతో పొత్తు కోసం కొంత కాలం నుంచే వెంపర్లాడుతున్నారు. జనసేనతో ఏమి జరుగుతూ వస్తున్నదో చూస్తున్నాము. కమ్యూనిస్టులతో సఖ్యత కోసం కూడా ప్రయత్నాలు సాగాయి. అంతటితో ఆగితే అందుకొక అర్థం ఉండేదేమో. అప్పటికైనా ఆయన బలహీనత తెలిసి వచ్చేదే గానీ కనీసం అది రాష్ట్ర స్థాయి రాజకీయంగా ఉండిపోయేది. కానీ, ఆ పొత్తులైనా తన విజయానికి సరిపోగలవన్న నమ్మకం చంద్రబాబుకు కలిగినట్లు లేదు. ఆ స్థితిలో ఇక మిగిలింది బీజేపీ అనే జాతీయ పార్టీ. 2014–19 మధ్య తన ఆశలను అడియాస చేసి, తన వైపు నుంచి తాను ఎన్నెన్నో కఠినమైన విమర్శలు సాగించి, సెక్యులరిజం, మతతత్త్వం వంటి పదాలను యథేచ్ఛగా దొర్లించి దాడులు చేసి, ఎన్డీఏ నుంచి ఈ కారణాల పరంపరతో నిష్క్రమించిన పార్టీ టీడీపీ. అయితేనేమిగాక. ప్రస్తుతం వరదలో కొట్టుకుపోతూ దారి తెన్ను కన్పించక, భవిష్యత్తు అంధకార బంధురంగా తోస్తున్న తనకు ఈ గత చరిత్ర గురించిన శషభిషలు అవివేకమవుతాయి. కనుక ‘పవన రాయబారం’ సాగించి నేటికి కృతకృత్యులయ్యారు. అయినప్పటికీ ఫలం సిద్ధిస్తుందా అంటే ఎవరూ చెప్పలేరు.

దానినట్లుంచితే, బీజేపీతో సంబంధాల విషయమై ఇంతలోనే ఈ మార్పు ఏమిటి? అని ఆశ్చర్యంతో కూడిన ప్రశ్నలు ఎదురు కాగలవన్నది చంద్రబాబు ఊహించలేని విషయం కాదు. అందుకు వివరణలను ముందే సిద్ధం చేసి ఉంచుకున్నట్లు కనిపిస్తున్నది. వాటిని ఆయన స్వయంగా వివరించిన దానిని బట్టి మూడు మాటలు కన్పిస్తున్నాయి. ఒకటి, ఏపీ ప్రయోజనాలను కాపాడేందుకు కలిసి పని చేయాలనుకోవటం. రెండు, ఒకవేళ టీడీపీ అధికారానికి వచ్చినా కేంద్ర సహాయం లేకుండా రాష్ట్రాభివృద్ధికి సాధ్యం కాదు గనుక బీజేపీతో కలవాలనుకోవటం, మూడు, ఎన్డీఏ సమావేశంలో పాల్గొనవలసిందిగా ఇతర మాజీ మిత్ర పక్షాలతో పాటు టీడీపీకి కూడా ఆహ్వానం అందినందున ఈ అవకాశాన్ని రాష్ట్ర ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవాలనుకోవటం. ఈ వివరణలోని నిజాయితీ ఏమిటో, పొత్తులోని అసలు ఉద్దేశం ఏమై ఉంటుందో ఎవరి అభిప్రాయానికి వారు రావచ్చు.

ఈ వివిధ పరిణామాలన్నింటి వెనుక స్పష్టంగా కనిపిస్తున్నది మాత్రం ఒకటే. జగన్‌పై చంద్రబాబు విమర్శలు, ఆరోపణలైతే యథేచ్ఛగా సాగిస్తున్నారు గానీ, వచ్చే ఎన్నికలలో విజయావకాశాలపై నమ్మకం కలగటం లేదు. ఆ కారణంగా తన రాజకీయ కళలన్నీ ప్రదర్శిస్తున్నారు.

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల ‘మనసులోని మాట’లు తాజాగా ఇలా...!

మీరు గుర్తించరా?



‘జంగ్నన్ ప్రాంతం చైనాకు చెందినది. సోకాల్డ్ అరుణాచల్ ప్రదేశ్‌ను చైనా ఎప్పుడూ గుర్తించ లేదు’ అని చైనా ప్రతినిధి వ్యాఖ్యానించారు. భారత్–చైనా సంబంధాలు ‘సాధారణం’గా ఉండకపోవడానికి ఉన్న ఎన్నో కారణాల్లో ఇదీ ఒకటి. రానున్న కాలంలోనూ సాధారణం అయ్యే అవకాశం లేదు. దానికి బాధ్యత చైనా మీదే ఉంటుంది.

– సనా హాశ్మీ, ఫెలో

ఇంత దారుణమా?



సంబంధాలు ఘోరంగా క్షీణిస్తున్నాయి. కుటుంబంలో తోబుట్టువుల మధ్య ఆస్తి తగాదాలు. ఇరు పక్షాల నుంచి పెట్టుకున్న కేసులు చూడండి: అత్యాచారం, దొంగతనం, నేరపూరిత కుట్ర, గృహ హింస, సీఆర్‌పీసీ 125(మనోవర్తి), హింస, ఉల్లంఘన, ఇంకా పది కేసులు!

– దీపికా నారాయణ్ భరద్వాజ్, యాక్టివిస్ట్

అలా జరుగుతోందా?



సీఏఏను వ్యతిరేకిస్తున్నవాళ్లు జవాబివ్వాల్సిన ప్రశ్న ఇది: పాకిస్తాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్తాన్– ఈ మూడు దేశాల్లో ముస్లింలు కూడా మతపీడనకు గురవుతున్నారా? తమ దేశంలోనే ముస్లింలను ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ పాకిస్తాన్ పీడిస్తోందా? వాళ్లకు కూడా ఇండియా ఆశ్రయం ఇవ్వాలా?

– మోహన్‌దాస్ పాయ్, వ్యాపారవేత్త

ఎలా జరిగింది?



ఎల్‌సీఏ తేజస్ కూలిపోవడం విషాదకరం. దాని సేవలు మొదలైన 23 ఏళ్లలో ఇదే మొదటి ప్రమాదం. పైలట్ సురక్షితంగా ఉన్నాడని తెలియడం సంతోషం. దీనికి కారణాలు ఏమిటో త్వరలోనే తెలుసుకుని, వాటిని సరిచేసుకుంటామని ఆశ.

– యూసుఫ్ ఉంఝావాలా, విశ్లేషకుడు

అందరి అంశం



ప్రజారోగ్యం అనేది వైద్యులందరూ పట్టించుకోవాల్సిన అంశం కావాలి; ఏదో కొద్దిమంది దాన్ని ప్రత్యేకంగా చదివేవాళ్లకు అది పరిమితం కావొద్దు.

– టిమ్ కెల్లీ, వైద్యుడు

వైజ్ఞానిక వేగుచుక్కలు

తొలి ‘మహిళా’ డాక్టర్

పాశ్చాత్య ప్రపంచంలో డాక్టర్ అంటే మొదట్లో పురుషుడే! అయితే ఈ వైద్యుల మహిళా కుటుంబ సభ్యులు సహాయకులుగా ఉండేవాళ్ళు. మహిళా రోగులు స్త్రీల ద్వారానే వైద్యం పొందితే బావుండనే పరిస్థితి ఉండేది. 1800లో ఇంగ్లాండులో ‘రాయల్ కాలేజ్ ఆఫ్ సర్జన్స్’ సంస్థ ఏర్పడి, లైసెన్స్ ఇస్తూ నకిలీ డాక్టర్ల బెడదను తగ్గించడానికి కృషి చేసింది. అయితే, వైద్య విద్యను పొందడానికి గానీ, వైద్య వృత్తిని పాటించడానికి గానీ అక్కడ మహిళలకు అవకాశం లేదు. కనుకనే ‘ఉమెన్స్ హెల్త్ మూవ్‌మెంట్’ వచ్చింది.



డా॥ జేమ్స్ మిరెండా స్టువర్ట్ బ్యారీ

ఆ చరిత్ర పుటలను తిరగేస్తే తారసపడే తొలి మహిళా డాక్టరు బ్రిటిష్ ఆర్మీలో పనిచేసిన డాక్టర్ జేమ్స్ మిరెండా స్టువర్ట్ బ్యారీ. ఈమె అసలు పేరు మార్గరెట్ యాన్ బల్క్ లే. ఈమె తన జీవిత పర్యంతం పురుషుడిగానే చలామణి అయింది. పురుషుడుగానే ఆమె ఎడింబరో యూనివర్సిటీలో 1809లో అడ్మిషన్ పొంది, అలానే 1812లో డాక్టర్ కోర్సు డిగ్రీ ఎమ్‌డీని పొందారు. ఐర్లాండ్‌లోని కోర్క్ నగరంలో 1789లో జన్మించారు.

దక్షిణాఫ్రికాలోని కేప్‌టౌన్‌తో పాటు బ్రిటిష్ సామ్రాజ్యంలోని చాలా ప్రాంతాల్లో దాదాపు 50 ఏళ్లకు పైగా వైద్య వృత్తిని విజయవంతంగా నిర్వహించారు. ఆఫ్రికాలో సిజేరియన్ ఆపరేషన్ నిర్వహించి, తల్లీ బిడ్డ క్షేమంగా ఉండేట్టు విజయం సాధించిన తొలి యూరోపియన్ డాక్టర్‌గా నమోదు అయ్యారు. బ్రిటిష్ ఆర్మీలో రెండవ అతి పెద్ద ఉన్నత పదవి ‘ఇన్‌స్పెక్టర్ జనరల్ ఇన్‌ఛార్జ్ ఆఫ్ మిలిటరీ హాస్పిటల్స్’ స్థాయికి వెళ్లిన తొలి వ్యక్తి కూడా!

ఈమె తండ్రి జెరేమియా బల్క్ లే, తల్లి మేరీ యాన్ బల్క్ లే. జెరేమియా అప్పుల్లో కూరుకునిపోయి చివరకు జైలు పాలయ్యాడు. దాంతో గత్యంతరం లేని ముగ్గురు పిల్లల తల్లి 15 సంవత్సరాల మన భావి డాక్టర్‌తో ఐర్లాండ్ నుంచి లండన్‌కు వెళ్లింది. మరుసటి సంవత్సరమే అక్కడ ఉన్న ఆమె సోదరుడు కన్నుమూయడంతో ఆయన ఆస్తి వీరికి దక్కడం ఒక ఆశ్చర్యకరమైన మలుపు. ఈ దశలో మేరీ యాన్ బల్క్ లే, ఆమె సోదరుని సన్నిహిత, ఉదారవాద వాద మిత్రులు కొందరు సంయుక్తంగా చర్చించి ఒక ప్రణాళిక వేశారు. కనుకనే 1809 నవంబర్లో యూనివర్సిటీ వైద్య శాస్త్రం చదువుకు పురుషునిగా అడ్మిషన్ పొందింది. అప్పటి నుంచీ పురుష దుస్తుల్లో కనిపిస్తూ బాహ్య ప్రపంచానికి ‘అతడు’గా మారిపోయింది.

చదువు పూర్తి చేసిన తర్వాత బ్రిటిష్ ఆర్మీలో హాస్పిటల్ అసిస్టెంట్‌గా 1813 జూలైలో ఉద్యోగం పొంది, శిక్షణ పొందిన తర్వాత 1816లో దక్షిణాఫ్రికా లోని కేప్‌టౌన్‌కు బదిలీ అయ్యారు. అక్కడ గవర్నర్ లార్డ్ చార్లెస్ సోమర్ సెట్ కూతురు ఒకరు అనారోగ్యంతో ఉండడంతో డా॥ జేమ్స్ బ్యారీ ఆ కుటుంబ సభ్యులుగా మారిపో(యింది)యారు. మారిషస్, వెస్టిండీస్, మాల్టా, కెనడా వంటి చోట్ల ఆమె పనిచేశారు. 1865 జూలై 25న డాక్టర్ జేమ్స్ బ్యారీ కన్ను మూశారు. మరణం తర్వాత డాక్టరు పురుషుడు కాదని, స్త్రీ అని బయట ప్రపంచానికి బోధపడింది. అప్పట్లో అది సంచలనమైంది.

– డా॥ నాగసూరి వేణుగోపాల్ । ఆకాశవాణి మాజీ ఉన్నతాధికారి

ఇకనైనా వర్సిటీలను పట్టించుకోవాలి!

అభిప్రాయం



టి. నాగరాజు

తెలంగాణ రాష్ట్రంలో 10 విశ్వవిద్యాలయాలకు నూతన వైస్ ఛాన్సలర్ల నియామకానికి రాష్ట్ర విద్యాశాఖ జనవరి 27న నోటిఫికేషన్ ఇచ్చింది. నూతన వైస్‌ఛాన్సలర్ పోస్టులకు రాష్ట్ర వ్యాప్తంగా 1382 దరఖాస్తులు వచ్చాయి. అయితే గత ప్రభుత్వం నియమించిన వీసీల పదవీకాలం 3 నెలలు మిగిలి ఉండగానే ఇంచార్జీలను పెట్టకుండా నూతన వీసీల నియామకాలను చేయాలని నిర్ణయించడం అభినందనీయం. ఉమ్మడి రాష్ట్రంలో ప్రత్యేక తెలంగాణ ఉద్యమ కేంద్రాలుగా ఉన్న వర్సిటీలు నేడు స్వరాష్ట్రంలో అభివృద్ధికి అమడ దూరంలో ఉన్నాయి. కేటాయిస్తున్న నిధులు సరిపోక, రెగ్యులర్ ఫ్యాకల్టీ లేక యూనివర్సిటీలు విలవిల్లాడుతున్నాయి. దీనికి గత ప్రభుత్వ వైఫల్యాలు కూడా కారణాలుగా ఉన్నాయి. కేవలం వీసీలను నియమించి ఊరుకోకుండా అన్ని సమస్యలూ పరిష్కరించాలి.

రాష్ట్ర విశ్వవిద్యాలయాలు నిధులు, నియామకాలు లేక అనేక సంవత్సరాలుగా ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నాయి. రాష్ట్రం సిద్ధించిన ఈ పదేళ్లలో రెండు మార్లు ఇంచార్జీల కిందకు యూనివర్సిటీలు వెళ్లి తమ ప్రభ కోల్పోయాయి. మరో రెండుసార్లు వీసీలను నియమించారు. ఈ నియామకాలు చూస్తే యూనివర్సిటీలు రాజకీయ పునరావాస కేంద్రాలుగా మారినట్లు అర్థమవుతుంది. గత 15 ఏండ్లుగా అధ్యాపక నియామకాలు చేపట్టక పోవడం, రీసెర్చ్ గ్రాంట్స్ విడుదల చేయక పోవడంతో పరిశోధనలు అటకెక్కాయి. ఈ ప్రభుత్వమైనా రాజకీయ జోక్యం లేకుండా ముందు వీసీల నియామకాలు జరపాలి.

రాష్ట్రం ఏర్పడిన నుండి ఇప్పటివరకు యూనివర్సిటీలకు నిధులు క్రమంగా తగ్గాయి. కొత్తగా మహిళా, ఫారెస్ట్ యూనివర్సిటీలను స్థాపించినా వాటికి తగిన సౌకర్యాలు కల్పించలేదు. అధ్యాపకులను నియమించలేదు. నిధులు లేవంటూ బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థులు చేసిన ఆందోళనలు కూడా మనం చూశాము. విద్యార్థులకు మెస్, ల్యాబ్స్, లైబ్రరీ సౌకర్యాలు లేవు. కరీంనగర్ ‘శాతవాహన’ యూనివర్సిటీలో తరగతి గదులు లేక రేకుల షెడ్డు కింద ఫార్మసీ క్లాసులు నడుస్తున్నాయి. ‘పాలమూరు’, ‘మహాత్మాగాంధీ’ యూనివర్సిటీల్లో గదుల తలుపులు విరిగి పోయాయి. అక్కడ తాగు నీటి సమస్యా ఉంది. ‘జెఎన్టీయూ ఫైన్ ఆర్ట్స్’,



‘మహిళా’ యూనివర్సిటీలలో విద్యార్థినులకు హాస్టల్స్ లేక ఆందోళన బాట పట్టారు. ఉస్మానియా యూనివర్సిటీలో కూడా అనేక సమస్యలు ఉన్నాయి. ఇంకా నిజాం నిర్మించిన రేకుల షెడ్ల హాస్టల్స్ లోనే వసతిగృహాలు ఉన్నాయి. పాడుబడిన హాస్టల్స్ పెచ్చులు ఊడి గాయాలపాలైన ఘటనలు ఉన్నాయి. సరైన భోజన సదుపాయాలు లేవు. వైద్య, వసతి సదుపాయాలు లేవు. అనేక సార్లు నాణ్యమైన భోజనం కోసం ఉస్మానియా విద్యార్థినులు రోడ్డెక్కారు. ఇవన్నీ నిధుల లేమి వల్ల ఎదుర్కొంటున్న సమస్యలే!

గత ప్రభుత్వం యూనివర్సిటీలు తమకు తెలియకుండా నియామకాలు చేపట్టకూడదని జీఓ తెచ్చింది. రాష్ట్ర యూనివర్సిటీలలో కేవలం 24 శాతం మంది మాత్రమే రెగ్యులర్ సిబ్బంది ఉన్నారు. 76 శాతం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అటు సౌకర్యాలు లేక, ఇటు సిబ్బంది లేకపోవడం వల్లా యూనివర్సిటీలు దయనీయంగా తయారయ్యాయి.

ఇటీవల యూనివర్సిటీల్లో రెగ్యులర్ కోర్సులను రద్దు చేసి, ‘సెల్ఫ్ ఫైనాన్స్’ కోర్సులను ప్రవేశపెడుతున్నారు. అలా వేలాది రూపాయలు పేద విద్యార్థుల నుంచి యూనివర్సిటీలు పిండుతున్నాయి. తెలంగాణ రాష్ట్రం రాకముందు ఉస్మానియా యూనివర్సిటీలో 3 నుండి 5 వేలు ఉన్న కోర్సు ఫీజులు ఇప్పుడు 35 వేల రూపాయలు చేశారు. 2,000 ఉన్న పీహెచ్‌డీ ఫీజులు 20 వేల రూపాయలకు పెంచారు. ఇక్కడ చదువుతున్న విద్యార్థుల్లో ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చి చదువుతున్న వారే. యూనివర్సిటీలు చేస్తున్న ఈ అనాలోచిత చర్యలవల్ల గ్రామీణ, పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం కావలసి వస్తోంది.


గత ప్రభుత్వం కనీసం ఒక్కసారి కూడా యూనివర్సిటీ విద్య, సౌకర్యాలపై సమీక్ష చేయలేదు. ఈ ప్రభుత్వమైనా సమీక్ష చేసి సమస్యలు పరిష్కారం చేయాలి. పేద వర్గాల విద్యార్థులకు పరిశోధనలు చేయడానికి ప్రోత్సాహం అందించేలా నేషనల్ ఫెలోషిప్స్ రాని విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం నెలకు రూ. 25 వేల రూపాయలు ఫెలోషిప్ ఇవ్వాలి. పీజీ విద్యార్థులకు నెలకు రూ. 5,000 ఫెలోషిప్ ఇవ్వాలి.

ప్రభుత్వ విశ్వవిద్యాలయాల విద్యార్థుల స్కిల్స్ పెంచడానికి చర్యలు తీసుకోవాలి. ఇందు కోసం ప్రత్యేక శిక్షణా అందించాలి. యూనివర్సిటీ అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు ఇవ్వాలి. ఇవన్నీ చేసిననాడే యూనివర్సిటీలు మేధో కేంద్రాలుగా వెలుగొందుతాయి.

వ్యాసకర్త ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి
మొబైల్: 94900 98292

ఎవరి నుంచైనా...

సూఫీ జ్ఞానులలో ఒకరు హసన్. ఆయన ఓమారు ఒక ఊరికి వెళ్ళారు. అక్కడ ఓ చిన్నారి వెలుగుతున్న కొవ్వొత్తిని పట్టుకుని పోతుండటాన్ని చూశారు. చిన్నారే కదా అని పిలిచి, ‘కొవ్వొత్తి వెలుగు ఎక్కడి నుంచి వస్తోందో నీకు తెలుసా’ అని అడిగారు. ఆ చిన్నారిగానీ చెప్పకుంటే తాను చెప్పాలనుకున్నారు హసన్. ఆ చిన్నారి ఏమాత్రం తడబాటు లేకుండా, వెలుగుతున్న కొవ్వొత్తిని ఉఫ్ అని ఊది ఆర్పేసి, ‘ఇప్పుడు వెలుగు ఎక్కడికి పోయిందో మీకు తెలుసా’ అని అడిగింది. ఇంతసేపూ వెలిగిన వెలుగు ఎక్కడికి పోయిందో మీరు చెప్తే వెలుగు ఎక్కడి నుంచి వచ్చిందో తాను చెప్తానని అంది. ఆ చిన్నారి అమాయకురాలని అంచనా వేసి తానేంటో చెప్పుకోవాలనుకున్న హసన్ అహం అణగారిపోయింది ఆ క్షణంలో. ఆ చిన్నారి కూడా తనకు గురువే అని ఆయన చెప్పుకున్నారు. ఎవరు ఏ క్షణంలో ఏ విధంగా కళ్ళు తెరిపిస్తారో చెప్పడం ఊహకందని విషయమన్నది హసన్ అభిప్రాయం.



జ్యోతిర్మయం

ఇతరులను చూసి ఎల్లప్పుడూ ఆనందంగా ఉండడం ఎలాగో గ్రహించారు మరో గురువు. ‘మీరీ చివరి క్షణాల్లోనూ ఎలా నవ్వుతూ ఉండగలుగుతున్నార’ని అడిగారు. అప్పుడాయన ‘మీ వయస్సులో ఉన్నప్పుడు నేనొక వృద్ధ సాధువును కలిశాను. ఎప్పుడూ ఎందుకు నవ్వుతూ ఉంటారని అడిగాను. అప్పుడాయన తాను మొదట్లో ఎప్పుడూ చిటపటలాడుతూ ఉండేవాడిననీ, తన చిరాకుని చూసి ఎవరూ తనతో మాట్లాడటానికి ఇష్టపడేవారు కాదనీ, చెప్పారు. తనను తాను ఆ రోజు తనకు ఏం కావాలో ప్రశ్నించుకున్నాడాయన. ఆనందం అని మనసు జవాబు చెప్పడంతో ఎప్పుడూ నవ్వుతూ ఉండడం అలవాటు చేసుకున్నానని చెప్పారు. అది నాకూ నచ్చింది’ అన్నారు గురువుగారు. శిష్యులు తామూ అలాగే ఉండాలని నిర్ణయించుకున్నారు. ఎవరి నుంచైనా మంచిని నేర్చుకొని ఆచరించడానికి సిద్ధమయ్యారు.

– యామిజాల జగదీశ్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, **తిథి:** శు.తదియ ఉ.8.39 వరకు, తదుపరి చవితి, **నక్షత్రం:** అశ్వని రా.11.12 వరకు, తదుపరి భరణి, **వర్జ్యం:** రా.7.27 నుండి 8.55 వరకు, **దుర్ముహూర్తం:** ప.11.46 నుండి 12.34 వరకు, **అమృత ఘడియలు:** సా.4.30 నుండి 6.01 వరకు ; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 6.15, **సూర్యాస్తమయం:** 6.05.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 425 9899

క్లుప్తంగా...

ప్రతీ మంగళవారం రైతునేస్తం: మంత్రి తుమ్మల

సాక్షి, హైదరాబాద్: రైతు నేస్తం ద్వారా వివిధ పంటలలో చేపట్టవలసిన యాజమాన్య చర్యలను నిపుణులైన శాస్త్రవేత్తలతో ప్రతి మంగళవారం ఉద యం 10 నుంచి 11.30 గంటల వరకు వివరి స్తామని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు వెల్లడించారు. రైతులు కూడా వారికున్న సమస్యలను ఈ కార్యక్రమం ద్వారా తెలుసు కుని వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకో వాలని మంత్రి సూచించారు. ఈ మేరకు మంగళవారం అన్ని జిల్లాల్లోని 110 రైతు వేదికల్లో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులు, వ్యవసాయశాఖ అధికారులతో రైతునేస్తం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేయాలి

సీఎంకు హరీశ్‌రావు లేఖ



సాక్షి, హైదరాబాద్: టెట్ నిర్వహించి డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన లేఖ రాశారు. 'ఇటీవల కాలంలో టెట్ పరీక్ష నిర్వహించకపోవడం వల్ల 7 లక్షల మంది డీఎడ్, బీఎడ్ విద్యార్థులు డీఎస్సీకి దరఖాస్తు చేసుకోలేక పోతున్నారు. అంతే కాకుండా గత డిసెంబర్‌లో డీఎడ్, బీఎడ్ కోర్సులు పూర్తి చేసుకున్న వారు 50 వేల మందికి పైగా ఉంటారు. టెట్‌లో ఉత్తీర్ణత సాధించిన వారు మాత్రమే డీఎస్సీకి దరఖాస్తు చేసుకోవడానికి అర్హులవుతారనే విషయం మీకు తెలిసిందే. గత సెప్టెంబర్‌లో బీఆర్ఎస్ ప్రభుత్వం టెట్ నిర్వహించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత టెట్ నిర్వహించలేదు. టెట్ పరీక్ష కోసం దాదాపు 7 లక్షల పైచిలుకు ఎదురు చూస్తున్నారు. డీఎస్సీ నోటిఫికేషన్ తో పాటు, టెట్ నిర్వహించాలి' అని సీఎంకు రాసిన లేఖలో హరీశ్‌రావు కోరారు.

వైద్య కాలేజీల్లో 4,356 అధ్యాపక పోస్టుల భర్తీ!

▶ మొదటి పేజీ తరువాయి



కమ్యూనిటీ మెడిసిన్, జనరల్ మెడి సిన్, పీడియాట్రిక్స్, డెర్మటాలజీ, సైకి యాట్రీ, జనరల్ సర్జరీ, ఈఎన్‌టీ, ఆప్తమాలజీ, ఆర్థోపెడిక్స్, గైనకాలజీ, రేడియాలజీ, అనెస్థీషియా, సూపర్ స్పెషాలిటీ విభాగాల్లో ఈ పోస్టులను భర్తీ చేస్తారు.

స్థానికులకు ప్రాధాన్యత

ఈ నెల 16వ తేదీన ఆయా ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ఇంటర్వ్యూలు జరుగుతాయి. ప్రొఫె సర్ పోస్టుకు 8 ఏళ్ల, అసోసి యేట్ ప్రొఫెసర్ పోస్టుకు ఐదేళ్ల అనుభవం ఉండాలి. ప్రొఫెస ర్‌కు నెల వేతనం రూ.1.90 లక్ష లు కాగా, అసోసియేట్ ప్రొఫెస ర్‌కు రూ.లక్షన్నర, అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు రూ.1.25 లక్షలు, సీనియర్ రెసిడెంట్‌కు రూ.92,575, ట్యూటర్‌కు రూ.55 వేలు ఇవ్వనున్నారు. దేశంలోని ఏ ప్రాంతానికి చెందిన వారైనా ఇంటర్వ్యూలకు హాజరుకావొచ్చు. అయితే స్థానిక అభ్యర్థు లకు ప్రాధాన్యం ఇస్తారు. స్థానికులు లేనప్పుడు ఇతర రాష్ట్రాల వారికి అవకాశం కల్పిస్తారు. అభ్యర్థుల గరిష్ట వయస్సు ఈ నెల 31వ తేదీ నాటికి 69 ఏళ్లకు మించకూడదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సాహసోపేత నిర్ణయం: మంత్రి

రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో అధ్యాపకులు, సిబ్బంది కొరతను తీర్చడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సాహసోపేత నిర్ణయం తీసుకుందని రాష్ట్ర వైద్య ఆరోగ్య మంత్రి దామోదర రాజనర్సింహ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిర్ణయంతో ఏటా రూ.634 కోట్ల అదనపు భారం పడుతుందని ఆయన పేర్కొన్నారు.

వివిధ మెడికల్ కాలేజీల్లో పోస్టుల వివరాలు

మెడికల్ కాలేజీ	పోస్టుల సంఖ్య	మెడికల్ కాలేజీ	పోస్టుల సంఖ్య
ఉస్మానియా మెడికల్ కాలేజీ, హైదరాబాద్	274	వనపర్తి ప్రభుత్వ మెడికల్ కాలేజీ	246
గాంధీ మెడికల్ కాలేజీ, హైదరాబాద్	122	నాగర్‌కర్నూలు ప్రభుత్వ మెడికల్ కాలేజీ	236
కాకతీయ మెడికల్ కాలేజీ, హనుమకొండ	197	భద్రాద్రి కొత్తగూడెం ప్రభుత్వ మెడికల్ కాలేజీ	208
రిమ్స్, ఆదిలాబాద్	153	పెద్దపల్లి ప్రభుత్వ మెడికల్ కాలేజీ, రామగుండం	257
నిజామాబాద్ ప్రభుత్వ మెడికల్ కాలేజీ	186	రాజన్న సిరిసిల్ల ప్రభుత్వ మెడికల్ కాలేజీ	115
సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కాలేజీ	200	కామారెడ్డి ప్రభుత్వ మెడికల్ కాలేజీ	97
మహబూబ్‌నగర్ ప్రభుత్వ మెడికల్ కాలేజీ	139	వికారాబాద్ ప్రభుత్వ మెడికల్ కాలేజీ	88
సూర్యాపేట ప్రభుత్వ మెడికల్ కాలేజీ	187	ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కాలేజీ	101
నల్లగొండ ప్రభుత్వ మెడికల్ కాలేజీ	176	కరీంనగర్ ప్రభుత్వ మెడికల్ కాలేజీ	99
సంగారెడ్డి ప్రభుత్వ మెడికల్ కాలేజీ	164	జయశంకర్ భూపాలపల్లి ప్రభుత్వ మెడికల్ కాలేజీ	124
మహబూబాబాద్ ప్రభుత్వ మెడికల్ కాలేజీ	208	జనగాం ప్రభుత్వ మెడికల్ కాలేజీ	75
మంచిర్యాల ప్రభుత్వ మెడికల్ కాలేజీ	197	నిర్మల్ ప్రభుత్వ మెడికల్ కాలేజీ	117
జగిత్యాల ప్రభుత్వ మెడికల్ కాలేజీ	247	కొమురంభీ ఆసిఫాబాద్ ప్రభుత్వ మెడికల్ కాలేజీ	143

భూ అక్రమాలపై వివరణ ఇవ్వండి

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: తమకు అమ్మిన భూమినే కొందరు ఇతరులకు కూడా విక్రయించి అన్యాయం చేస్తున్నారంటూ దాఖలైన పిటిషన్‌పై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు హోంశాఖ ముఖ్య కార్యదర్శి, సీసీఎల్ఏ, డీజీపీ, సైఫాబాద్ సీఐడీ అడిషనల్ డీజీపీ, సైబరాబాద్ సీపీతో పాటు పలువురు అధికారులు, అనధికారిక ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ ఏప్రిల్ 15కు వాయిదా వేస్తూ, ఆలోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. 'రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం వట్టినాగులపల్లి గ్రామంలో 460 ఎకరాలకుపైగా భూమిని దాదాపు 3,308 మంది 1983 నుంచి 1986 మధ్య చట్టప్రకారం కొనుగోలు చేశాం. సేల్‌డీడ్ ద్వారా ప్లాట్లు పొందాం. అయినా సదరు భూములను రెవెన్యూ అధికారులు పాత యజమానుల పేర్లపై ఉంచడం వివాదాలకు దారి తీసింది. ప్రతివాదుల్లో కొందరు మాకు అమ్మిన భూములను డబుల్ రిజిస్ట్రేషన్లు చేశారు. ఆ భూములు కొన్నవారు రియల్ ఎస్టేట్ సంస్థలతో కుమ్మక్కై మాకు అన్యాయం చేస్తున్నారు' అని మేడ్చల్‌కు చెందిన రిటైర్డ్ లెక్చరర్ వి.రామారావుతోపాటు మరో 19 మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ అంశంపై సీఐడీ విచారణ జరిపి తమ భూములు తమకు ఇప్పించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ సీవీ.భాస్కర్‌రెడ్డి మంగళవారం విచారణ చేపట్టారు.

పని లేక.. పూట గడవక

సిరిసిల్లలో నేతన్న బలవన్మరణం



శ్రీనివాస్ (ఫైల్)

సిరిసిల్లటౌన్: ఓ వైపు పని లేదు..మరోవైపు ఆర్థిక ఇబ్బందులు..ఇంకోవైపు అనారోగ్యంతో మనస్తాపం చెందిన ఓ నేత కార్మి కుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని బంధువులు తెలిపిన వివరాల ప్రకారం. సిరిసిల్లలోని బీవైనగర్‌కు చెందిన తడుక శ్రీనివాస్(43) సాంచాలు నడుపుతూ తల్లి లచ్చవ్వతో కలిసి ఉంటున్నాడు. కుటుంబకలహాలతో భార్య లావణ్య ఇద్దరు కుమార్తెలతో విడిగా ఉంటోంది. శ్రీనివాస్ చాలా రోజులుగా అనారోగ్యంతో బాధపడు తున్నాడు. ఈ క్రమంలోనే సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో సాంచాలు బంద్ కావడంతో రెండు నెలలుగా పూర్తిగా పనిలేక ఇంటికే పరి మితమయ్యాడు. గతంలో చేసిన రూ.లక్షకు పైగా అప్పుకు తోడు పని, సంపాదన లేక ఆర్థి కంగా ఇబ్బందులు పడుతున్నాడు. ఈక్రమంలోనే సోమవారం రాత్రి ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

పట్టాలెక్కిన సికింద్రాబాద్–విశాఖ రెండో వందేభారత్

- అహ్మదాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జెండా ఊపి ప్రారంభించిన ప్రధాని మోదీ
- ద.మ.రైల్వే పరిధిలో పలు ప్రాజెక్టులు జాతికి అంకితం



వందేభారత్ రైలు ప్రారంభోత్సవంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్/ రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్–విశాఖపట్నం మధ్య రెండో వందేభారత్ రైలును జెండా ఊపి ప్రారంభించటం సహా దక్షిణ మధ్య రైల్వే పరిధిలో పూర్తయిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ జాతికి అంకితం చేశారు. మంగళవారం ఉదయం ఆయన రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో కలిసి అహ్మదాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ పద్ధతిలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా పలు రైల్వే ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు. గతేడాది సంక్రాంతి రోజున సికింద్రాబాద్–విశాఖపట్నం మధ్య ప్రారంభించిన తొలి వందేభారత్ రైలు కిక్కిరిసి ప్రయాణిస్తుండటంతో దానికి అదనంగా ఇటీవలే రైల్వే బోర్డు రెండు నగరాల మధ్య రెండో వందేభారత్ రైలును మంజూరు చేసింది. సికింద్రాబాద్‌లో ఉదయం ప్రారంభమయ్యే ఈ రైలును ప్రధాని జెండా ఊపి ప్రారంభించారు. కొల్లాం–తిరుపతి ఎక్స్‌ప్రెస్‌ను కూడా ప్రారంభించారు. కాజీపేట– విజయవాడ, కాజీపేట–బలార్షా మధ్య పూర్తయిన మూడో లైన్ భాగాలను, 14 డబ్లింగ్ లైన్లను, కొన్ని బైపాస్, గేజ్ మార్పిడి లైన్లు, పాత రైల్ కోచ్‌లను, స్టేషన్లలో ఏర్పాటుచేసిన రెస్టారెంట్లను, దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 193 స్టేషన్‌లలో ఏర్పాటు చేసిన వన్ స్టేషన్ వన్ ప్రాడక్ట్ కేంద్రాలను, తొమ్మిది పీఎం గతిశక్తి కార్గో టెర్మినళ్లు, 11 గూడ్సు షెడ్లు, రెండు జన్ ఔషధి కేంద్రాలను ఆయన జాతికి అంకితం చేశారు. దేశవ్యాప్తంగా రైల్వే నెట్‌వర్క్‌లో చోటుచేసుకుంటున్న పురోగతిని ఆయన వివరించారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్ రెడ్డి కూడా..

ప్రధాని అహ్మదాబాద్ నుంచి నిర్వహించిన ఈ వర్చువల్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొనటం విశేషం. సికింద్రాబాద్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి, దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్, డీఆర్ఎం కుమార్, వివిధ విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

జన ఔషధి షాపుల్లో తక్కువ ధరకు మందులు

సికింద్రాబాద్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన జన ఔషధి, స్థానిక ఉత్పత్తుల కేంద్రాలను కిషన్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో రైల్వే స్టేషన్లలో ప్రత్యేక కౌంటర్లు, తక్కువ ధరకు మందులు అందుబాటులో ఉండేలా జన ఔషధి షాపులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రూ.720 కోట్లతో సికింద్రాబాద్, రూ.350 కోట్లతో నాంపల్లి స్టేషన్‌ల పునరాభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. చర్లపల్లి టెర్మినల్ పనులు చాలావరకు పూర్తయ్యాయని, త్వరలోనే అందుబాటులోకి వస్తుందని కిషన్‌రెడ్డి తెలిపారు.

317 జీవోపై తక్షణ కార్యాచరణ

- అధికారులకు సబ్ కమిటీ ఆదేశం
- లోటుపాట్లు సరిదిద్దడంపై చర్చ

సాక్షి, హైదరాబాద్: జిల్లాల పునర్విభజన నేపథ్యంలో ఉపాధ్యాయులు, ఉద్యోగులను కొత్త జిల్లాలకు కేటాయించేందుకు గత ప్రభుత్వం తీసుకొచ్చిన 317 జీవోలోని లోటుపాట్లను సరిదిద్దేందుకు అవసరమైన కార్యాచరణను వెంటనే సిద్ధం చేయాలని అధికారులను రాష్ట్ర కేబినెట్ సబ్ కమిటీ ఆదేశించింది. దీంతో సబ్ కమిటీ చైర్మన్, మంత్రి దామోదర్ రాజనర్సింహ, మంత్రులు డి. శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ మంగళవారం 317 జీవోపై సమీక్షించారు. ఉద్యోగుల విభజన సందర్భంగా తీసుకున్న ప్రామాణికతను అధికారులు ఈ సందర్భంగా సబ్ కమిటీకి వివరించారు. సీనియారిటీ ప్రాతిపదికన కొత్త జిల్లాలకు బదిలీ చేసినట్టు తెలిపారు. అయితే దీనివల్లనే సమస్య మరింత జఠిలమైందని, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వాళ్లు సీనియారిటీ వల్ల అదే జిల్లాలో ఉండే వీలు కలిగిందని, అదే జిల్లాకు చెందిన ఉద్యోగులు సీనియారిటీ లేకపోవడం వల్ల స్థానికేతర జిల్లాలకు వెళ్లాల్సి వచ్చిందని సబ్ కమిటీ అభిప్రాయపడింది. విభజనకు స్థానికత లేదా సీనియారిటీని ప్రాతిపదికగా తీసుకోవడం వల్ల ఏర్పడిన ఇబ్బందులు, వీటిని సరిచేసే దిశలో ఉత్పన్నమయ్యే సమస్యలపై చర్చించారు. 317 జీవోకు సంబంధించిన పూర్తి వివరాలు అందించాలని అధికారులను కమిటీ సభ్యులు కోరారు.

రేపు ఉద్యోగ సంఘాలతో భేటీ

ఉద్యోగులు, ఉపాధ్యాయులు 317 జీవోతో పడుతున్న ఇబ్బందులను పరిష్కరించేందుకు ప్రజా ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రులు చెప్పారు. ఈ నెల 14వ తేదీన ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలతో భేటీ అయ్యి వారి అభిప్రాయాలు తెలుసుకోవాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా కూడా అభిప్రాయాలు వెల్లడించే వెసులుబాటు కల్పిస్తామన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు వారి సమస్యలను, అభిప్రాయాలను తెలియజేయడానికి ఆన్‌లైన్‌లో గ్రీవెన్స్ సెల్‌ను ఏర్పాటు చేయాల్సిందిగా రాష్ట్ర ప్రణాళికా విభాగాన్ని దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. దీనికి నోడల్ అధికారిగా రాష్ట్ర ప్రభుత్వ సర్వీసుల శాఖ సెక్రటరీని నియమించారు. ఈ సమావేశంలో రాష్ట్ర హోం శాఖ ముఖ్య కార్యదర్శి జితేందర్, విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా చోంగ్తు, పీఆర్‌సీ కమిటీ చైర్మన్ శివ శంకర్, సెక్రటేరియట్ సర్వీసెస్ సెక్రటరీ నిర్మల, విద్యా శాఖ డైరెక్టర్ దేవసేన, ఇంటర్ బోర్డు కమిషనర్ శృతి ఓజా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రజా ఆకాంక్షలకు అద్దం పట్టేలా రాష్ట్ర చిహ్నం ఉండాలి

అధికారులతో కేబినెట్ సబ్‌కమిటీ భేటీ

సాక్షి, హైదరాబాద్: 'రాష్ట్ర అధికారిక చిహ్నం ప్రజాస్వామిక ఆకాంక్షలకు అద్దం పట్టేలా ఉండాలి. అధికారిక విగ్రహం రాష్ట్ర సంస్కృతిని ప్రతిబింబించేలా రూపొందించాలి. రాష్ట్ర గీతం అన్ని ప్రాంతాల మనోగతాన్ని స్పష్ట పరిచేదిలా ఉండాలి' అని కేబినెట్ సబ్‌కమిటీ భావించింది. ఈ దిశగా అవసరమైన కార్యాచరణ చేపట్టాలని అధికారులను ఆదేశించింది. రాష్ట్ర చిహ్నం, విగ్రహం, రాష్ట్ర గీతం ఖరారుకు ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన సచివాలయంలో సోమవారం తొలిసారిగా సమావేశమైంది. మంత్రివర్గ ఉపసంఘం సభ్యులుగా ఉన్న తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్క, కొండా సురేఖలు హాజరయ్యారు. తెలంగాణ చిహ్నం ప్రజాస్వామిక ఆకాంక్షలను, రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఉండాలని భట్టి విక్రమార్క పునరుద్ఘాటించారు. ఫ్యూడలిజం, నిరంకుశత్వం, నియంతృత్వ పోకడలకు తావు లేకుండా చిహ్నంలో జాగ్రత్త పడాలని సూచించారు. తెలంగాణ విగ్రహం రాష్ట్రంలోని సామాన్య మహిళను ప్రతిబింబించేలా ఉండాలన్నారు. రాష్ట్ర గీతానికి సంబంధించి, ప్రముఖ కవి అందెశ్రీని ఆహ్వానించి, సమకాలీన కాలాన్ని ప్రతిబింబించేలా ''జయ జయ హే'' పాటకు కొన్ని మార్పులు చేయాలని కోరారు. ప్రముఖ కళాకారులు, మేధావులను గుర్తించి, చిహ్నం, విగ్రహానికి సంబంధించిన డిజైన్‌లు రూపొందించాలని కోరారు. ఈ సమావేశంలో జీఏడీ కార్యదర్శి రఘునందన్‌రావు, పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి శైలజారామయ్యర్, పౌర సంబంధాల శాఖ కమిషనర్ హనుమంతరావు, ప్రొటోకాల్ డైరెక్టర్ అరవిందర్‌సింగ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అమెరికాలో కాజీపేట విద్యార్థి దుర్మరణం



వెంకటరమణ (ఫైల్)

కాజీపేట: ఎన్నో ఆశలతో ఉన్నత చదువుల కోసం విదేశానికి వెళ్లిన ఓ విద్యార్థి వాటర్ గేమ్స్ ఆడుతుండగా జరిగిన ప్రమాదంలో మృతిచెందాడు. హనుమకొండ జిల్లా కాజీపేట పట్టణానికి చెందిన పిట్టల రాజగణేష్ కుమారుడు వెంకటరమణ (27) ఉన్నత విద్య కోసం గత ఏడాది ఆగస్టు 22న అమెరికా వెళ్లాడు. ఇండియానా యూనివర్సిటీలో మాస్టర్స్ ఇన్ ఇన్ఫార్మటిక్స్ కోర్సు చదువుతున్నాడు. ఈనెల 9న మిత్రులతో కలిసి వెస్ట్‌ఫ్లోరిడాకు వెళ్లి వాటర్ గేమ్స్ ఆడుతుండగా, వేరే వ్యక్తి వేగంగా వచ్చి ఢీకొట్టాడు. దీంతో వెంకటరమణ నీటిలో పడి మృతిచెందాడు. వెంకటరమణ మృతి విషయాన్ని భారత ఎంబసీ అధికారులు కుటుంబ సభ్యులకు సోమవారం రాత్రి తెలిపారు. మృతదేహం ఈనెల 18 లేదా 19న భారత్‌కు వస్తుందని సమాచారం ఇచ్చినట్లు కుటుంబ సభ్యులు చెప్పారు.

తుది తీర్పు మేరకే గురుకుల లెక్చరర్ల నియామకాలు

కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించిన హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: గురుకుల విద్యాసంస్థల్లో జూనియర్ లెక్చరర్ల పోస్టుల భర్తీ తుది తీర్పున కు లోబడే ఉంటుందని హైకోర్టు స్పష్టం చేసింది. పిటిషనర్ల అభ్యంతరాలపై వివరాలు తెలు సుకుని చెప్పాలని స్టాండింగ్ కౌన్సిల్‌ను ఆదేశించింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చే యాలంటూ.. విచారణను వాయిదా వేసింది. గురుకుల విద్యా సంస్థల్లో జూనియర్ లెక్చరర్ల భర్తీ కోసం గత సంవత్సరం ప్రభుత్వం నోటిఫి కేషన్ ఇచ్చింది. అయితే నోటిఫికేషన్‌లో ఇచ్చిన నిబంధనలు పాటించకుండా తమను పక్కకు పెట్టడాన్ని సవాల్ చేస్తూ జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి చెందిన గంగాప్రసాద్‌తో పాటు మరో 9 మంది హైకోర్టులో పిటి షన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయ మూర్తి జస్టిస్ పుల్ల కార్తీ క్ విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున న్యా యవాది చిల్లా రమేశ్ వాదనలు వినిపిస్తూ.. 'జంతుశాస్త్రం, వృక్ష శాస్త్రం లెక్చరర్ పోస్టులకు దరఖాస్తు చేసేవారు ఎంఎస్సీలో ఏ సబ్జెక్ట్ చేసి నా డిగ్రీలో మాత్రం సంబంధిత సబ్జెక్ట్ చేసి ఉండాలని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. దీంతో డిగ్రీలో జంతుశాస్త్రం, వృక్ష శాస్త్రం చదివి.. ఎంఎస్సీలో మరో సబ్జెక్ట్ చదివిన పిటిషనర్లు కూడా దరఖాస్తు చేసుకున్నారు. పరీక్షల అనంతరం ప్రకటించిన మెరిట్ లిస్ట్‌లో పిటిషనర్ల పేర్లు కూ డా ఉన్నాయి. సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయిన తర్వాత పిటిషనర్ల అర్హతపై నిపుణుల కమిటీ వేశామని.. నివేదిక వచ్చేదాకా ఆగాలని అధికా రులు సూచించారు. అయితే ఆ నివేదిక రాక ముందే పిటిషనర్లను పక్కకు పెట్టి ఇతరులకు అపాయింట్‌మెంట్ ఆర్డర్స్ ఇచ్చారు. ప్రభుత్వ తీరు సమర్థనీయం కాదు. మెరిట్ ప్రకారం పిటిషనర్లకు కూడా అపాయింట్‌మెంట్ లెటర్లు ఇచ్చేలా అధికారులకు ఆదేశాలు జారీ చేయాలి' అని కోరారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని స్టాండింగ్ కౌన్సిల్ ఆదేశాలు జారీ చేస్తూ.. తదుపరి విచారణ రెండు వారాలకు వాయిదా వేశారు.

పురపాలక సంఘ కార్యాలయం, భీంగల్

పత్రికా ప్రకటన

ఇందుమూలముగా సమస్త పట్టణ ప్రజలకు తెలియచేయునది ఏమనగా పురపాలక సంఘం భీంగల్ యొక్క 2024-2025 సంవత్సరమునకు గాను శైబజార్ వేలములు మున్సిపల్ చైర్ పర్సన్ అధ్యక్షతన తేది: 14.03.2024 గురువారం రోజున ఉ। 11.00 గం.లకు భీంగల్ మున్సిపల్ కార్యాలయం నందు నిర్వహించబడును. శైబజార్ వేలం పాటలో పాల్గొనేవారు ధరావత్తు రూ.5,00,000/- సాల్వెన్సీ/వాల్యుయేషన్ సర్టిఫికెట్ 3,00,000/-. కావున వేలములో పాల్గొనుటకు పైన చూపిన విధముగా ధరావత్తు సొమ్మును కమిషనర్, పురపాలక సంఘం, భీంగల్ గారి పేరున డి.డి పేరున తేది: 14.03.2024 ఉ.10.00 గం.ల లోపు సమర్పించవలెను. ధరావత్తు సొమ్ము నేరుగా స్వీకరించబడదు.

సం/- కమిషనర్, మున్సిపల్ కౌన్సిల్ ఆఫీస్, భీంగల్, నిజామాబాద్ జిల్లా

DIPR RO No.11547-PP/CL/Advt/1/2023-24, Dt: 12.03.2024

మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయం, రామాయంపేట్

ఇ- ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన

e-NIT Nos. E1/MCR/Supply and Delivery of Various Plants/2023-24

పనుల సంఖ్య:1. బిడ్ డాక్యుమెంట్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది: 13-03-2024న ఉ.10.30గం. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ముగింపు తేది: 20-03-2024 సా.5.30గం. ధర బిడ్ తెరుచు తేది(ఫైనాన్షియల్ బిడ్ స్టేజ్): 20-03-2024 సా.5.35 గం. గమనిక: సవివరమైన సమాచారమును Tender.telangana.gov.in వెబ్‌సైట్‌లో పొందవచ్చును. ఏదేని ఇతర సమాచారం కోసం కమిషనర్ & ఇంజినీర్, రామాయంపేట్ మున్సిపాలిటీ గారిని సంప్రదించండి. ఫోన్ నం.9866079691.

సం/- కమిషనర్, రామాయంపేట్ మున్సిపాలిటీ

DIPR RO No.11592-PP/CL/Advt/1/2023-24, Dt. 12.03.2024

తెలంగాణ ప్రభుత్వం

సూపరింటెండింగ్ ఇంజినీర్ కార్యాలయం, PR, పెద్దపల్లి సర్కిల్

NIT No.T1/Tender/59 to 73/2023-24, టెండరు ప్రకటన తేది:11-03-2024

పనుల సంఖ్య: 15. జయశంకర్ భూపాలపల్లి మరియు పెద్దపల్లి జిల్లాలో DMFT, STSDF మరియు NITI AYOG (ADP) 2023-24 గ్రాంట్ల క్రింద పనుల కోరబడుచున్నవి. మొత్తం అంచనా వ్యయం: రూ.1709.05 లక్షలు. అప్‌లోడ్ తేదీ నుండి పాల్గొనుటకు కోసం (07) పనిరోజులలో ప్రతీ టెండర్ కోసం తేది: 12-03-2024 నుండి 19-03-2024 వరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ నుండి టెండర్ షెడ్యూల్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. ఇతర వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ https://tenders.telangana.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. ఇ-మెయిల్ Id: seprpeddapally@gmail.com. తదుపరి వివరాలను సూపరింటెండింగ్ ఇంజినీర్ కార్యాలయం, PR, పెద్దపల్లి సర్కిల్ నుండి పొందవచ్చును. సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, PR, పెద్దపల్లి సర్కిల్

DIPR RO No.2969-DP/CL/Advt/1/2023-24, Dt:12.03.2024

పురపాలక సంఘ కార్యాలయము :: జనగామ, జిల్లా: జనగామ

టెండర్ నోటీసు

టెండర్ నోటీసు నెం.ఇ1/599/2023-24/12 తేది: 11-03-2024

1.పనుల సంఖ్య : (10) పనులు, 2. పనుల విలువ : రూ.50.00 లక్షలు (మున్సిపల్ సాధారణ నిధులు + SDF నిధులు) 3.టెండరు డాక్యుమెంట్లు లభించు తేది: 12-03-2024 ఉ.11:00 గం.ల నుండి 4.టెండర్లు స్వీకరించు చివరి తేది, సమయం: 16-03-2024 సా: 4.00 గం.ల వరకు మిగతా వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ https://tender.telangana.gov.in వెబ్‌సైట్‌లో చూడగలరు.

సం/- కమిషనర్, పురపాలక సంఘం, జనగామ

DIPR RO No.11609-PP/CL/Advt/1/2023-24, Dt. 12.03.2024

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

పాఠశాల విద్యా శాఖ

స్కూల్ ఎడ్యుకేషన్, A.P. Ref. No. : (1) CSE-SE-IT-2024-3-3 with Tender ID 732054, and (2) CSE-SE-IT-2024-3-2 with Tender ID 732027, Dt., : 10.03.2024.

స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్, GoAPకు పెన్‌డ్రైవ్స్ మరియు SD కార్డ్స్ సేకరణ కోసం టెండరు పిలుపు ప్రకటన జారీ చేయబడినది. సవివరమైన టెండరు ప్రకటన, స్పెసిఫికేషన్‌కు సంబంధించి తదుపరి వివరాల కోసం దర్శించండి https://cse.ap.gov.in/ మరియు https://tender.apeprocurement.gov.in దర్శించండి.

సం/- కమిషనర్, స్కూల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తరఫున

DIPR RO No. 2770PP/CL/ADVT/1/1/2021-22, Dt. : 12.03.2024

తెలంగాణ ప్రభుత్వం

నీటిపారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ

ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన

నం.31/2023-24 తేది: 09-03-2024

పని వివరణ: పని పేరు: FRD 2023 జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ఘన్‌పూర్ (M), ములుగు కవర్ చేస్తూ KM 9.00 నుండి 17.00 వరకు SRSP యొక్క DBM 38లోని మైనర్ 34R కు శాశ్వత మరమ్మతులు. పని అంచనా కాంట్రాక్ట్ విలువ: రూ.37,72,621/-. టెండర్ డాక్యుమెంట్లు 13-03-2024 ఉ.11.00 గం.ల నుండి లభిస్తాయి. మరిన్ని వివరాలు మరియు టెండర్ డాక్యుమెంట్ల డౌన్‌లోడ్ కోసం వెబ్‌సైట్ www.eprocurement.gov.in దర్శించండి.

సం/- (వై. మోహన్ రావు), సూపరింటెండింగ్ ఇంజినీర్, ఇరిగేషన్, ములుగు సర్కిల్

DIPR RO No.11616-PP/CL/Advt/1/2023-24, Dt: 12.03.2024

తెలంగాణ ప్రభుత్వం

హైదరాబాద్ మహానగర నీటి సరఫరా & మురుగునీటి పారుదల మండలి

O/o. చీఫ్ జనరల్ మేనేజర్ (Engg), IT సర్కిల్, ఖైరతాబాద్, హైదరాబాద్-500 004. TS

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

ఇ-టెండరు ప్రకటన నం.& తేది	పని పేరు	సుమారు ECV
EP No.19/ CGM(E)/ IT.C/ B&C/2023-24, dated: 11-03-2024.	HMWSSB అధికారులు ఆదేశించిన విధంగా పూర్తిగా గమ్యస్థానం వరకు డ్యూటీలు, రవాణా మరియు ట్రాన్సిట్ రిస్క్ మొ॥వాటితోసహా (01) ఒక సంవత్సర కాలానికి ప్రస్తుతం గల హ్యాండ్ హెల్డ్ మెషిన్స్ బేస్డ్ బిల్లింగ్ అండ్ కలెక్షన్ మాడ్యుల్ మెషిన్ అండ్ సర్వర్ సైడ్ యొక్క మెయింటెనెన్స్ మరియు పెంపుదల.	రూ. 48.00 లక్షలు

ECV మరియు EMD మరియు ఇతర వివరాలను https://www.tender.telangana.gov.inలో 13.03.2024 నుండి చూడవచ్చును. డౌన్‌లోడ్ ప్రారంభం మరియు ముగింపు తేది ఆన్‌లైన్‌లో NITలో లభించును.

సం/- చీఫ్ జనరల్ మేనేజర్ (Engg), IT సర్కిల్, ఖైరతాబాద్, హైదరాబాద్-500 004, T.S.

జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ హనుమకొండ

టెండరు ప్రకటన

ఆర్.సి.నెం.E/90/2024 తేది: 12-03-2024

ఉపసంచాలకులు వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ హనుమకొండ గారి ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా నందు (10) ప్రీమెట్రిక్ వసతి గృహములకు మరియు (5) కళాశాల వసతి గృహములకు 2023-24 విద్యా సంవత్సరానికి మెటీరియల్ సరఫరాకు గాను క్రింద తెలుపబడిన వాటికి టెండరు కోరడమైనది.

క్రమ సంఖ్య	టెండరు పేరు	ఫారము ధర	ధరావత్ సొమ్ము
1	వసతి గృహాలకు మెటీరియల్ సరఫరా	5000.00	1,00,000.00

ఉప సంచాలకులు, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, హనుమకొండ జిల్లా పేరున SBI, నక్కల గుట్ట, హనుమకొండ నందు చెల్లుబాటు అయ్యే విధంగా డి.డి.చెల్లించి కార్యాలయ పనివేళలలో తేది: 14-03-2024 నుండి 21-03-2024 మధ్యాహ్నం 3.00 గంటల వరకు టెండర్ ఫారంను పొందగలరు. ఉపసంచాలకులు వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ హనుమకొండ గారి కార్యాలయములో తేది: 21-03-2024 మధ్యాహ్నం 4.00 గంటల వరకు టెండర్ బాక్స్‌లో వేయగలరు. తేది: 22-03-2024 సాయంత్రం: 4.00 గంటలకు అదనపు కలెక్టర్/చైర్మెన్ జిల్లా కొనుగోలు కమిటీ సమక్షంలో టెండర్ బాక్స్ తెరవబడును. టెండర్ తేదిని మార్చుటకు లేదా రద్దు చేయుటకు అడిషనల్ కలెక్టర్ గారికి పూర్తి అధికారం కలదు. తదుపరి వివరాలకై 9491531090 నెంబర్ నందు సంప్రదించగలరు.

సం/- చైర్మన్ జిల్లా కొనుగోలు కమిటీ/ అదనపు కలెక్టర్ (వె.త.సం.శాఖ) హనుమకొండ

DIPR No.SPL/PP/CL/2024, Dt: 12.03.2024

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్

టెండరు కోరుతూ ప్రకటన

టెండర్ నోటీస్ నం.EE-III/GWMC/CTN/36/e-proc/2023, తేది: 12.03.2024

జనరల్ ఫండ్స్ క్రింద రూ.374.40 లక్షల కొరకు (49) పనుల కొరకు ఆన్‌లైన్ టెండర్ ప్లాట్‌ఫారం tender.telangana.gov.in పై జాబితా చేయబడిన పనుల కొరకు నమోదిత కాంట్రాక్టర్లు/ ఏజెన్సీల నుండి టెండర్లు కోరబడుచున్నవి. పనుల సారాంశం: SC కొరకు రిజర్వు చేసినది (8 పనులు): రూ.70.75 లక్షలు. ST కొరకు రిజర్వు చేసినది (3 పనులు): రూ.38.60 లక్షలు. జనరల్ (2 పనులు): రూ.29.35 లక్షలు.మొత్తం (36 పనులు): రూ.235.70 లక్షలు. టెండరు ప్రక్రియ షెడ్యూల్: డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది: 14.03.2024, ఉ.10.30 గం. నుండి. డౌన్‌లోడింగ్ ఆఖరి తేది: 18.03.2024, మ.3.00 గం. వరకు. బిడ్ల తెరుచుట (సాంకేతిక): 18.03.2024, మ.3.30 గం.కు. సంప్రదించు వివరాలు: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, నక్కలగుట్ట సర్కిల్, GWMC, సెల్ నం.9701999598. ఇ-మెయిల్: ee3gwmc@gmail.com. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్‌ప్లేస్ @ https://tender.telangana.gov.in లో చూడవచ్చును.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్

DIPR RO No.11610-PP/CL/Advt/1/2023-24, Dt: 12.03.2024

పురపాలక సంఘ కార్యాలయం నర్సంపేట, జిల్లా: వరంగల్

బహిరంగ వేలము ప్రకటన

ఆర్.సి.నెం. A1/32/2024-25 తేది: 12-03-2024

[illegible]

క్రమ సంఖ్య	కాంట్రాక్టు వివరములు	డిపాజిట్	వేలము రుసుం తిరిగి చెల్లించబడదు
1	[illegible]	6,00,000=00 లు	10,000=00 లు
2	[illegible]	6,00,000=00 లు	10,000=00 లు
3	[illegible]	6,00,000=00 లు	10,000=00 లు
4	[illegible]	75,000=00 లు	1500=00 లు

సం/- కమిషనర్, పురపాలక సంఘం, నర్సంపేట.

DIPR RO No.11593-PP/CL/Advt/1/2023-24, Dt. 12.03.2024

తెలంగాణ స్టేట్ మెడికల్ సర్వీసెస్ & ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్

డైరెక్టర్ ఆఫ్ హెల్త్ క్యాంపస్, సుల్తాన్ బజార్, హైదరాబాద్-95, తెలంగాణ రాష్ట్రం

(ISO 9001: 2015 ధ్రువీకృత సంస్థ)

1.టెండర్ నోటీస్ నం. 4/2023/DIAG/TSMSIDC, Dt.11.03.2024
2.టెండర్ నోటీస్ నం. 6/2023/EQU/TSMSIDC, Dt.11.03.2024
3.టెండర్ నోటీస్ నం. 16/2023/Medicine/MW/TSMSIDC, Dt.11.03.2024
4.టెండర్ నోటీస్ నం. 17/2023/Surgical/MW/TSMSIDC, Dt.11.03.2024

రెండు సంవత్సరాల కాలానికి రేట్ కాంట్రాక్ట్ క్రింద దిగువ తెలిపిన వాటిని సేకరించుటకు, సరఫరా కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫామ్ (ఆన్‌లైన్) ద్వారా పైన తెలిపిన టెండర్లు కోరబడుచున్నవి:-
T.No.4:- డయాగ్నోస్టిక్ ఎక్విప్‌మెంట్ అండ్ కిట్స్ & రీఏజెంట్స్,
T.No.6:- ఎక్విప్‌మెంట్స్,
T.No.16:- మెడిసిన్స్,
T.No.17:- మెటీరియల్స్ & సప్లైస్ (సర్జికల్)
మరియు ఏదేని ఇతర సకలవిధ ఐటమ్‌లు. ఎట్టి కారణం తెలియజేయకుండా ఏ సమయంలోనైనా టెండర్‌ను రద్దు చేయుటకు మేనేజింగ్ డైరెక్టర్, TSMSIDC కు హక్కు కలదు. పూర్తి వివరాల కోసం https://tender.telangana.gov.in వెబ్‌సైట్‌ను 20-03-2024 నుండి దర్శించండి.

DIPR RO No.11596-PP/CL/Advt/1/2023-24, Dt: 12.03.2024 సం/- మేనేజింగ్ డైరెక్టర్

వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయము, వరంగల్

టెండరు ప్రకటన

నెం. వ్యమాకవ/ఏస్టా-2/62/2023-24 తేది: 11.03.2024

[illegible]

సం/- శ్రీ కె.సంగయ్య, ఉన్నత శ్రేణి కార్యదర్శి, వ్య.మా.క, వరంగల్ సం/- శ్రీ ఇ.వత్సలం, పర్సన్-ఇన్-చార్జ్, వ్య.మా.క, వరంగల్

DIPR RO No.11549-PP/CL/Advt/1/2023-24, Dt: 12.03.2024

పురపాలక సంఘ కార్యాలయము, కొల్లాపూర్

జిల్లా నాగర్ కర్నూల్

ఫైల్ నెం. A2/26/KLPR/2024 తేది: 11.03.2024

శైబజార్ వేలము ప్రకటన

[illegible]

సం/- కమిషనర్, పురపాలకసంఘం, కొల్లాపూర్

DIPR RO No.11555-PP/CL/Advt/1/2023-24, Dt: 12.03.2024

రైలు పట్టాలపై జీవితం ఆరంభించా

రైల్వే శాఖ కష్టాలు, ప్రయాణికుల ఇబ్బందులు నాకు తెలుసు

- తద్వారా కేంద్ర ప్రభుత్వ నిధులు అందుబాటులోకి వచ్చాయి
- గుజరాత్‌లో ప్రధాని మోదీ
- రూ.1,06,000 కోట్ల విలువైన ప్రాజెక్టులు ప్రారంభం..
- 10 నూతన వందేభారత్ రైళ్లకు పచ్చజెండా

అహ్మదాబాద్/పోఖ్రాన్: రైలు పట్టాలపైనే తన జీవితాన్ని ప్రారంభించానని, రైల్వే శాఖకు సంబంధించిన కష్టాలు, ప్రయాణికుల ఇబ్బందులన్నీ తనకు తెలుసని ప్రధానమంత్రి మోదీ చెప్పారు. నరకం లాంటి పరిస్థితి నుంచి రైల్వేలను బయటకు తీసుకురావడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. రైల్వే రంగం అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని వెల్లడించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత అప్పటి ప్రభుత్వాలు రైల్వేశాఖ అభివృద్ధిని నిర్లక్ష్యం చేశాయని, సొంత రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇచ్చాయని విమర్శించారు. 21వ శతాబ్దంలో రైల్వేల ప్రగతిని దృష్టిని పెట్టుకొని రైల్వే బడ్జెట్‌ను కేంద్ర బడ్జెట్‌లో విలీనం చేశామని వెల్లడించారు. తద్వారా రైల్వేల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ నిధులు అందుబాటులోకి వచ్చాయని పేర్కొన్నారు. ప్రధాని మోదీ మంగళవారం గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో పర్యటించారు. సబర్మతి ప్రాంతంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. రూ.1,06,000 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించి, జాతికి అంకితం చేశారు. కొన్నింటికి శంకుస్థాపన చేశారు. ఇందులో రూ.85,000 కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టులు ఉన్నాయి. పది నూతన వందేభారత్ రైళ్లను ప్రధానమంత్రి వర్చువల్‌గా ప్రారంభించారు. ఇందులో సికింద్రాబాద్–విశాఖపట్నం, పూరీ–విశాఖపట్నం వందేభారత్ రైళ్లు కూడా ఉన్నాయి. తిరుపతి–కొల్లాం స్టేషన్ల మధ్య కొత్త రైలుకు పచ్చజెండా ఊపారు. అనంతరం బహిరంగ సభలో ప్రసంగించారు.

ఎన్నికల్లో లబ్ధి కోసం కాదు

2004–2014తో పోలిస్తే గత పదేళ్లలో తమ ప్రభుత్వం రైల్వేల అభివృద్ధికి 6 రెట్లు అధికంగా ఖర్చు చేసిందని ప్రధానమంత్రి అన్నారు. గతంలో రైళ్లు ఆలస్యంగా నడవడం అనేది సాధారణ వ్యవహారంగా ఉండేదన్నారు. 2014 వరకు దేశంలో కేవలం 35 శాతం రైల్వే లైన్లు విద్యుదీకరణకు నోచుకున్నాయని గుర్తుచేశారు. రైళ్లలో ప్రయాణానికి రిజర్వేషన్ దొరకడం చాలా కష్టంగా ఉండేదని, టికెట్ల కోసం ప్రయాణికులు గంటల తరబడి క్యూలో నిల్చునేవారని, ఏజెంట్లు కమీషన్లు వసూలు చేసేవారని చెప్పారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదని పేర్కొన్నారు. దేశ ప్రగతి అనే మిషన్‌లో భాగంగానే అభివృద్ధి పనులు, ప్రాజెక్టులు చేపడుతున్నామని, అంతేతప్ప కొందరు ఆరోపిస్తున్నట్లు ఎన్నికల్లో లబ్ధి కోసం ఎంతమాత్రం కాదని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు.

వారసత్వ సంపదను కాపాడుకోవాలి

సొంత వారసత్వ సంపదను కాపాడుకోని దేశానికి భవిష్యత్తు ఉండదని ప్రధానమంత్రి మోదీ చెప్పారు. మన దేశ వారసత్వ సంపదను కాపాడే విషయంలో గత ప్రభుత్వాలు ఏమాత్రం నిబద్ధత చూపలేదని విమర్శించారు. మంగళవారం అహ్మదాబాద్‌లోని సబర్మతి ఆశ్రమంలో దండి యాత్ర వార్షికోత్సవంలో మోదీ పాల్గొన్నారు. రూ.1,200 కోట్లతో అమలు చేయనున్న గాంధీ ఆశ్రమ్ మెమోరియల్ మాస్టర్‌ప్లాన్‌ను ప్రారంభించారు. ఆధునీకరించిన కోచ్రాబ్ ఆశ్రమాన్ని ప్రారంభించారు. మహాత్మాగాంధీ ఆరంభించిన సబర్మతి ఆశ్రమం కేవలం మన దేశానికే కాదు, మొత్తం మానవాళికే వారసత్వ సంపద అని తేల్చిచెప్పారు.

విన్యాసాలను తిలకిస్తున్న ప్రధాని మోదీ




పోఖ్రాన్‌లో అబ్బురపర్చిన 'భారత్ శక్తి'

భారతదేశ ఆత్మనిర్భరత, ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవానికి పోఖ్రాన్ ఒక ఘనమైన సాక్షి అని ప్రధానమంత్రి మోదీ వ్యాఖ్యానించారు. రాజస్తాన్ రాష్ట్రం పోఖ్రాన్‌లోని ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్‌లో మంగళవారం భారత త్రివిధ దళాలు 'భారత్ శక్తి' పేరిట సైనిక విన్యాసాలు నిర్వహించారు. దాదాపు 50 నిమిషాల పాటు జరిగిన ఈ విన్యాసాలను మోదీ ప్రత్యక్షంగా తిలకించారు. దేశీయంగా అభివృద్ధి చేసిన ఆయుధాలు, రక్షణ పరికరాల విన్యాసాలు చూపరులను అబ్బురపర్చాయి. తేజస్, ఏఎల్ఎస్ ఎంకే–4 యుద్ధ విమానాలు, యుద్ధ ట్యాంకులు అర్జున్, కె–9 వజ్ర, ధనుష్ వంటివి ఆకట్టుకున్నాయి. పినాకా ఉపగ్రహ వ్యవస్థతోపాటు డ్రోన్ల విన్యాసాలు సంభ్రమాశ్చర్యాలకు గురిచేశాయి. ఆకాశంలో మన యుద్ధ విమానాల గర్జనలు, నేలపై మన జవాన్ల సాహసాలు నవ భారత్(న్యూ ఇండియా)కు ఆహ్వానం పలుకుతున్నామని మోదీ పేర్కొన్నారు.

సీఏఏపై ముస్లింలకు ఆందోళన అక్కర్లేదు

కేంద్ర హోం శాఖ భరోసా

న్యూఢిల్లీ: పౌరసత్వ సవరణ చట్టంపై భారత ముస్లింలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కేంద్ర హోంశాఖ సూచించింది. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ చట్టం వల్ల వారి పౌరసత్వంపై ఎలాంటి ప్రభావం ఉండబోదని భరోసా ఇచ్చింది. దేశంలోని హిందువులతో సమానంగా హక్కులు అనుభవించవచ్చని పేర్కొంది. సీఏఏ వల్ల ముస్లింలపై ఎలాంటి వివక్ష ఉండదని, వారి హక్కులకు భంగం కలగదని తేల్చిచెప్పింది. పౌరసత్వం నిరూపించుకోవడానికి ధ్రువ పత్రాలు సమర్పించాలంటూ ఏ ఒక్క భారతీయ పౌరుడినీ అడిగే అవకాశమే లేదని కేంద్ర హోంశాఖ వెల్లడించింది. దేశంలోని 18 కోట్ల మంది ముస్లింలు నిశ్చింతగా ఉండొచ్చని సూచించింది. ఎవరూ దేశం విడిచి వెళ్లాల్సిన అవసరం లేదని వివరించింది. కొన్ని ముస్లిం దేశాల్లో మైనార్టీలపై వేధింపుల కారణంగా ఇస్లాం మతానికి చెడ్డపేరు వస్తోందని పేర్కొంది.



ఖట్టర్

ఖట్టర్ రాజీనామా

హరియాణా కొత్త సీఎంగా సైనీ ప్రమాణం ● సీట్ల సర్దుబాటులో జేజేపీతో విభేదాలు

చండీగఢ్: హరియాణాలో రాజకీయ ముఖచిత్రం ఒక్కసారిగా మారిపోయింది. రాష్ట్ర ముఖ్యమంత్రి పదవికి బీజేపీ సీనియర్ నేత మనోహర్‌లాల్ ఖట్టర్ రాజీనామా చేయడం మొదలు ఓబీసీ నేత నాయబ్ సైనీ నూతన ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయడం దాకా మంగళవారం అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. సంకీర్ణ ప్రభుత్వంలో దుష్యంత్ చౌతాలా సారథ్యంలోని జననాయక్ జనతా పార్టీ(జేజేపీ)తో విభేదాలు ముదరడంతో ఖట్టర్ సీఎం పదవిని వదులుకోవాల్సి వచ్చిందని వార్తలొచ్చాయి. అయితే ఖట్టర్‌ను లోక్‌సభ ఎన్నికల్లో బరిలో నిలిపేందుకే బీజేపీ ఆయనను సీఎం పీఠం నుంచి దింపేసిందని మరో వాదన వినిపించింది. హరియాణాలో లోక్‌సభ సీట్ల సర్దుబాటు విషయంలో జేజేపీతో బీజేపీకి ఏకాభిప్రాయం కుదరకపోవడంతో తెగదెంపులు చేసుకోవాల్సి వచ్చిందని సమాచారం. దీంతో చివరకు సీఎం ఖట్టర్, 13 మంది మంత్రులు రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయను కలిసి తమ రాజీనామా లేఖలను సమర్పించారు. రాజీనామాలను గవర్నర్ ఆమోదించారు. ఆ తర్వాత బీజేపీ ఎమ్మెల్యేలు హరియాణా నివాస్‌లో కలిసి 54 ఏళ్ల సైనీని తమ శాసనసభాపక్ష నేతగా ఎన్నుకున్నారు. దీంతో ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం ఇవ్వాలంటూ సైనీ గవర్నర్‌ను కలిసి కోరారు. ఇందుకు గవర్నర్ ఒప్పుకోవడంతో హరియాణా ముఖ్యమంత్రిగా నాయబ్ మంత్రులుగా మరో ఐదుగురు ఎమ్మెల్యేల ప్రమాణస్వీకారం చకచకా జరిగిపోయాయి. ఈ ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఖట్టర్ హాజరయ్యారు.

జేజేపీతో పొసగని పొత్తు

సార్వత్రిక ఎన్నికల వేళ రాష్ట్రంలో బీజేపీ–జేజేపీ సంకీర్ణ ప్రభుత్వానికి నూకలు చెల్లిపోయాయి. హరియాణాలోని మొత్తం 10 లోక్‌సభ స్థానాల్లోనూ పోటీచేస్తామని జేజేపీ పార్టీ పట్టుబట్టడంతో పార్టీతో పొత్తుకు బీజేపీ ఫుల్‌స్టాప్ పెట్టిందని తెలుస్తోంది. ఖట్టర్ రాజీనామా తర్వాత డెప్యూటీ సీఎం పదవి నుంచి జేజేపీ నేత దుష్యంత్ తప్పుకోవాల్సి వచ్చింది. గత లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని మొత్తం 10 ఎంపీ స్థానాలను బీజేపీ కైవసం చేసుకుంది. ఈసారీ గెలుపు ఖాయమని భావిస్తోంది. అందుకే గెలవబోయే స్థానంలో ఖట్టర్‌ను నిలపాలని బీజేపీ భావిస్తోంది. కులగణన డిమాండ్‌ను కాంగ్రెస్ తెరమీదకు తెచ్చిన నేపథ్యంలో జనాభాలో 30 శాతమున్న ఓబీసీ వర్గానికి చెందిన సైనీని సీఎంగా చేసింది. 2014లో తొలిసారి ఎంపీ అయిన ఖట్టర్‌ను సీఎంగా ఎంచుకున్నట్లే తొలిసారి ఎంపీ అయిన నాయబ్‌నూ సీఎంగా కమలదళం ఎన్నుకుంది. ప్రస్తుత హరియాణా శాసనసభ కాలపరిమితి అక్టోబర్‌తో ముగియనుంది.



సైనీ

ఈలోపు ఓబీసీ నేతతో సీఎం పదవిని భర్తీచేసి ఓబీసీలను తమవైపు తిప్పుకోవాలని పార్టీ భావిస్తోంది.

బలపరీక్షకు అవకాశమివ్వండి

తమ ప్రభుత్వానికి 48 మంది ఎమ్మెల్యేల మద్దతుందని, బలనిరూపణకు బుధవారం అసెంబ్లీ ప్రత్యేక సెషన్ నిర్వహణకు అనుమతి ఇవ్వాలంటూ నూతన సీఎం సైనా గవర్నర్‌కు లేఖ రాశారు. 90 మంది సభ్యులున్న అసెంబ్లీలో 41 మంది బీజేపీ సభ్యులున్నారు. తమకు ఆరుగురు స్వతంత్ర్య ఎమ్మెల్యేలు, ఒక హరియాణా లోఖిత్ పార్టీ ఎమ్మెల్యే మద్దతు ఉందని బీజేపీ చెబుతోంది. జేజేపీకి 10 మంది, కాంగ్రెస్‌కు 30 మంది, ఇండియన్ నేషనల్ లోక్‌దళ్‌కు ఒక ఎమ్మెల్యే ఉన్నారు.

కూలిన తేజస్ యుద్ధ విమానం

జైసల్మేర్: భారత వైమానిక దళానికి చెందిన తేలికపాటి యుద్ధ విమానం(ఎల్‌సీఏ) తేజస్ మంగళవారం రాజస్తాన్‌లోని జైసల్మేర్‌లో కుప్పకూలింది. శిక్షణ సమయంలో చోటుచేసుకున్న ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రాణాపాయం సంభవించలేదు. పైలట్ సురక్షితంగా బయటపడ్డాడు. దేశీయంగా రూపుదిద్దుకున్న ఈ రకం విమానం ప్రమాదానికి గురి కావడం ఇదే మొదటిసారి. అక్కడికి 100 కిలోమీటర్ల దూరంలో ఉన్న థార్ ఎడారిలోని పోఖ్రాన్‌లో ప్రధాని మోదీ, సైనిక ఉన్నతాధికారుల సమక్షంలో 'భారత్ శక్తి' పేరుతో జరుగుతున్న భారీ యుద్ధ విన్యాసాల్లో పాల్గొని వస్తుండగా ఘటన చోటుచేసుకుంది. నంబర్–18 స్క్వాడ్రన్‌కు చెందిన ఈ సింగిల్ ఇంజిన్ ఎల్‌సీఏ 2001 నుంచి సేవలందిస్తోందని ఐఏఎఫ్ పేర్కొంది. విన్యాసాల్లో పాల్గొన్న ఈ రకం మూడు విమానాల్లో ఇదీ ఒకటని వివరించింది. ఘటనపై కోర్టు ఆఫ్ ఎంక్వయిరీకి ఆదేశించినట్లు ఐఏఎఫ్ వెల్లడించింది. ఇలా ఉండగా, జైసల్మేర్‌లోని కల్లా, జవాహర్ నివాస ప్రాంతంలోని ఓ హాస్టల్ భవనంపై తేజస్ విమానం కుప్పకూలిందని అదనపు ఎస్పీ మహేందర్ సింగ్ చెప్పారు. ఆ సమయంలో భవనంతోపాటు చుట్టుపక్కల కూడా ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందన్నారు. విమానం నేలను తాకిన వెంటనే పెద్ద శబ్దంతో మంటలు చెలరేగాయన్నారు. అగ్ని మాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారని చెప్పారు. విమానం కూలడానికి కొద్ది క్షణాల ముందు అందులో ఉన్న ఏకైక పైలట్ బయటపడ్డాడన్నారు. 40 వరకు తేలికపాటి యుద్ధ విమానాలు భారత వైమానిక దళంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి.

ఎట్టకేలకు ఎలక్టోరల్ బాండ్ల వివరాలు

ఎన్నికల సంఘానికి సమర్పించిన ఎస్‌బీఐ

న్యూఢిల్లీ: ఎలక్టోరల్ బాండ్ల వివరాలను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) మంగళవారం సాయంత్రం ఎన్నికల సంఘానికి సమర్పించింది. ఈ బాండ్ల వివరాలను మంగళవారం సాయంత్రానికల్లా ఎన్నికల సంఘానికి ఇవ్వాల్సిందేనని సుప్రీంకోర్టు సోమవారం ఎస్‌బీఐని ఆదేశించిన సంగతి తెలిసిందే.సుప్రీంకోర్టు ఉత్తర్వు ప్రకారం.. ఎస్‌బీఐ ఇచ్చిన ఎలక్టోరల్ బాండ్ల వివరాలను ఎన్నికల సంఘం ఈనెల 15వ తేదీ సాయంత్రం 5 గంటలకల్లా తన అధికారిక వెబ్‌సైట్‌లో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాల్సి ఉంది.

రూ.480 కోట్ల డ్రగ్స్‌తో పాక్ బోట్ పట్టివేత

అహ్మదాబాద్: భారత తీర రక్షక దళం(ఐసీజీ) సారథ్యంలో అరేబియా సముద్రంలో జరిగిన ఆపరేషన్‌లో రూ.480 కోట్ల విలువైన డ్రగ్స్‌తో కూడిన పాకిస్తాన్ బోటు పట్టుబడింది. ఐసీజీ ఆధ్వర్యంలో నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో(ఎన్‌సీబీ), గుజరాత్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్(ఏటీఎస్)సోమవారం అర్ధరాత్రి చేపట్టిన ఈ ఆపరేషన్‌లో ఆరుగురు పాకిస్తానీయులు కూడా పట్టుబడినట్లు రక్షణ శాఖ మంగళవారం తెలిపింది. విశ్వసనీయ నిఘా సమాచారం మేరకు..ఈ నెల 11న పోరుబందర్‌కు 350 కిలోమీటర్ల దూరంలోని సముద్రజలాల్లో ఐసీజీ నౌకలను మోహరించింది. డోర్నియర్ విమానంతో గస్తీ చేపట్టింది. అర్ధరాత్రి సమయంలో చీకటి మాటున ఓ బోటు అనుమానాస్పద కదలికలను పసిగట్టి, సిబ్బందిని అప్రమత్తం చేసింది. తప్పించుకునేందుకు ప్రయత్నించిన ఆ బోటును వెంటాడి దిగ్బంధించింది. తనిఖీలు జరపగా అందులో సుమారు రూ.480 కోట్ల విలువైన 60 ప్యాకెట్లతో ఉన్న 80 కిలోల నిషేధిత డ్రగ్స్ ఉన్నట్లు తేలింది. బోటులోని ఆరుగురిని అదుపులోకి తీసుకుని, డ్రగ్స్ సహా పోరుబందర్ తీరానికి తరలించినట్లు రక్షణ శాఖ తెలిపింది. ఇది గత మూడేళ్లలో ఐసీజీ, గుజరాత్ ఏటీఎస్, ఎన్‌సీబీలతో కలిసి చేపట్టిన పదో ఆపరేషన్ అని, మొత్తం రూ.3,135 కోట్ల విలువైన 517 కిలోల డ్రగ్స్‌ను పట్టుకుందని తెలిపింది. అరేబియా సముద్రంలో నెల రోజుల వ్యవధిలో విజయవంతంగా నిర్వహించిన రెండో ఆపరేషన్ అని రక్షణ శాఖ వివరించింది. ఫిబ్రవరి 26న పోరుబందర్ సమీపంలో ఓ బోటులో తరలిస్తున్న చరస్ తదితర 3,300 కిలోల డ్రగ్స్‌ను పట్టుకుని, ఐదుగురు విదేశీయులను అరెస్ట్ చేసినట్లు వెల్లడించింది.

హైతీ ప్రధాని రాజీనామా

పోర్టు ఆవ్ ప్రిన్స్: కరేబియన్ దేశం హైతీ ప్రధానమంత్రి ఆరియల్ హెన్రీ ఎట్టకేలకు పదవి నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించారు. రాజధానిలోని 80శాతం పైగా సాయుధ ముఠాల చేతుల్లోకి వెళ్లిపోవడం, పలు ప్రభుత్వ కార్యాలయాలను ముఠాలు ఆక్రమించడం, అంతర్జాతీయంగా ఒత్తిళ్లు పెరగడంతో హెన్రీ ఈ మేరకు నిర్ణయించినట్లుగా భావిస్తున్నారు. హెన్రీ ప్రస్తుతం పొరుగుదేశం పోర్టోరికోలో ఉన్నారు. ఆయన ప్రయాణిస్తున్న విమానం పోర్టు ఆవ్ ప్రిన్స్‌లోని విమానాశ్రయంలో ల్యాండయ్యేందుకు సాయుధ ముఠాలు అంగీకరించకపోవడంతో దేశం వెలుపలే ఉండిపోయారు. 2021లో అప్పటి అధ్యక్షుడు జొవెనెల్‌ను సాయుధులు ఇంట్లో ఉండగా చంపారు. అప్పటి నుంచి హెన్రీ ఆపద్ధర్మ ప్రధానిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

రిషి సునాక్‌కు ప్రధాని మోదీ ఫోన్

న్యూఢిల్లీ: భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ యూకే ప్రధానమంత్రి రిషి సునాక్‌తో మంగళవారం ఫోన్‌లో మాట్లాడారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని(ఎఫ్‌టీఏ) త్వరగా అమల్లోకి తీసుకురావడమే లక్ష్యంగా రెండు దేశాల మధ్య జరుగుతున్న చర్చల్లో పురోగతిని ఇరువురు నేతలు స్వాగతించారు. భారత్–యూకే మధ్య వ్యూహాత్మక ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. రిషి సునాక్‌తో ఫలవంతమైన సంభాషణ జరిగిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

పోలీసుల భారీ బందోబస్తు మధ్య ఒక్కటైన గ్యాంగ్‌స్టర్, రివాల్వర్ రాణి

న్యూఢిల్లీ: సమాజంలో ప్రముఖ వ్యక్తుల పెళ్లిళ్లు జరిగినపుడు భారీ బందోబస్తు, కట్టుదిట్టమైన భద్రత కనిపించడం సహజం. కానీ కరడుగట్టిన నేరగాడి పెళ్లి తంతును పోలీసులే దగ్గరుండి జరిపించిన ఘటనకు దేశ రాజధాని వేదికైంది. పెరోల్‌పై తిహార్ జైలు నుంచి బయటికొచ్చిన గ్యాంగ్‌స్టర్ సందీప్ అలియాస్ కాలా జథేడీ వివాహ వేడుక విశేషమిది. వివరాల్లోకి వెళ్తే సందీప్ డజనుకుపైగా హత్య, హత్యాయత్నం, దోపిడీ కేసుల్లో నిందితుడు. గ్యాంగ్‌స్టర్ అయిన సందీప్ నాలుగేళ్లుగా లేడీ డాన్‌గా పేరుబడ్డ అనురాధాతో ప్రేమాయణం నడుపుతున్నాడు. మరో గ్యాంగ్‌స్టర్ ఆనంద్‌పాల్‌సింగ్ ముఠా సభ్యురాలైన అనురాధాపై మనీ లాండరింగ్, బెదిరింపు వసూళ్ల వంటి అరడజనుదాకా కేసులు ఉన్నాయి. బెయిల్ మీద ఇప్పటికే అనురాధా విడుదల కాగా సందీప్‌కు కేవలం ఆరు గంటల పెరోల్ లభించింది. ఈ సమయంలోనే పెళ్లాడాలని నిర్ణయించుకున్నాడు. అనుకున్నదే తడవుగా ఢిల్లీ ద్వారకా సెక్టార్–3లోని సంతోష్ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌ను బుక్‌చేశారు. సందీప్ న్యాయవాది రూ.51,000కు ఈ ఫంక్షన్‌ను బుక్‌చేశారు. సందీప్, అనురాధాలు వేర్వేరు నేరముఠాలకు చెందిన వ్యక్తులు కావడంతో పెళ్లివేడుకలో గ్యాంగ్ వార్ జరిగే ఆస్కారముందని పోలీసులు భావించారు.

నాలుగు అంచెల రక్షణ

ఢిల్లీ, హరియాణా పోలీసులు ఫంక్షన్ హాల్‌ను శత్రుదుర్భేద్యంగా మార్చేశారు. ప్రవేశద్వారం వద్ద మెటల్ డిటెక్టర్లు, కీలక ప్రాంతాల్లో సీసీకెమెరాలు అమర్చారు. డ్రోన్‌లను రంగంలోకి దింపారు. ఫంక్షన్ హాల్ పరిసరాల్లో 250కిపైగా పోలీసులు మొహరించారు. పెళ్లిరోజు రానే వచ్చింది. హరియాణాలోని సోనీపట్ నుంచి బ్లాక్ ఎస్‌యూవీ వాహనంలో వధువు అనురాధా, పోలీసు బందోబస్తు నడుమ వరుడు సందీప్ పెళ్లిమండపానికి చేరుకున్న విధానం అచ్చం ఓటీటీ థ్రిల్లర్‌ను తలపించింది. కవరేజీ కోసం చేరుకున్న మీడియా ప్రతినిధులు, రక్షణగా చుట్టుముట్టిన పోలీసులు, వధూవరుల తరఫున హాజరైన కొందరు నేరగాళ్ల సమక్షంలో మంగళవారం వివాహం ఆడంబరంగా జరిగింది. వివాహం తర్వాత సందీప్‌ను పోలీసులు మళ్లీ తిహార్ చెరసాలకు తీసుకెళ్లారు. పెళ్లి వేడుకలో నాలుగు అంచెల భద్రతా వలయాన్ని పోలీసులు సృష్టించారు. బంధువులు వస్తే వెంట గుర్తింపు కార్డులను తెచ్చుకోవాలి. వారి పేర్లు పోలీసుల వద్ద ఉన్న జాబితాతో సరిపోలాలి. ఆ తర్వాత వేడుకలో పాల్గొననిస్తారు. సెల్‌ఫోన్లను మండపంలోకి పోలీసులు అనుమతించలేదు. స్పెషల్ సెల్, క్రైమ్ బ్రాంచ్, హరియాణా క్రైమ్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ, ఢిల్లీ స్పెషల్ వెపన్స్ టెక్నిక్స్ విభాగాల పోలీసులు భద్రతా విధుల్లో పాల్గొన్నారు.



'రివాల్వర్ రాణి', 'మేడమ్ మింజ్'గా పేరొందిన 39 ఏళ్ల అనురాధాను 2020 సంవత్సరం నుంచి 40 ఏళ్ల సందీప్ ప్రేమిస్తున్నాడు. జైలులో ఉన్న గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్‌కు ఇతను సన్నిహితుడు. అతడి తలపై రూ.7 లక్షల రివార్డ్ ఉంది. 2021లో పోలీసులు అతడిని అరెస్ట్‌చేశారు. గతంలో కస్టడీ నుంచి ఒకసారి సందీప్ తప్పించుకున్నాడు. అది పునరావృతం కాకూడదనే పెరోల్‌పై బయట ఉన్నంతసేపు సందీప్‌పై పోలీసులు ఓ కన్నేసి ఉంచారు. గ్యాంగ్ వార్‌ను ఎదుర్కొనేందుకు మండపంలో పోలీసులు బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్లు ధరించారు. కేసుల బాధ నుంచి విముక్తి పొందాక సాధారణ జీవితం గడపాలని ఇద్దరం భావిస్తున్నట్లు అనురాధా చెప్పారు.

200 రోజుల తర్వాత..

ఫ్లోరిడా: దాదాపు ఆరు నెలలపాటు అంతరిక్షంలో గడిపిన నలుగురు వ్యోమగాములు సురక్షితంగా భూమికి తిరిగి వచ్చారు. ఈబృందం గత ఏడాది ఆగస్ట్ 26న కెన్నడీ స్పేస్ సెంటర్ నుంచి స్పేస్ ఎక్స్ అంతరిక్ష నౌక డ్రాగన్ ద్వారా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్)కు చేరుకుంది. అక్కడ ఐఎస్ఎస్‌లో ఉంటూ 200 రోజుల్లో భూమిని వీరు 3,184 సార్లు చుట్టి వచ్చారు.

పాస్ చేయండి లేదంటే పెళ్లి చేస్తారు

- జవాబుపత్రంలో పదో తరగతి విద్యార్థిని వేడుకోలు
- బిహార్‌లో ఘటన

పట్నా: ఎలాగోలా పాస్ చేయండని, లేదంటే నాకు మా నాన్న పెళ్లి చేసేస్తాడని పదో తరగతి విద్యార్థిని ఒకరు జవాబుపత్రంలో వేడుకున్న ఘటన ఒకటి బిహార్‌లో జరిగింది. సంబంధిత టెన్త్ క్లాస్ ఆన్సర్ షీట్ ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో తెగ చక్కర్లు కొడుతోంది. గత నెల 15 నుంచి 23వ తేదీ వరకు జరిగిన పదో తరగతి పరీక్షల జవాబుపత్రాలను తాజాగా ఉపాధ్యాయులు దిద్దుతుండగా ఈ విన్నపం విషయం బయటపడింది. కొందరు కవిత్వాలు, మరికొందరు ఉద్వేగంతో కూడిన వాక్యాలు, ప్రార్థనలు రాశారు. అయితే ఆరాహ్ మోడల్ స్కూల్‌కు చెందిన ఒకమ్మాయి మాత్రం తన ఇంట్లో చదువుకునే అమ్మాయిల దుస్థితిని విన్నవించుకుంది. 'మా నాన్న ఒక పేద రైతు. చదువులకయ్యే ఖర్చులను భరించలేని కుటుంబం మాది. అందుకే మేం చదువుకోవడం మా వాళ్లకు ఇష్టంలేదు. మంచి మార్కులు సాధించలేకపోతే చదువు కొనసాగించలేము. వెంటనే పెళ్లి చేసేస్తారు. పెళ్లి చేసుకోవడం మాకు అస్సలు ఇష్టంలేదు. మమ్మల్ని కాపాడండి. నిరుపేదరాలిగా వేడుకుంటున్నా. నన్ను పాస్ చేయండి' అని అమ్మాయి రాసింది.

ఎన్నార్సీని తెచ్చేందుకే ఈ చట్టం

కేంద్రం కుట్రపన్నుతోందన్న మమతా బెనర్జీ

బరాసత్: లోక్‌సభ ఎన్నికల వేళ కేంద్ర ప్రభుత్వం వివాదాస్పద పౌరసత్వ (సవరణ) చట్టం(సీఏఏ)–2019ను అమల్లోకి తేవడంపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్రంగా స్పందించారు. సీఏఏలోని నిబంధనలను అస్పష్టం, రాజ్యాంగ విరుద్ధం, వివక్షాపూరితమని ఆమె అభివర్ణించారు. మంగళవారం ఉత్తర 24 పరగణాల జిల్లా హబ్రాలో జరిగిన కార్యక్రమంలో సీఎం మమత మాట్లాడారు. జాతీయ పౌర రిజిస్టర్(ఎన్నార్సీ)ని అమలు చేసే ఎత్తుగడల్లో భాగంగానే మోదీ ప్రభుత్వం సీఏఏను ముందుగా తీసుకొచ్చిందని ఆరోపించారు. 2014కు ముందు దేశంలోకి వచ్చిన వారికి పౌరసత్వం కల్పిస్తే, 2015 ఆ తర్వాత వచ్చిన వారి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో బీజేపీ తప్పుడు హామీలిస్తోందన్నారు. అటువంటి పార్టీకి అధికారం అప్పగించరాదన్నారు. బెంగాల్‌లో ఎట్టిపరిస్థితుల్లోనూ ఎన్నార్సీని అమలు కానీయబోనని స్పష్టం చేశారు. క్రైస్తవ, ముస్లిం తదితరుల హక్కుల లాగేసుకోవాలనే కుట్రతోనే కేంద్రం ఈ చట్టాన్ని తీసుకువచ్చిందన్నారు.

మేం అమలు చేయం: స్టాలిన్

చెన్నై: పౌరసత్వ సవరణ చట్టాన్ని తమిళనాడులో అమలు చేయబోమని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ చెప్పారు. ప్రజల మధ్య విభజనలను తీసుకువచ్చే ఈ చట్టంతో ఎలాంటి ఉపయోగం లేదని ఆయన పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికలు దగ్గరపడుతున్న సమయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం హడావుడిగా ఈ చట్టాన్ని అమలు చేస్తూ నోటిఫికేషన్ జారీ చేసిందని విమర్శించారు. ఈ చట్టంలోని నిబంధనలను రాజ్యాంగం మౌలిక సూత్రాలకు విరుద్ధంగా ఉన్నాయని స్టాలిన్ అన్నారు.

సీఏఏ దరఖాస్తుల కోసం కొత్త పోర్టల్

న్యూఢిల్లీ: పౌరసత్వ(సవరణ)చట్టం, 2019 కింద భారత పౌరసత్వం పొందాలని భావించే పాకిస్తాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్తాన్ కాందిశీకుల కోసం భారత సర్కార్ ప్రత్యేకంగా కొత్త పోర్టల్‌ను మంగళవారం ప్రారంభించింది. అర్హులైన శరణార్థులు ఈ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కేంద్ర హోం శాఖ తెలిపింది. సీఏఏ చట్టాన్ని అమల్లోకి తెస్తూ సంబంధిత నిబంధనలను నోటిఫై చేసిన మరుసటి రోజే ఇలా శరణార్థులకు సాయపడేలా indiancitizenshiponline.nic.in పేరిట నూతన పోర్టల్‌ను మోదీ సర్కార్ తీసుకు రావడం విశేషం. ఈ చట్టం ప్రకారం 2014 డిసెంబర్ 31వ తేదీలోపు పాకిస్తాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్తాన్‌ల నుంచి భారత్‌కు వచ్చిన ముస్లిమేతర శరణార్థులు భారత పౌరసత్వం పొందేందుకు అర్హులు. ఈ దేశాల నుంచి వచ్చిన హిందువులు, క్రైస్తవులు, సిక్కులు, జైనులు, బౌద్ధులు, పార్సీలు భారత పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. 2014లోపే భారత్‌కు వచ్చినట్లు నిర్ధారించే ఆధారాలను దరఖాస్తుదారులు ప్రభుత్వానికి చూపాల్సి ఉంటుంది.

అమలు నిలిపివేయండి: సుప్రీంలో పిటిషన్

న్యూఢిల్లీ: పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ) అమలును నిలిపివేసేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. 2019 నాటి పౌరసత్వ సవరణ చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ పూర్తయ్యి తీర్పు వచ్చేదాకా ఈ చట్టాన్ని అమలును నిలిపివేయాలని కోరుతూ ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్(ఐయూఎంఎల్) మంగళవారం ఈ వ్యాజ్యం దాఖలు చేసింది. సీఏఏ అమలుపై స్టే విధించాలని విజ్ఞప్తి చేస్తూ అలాగే డెమొక్రటిక్ యూత్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కూడా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది.

ఛింద్వారా నుంచి నకుల్‌నాథ్

కాంగ్రెస్ అభ్యర్థుల రెండో జాబితా విడుదల

న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల సమరంలో నిలిచే పార్టీ అభ్యర్థుల రెండో జాబితాను కాంగ్రెస్ పార్టీ మంగళవారం విడుదలచేసింది. మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కమల్‌నాథ్ కుమారుడు నకుల్‌నాథ్‌ను ఆ రాష్ట్రంలోని ఛింద్వారా స్థానం నుంచే మళ్లీ బరిలో నిలపనుంది. మొత్తం 43 మంది పేర్లతో రెండో జాబితాను పార్టీ విడుదలచేసింది. రాజస్తాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోత్ కుమారుడు వైభవ్ ఈసారి జాలోర్ ఎంపీ స్థానం నుంచి పోటీచేస్తారు. లోక్‌సభలో ఉపనేత గౌరవ్ గొగోయ్ ఈసారి అస్సాంలోని జోర్హాట్ నుంచి, ప్రద్యుత్ బోర్డోలోయ్ నగావ్ నుంచి ఎన్నికల్లో నిలబడనున్నారు. రెండ్రోజుల క్రితమే బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన సిట్టింగ్ ఎంపీ రాహుల్ కస్వాన్‌ను రాజస్థాన్‌లోని అదే చురు స్థానం నుంచి కాంగ్రెస్ పోటీకి దింపుతోంది. మాజీ డీజీపీ హరీశ్ చంద్రమీనాను రాజస్తాన్‌లోని టోంక్–సవాయ్ నుంచి పోటీచేస్తారు. మంగళవారం విడుదలైన జాబితాలో 76.7 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన అభ్యర్థులే ఉన్నారు. 43 మంది ఉన్న జాబితాలో నలుగురు మహిళలు ఉన్నారు.

భారత ప్రాదేశిక జలాల సమీపానికి చైనా పరిశోధక నౌక

విశాఖ సిటీ: చైనాకు చెందిన ఓ పరిశోధన నౌక భారత ప్రాదేశిక జలాల సమీపంలోకి రావడం కలకలం రేపింది. చైనాకు చెందిన జియాన్ యాంగ్ హాంగ్ 01 నౌక ఏపీలోని విశాఖ తీరానికి 480 కిలోమీటర్ల దూరంలో అంతర్జాతీయ సముద్ర జలాల్లో లంగరు వేసింది. కొంత కాలంగా హిందూ మహా సముద్రం , బంగాళాఖాతంలో చైనా నౌకల రాకపోకలు పెరిగాయి. చైనా పరిశోధక నౌకల పేరిట భారత్‌పై నిఘా పెడుతోందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సరిగ్గా అగ్ని–5 క్షిపణి ప్రయోగం చేపట్టే సమయంలోనే చైనా నౌక భారత తీరానికి చేరువలోకి రావడం ఈ అనుమానాలకు మరింత బలాన్ని చేకూరిస్తోంది. ఈ నౌక మలక్కా జలసంధి దాటి దిశ మార్చుకుని బంగాళాఖాతంలోకి ప్రవేశించినట్లు తెలుస్తోంది. కేవలం మూడు రోజుల వ్యవధిలోనే ఆగ్నేయ బంగాళాఖాతం నుంచి మధ్య బంగాళాఖాతంలోకి ప్రవేశించింది. సముద్ర గర్భంలో 10 వేల అడుగుల లోతులోనూ పరిశోధించ గల అత్యాధునిక రిమోట్ సెన్సింగ్ వ్యవస్థలు ఈ నౌకలో ఉన్నట్టు భారత నేవీ అనుమానిస్తోంది. భారత్ కు చెందిన మూడు అణు బాలిస్టిక్ మిస్సైల్ సహిత జలాంతర్గాములు, పలు కీలక ఆయుధ వ్యవస్థలకు స్థావరంగా ఉన్న విశాఖ నౌకాస్థావరం సమీపానికి చైనా నౌక రావడంతో భారత ప్రభుత్వం అప్రమత్తమైంది.

బీజేపీలో ఏఐఎస్ఎంకే విలీనం

చెన్నై: లోక్‌సభ ఎన్నికల వేళ సీనియర్ తమిళ నటుడు ఆర్.శరత్ కుమార్(69) తన అఖిల ఇండియా సమత్తువ మక్కల్ కట్చి(ఏఐఎస్ఎంకే)పార్టీని బీజేపీలో కలిపేశారు. మంగళవారం జరిగిన ఏఐఎస్ఎంకే కార్యవర్గం సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అన్నామలై సమక్షంలో ఆయన విలీనం నిర్ణయాన్ని ప్రకటించారు. ఏఐఎస్ఎంకే సభ్యులను అన్నామలై బీజేపీ కుటుంబంలోకి ఆహ్వానించారు. 2026లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని అధికారంలోకి తెచ్చేందుకు కృషి చేయాలని పార్టీ కార్యకర్తలకు ఈ సందర్భంగా శరత్ కుమార్ పిలుపునిచ్చారు.

జేకేఎన్ఎఫ్‌పై కేంద్రం నిషేధం

న్యూఢిల్లీ: కశ్మీర్‌కు చెందిన వేర్పాటువాద రాజకీయ వేదిక హురియత్ కాన్ఫరెన్స్‌కు చెందిన జమ్మూకశ్మీర్ నేషనల్ ఫ్రంట్ (జేకేఎన్ఎఫ్)పై ప్రభుత్వం మంగళవారం అయిదేళ్ల నిషేధం విధించింది. నయీమ్ అహ్మద్ ఖాన్ సారథ్యంలోని జేకేఎన్ఎఫ్ దేశ సమగ్రత, సార్వభౌమత్వానికి భంగం కలిగించడంతోపాటు ప్రజల మధ్య విద్వేష బీజాలు నాటుతున్నందున కఠినమైన చట్టవ్యతిరేక కార్యకలాపాల(నివారణ)చట్టం కింద ఈ మేరకు చర్య తీసుకున్నట్లు కేంద్ర హోం శాఖ తెలిపింది. ఉగ్ర నిధుల కేసులో 2017లో ఎన్ఐఏ అదుపులోకి తీసుకున్న వేర్పాటు నేతల్లో నయీమ్ అహ్మద్ ఖాన్ ఒకడు. ఇతడు ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నాడు.

పాక్‌లో భవనం కుప్పకూలి..9 మంది మృతి

లాహోర్: పాకిస్తాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌లో భవనం కుప్పకూలిన ఘటనలో తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారు. ముల్తాన్ నగరంలోని హరాంగేట్ ప్రాంతంలోని ఓ ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలి, ఆ తీవ్రతకు మూడంతస్తుల భవనం శిథిలాల దిబ్బగా మారిపోయింది. ఆ సమయంలో భవనంలో ఉన్న మొత్తం 11 మందిలో 9 మంది శిథిలాల కింద చిక్కుకుని చనిపోగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో ఏడుగురు ఒకే కుటుంబానికి చెందిన వారు కాగా, వీరిలో అయిదుగురు టీనేజర్లని అధికారులు తెలిపారు.



నర్సుల పోస్టులకు రూ.3లక్షలు?

నేషనల్ హెల్త్‌మిషన్ కింద వైద్యారోగ్యశాఖలో భర్తీ చేస్తున్న కొలువులకు మధ్యవర్తులు డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. 8లో▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
బుధ : 6:24	గురు 4:56

వాతావరణం

గరిష్టం/కనిష్టం 38.0/27.0

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. రాత్రి పూట ఉక్కపోత ఉంటుంది.

న్యూస్‌రీల్

ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు



కరీంనగర్ అర్బన్:పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ ఆదేశించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి సంయుక్త ఎన్నికల అధికారులు సర్ఫరాజ్ అహ్మద్, లోకేష్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఈవీఎం రాండమైజేషన్ అన్ని జిల్లాల్లో ఒకే రోజు చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. వయోవృద్ధులు, దివ్యాంగులు ఇంటి వద్ద ఓటు వేసేలా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. కొత్త ఓటర్ల నమోదుకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను సత్వరమే క్లియర్ చేయాలని సూచించారు. అదనపు కలెక్టర్లు ప్రఫుల్‌దేశాయ్, లక్ష్మీ కిరణ్, డీఆర్‌వో పవన్ కుమార్ ఆర్డీవో కుందారపు మహేశ్వర్, సీపీవో కొమురయ్య, కరీంనగర్ మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్, తహసీల్దార్లు రమేశ్, నరేందర్, రాజు, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

'కేసీఆర్‌వి పచ్చి అబద్ధాలు'

కరీంనగర్ టౌన్: కరీంనగర్‌లో 'కదనభేరి' సభ సాక్షిగా బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్, మాజీ ఎంపీ వినోద్ కుమార్ పచ్చి అబద్ధాలు మాట్లాడారని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ ఒక ప్రకటనలో ఆరోపించారు. ఓట్ల కోసం అవాస్తవాలను ప్రజలపై రుద్దే ప్రయత్నం చేశారని అన్నారు. మొన్నటి ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు కర్రు కాల్చి వాతపెట్టినా సిగ్గు లేకుండా అబద్ధాలు మాట్లాడుతూనే ఉన్నారని మండిపడ్డారు. వారు చేసిన ప్రసంగంలోని డొల్లతనాన్ని, పచ్చి అబద్ధాలను మీడియా వేదికగా ప్రజల ముందుంచుతానని పేర్కొన్నారు.

అంగన్‌వాడీల ధర్నా

కరీంనగర్: అంగన్‌వాడీ కేంద్రాల్లో సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ పెట్టాలనే నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని, కేంద్రాలకు ఒక్కపూట బడితో పాటు మే నెలలో సెలవులు ఇవ్వాలని, 24రోజుల సమ్మె హామీలు వెంటనే అమలు చేయాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి పవన్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం దుర్వినియోగం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, దీనికోసం కేంద్రాల్లో సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ విధానాన్ని ప్రవేశపెట్టాలని ఆదేశించారని, అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లను దొంగలుగా ఆరోపించడం తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అంగన్‌వాడీలు మంగ, మమత, కాత్యాయని, శారద, శ్రీలత, సునీత, వనజ, శిరీష, శోభ, శ్రీదేవి, కవిత, హరిప్రియ, వాణి, రమాదేవి ఉన్నారు.



అభివాదం చేస్తున్న కేసీఆర్, వినోద్‌కుమార్



కరీంనగర్ కదనభేరి సభలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వేదికపై పోచారం శ్రీనివాస్, మహమూద్ అలీ, వినోద్ కుమార్, కడియం శ్రీహరి, కెప్టెన్ లక్ష్మీకాంతారావు, మధుసూదనాచారి, రసమయి బాలకిషన్, సతీశ్‌బాబు, రవిశంకర్, పాడి కౌశిక్‌రెడ్డి తదితరులు



రైతులను చూస్తే.. కన్నీళ్లు ఆగట్లే..

కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు ఎకరమైనా ఎండిందా?





సభకు హాజరైన ప్రజలు, బీఆర్ఎస్ కార్యకర్తలు

- చెరువుల్లో మత్తళ్లు దూకిన నీరు మాయమెలా?
- స్మార్ట్‌సిటీ, రైల్వే, రహదారులు తెచ్చిన సమర్థుడు వినోద్
- బండికి, వినోద్‌కు నక్కకు నాగలోకానికి ఉన్నంత వ్యత్యాసం
- తెలంగాణ గళం కోసం బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులను గెలిపించాలి
- సిరిసిల్ల ఆత్మహత్యలు ఆపేందుకే బతుకమ్మ చీరలు
- కదనభేరి సభలో కాంగ్రెస్, బీజేపీలపై మాజీ సీఎం కేసీఆర్ నిప్పులు

కరీంనగర్‌కు బండి చేసిందేంటి?: వినోద్



తాను ఎంపీగా ఉన్నప్పుడు రూ.1000 కోట్లతో స్మార్ట్ సిటీ, జాతీయరోడ్లు, కొత్తపల్లి మనోహరాబాద్ రైల్వే లైన్, కేబుల్ బ్రిడ్జి, ఐటీ టవర్ తదితర ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు కేంద్రంతో పోరాడి తీసుకువచ్చామని మాజీ ఎంపీ వినోద్ అన్నారు. ఎంపీగా ఐదేళ్లలో బండి సంజయ్ ఏంచేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. జిల్లాకు ఒక నవోదయ ఉండాలని, మన రాష్ట్రంలో బండి సంజయ్ ఒక్క నవోదయ కూడా తేలేకపోయాడని విమర్శించారు. తాను లోక్‌సభలో మొత్తం 106 సార్లు రాష్ట్ర, కరీంనగర్ ప్రయోజనాలపై గళమెత్తానని, బండి సంజయ్ పార్లమెంటులో ఎన్నిసార్లు మాట్లాడారని ప్రశ్నించారు. మొన్న అసెంబ్లీలో ఓడిన వ్యక్తికి పార్లమెంటులో ఏం పని అని? ఇదేమైనా పునరావాస కేంద్రమా? అని నిలదీశారు. సీఎంగా కేసీఆర్ గెలిచి ఉంటే మేడిగడ్డలో దగ్గరుండి మరమ్మతులు చేయించేవారన్నారు.

కేసీఆర్ రాకతో నేల పులకరించింది: గంగుల



కేసీఆర్ కరీంనగర్‌లో అడుగుపెట్టగానే ఈ నేల పులకించిపోయిందని కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. 2001లో తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా టీఆర్ఎస్ పార్టీని స్థాపించినప్పుడు కేసీఆర్ కరీంనగర్ గడ్డ నుంచే సింహగర్జన చేశారని, ఆ తర్వాత విజయవంతంగా లక్ష్యాన్ని సాధించారని గంగుల గుర్తుచేశారు. ఉద్యమంలో ఆమరణ దీక్ష నుంచి రైతుబంధు, దళితబంధులాంటి పథకాలకు కరీంనగర్ నేలమీద నుంచే కేసీఆర్ శ్రీకారం చుట్టారన్నారు. ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికల కోసం ఈ కరీంనగర్ గడ్డ నుంచే కదనభేరి మోగించేందుకు కేసీఆర్ వచ్చారన్నారు. రానున్న ఎన్నికల్లో కరీంనగర్ ఎంపీగా వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.



కేసీఆర్‌కు గద బహూకరిస్తున్న వీర్ల వెంకటేశ్వర్లు



గంగుల నివాసంలో మాటామంతీ

సాక్షిప్రతినిధి,కరీంనగర్:

తాను సీఎంగా ఉన్నప్పుడు ఎకరమైనా ఎండలేదని, మూడునెలల కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతులు పంటలకు నిప్పు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందని మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. పార్లమెంటు ఎన్నికల కోసం కరీంనగర్ కదనభేరి పేరిట నగరంలోని ఎస్సారార్ కళాశాల మైదానంలో మంగళవారం నిర్వహించిన భారీబహిరంగ సభకు ముఖ్యఅతిథిగా హాజరై కాంగ్రెస్, బీజేపీపై నిప్పులు చెరిగారు. కరీంనగర్ చాలా చైతన్యమున్న గడ్డ అని.. అందుకే తాను పదవులను విసిరికొట్టి ఇదే నేలనుంచి ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం చేపట్టినట్లు గుర్తుచేశారు. కరీంనగర్ చైతన్యవంతమైన జిల్లా, పోరాటాల పురిటిగడ్డ అన్నారు. 2001, మే17న ఇదే ఎస్ఆర్ఆర్ కళాశాల వేదికగా 'సింహ గర్జన' పేరిట నిర్వహిస్తే కరీంనగర్ జనాలు తెలంగాణ జెండాను ఆకాశానికి ఎత్తుకున్నారని గుర్తుచేశారు.మాట ఇచ్చి తప్పడం కాంగ్రెస్‌కు అలవాటేనని, నాడు తమ పొత్తుతో గెలిచావని ఎగతాళి చేస్తే.. రాజీనామా చేసి రెండున్నర లక్షలఓట్ల మెజారిటీతో తాను కరీంనగర్ ఎంపీగా తిరిగి గెలిచానన్నారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులు లేకుండా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మిస్తే.. దానికి మరమ్మతులు చేయకుండా వదిలేయడమేంటని ప్రశ్నించారు. తాను సీఎంగా ఉన్నప్పుడు రాష్ట్రంలో ఎకరమైనా ఎండలేదని, ఇప్పుడు కరెంటు, నీళ్లు ఎలా మాయమయ్యాయని ప్రశ్నించారు. కాళేశ్వరం కట్టి ఎల్ఎండీ, ఎంఎండీలు నింపితే ఎండాకాలం చెరువులు మత్తళ్లు దూకాయన్నారు. 420 పథకాలు ప్రకటించి ప్రజల్ని మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. మూడు నెలలకే వాటిని నెరవేర్చలేక తనను తిట్టడం పనిగా పెట్టుకుందని ఆరోపించారు. ఉమ్మడి రాష్ట్రంలో సిరిసిల్ల చేనేత కార్మికుల ఆత్మహత్యలు ఆపేందుకు తాను రూ.50 లక్షలు సేకరించి ఇచ్చానని, వారికి తిరిగి ఉపాధి కల్పించేందుకే బతుకమ్మ చీరలు, పిల్లలకు యూనిఫాంల ఆర్డర్స్ ఇచ్చామని వివరించారు. ప్రభుత్వ వ్యతిరేక పోస్టులు పెడుతున్న బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ఇబ్బందులు పెట్టడమేంటని, తాము అధికారంలో ఉన్నప్పుడు అలాచేసి ఉంటే కాంగ్రెస్ వాళ్లు మిగిలేవాళ్లు కాదన్నారు. కాంగ్రెస్, బీజేపీ నేతలు ఎవరూ మనస్ఫూర్తిగా జై తెలంగాణ అనలేరని, తెలంగాణ దళం, తెలంగాణ బలం బీఆర్ఎస్సేనని అన్నారు. కరీంనగర్ సహా అన్ని పార్లమెంటు స్థానాల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు.

బండి రూ.10 పనైనా చేసిండా?

కరీంనగర్ ఎంపీగా ఐదేళ్లు ఉన్న సమయంలో కరీంనగర్‌ను హైదరాబాద్‌తో కలిపే కొత్తపల్లి–మనోహరాబాద్ రైల్వేలైన్, కరీంనగర్‌కు స్మార్ట్‌సిటీ హోదా, జాతీయ రహదారులు, ఇతర ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు తెచ్చిన సమర్థుడు వినోద్ అని ప్రశంసించారు. ఐదేళ్ల కాలంలో బండి సంజయ్ రూ.పది పని అయినా చేసిండా? అని ప్రశ్నించారు. ఇప్పటికే మొన్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ మాటలు నమ్మి మోసపోయి గోస పడుతున్నారని, మరోసారి అలా అవొద్దని హెచ్చరించారు. ఇలాంటి సమయంలో ఢిల్లీలో, పార్లమెంటులో తెలంగాణ గొంతుక వినబడాలంటే.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచేలా బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవాలని కేసీఆర్ పిలుపునిచ్చారు.



సభలో రసమయి బాలకిషన్ ఆటాపాట

దరఖాస్తుకు గ్యారంటీ ఏది?

- ప్రజాపాలన ఆన్‌లైన్‌లో గందరగోళం
- దరఖాస్తులే కనిపించని వైనం
- ఉద్యోగులపై మండిపడుతున్న జనం

'నగరంలోని 14వ డివిజన్‌కు చెందిన పద్మ ఆరుగ్యారంటీ పథకాలకు సంబంధించి తమ వార్డులో ఏర్పాటు చేసిన కేంద్రంలో దరఖాస్తు చేసుకున్నారు. ఆ కేంద్రంలో ఉన్న ఇన్‌చార్జీలు ప్రజాపాలన దరఖాస్తు రశీదును (టీ2/14/7) కూడా ఇచ్చారు. కానీ 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కు సిలిండర్ పథకాలు తమకు రాకపోవడంతో, నగరపాలకసంస్థ సప్తగిరికాలనీలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సవరణ కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. అక్కడి ఉద్యోగులు పరిశీలించి, అసలు ఆమె దరఖాస్తే లేదని, ఆన్‌లైన్‌లో చూపడం లేదని సెలవిచ్చారు.'

'నగరంలోని 35వ డివిజన్‌లో కోట భాస్కర్‌రెడ్డి ఈ ఏడాది జనవరి 2వ తేదీన ప్రజాపాలన కేంద్రంలో ఆరుగ్యారంటీలకు సంబంధించి దరఖాస్తు అందచేశారు. తనకు పథకాలు అమలు కాకపోవడంతో మంగళవారం ప్రజాపాలన కేంద్రంలో తన దరఖాస్తును (కెఎస్ఏ/35/టీ5/61) సరిచూసుకునేందుకు వచ్చారు. కానీ సిస్టమ్‌లో చూసిన సదరు ఉద్యోగులు, అసలు దరఖాస్తే లేదని తేల్చిచెప్పారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తే లేదనడంతో అవాక్కవడం భాస్కర్‌రెడ్డి వంతైంది.'



నగరపాలకసంస్థ కార్యాలయంలో దరఖాస్తుదారుల రద్దీ

కరీంనగర్ కార్పొరేషన్: ఇవీ.. నగరంలో ప్రజాపాలన దరఖాస్తుల తీరుకు ప్రత్యక్ష తార్కాణాలు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరుగ్యారంటీ పథకాలకు నగరవ్యాప్తంగా ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.60 డివిజన్లలో మొత్తంగా 83,670 దరఖాస్తులు వచ్చాయి. ఈ దరఖాస్తులను నగరపాలక సంస్థ అధికారులు ఆన్‌లైన్‌చేశారు. ఆన్‌లైన్‌లో డాటా ఎంట్రీ ఆధారంగానే ఆయా దరఖాస్తుదారులు ఆరుగ్యారంటీ పథకాలకు సంబంధించి నేరుగా లబ్ధిదారులుగా ఎంపికవుతుండడం తెలిసిందే.

- కానీ చాలా మందికి పథకాలు అమలు కాకపోవడంతో, ప్రభుత్వం సవరించేందుకు నగరవ్యాప్తంగా ఎనిమిది కేంద్రాలు ఏర్పాటు చేసింది. లబ్ధిదారులుగా ఎంపికకాని దరఖాస్తుదారులు వేలాదిగా ఈ కేంద్రాలను సందర్శిస్తున్నారు.
- ఈ క్రమంలో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రహసనంగా సాగిన వైనం తేటతెల్లమవుతోంది. దరఖాస్తుల స్వీకరణ అనంతరం ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేసిన సందర్భంగా ఉద్యోగుల నిర్లక్ష్యం ప్రజలను సంక్షేమ పథకాలకు దూరం చేస్తోంది.
- ఇప్పటికే దరఖాస్తులో సమర్పించిన ఆధారాలను సరిగా నమోదు చేయకపోవడంతో ఇబ్బందులు ఎదురవగా, వాటిని ప్రస్తుతం సవరించే కార్యక్రమం చేపట్టారు. కానీ అసలు దరఖాస్తులే ఆన్‌లైన్‌లో కనిపించకపోవడంతో ఏం చేయాలో పాలుపోనిస్థితి ప్రజల్లో నెలకొంది.
- తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తే అధికారుల వద్ద కూడా సరైన సమాధానం లభించడం లేదని బాధితులు వాపోతున్నారు.
- నగరపాలకసంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కేంద్రం వద్ద మంగళవారం కూడా రద్దీ నెలకొంది. ఉదయం 8 గంటలకే దరఖాస్తు దారులు సెంటర్‌కు చేరుకున్నారు.
- 10.30 గంటల వరకు కూడా ఉద్యోగులు రాకపోవడంతో అప్పటికే లైన్‌లో ఉన్నవారు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా రద్దీ దృష్ట్యా మరో రెండు కౌంటర్లను వేర్వేరుగా ఏర్పాటు చేశారు.
- గ్యాస్‌కు సంబంధించి కేవీసీ చేసినప్పటికీ, మళ్లీ ఏవేవో కాగితాలు తీసుకురమ్మంటున్నారంటూ, ఓ దరఖాస్తుదారు తాను తెచ్చిన కాగితాలను చింపి ఆగ్రహం వ్యక్తం చేయడం కనిపించింది.
- విద్యుత్ బిల్లు తీసేందుకు ఇంటింటికీ తిరుగుతున్న సందర్భంలోనే అవసరమైన కాగితాలు చూస్తే సరిపోయేది కదా, తమను ఎందుకు ఇలా కార్యాలయాల వెంట తిప్పుతున్నారంటూ మరికొంతమంది మండిపడ్డారు.
- ప్రజాపాలన దరఖాస్తుల సవరణ ఉన్న సమస్యలను పరిష్కరించడం మాట అటుంచితే, మరిన్ని కొత్త సమస్యలను తీసుకువస్తోందంటూ అధికారులు తల పట్టుకుంటున్నారు.

అటెండర్ నుంచి ఆర్ఐ వరకు బదిలీ



తహసీల్లో అన్నీ వివాదాలే..

సోమవారం సాక్షిలో వచ్చిన కథనం

సాక్షి ఎఫెక్ట్..

వీణవంక: వీణవంక తహసీల్దార్ కార్యాలయం కొద్ది రోజులుగా వివాదాలకు నిలయంగా మారింది. తహసీల్దార్ తిరుమల్‌రావు, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ధరణి ఆపరేటర్ అరుణ్‌ను ఓ భూమి వివాదంతో పాటు, ఫ్యామిలీ సర్టిఫికెట్ విషయంలో కలెక్టర్ సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. తహసీల్దార్ కార్యాలయంలో కిందిస్థాయి ఉద్యోగి నుంచి పైస్థాయి అధికారి వరకు పైసలు ఇస్తేనే పనులు జరుగుతాయని.. ఇందులో ఓ ఉద్యోగి అధికారుల మధ్యచిచ్చు పెడుతున్నాడని సోమవారం 'తహసీల్లో అన్నీ వివాదాలే..'అనే శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన కలెక్టర్ పమేలా సత్పతి తహసీల్దార్ కార్యాలయాన్ని ప్రక్షాళన చేశారు. అటెండర్ నుంచి ఆర్ఐల వరకు అందరిని బదిలీ చేశారు. వీరిలో సీనియర్ అసిస్టెంట్ శ్రీనాథ్, ఆర్ఐ–1 నాగరాజు, ఆర్ఐ–2 ప్రత్యూష, జూనియర్ అసిస్టెంట్ సోమేశ్వర్, జూనియర్ అసిస్టెంట్లు భాను, దాసారపు రవి, కిశోర్, శ్రావణ్, రికార్డ్ అసిస్టెంట్లు హరీశ్, తిరుపతి, అటెండర్లు కోమల, నర్సయ్య ఉన్నారు. ఇందులో ఓ అధికారి పాత్రపై ఇంటెలిజెన్స్ అధికారులు ఆరా తీస్తున్నట్లుగా తెలిసింది.

ధరణిపై కలెక్టర్ నజర్

- నేటి నుంచి పెండింగ్ అర్జీలపై సమీక్ష
- భూ సమస్యలకు విముక్తి కలిగేనా?
- అక్రమార్కుల గుండెల్లో గుబులు

'చొప్పదండి మండలం రుక్మాపూర్ గ్రామానికి చెందిన గుడిపాక ఉరఫ్ బాసం మల్లయ్యకు గ్రామంలోని సర్వే నంబర్ 69లో 1.27 ఎకరాల భూమి ఉంది. దీనికి సంబంధించి పాస్‌బుక్ జారీ కావాల్సి ఉండగా తన కూతుళ్లు కోర్టులో కేసు వేయడంతో పెండింగ్‌లో పడింది. 2019లో లోక్‌అదాలత్ ద్వారా రాజీ జరిగింది. సదరు కాపీతో మీ సేవ రసీదు నంబరు 053657000013641తో దరఖాస్తు చేసినా పరిష్కారం శూన్యం. తహసీల్దార్‌ను కలిస్తే నిర్లక్ష్యంగా వ్యవహరించడం.. కాలయాపన చేయడంతో ఏళ్లుగా నిరీక్షణ తప్పడం లేదు. ఇది ఒక మల్లయ్యదే కాదు.. జిల్లాలో వేల మంది సమస్య..!

జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అర్జీలు	10,520
ఇందులో జీఎల్‌ఎం	1,866
మ్యుటేషన్	858
పీవోబీ	1,381
కోర్టు కేసులు	998
పీపీబీ కోర్టు కేసులు	223
జీపీఏ	04
నాలా విత్‌అవుట్ పీపీబీ	402
సక్సేషన్	916
పాస్‌బుక్ సమస్య	3,311
సెమీ అర్బన్ ల్యాండ్	110
ఖాతా మెర్జింగ్	292
ఓఆర్‌జీపీబీ	15
సర్వే నంబర్ డిలేషన్	8
ఎన్ఆర్ఐ	17
హౌస్‌సైట్స్	112
ఇతర	07

కరీంనగర్ అర్బన్: జిల్లాలో ధరణి పెండింగ్ సమస్యలపై కలెక్టర్ పమేలా సత్పతి ప్రత్యేక దృష్టి సారించారు. ప్రతీ అర్జీకి అధికారి జవాబుదారిగా ఉండేలా చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే తదనుగుణ ఆదేశాలు జారీ చేయగా బుధవారం నుంచి సమీక్షిస్తానని స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. కలెక్టర్ నేరుగా రంగంలోకి దిగుతుండగా పలువురి రెవెన్యూ అధికారుల్లో గుబులు మొదలైంది. చేయాల్సిన పనులను చేయకుండా పెండింగ్‌లో పెడుతున్నారని, కాసులిస్తేనే పరిష్కరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. కాగా పెండింగ్ అర్జీల పరిష్కారానికి తీసుకున్న చర్యలు, అన్ని అంశాలతో తహసీల్దార్లు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఇప్పటికే దిశానిర్దేశం చేశారు.

కలెక్టర్‌పై కర్షకుల గంపెడాశలు

ధరణిపై కలెక్టర్ స్వయంగా సమీక్షిస్తానని ప్రకటించడంతో కర్షకులు గంపెడాశలు పెట్టుకున్నారు. ఇప్పటికైనా తమ అర్జీలకు విముక్తి కలుగుతుందన్న ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పెండింగ్ దరఖాస్తులపై ప్రత్యేక బృందాల ద్వారా డ్రైవ్ జరుగుతుండగా ప్రయోజనం లేదని అన్నదాతలు చెబుతున్నారు. ఈ క్రమంలో కలెక్టర్ స్వయంగా ప్రతి రోజు 20 దరఖాస్తుల పరిష్కారంపై సమీక్షించాలని నిర్ణయించడం ఆహ్వానించదగ్గ పరిణామం.

అక్రమార్కుల గుండెల్లో గుబులు

ప్రభుత్వం ధరణి పెండింగ్ అర్జీలపై చేపట్టిన ప్రత్యేక డ్రైవ్ ఈ నెల 11తో పూర్తవగా 17వ తేదీ వరకు పొడిగించిన విషయం తెలిసిందే. జిల్లాలోని 16మండలాల్లోనూ పెండింగ్ అర్జీలుండగా పలువురు అధికారులు మామూళ్లకు తెరలేపారు. కావాలని ఫైళ్లను తొక్కిపెట్టడం, ప్రసన్నం చేసుకున్నవారి అర్జీలే కదిలించారు. తహసీల్దార్ స్థాయిలో పలు అంశాలకు సంబంధించి అధికారమిచ్చినా ఇంకా నిర్లక్ష్యమే. అందుకు సంబంధించిన లాగిన్ కేటాయించినప్పటికి ఇంకా ఓపెన్ కావడం లేదని కాలయాపన చేస్తున్నారు. ఈ క్రమంలో కలెక్టర్ స్వయంగా సమీక్షిస్తుండటంతో పలు ఆసక్తికర విషయాలు వెలుగుచూసే అవకాశముంది.

క్లుప్తంగా

వ్యక్తి ఆత్మహత్య

జ్యోతినగర్(రామగుండం): మద్యానికి బానిసై ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎన్టీపీసీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. న్యూపోరట్‌పల్లి మేరకాలనీకి చెందిన బుట్టి వేణు (33) కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొద్ది నెలలుగా మద్యానికి బానిసై సోమవారం అర్ధరాత్రి ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు గమనించి చూసే సరికే మృతి చెందాడు.మృతుడికి భార్య స్వర్ణతో పాటు ముగ్గురు పిల్లలున్నారు. మృతుడి తండ్రి భీమయ్య ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని ఎన్టీపీసీ పోలీసులు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పెద్దబొంకూర్‌లో మరో వ్యక్తి..

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం పెద్దబొంకూర్‌కు చెందిన ఎనగందుల సంజీవరాజు (46) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సంజీవరాజు మద్యానికి బానిసై అదే మత్తులో ఈ ఘాతుకానికి పాల్పడ్డాడని ఏఎస్సై రామస్వామి తెలిపారు. మృతుడి భార్య భూలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

టీచింగ్ పోస్టు ఖాళీ

చొప్పదండి: మండలంలోని రుక్మాపూర్ శివారు సైనిక్ శిక్షణ గురుకుల విద్యాలయంలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఎన్‌డీఏ సోషల్ స్టడీస్ బోధించుటకు అర్హులైన అభ్యర్థులు ఈ నెల 18న జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలని ప్రిన్సిపాల్ లచ్చయ్య కోరారు. ఎంఏ బీఈడీ, పదేళ్ల అనుభవం కలిగిన అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలతో ఇంటర్వ్యూకి హాజరు కావాలని, డెమో నిర్వహించి ఎంపిక చేస్తామని, ఎంపికైన అభ్యర్థికి నెలకి రూ.50 వేల పారితోషికం ఉంటుందన్నారు.

ఆరుగురు వ్యక్తుల బైండోవర్

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఆరుగురిని తహసీల్దార్ డి.పుష్పలత ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ మంగళవారం తెలిపారు. ఇసుక అక్రమ రవాణ చేస్తున్న మాన్వాడకు చెందిన కొమురయ్య, సంతోష్, ప్రసాద్, బోయినపల్లికి చెందిన ప్రభాకర్, తరచూ భూముల విషయంలో గొడవలు పడుతున్న బూర్గుపల్లికి చెందిన శ్రీనివాస్, మల్లేశంను బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు.

పోలీసుల విధులకు ఆటంకం

జమ్మికుంట: పోలీసు విధులకు ఆటంకం కలిగించిన ఐదుగురిపై కేసు నమోదు, అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు టౌన్ సీఐ వరగంటి రవి మంగళవారం తెలిపారు. మండలంలోని మానేరు పరివాహక ప్రాంతం విలాసాగర్ వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను సోమవారం పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్లను విలాసాగర్ గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులు ఎలాంటి అనుమతులు లేకుండా తీసుకువెళ్లారు. వారిని గుర్తించి కేసు నమోదు, అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ వివరించారు.

నృసింహుని బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు



ధర్మపురిలో ఏర్పాటు చేస్తున్న స్వాగత తోరణాలు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఈవో, సీఐ, ఎస్సై, మున్సిపల్ కమిషనర్

- ఈనెల 20 నుంచి వచ్చేనెల ఒకటో తేదీ వరకు..
- ధర్మపురిలో కొనసాగుతున్న పనులు

ధర్మపురి: ధర్మపురి నృసింహుడి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు. ఈనెల 20నుంచి ఏప్రిల్ ఒకటో తేదీ వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాలకు ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర రాష్ట్రాలతోపాటు నిజామాబాద్, నిర్మల్, ఆర్మూర్ జిల్లాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారు. వారికి సరిపడా కల్పించాల్సిన వసతులపై ఆలయ అధికారులు శాఖల వారీగా ప్రణాళిక రూపొందించుకున్నారు.

అధికారుల పక్కా ప్రణాళిక

బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారి ప్రధాన ఆలయంతోపాటు అనుబంధ ఆలయాలు, రాజగోపురాలు, బ్రహ్మపుష్కరిణి వద్ద, గోదావరిలో చలువ పందిళ్లు, స్త్రీలు బట్టలు మార్చుకునేందుకు తడకలతో డ్రెస్సింగ్ రూంలు, షెడ్లు, తాగునీటి వసతి కల్పిస్తున్నారు. ముఖ్యంగా వివిధ రాష్ట్రాలు, జిల్లాల నుంచి వచ్చే భక్తుల కోసం పోస్టర్లు, కరపత్రాలు, బ్యానర్లు, ఫ్లెక్సీలు ముద్రించి పంపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

- ఆలయాలు, రాజగోపురాలు, స్వాగత తోరణాలకు రంగురంగుల విద్యుద్దీపాలంకరణకు చర్యలు తీసుకుంటున్నారు.
- బ్రహ్మపుష్కరిణి (కోనేరు)లో పాతనీటిని తొలగించి కొత్త నీటిని నింపుతున్నారు.
- కోనేరులోని చెత్తాచెదారాన్ని తొలగిస్తున్నారు.
- భక్తులకు ఆలయం తరఫున, స్వచ్ఛంద సంస్థలు, దాతల సహకారంతో ఆలయంతోపాటు గోదావరి తీర ప్రాంతాల్లో చలివేంద్రాలు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయనున్నారు.
- అన్నదానం కోసం రైసుమిల్లర్లు, ఆర్యవైశ్యులు, వర్తక సంఘం, ఇతర దాతల సహకారం తీసుకుంటున్నారు.
- జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సుమారు 400 మంది పోలీస్ బందోబస్తుకు చర్యలు చేపడుతున్నారు.
- వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలాలను పరిశీలిస్తున్నారు.
- స్వామివారి కల్యాణానికి ఆలయంలో స్థలం ఇరుకుగా ఉన్నందున మరోచోట చేయించడానికి చర్యలు చేపడుతున్నారు.
- భక్తుల భద్రత నిమిత్తం ఆలయం, గోదావరి తీరప్రాంతం, బస్టాండ్ ఏరియా, ప్రధాన కూడళ్లలో దేవస్థానం, పోలీస్ సంయుక్త పర్యవేక్షణలో 60వరకు సీసీ కెమెరాల ఏర్పాటు చేస్తున్నారు.

సింగరేణిలో భారీగా అధికారుల బదిలీలు

గోదావరిఖని: సింగరేణి సంస్థలో 20 మంది మైనింగ్ అధికారులను బదిలీ చేస్తూ యాజమాన్యం ఆదేశాలు జారీ చేసింది. ఈమేరకు సీఆర్‌పీ/పీఈఆర్/సీ/26/775పేరున మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

అధికారి పేరు	హోదా	ప్రస్తుతం బదిలీ
హబీబ్‌హుస్సేన్	జీఎం(క్వాలిటీ)	ఓఎస్‌డీ, భూపాల్‌పల్లి
డి.రాంచందర్	జీఎం,మణుగూరు	సీఎండీ,హైదరాబాద్
కేహెచ్ఎన్‌గుప్తా	జీఎం,బెల్లంపల్లి	సేఫ్టీ,రామగుండం
డి.లలిత్‌కుమార్	జీఎం, కొత్తగూడెం	జీఎం,మణుగూరు
కె.రఘుకుమార్	ఏజీఎం,రామగుండం	సేఫ్టీ,బెల్లంపల్లి రీజియన్
బండి వెంకటయ్య	ఏజీఎం,భూపాల్‌పల్లి	ఎస్టేట్, కార్పొరేట్
వి.కృష్ణయ్య	ఏజీఎం, మణుగూరు	హెచ్ఆర్‌డీ,జీఎం
శీలం కవీంద్ర	డీవైజీఎం,భూపాల్‌పల్లి	ఎస్‌వోటూజీఎం,భూపాల్‌పల్లి
ఎస్.వెంకటాచారి	డీవైజీఎంపీవో,జీవీఆర్	ఎస్టేట్, కార్పొరేట్
ఎస్‌వీఆర్‌ప్రహల్లాద్	డీవైజీఎం పీఓ, కోయగూడెం	పీవో,జీవీఆర్,ఓసీపీ
వి.శ్రీనివాస్‌రావు	డీవైజీఎం,ప్రాజెక్టుఅండ్‌ప్లానింగ్	పీవో,కోయగూడెం
ఎస్.వెంకటేశ్వర్‌రావు	డీవైజీఎం ఏవో, కేటీకే-8	ఎస్ఓటూజీఎం,ఆర్జీ-2
వి.భిక్షమయ్య	డీవైజీఎం,కేటీకే-2,ఓసీపీ	ఏవో,కేటీకే-8
బి.కృష్ణప్రసాద్	ఎస్‌వోఎం,ఎన్విరాన్,భూపాల్‌పల్లి	మేనేజర్,కేటీకే-2
ఎస్.భూశంకరయ్య	ఎస్‌వోఎం,కేటీకే-5	కాసిపేట్-1
షేక్ అల్లావుద్దీన్	కా.మేనేజర్ కాసిపేట్-1	కేకే-5
బి.మల్లేశం	అ.మేనేజర్,జీడీకే-11	జీవీఆర్,ఓసీ-2
జి.దుర్గాప్రసాద్‌రావు	అ.మేనేజర్,జీవీఆర్ఓసీ-2	ఆర్అండ్‌డీ,కార్పొరేట్
ప్రసాద్	అ.మేనేజర్,ప్రాజెక్టుఅండ్‌ప్లానింగ్	జీడీకే-11
టి.పోషమల్లు	అ.మేనేజర్,కార్పొరేట్	ఎన్విరాన్, భూపాల్‌పల్లి

'వన్ స్టేషన్–వన్ ప్రొడక్ట్' స్టాల్ ప్రారంభం

- వర్చువల్ విధానంలో ప్రారంభించిన ప్రధాని మోదీ



స్టాళ్లను ప్రారంభిస్తున్న ప్రధాని మోదీ

పెద్దపల్లిరూరల్/రామగుండం: అమృత్ భారత్ రైల్వేస్టేషన్లలో ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలందించడంలో భాగంగా మంగళవారం ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ పద్ధతిలో పలు ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా పెద్దపల్లి, రామగుండం రైల్వే స్టేషన్‌లలో ఏర్పాటు చేసిన వన్‌స్టేషన్ వన్ ప్రాడక్ట్ స్టాళ్లను, రాఘవాపూర్‌లో ఏర్పాటు చేసిన షెడ్, సుల్తానాబాద్‌లో పీఎంగతిశక్తి కార్గో టెర్మినల్‌ను ప్రారంభించారు.రైల్వే వ్యవస్థను అన్ని విధాల అభివృద్ధి చేయడం ద్వారా సామాజిక, ఆర్థికాభ్యున్నతి సాధించామని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. పెద్దపల్లి జంక్షన్ రైల్వేస్టేషన్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్‌తో పాటు బీజేపీ నాయకులు కొంతం శ్రీనివాసరెడ్డి, వెల్లంపల్లి శ్రీనివాసరావు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సురేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. రామగుండంలో కార్పొరేటర్ సతీశ్‌కుమార్, జెడ్పీటీసీ సంధ్యారాణి, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ సంతోష్, అధికారులు, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'దానాపూర్' సేవలు



జమ్మికుంట రైల్వే స్టేషన్

- అందుబాటులోకి మెరుగైన ప్రయాణ సౌకర్యం
- హర్షం వ్యక్తం చేస్తున్న వ్యాపారులు, ప్రయాణికులు

జమ్మికుంట(హుజూరాబాద్): ప్రముఖ వ్యాపార కేంద్రం జమ్మికుంట పట్టణంలోని రైల్వే స్టేషన్ సాంకేతికత పరిజ్ఞానంతో రూపుదిద్దుకుంది. ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్‌తో ఇక్కడి నుంచి రోజూ కాగజ్‌నగర్, నాగపూర్, రామగుండం, హైదరాబాద్‌కు రాకపోకలు సాగించే వ్యాపారులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, విద్యార్థులు, ప్రయాణికులకు మెరుగైన ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి రానుంది. ముఖ్యంగా కాగజ్‌నగర్ నుంచి హైదరాబాద్ వెళ్లే ప్రయాణికులకు గతంలో ఉదయం సమయాల్లో భాగ్యనగర్ రైలు రోజులో ఒక్కటి మాత్రమే ఉండేది. సుమారు 14గంటల తర్వాత అదే రైలులో ప్రయాణం చేయాల్సి వచ్చేది. కాగా, దానాపూర్ ఎక్స్‌ప్రెస్‌కు జమ్మికుంటలో హాల్టింగ్ కల్పించడంతో ప్రయాణికులకు మరింత సౌకర్యవంతంగా ఉండనుంది.

సికింద్రాబాద్ టు దానాపూర్..

బుధవారం నుంచి జమ్మికుంట రైల్వే స్టేషన్‌లో దానాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు హాల్టింగ్‌తో సేవలు ప్రారంభంకానున్నాయి. దేశవ్యాప్తంగా పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల రాకపోకలను ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. సికింద్రాబాద్ టూ బిహార్ రాష్ట్రంలోని దానాపూర్ రైల్వేస్టేషన్ వరకు దానాపూర్ ఎక్స్‌ప్రెస్ నడవనుండగా, జమ్మికుంటలో రోజూ ఉదయం 11.39 గంటలకు హాల్టింగ్ ఉంటుంది. తిరిగి దానాపూర్ రైల్వే స్టేషన్ టూ సికింద్రాబాద్ వెళ్లే క్రమంలో జమ్మికుంట స్టేషన్‌లో రోజూ సాయంత్రం 5.24 గంటలకు హాల్టింగ్ ఉండనున్నట్లు రైల్వే అధికారులు పేర్కొన్నారు.

రూ.21 కోట్లతో అభివృద్ధి పనులు

కేంద్ర ప్రభుత్వ నిధులతో జమ్మికుంట స్టేషన్‌లో ఆధునిక వసతులు కల్పించారు. రూ.10 కోట్లతో మూడో లైన్, రూ.11 కోట్లతో సిగ్నల్ టెక్నాలజీ, అత్యాధునిక స్టేషన్ మేనేజర్ రూమ్, టెలీ కమ్యూనికేషన్ సిస్టం, సీసీ కెమెరాలు, డిజిటల్ డిస్‌ప్లే, కోచ్ డిస్‌ప్లే బోర్డు, రైల్వే స్టేషన్ ప్రాంగణంలో తారు రోడ్డు, గార్డెనింగ్, ప్లాట్ ఫామ్స్, బారికేడ్లు తదితర సౌకర్యాలు కల్పించారు. అలాగే బల్లార్ష నుంచి కాజీపేట వరకు మూడోలైన్ పనులు పూర్తయ్యాయి. దీంతో తక్కువ సమయంలో ఎక్కువ రైళ్ల రాకపోకలు సాగించే వీలుంటుంది.

వినియోగించుకోవాలి



జమ్మికుంట రైల్వేస్టేషన్‌లో దానాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు సేవలు ఈ నెల 13 నుంచి ప్రారంభంకానున్నాయి. ఈ సౌకర్యాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలి.

– పి.చంద్రమౌళి, రైల్వే స్టేషన్ మేనేజర్, జమ్మికుంట

ఎంపీ సంజయ్ కృషితో..



జమ్మికుంట స్టేషన్‌లో దానాపూర్ ఎక్స్‌ప్రెస్ హాల్టింగ్ ఉండేలా చూడాలని స్థానిక వ్యాపారులు ఎంపీ బండి సంజయ్‌కుమార్‌కు విన్నవించారు. దీంతో కేంద్ర మంత్రితో ఎంపీ మాట్లాడి హాల్టింగ్ కోసం కృషి చేశారు. ఎంపీకి ప్రత్యేక కృతజ్ఞతలు.

– జీడి మల్లేశ్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు, జమ్మికుంట

రైల్వే అభివృద్ధికి కేంద్రం ప్రాధాన్యం

- వీసీలో ప్రధాని మోదీ
- కరీంనగర్ స్టేషన్‌లో వన్ స్టేషన్–వన్ ప్రొడక్ట్ స్టాల్ ప్రారంభం



స్టాల్‌ను వర్చువల్‌గా ప్రారంభిస్తున్న పీఎం మోదీ

కరీంనగర్‌రూరల్: దేశంలో రైల్వే అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యతం ఇస్తోందని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అన్నారు. మంగళవారం గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దేశవ్యాప్తంగా రూ.85 కోట్ల విలువైన రైల్వే ఆధునీకరణ పనులతోపాటు కరీంనగర్ రైల్వేస్టేషన్‌లో వన్ స్టేషన్–వన్ ప్రొడక్ట్ స్టాల్‌ను ప్రారంభించారు. కార్యక్రమానికి హాజరైన కార్పొరేటర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా రైల్వేస్టేషన్లను కేంద్రం ఆధునీకరిస్తోందన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం బుల్లెట్, వందే భారత్ రైళ్లను తీసుకొచ్చిన ఘనత ప్రధాని మోదీకే దక్కుతుందని తెలిపారు. వన్ స్టేషన్–వన్ ప్రొడక్ట్ స్టాల్స్ ద్వారా స్థానిక ఉత్పత్తులను విక్రయించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. స్టేషన్ మేనేజర్ రవీందర్, ఏడీ సమీర్‌కుమార్, వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్ విష్ణు, కమర్షియల్ సూపర్‌వైజర్ సమ్మయ్య, టీసీ తిరుపతి, రైల్వే హమాలీ సంఘం ప్రతినిధులు కాశెట్టి లక్ష్మణ్, తోట తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి కోసం రోడ్డెక్కిన రైతులు



రాష్ట్ర రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు

చొప్పదండి: కరీంనగర్ జిల్లాలో సాగునీటి కోసం రైతులు రోడ్డెక్కారు. ఎస్సారెస్పీ ద్వారా డీ87 ఉప కాలువకు సాగునీరు అందించాలని కోరుతూ కరీంనగర్ రూరల్ మండలం చామనపల్లి గ్రామ రైతులు మంగళవారం చొప్పదండిలోని ప్రధాన రహదారిపై ధర్నాకు దిగారు. చామనపల్లిలో సుమారు 400 ఎకరాలకు సాగునీరు అందక ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని, డీ87 ఉప కాలువకు నీరు అందించడం ద్వారా పంటలను కాపాడాలని అధికారులను కోరారు. పోలీసులు రైతులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు. అనంతరం రైతులు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు.


డెంగీతో యువకుడు మృతి



నందన్ (ఫైల్)

శంకరపట్నం(మానకొండూర్): కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం కేశవపట్నం గ్రామానికి చెందిన గాజుల నందన్(24) డెంగీ బారినపడి చికిత్స పొందుతూ మంగళవారం చనిపోయాడు. గ్రామానికి చెందిన గాజుల శ్రీనివాస్- రమ దంపతులకు కూతురు, కొడుకు నందన్ ఉన్నారు. నందన్ ప్రస్తుతం హైదరాబాద్‌లో ఫొటోషూట్‌లో శిక్షణ పొందుతున్నాడు. 18రోజుల క్రితం డెంగీ బారిన పడ్డాడు. దీంతో కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మంగళవారం వేకువజామున మృతి చెందాడు. ఆయన అవయవాలను కుటుంబసభ్యులు దానం చేశారు.

15న పొన్నం అభినందన సభ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీసీ ప్రతినిధులు

కరీంనగర్ కార్పొరేషన్: ఈ నెల 15వ తేదీన జరిగే మంత్రి పొన్నం ప్రభాకర్ ఆత్మీయ అభినందనసభను విజయవంతం చేయాలని బీసీ కుల సంఘాల ఐక్యవేదిక గౌరవ అధ్యక్షుడు టి.సంతోష్ కుమార్, కన్వీనర్ వైద్యుల అంజన్ కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని ఆర్అండ్‌బీ అతిథిగృహంలో అభినందన సభ సన్నాహక సమావేశం నిర్వహించారు. సభకు సంబంధించి వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ముందుగా నిర్ణయించిన ప్రకారం ఈ నెల 7వ తేదీన సభ ఉండగా, వివిధ కార్యక్రమాల కారణంగా వాయిదా పడిందన్నారు. తిరిగి ఈ నెల 15వ తేదీన పొన్నం అభినందన సభ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పద్మనగర్‌లోని ఇందిరాభవన్‌లో జరిగే సభకు రాజకీయాలకతీతంగా బీసీ కులస్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. బీసీ కుల సంఘాల ప్రతినిధులు పురుమల్ల శ్రీనివాస్, మోసం అంజయ్య, మడుపు మోహన్, మెతుకు సత్యం, కేశిపెద్ది శ్రీధర్ రాజు, వి.గణేశ్‌బాబు, లక్కాకుల సురేందర్‌రావు, మీస బీరయ్య, ఉప్పుల అంజనీప్రసాద్, గడ్డం శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సేవాగుణం గొప్పది

కరీంనగర్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సేవాగుణం గొప్పదని డీఈవో జనార్దన్‌రావు అన్నారు. మంగళవారం స్థానిక అంధుల పాఠశాలలో సరస్వతి పూజకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సవరన్ పాఠశాల పదోతరగతి విద్యార్థులు తాము పొదుపుచేసుకున్న రూ.7వేలతో కొనుగోలు చేసిన వంటపాత్రలతో పాటుగా బ్రెయిలీలిపి రాయడానికి ఉపయోగించే డ్రాయింగ్ పేపర్లను డీఈవో సమక్షంలో అంధుల పాఠశాల ప్రిన్సిపాల్ నర్మదకు అందించారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించారు. ఉపాధ్యాయులు నంద్యాల భాస్కర్, ఉల్లోజు రమేశ్, అట్ల శ్రీనివాస్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, లక్ష్మణ్ రఘురాంరావు, పురుషోత్తం, రాంప్రసాద్, రమేశ్ పాల్గొన్నారు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్: డీఎస్సీలో భాగంగా ఎస్జీటీ ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కరీంనగర్, జగిత్యాల,పెద్దపల్లి జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ అభ్యర్థులు ఈనెల 14 నుంచి 22 వరకు www.tsbcstudycircle.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.5లక్షల లోపు ఉండాలని పేర్కొన్నారు. రిజర్వేషన్, ఇంటర్,డైట్, టెట్‌లో సాధించిన మార్కుల ఆధారంగా అభ్యర్థుల ఎంపిక ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు ఫోన్ నంబర్ 0878–2268686లో సంప్రదించాలని వివరించారు.

ఎన్‌హెచ్‌ఎం పోస్టులకు రూ.3 లక్షలు?

- వైద్యారోగ్య శాఖ ఉద్యోగుల బేరసారాలు!
- అభ్యర్థుల్లో ఆందోళన
- పైరవీలకు తావులేదంటున్న అధికారులు
- జిల్లాలో 45 పోస్టులకు 1,780 దరఖాస్తులు

బ్రోకర్లను నమ్మి మోసపోవద్దు

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగాల భర్తీ పూర్తి పారదర్శకంగా జరుగుతుంది. కలెక్టర్ ఆదేశాల మేరకు కమిటీ ఏర్పాటు చేసి, దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిశీలించిన తర్వాత మెరిట్ ప్రకారం ఉద్యోగాలు ఇస్తాం. ఇందులో ఎలాంటి పైరవీలకు తావులేదు. బ్రోకర్లను నమ్మి మోస పోవద్దు.

– డాక్టర్ సుజాత, డీఎంహెచ్‌వో

కరీంనగర్‌టౌన్: జిల్లాలో నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కింద వైద్యారోగ్య శాఖలో ఉన్న ఖాళీల ను భర్తీ చేసేందుకు ఇటీవల నోటిఫికేషన్ జారీ చేశారు. 8 విభాగాల్లో 45 పోస్టులకు ఏకంగా 1,780 దరఖాస్తులు వచ్చాయి. 4 వైద్యాధికారి పోస్టులకు 13, 21 స్టాఫ్‌నర్సు పోస్టులకు 821, 13 ఎంఎల్‌హెచ్‌పీ పోస్టులకు 216, ఒక ప్రోగ్రాం అధికారి పోస్టుకు 51, ఒక ఏఎన్‌ఎం పోస్టుకు 216, 3 ఫార్మసిస్టు పోస్టులకు 298, ఒక డీఈవో పోస్టుకు 154, ఒక ఆప్టోమెట్రిక్ పోస్టుకు 11 మంది అర్జీ పెట్టుకున్నారు.

మెరిట్ అభ్యర్థుల లిస్టు తీసుకొని..

ఎన్‌హెచ్‌ఎం కింద జరిగే నియామకాలను ఎలాంటి రాత పరీక్ష లేకుండా మెరిట్ ఆధారంగా చేపడుతున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. దరఖాస్తుల గడువు ఈ నెల 2తో ముగిసిన వెంటనే వైద్యారోగ్య శాఖలో పనిచేసే కొంతమంది ఉద్యోగులు చేతివాటం ప్రదర్శనకు తెరలేపినట్లు తెలిసింది. దరఖాస్తు చేసుకున్నవారిలో మెరిట్ అభ్యర్థుల లిస్టు తీసుకొని, మధ్యవర్తుల సహకారంతో వారిని మభ్యపెట్టే పనిలో పడినట్లు సమాచారం. ఎన్‌హెచ్‌ఎం కింద కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేస్తున్న ఈ పోస్టులు భవిష్యత్తులో రెగ్యులరైజ్ అయ్యే అవకాశం ఉందని ఆశ చూపుతూ.. రూ.2 లక్షల నుంచి రూ. 3 లక్షల వరకు ఖర్చవుతుందని బేరసారాలకు దిగుతున్నట్లు తెలిసింది. దీంతో ఇప్పటివరకు మెరిట్ ప్రకారమే పోస్టుల భర్తీ జరుగుతుందని భావించిన అభ్యర్థుల్లో ఆందోళన మొదలైంది.

ఎవరిని కలవాలంటూ ఆరా..

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగాలకు పైరవీలు కొనసాగుతున్నాయన్న ప్రచారంతో చాలామంది వైద్యారోగ్య శాఖలో పని చేస్తున్న తమ సన్నిహితులు, బంధువులు, ఇతర తెలిసిన వారితో పైరవీల గురించి మాట్లాడే పనిలో పడ్డారు. ఎవరిని కలిస్తే పని అవుతుంది.. ఎవరి ద్వారా కలవాలంటూ ఆరా తీస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. అయితే ఈ పోస్టులన్నీ కలెక్టర్ నేతృత్వంలో పారదర్శకంగా భర్తీ చేస్తామని అధికారులు చెబుతున్నారు. డబ్బులున్నవారు పైరవీకారుల కోసం ప్రయత్నిస్తుండగా పేద, మధ్యతరగతి అభ్యర్థులు మాత్రం ఆవేదన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి, పోస్టుల భర్తీలో అవకతవకలకు చోటు లేకుండా చూడాలని కోరుతున్నారు.

కష్టాల కడలి.. కన్నీటి మజిలీ

- చిన్ననాడు తండ్రి.. నేడు భర్త మృతి
- దిక్కుతోచని స్థితిలో మహిళ
- దాతల సాయం కోసం వేడుకోలు



దాతలు ఆదుకోవాలని వేడుకుంటున్న తల్లీకూతురు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): చిన్నతనంలోనే తండ్రి చనిపోతే.. కష్టాలను ఈదుకొని పెద్దయ్యింది. పెళ్లి అయి ఆనందంగా ఉందామనుకునే వయసులో భర్త మృతితో మళ్లీ కష్టాలు చుట్టుముట్టాయని ఆ మహిళ రోదిస్తుంది. ఒక కూతురు, తను ఒంటరివారయ్యామని.. కుటుంబ పెద్దదిక్కు మృతిచెందడంతో రోడ్డున పడ్డామని ఆవేదన చెందుతుంది. ఆర్థికంగా చితికిపోయిన తమ కుటుంబాన్ని దాతలు ఆదుకోవాలని వేడుకుంటుంది. వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన రేణిగుంట రామస్వామి–స్వరూప దంపతులకు ఇద్దరు కూతుళ్లు నీలిమ, శ్వేత. ఇరువై ఏళ్ల క్రితం రామస్వామి అనారోగ్యంతో మృతిచెందగా కూతుళ్లను ఆ తల్లి పెంచి పోషించింది. పెద్ద కూతురు నీలిమ వివాహానికి డబ్బులు లేకపోవడంతో వారి కులసంఘం(మేర) ప్రతినిధులు చందాలు వేసి బండలింగంపల్లికి చెందిన వెన్ను దేవేందర్‌తో పెళ్లి జరిపించారు. చిన్న కూతురు శ్వేతను దేవేందర్ సోదరుడు శ్రీనివాస్ 11 ఏళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. హైదరాబాదులో ఓ ప్రైవేట్ కంపెనీలో మార్కెటింగ్ చేస్తూ బతుకుతున్న శ్రీనివాస్‌కు ఓ కూతురు రేష్మ(10) జన్మించింది. ఏడేళ్ల క్రితం శ్వేత తల్లి స్వరూప అనారోగ్యంతో మృతి చెందింది. కొన్ని రోజులుగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న శ్రీనివాస్ ఐదు రోజుల క్రితం హైదరాబాద్‌లో అద్దె ఇంటిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని స్వగ్రామం బండలింగంపల్లికి తీసుకురాగా గ్రామస్తులు చందాలతో అంత్యక్రియలు నిర్వహించారు. అప్పటి వరకు కష్టమంటే తెలియకుండా పోషించిన భర్త దూరమవడంతో భవిష్యత్‌ను తలుచుకొని భార్య శ్వేత దీనంగా రోధిస్తుంది. బాధిత కుటుంబానికి దాతలు సాయం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు. సాయం చేయాలనుకున్నవారు ఫోన్ పే నంబర్ 9581900554లో పంపాలని కోరారు.

IndusInd Bank - CFD
COMMERCIAL VEHICLES FOR SALE
1) M & M 575 YUVO 2017 MODEL TS19 T 3828
2) SWARAJ 834 2014 MODEL TS02 UA 4578
3) JD 5310 TREM 2020 MODEL TS23 T 5550
4) EICHER 380 DI 2017 MODEL TS02 EW 8526
5) SONALIKA 42 RX 2022 MODEL JWRDJ1215942S3
6) SWARAJ 735 FE 2022 MODEL MBNAK49AHNTH27005
7) SOLIS 4215 2023 MODEL MXRDK1274879S3
8) SWARAJ 744 FE 2020 MODEL TS25 DTR 4685
9) SWARAJ 735 XT 2019 MODEL TS19 TA 5745
10) SWARAJ 735 XT 2021 MODEL MBNAP49ACMTA14712
11) EICHER 380DI 2017 MODEL TS27 T 0653
12) M & M 605 NOVO 2017 MODEL TS25 A 1737
13) M & M 475 XP 2022 MODEL TS19 TA6652
14) M & M 415 YUVO 2023 MODEL MBNPFAVTEPZM00539
15) MF 5245 PD 2015 MODEL TS15 EE 9307
16) M & M 475 YUVO 2019 MODEL TS26 F 2344
17) M & M 475 YUVO 2022 MODEL MBNPFAJVFNNG00102
18) M & M 475 YUVO 2022 MODEL MBNPFAJVFNNG00081
19) M & M 415 XP 2022 MODEL TS20 T 8555
Cell : 99084 41353
H. No : 2-10-145, 2nd Floor, Upstaires of Bank Of Baroda, Jyothinagar, KARIMNAGAR.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
■ Single Sitting : 10th, Inter, BA, B.Com, B.Sc, BED, BPED, UGDPED, BBA, MBA, DMLT, BMLT, BNYS, BAMS, BHMS, B.Tech, NURSING ITI, Pharmacy, LLB, Phd : 81435 83986. [L-806434]

REAL ESTATE
LAND FOR SALE
■ 4ఎకరాల పొలం అమ్మకానికి కలదు. ఈ పొలంలో బావి వుంది, మోటర్ అండర్ గ్రౌండ్ పైపులైన్ వుంది, పొలం వరకు కారు వెళ్ళే దారి వుంది. సంప్ర॥ ప్రదీప్, సెల్: 9640001100, గ్రా॥ జయ్యారం, మం॥ పాలకుర్తి, జి॥ పెద్దపల్లి. [K-1187112]

WANTED
■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్స్ కలవు. మీ పేరు, అడ్రస్ కాల్ / వాట్సప్ చేయగలరు. 90596 63584, 95026 15217. [M-1233879]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573633520,89197 39694. [M-1167545]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933, 9951602824

గులాబీ శ్రేణుల్లో 'కదనభేరి' జోష్




సభకు హాజరైన బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలకు అభివాదం చేస్తున్న మాజీ సీఎం కేసీఆర్, వేదికపై కళాకారులతో మాజీ ఎమ్మెల్యే రసమయి ఆటాపాట

కరీంనగర్: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ మంగళవారం కరీంనగర్‌లోని ఎస్సారార్ కళాశాల మైదానంలో నిర్వహించిన కరీంనగర్ కదనభేరి బహిరంగ సభ సక్సెస్ అయింది. దీంతో గులాబీ శ్రేణుల్లో జోష్ నెలకొంది. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని 7 నియోజకవర్గాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మానకొండూరు మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, ప్రముఖ గాయకులు ఏపూరి సోమన్న, మద్దెల సందీప్, తేలు విజయ తదితర బృందాలు ఆలపించిన తెలంగాణ ఉద్యమ గేయాలు, పదేళ్ల కేసీఆర్ పాలన ప్రగతి, 3 నెలల్లో కాంగ్రెస్ వైఫల్యాలు, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు నిధుల కేటాయింపుల్లో చూపుతున్న వివక్షపై పాడిన పాటలు ఆకట్టుకున్నాయి. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు అధ్యక్షతన జరిగిన సభలో మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ప్రారంభ ఉపన్యాసం చేయగా, మాజీ ఎంపీ, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ ప్రసంగించారు. పార్టీ సీనియర్ నేతలు మాజీ ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతారావు, మాజీ డిప్యూటీ సీఎం మహమూద్ అలీ, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, డాక్టర్ సంజయ్‌కుమార్, పాడి కౌశిక్‌రెడ్డి, డాక్టర్ సంజయ్, మాజీ మంత్రి, పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, వొడితెల సతీశ్‌బాబు, విద్యాసాగర్ రావు, మాజీ ఎమ్మెల్సీలు నారదాసు లక్ష్మణ్‌రావు, భానుప్రసాద్‌రావు, కర్నె ప్రభాకర్, మేయర్ వై.సునీల్‌రావు, జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధు, మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్, చల్ల హరిశంకర్, ఏనుగు రవీందర్‌రెడ్డి, పొన్నం అనిల్, సిద్ధం వేణు, జక్కుల నాగరాజు, ఎడ్ల అశోక్ హాజరయ్యారు.

సైడ్‌లైట్స్.. ఛలోక్తులు..

- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సాయంత్రం 5.40 గంటలకు హెలికాప్టర్‌లో శాతవాహన యూనివర్సిటీ వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు వెళ్తుంటే ప్రజలు ఆసక్తిగా తిలకించారు.
- హెలిప్యాడ్ వద్ద ఎమ్మెల్యే గంగుల కమలాకర్, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మేయర్ వై.సునీల్ రావు, పార్టీ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్‌లు కేసీఆర్‌కు స్వాగతం పలికారు.
- అక్కడి నుంచి మాజీ మంత్రి గంగుల కమలాకర్ నివాసానికి చేరుకొని, కాసేపు విశ్రాంతి తీసుకున్నారు. మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కడియం శ్రీహరి, చల్మెడ లక్ష్మీనర్సింహారావులతో మాట్లాడారు.
- సాయంత్రం 6.37 గంటలకు సభావేదిక వద్దకు చేరుకున్నారు. విక్టరీ సింబల్ చూపిస్తూ అభివా దం చేస్తుంటే జనం నినాదాలతో హోరెత్తించారు.
- మాజీ సీఎం కేసీఆర్ సరిగ్గా 7.05 గంటలకు ప్రసంగం మొదలుపెట్టి, 7.38 గంటలకు ముగించారు.
- పోలీసులారా.. మీకెందుకు రాజకీయాలు? బీఆర్ఎస్ శ్రేణులపై అక్రమ కేసులు వద్దన్నప్పుడు జనం నుంచి పెద్ద ఎత్తున కేరింతలు వినిపించాయి.
- హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని టైగర్ అని సంబోధించడంతో ప్రజలు హర్షధ్వానాలు చేశారు.
- మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఎంపీగా వినోద్‌కుమార్‌ను గెలిపించేందుకు మళ్లీ గొంగడి భుజాన వేస్తానని అనడంతో సభలో నవ్వులు విరిసాయి.
- బీఆర్ఎస్ సీనియర్ నేత వీర్ల వెంకటేశ్వర్‌రావు కేసీఆర్‌కు గద బహూకరించారు.
- బీఆర్ఎస్ సభలో యువత, విద్యార్థులు ఎక్కువగా పాల్గొన్నారు.

మహిళలకు నిర్ణయాధికారం ఇవ్వాలి



మాట్లాడుతున్న హేమలత

విద్యానగర్: మహిళల ప్రగతి వేగవంతం కావాలంటే వారికి నిర్ణయాధికారం ఇవ్వాలని కరీంనగర్ బార్ అసోసియేషన్ మహిళా ప్రతినిధి హేమలత అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో వనిత మైత్రి పబ్లిక్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అభివృద్ధిలో మహిళలను భాగస్వామ్యం చేయడం ద్వారా వారు సాధికారత సాధిస్తారన్నారు. సఖి సెంటర్ ఇన్‌చార్జి లక్ష్మి మాట్లాడుతూ.. మహిళల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. వారు విద్యావంతులైతేనే అన్ని రంగాల్లో రాణిస్తారని పేర్కొన్నారు. మహిళా సాధికారత కేంద్రం జిల్లా కో–ఆర్డినేటర్ శ్రీలత, ఆశ ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ ప్రతినిధి సురేశ్, స్వాతి మహిళా సంఘ ప్రోగ్రాం ఆఫీసర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ తరలివెళ్లిన బీజేపీ శ్రేణులు



కరీంనగర్‌టౌన్: హైదరాబాద్‌లో మంగళవారం బీజేపీ సోషల్ మీడియా వలంటీర్లు, పోలింగ్ బూత్, ఆపై స్థాయి నాయకులతో నిర్వహించిన విజయ సంకల్ప సమ్మేళనానికి కరీంనగర్ నుంచి ఆ పార్టీ శ్రేణులు తరలివెళ్లాయి. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా హాజరై, దిశానిర్దేశం చేశారు. రాబోయే లోక్‌సభ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని, ఈసారి కచ్చితంగా 400 ఎంపీ సీట్లు గెలిచేందుకు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. బీజేపీ మీడియా బాధ్యులు కటకం లోకేశ్, బొంతల కల్యాణ్ చంద్ర, సోషల్ మీడియా ప్రతినిధులు ఉప్పరపల్లి శ్రీనివాస్, వినోద్, ప్రఫుల్, అరవింద్, నవీన్, భరత్, గాయత్రి, చైతన్య, వెంకట్ సాయి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలి



అవగాహన కల్పిస్తున్న వైద్యులు

కరీంనగర్‌సిటీ: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో మంగళవారం హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో రెనె హాస్పిటల్ వారు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఆస్పత్రి చైర్మన్, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ బంగారు స్వామి, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రవీంద్రాచారి హాజరయ్యారు. పల్మనాలజిస్ట్ డాక్టర్ నర్రా యుగంధర్ సీపీఆర్ ఎవరికి, ఏ పరిస్థితుల్లో ఎలా చేయాలో విద్యార్థినులకు వివరించారు. ప్రస్తుత సమాజంలో చిన్న వయసు వారికి కూడా హృద్రోగ సమస్యలు వస్తున్నాయని, ప్రతిఒక్కరూ సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి మాట్లాడుతూ.. అనుకోకుండా గుండెపోటుకు గురైనప్పుడు సీపీఆర్ చేస్తే బాధితుల ప్రాణాలు కాపాడే అవకాశం ఉంటుందని తెలిపారు. హెల్త్ క్లబ్ కో–ఆర్డినేటర్ జ్యోతిర్మయి, సభ్యులు సంగీతారాణి, శ్రీధర్‌రావు, డాక్టర్ చంద్రశేఖర్‌లను ఆమెతోపాటు రెనె హాస్పిటల్‌వారు అభినందించారు. కార్యక్రమంలో ఆస్పత్రి జనరల్ మేనేజర్ అరవిందరావు, కో–ఆర్డినేటర్ శ్రీనివాస్, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వేధింపుల వల్లే కేరళ విద్యార్థి ఆత్మహత్య



ఎస్ఎఫ్ఐ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

కరీంనగర్‌సిటీ: పూకోడే కేరళ వెటర్నరీ అండ్ యానిమల్ హస్బెండరీ యూనివర్సిటీ విద్యార్థి జేఎస్.సిద్ధార్థ్ ఆత్మహత్యకు కారణమైన ఎస్ఎఫ్ఐ గూండాలను కఠినంగా శిక్షించాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం శాతవాహన యూనివర్సిటీ ఎదుట ఎస్ఎఫ్ఐ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మల్యాల రాకేశ్ మాట్లాడుతూ.. సిద్ధార్థ్ ప్రేమికుల రోజున(ఫిబ్రవరి 14) సీనియర్లతో కలిసి డాన్స్ చేసినందుకు చిత్రహింసలు పెట్టారని ఆరోపించారు. అలాగే, మూడు రోజులపాటు మూకుమ్మడి విచారణ, క్రూరమైన దాడి, వేధింపుల వల్లే అతను కళాశాల హాస్టల్ టాయిలెట్‌లో ఉరేసుకున్నాడని తెలిపారు. ప్రధాన నిందితులు ఎస్ఎఫ్ఐ ఆఫీస్ బేరర్లు అని, అక్కడి రాష్ట్ర ప్రభుత్వం వారి విషయంలో మెతక వైఖరి అవలంబిస్తోందని మండిపడ్డారు. నిందితులపై, బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పరిషత్ జిల్లా కన్వీనర్ పూసాల విష్ణు, నగర కార్యదర్శి నందు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మధు, జిల్లా హాస్టల్ ఇన్‌చార్జి శ్రీవర్ధిన, ఎస్ఎఫ్ఎస్ ఇన్‌చార్జి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

కరీంనగర్‌రూరల్: మొగ్దుంపూర్‌లో బుధవారం చల్మెడ ఆనందరావు ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆసీం అలీ తెలిపారు. వివిధ విభాగాలకు చెందిన వైద్యులు పురుషులు, మహిళలకు వేర్వేరుగా వైద్య పరీక్షలు చేసి, మందులను ఇస్తారన్నారు. గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బోర్డులో హోదా మార్చరా?



మంత్రి కమలాకర్ పేరుతో ఉన్న బోర్డు

కరీంనగర్‌రూరల్: ప్రభుత్వం మారి, 3 నెలలవుతున్నా బోర్డులో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ హోదాను మంత్రిగానే కొనసాగించడంపై పలువురు ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, ఆయన హోదాను ఎమ్మెల్యేగా రాయాలని డిమాండ్ చేస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆయన వెనకబడిన తరగతులు, పౌరసరఫరాల శాఖల మంత్రిగా పని చేశారు. దీంతో కరీంనగర్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీటీసీ సభ్యుల జాబితాతో ఏర్పాటు చేసిన బోర్డులో శాశ్వత ఆహ్వానితునిగా మంత్రి గంగుల కమలాకర్ అని రాశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. కమలాకర్ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.

రహదారి వెంట.. మురికి నీటి తంటా



కరీంనగర్‌రూరల్: రాజీవ్ రహదారికి ఇరువైపులా పలుచోట్ల మురికి నీటితో దుర్వాసన వస్తోంది. ప్రధానంగా బొమ్మకల్‌లోని భారత్ గ్యాస్ గోదాం ఎదుట వినియోగదారులు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. సమీపంలోని దాబా, బేకరీ నుంచి వస్తున్న మురికి నీరు గోదాం ముందునుంచి ప్రవహిస్తోంది. పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలని వినియోగదారులు కోరుతున్నారు.

16న హుండీల లెక్కింపు

కరీంనగర్ కల్చరల్: నగరంలో దేవాదాయ శాఖ పరిధిలోని ఆలయాల హుండీలను ఈ నెల 16న లెక్కించనున్నట్లు ఈవో శ్రీనివాస్ తెలిపారు. కట్టరాంపూర్ అభయాంజనేయ స్వామి ఆలయ హుండీలను శనివారం ఉదయం 9 గంటలకు, ప్రశాంత్‌నగర్ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయ హుండీలను మధ్యాహ్నం 12.30 గంటలకు లెక్కించేందుకు సహాయ కమిషనర్ ద్వారా అనుమతి పొందినట్లు పేర్కొన్నారు. ఆయా ఆలయాల బాధ్యులు, సిబ్బంది, ఔత్సాహిక భక్తులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

అంతర్ విశ్వవిద్యాలయాల క్రికెట్ పోటీలకు ఎంపిక



అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రామకృష్ణ

కరీంనగర్ స్పోర్ట్స్: హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ ఆధ్వర్యంలో త్వరలో జరగనున్న అంతర్ విశ్వవిద్యాలయాల క్రికెట్ పోటీలకు స్థానిక ఎస్సారార్ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు పీడీ నాగేశ్వర్‌రావు తెలిపారు. ఇటీవల జరిగిన శాతవాహన యూనివర్సిటీ స్థాయి పోటీల్లో సాయినాథ్, అజయ్, సాయికుమార్, హుస్సేన్, అల్సీ రాణించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, సెక్రటరీ శ్రీనివాస్, ప్రమోద్ తదితరులు మంగళవారం అభినందించారు.

క్లుప్తంగా

నేడు జిల్లా సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్: నగరంలోని అంబేడ్కర్ స్టేడియంలో బుధవారం జిల్లా సాఫ్ట్‌బాల్ సబ్ జూనియర్ బాలబాలికల జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా నిర్వహణ కార్యదర్శి అంతడ్పుల శ్రీనివాస్ తెలిపారు. సత్తా చాటిన క్రీడాకారులను ఈ నెల 14 నుంచి 16 వరకు ఆదిలాబాద్‌లో, 17 నుంచి 19 వరకు మెదక్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ధ్రువపత్రాలతో మధ్యాహ్నం 3 గంటలకు అంబేడ్కర్ స్టేడియంలో రిపోర్టు చేయాలని, పూర్తి వివరాలకు 97005 17852 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

జైలులో రంజాన్ సామగ్రి అందజేత



సామగ్రి ఇస్తున్న ఎంఐఎం నాయకులు

విద్యానగర్: జిల్లా జైలులోని ముస్లిం ఖైదీల కోసం రంజాన్ ఉపవాస దీక్షకు సంబంధించిన సామగ్రిని ఎంఐఎం పార్టీ శాఖ నగర నాయకులు మంగళవారం అందజేశారు. ఇఫ్తార్‌కు కావాల్సిన పండ్లు, డ్రైఫ్రూట్స్, నమాజ్ కోసం జానిమాజులు, టోపీలు, తస్బీహ్ తదితరాలను జైలు పర్యవేక్షకుడు సమ్మయ్య, జైలర్ రమేశ్‌లకు అందించినట్లు మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ తెలిపారు. కార్యక్రమంలో ఎంఐఎం నగర ప్రధాన కార్యదర్శి సయ్యద్ బర్కత్ అలీ, జాయింట్ సెక్రటరీ ఆతిన, ఇబ్రహీం, కార్పొరేటర్ శర్ఫుద్దీన్, నాయకులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షకు 381 మంది గైర్హాజరు

కరీంనగర్: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షకు మంగళవారం 381 మంది గైర్హాజరైనట్లు డీఐఈవో జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. జనరల్, ఒకేషనల్ విభాగాలను కలుపుకొని జిల్లా వ్యాప్తంగా 15,465 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 15,084 మంది రాసినట్లు పేర్కొన్నారు.

రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటుకు ఆమోదంపై హర్షం

కరీంనగర్: రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలుపడంపై ఓసీ సామాజిక సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పొలాడి రామారావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రెడ్డి సామాజిక వర్గాల్లోని పేదల సంక్షేమం కోసం ప్రత్యేక కార్పొరేషన్ కావాలని సమాఖ్య తరపున పోరాటాలు చేశామన్నారు. వాటి ఫలితంగా రెడ్డి కార్పొరేషన్‌కు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపిందని పేర్కొన్నారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్‌పై..

కరీంనగర్ టౌన్: ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలుపడంపై ఆర్యవైశ్య మహాసభ ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి, సెన్సార్ బోర్డు మాజీ సభ్యుడు కటకం వెంకటరమణ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంగళవారం సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్, ఇతర మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని నగునూరు సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో గణితం బోధించేందుకు గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సమత తెలిపారు. పీజీ చదివి, బోధన అనుభవం, నెట్ లేదా సెట్ అర్హత కలిగిన మహిళా అభ్యర్థులు కలెక్టరేట్‌లోని వారధి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 15న ఉదయం 9 గంటలకు కళాశాలలో రాత పరీక్ష, డెమో, ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ప్లాస్టిక్ వాడకం తగ్గించాలి



కరీంనగర్‌సిటీ: వాగేశ్వరి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల కరీంనగర్ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ శీతాకాల శిబిరం రెండో రోజు మంగళవారం మహాత్మానగర్‌లో స్వచ్ఛ భారత్ నిర్వహించారు. వలంటీర్లు రోడ్లకు ఇరువైపులా చెత్తను తొలగించారు. మానవాళికి ముప్పుగా మారుతున్న ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి పురమళ్ల శ్రీనివాస్ మాట్లాడారు. వలంటీర్లు కష్టపడి చదువుతూ భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సమద్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రమణాచారి, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ స్వప్న, అధ్యాపకులు శ్రవణ్, నిహారిక తదితరులు పాల్గొన్నారు.

'పది'లో విజయం.. పలు సూత్రాలతో సాధ్యం

- ముఖ్యమైన పాఠ్యాంశాలను బాగా ప్రాక్టీస్ చేయాలి
- ప్రశ్నపత్రాలను క్షుణ్ణంగా చదవాలి
- తప్పుల్లేకుండా జవాబులు రాయాలి
- ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలంటున్న నిపుణులు

సప్తగిరికాలనీ: ఈ నెల 18 నుంచి వార్షిక పరీక్షలు రాసేందుకు పదోతరగతి విద్యార్థులు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో ఆత్మవిశ్వాసంతో ముందుకుసాగితే అత్యుత్తమ ఫలితాలు సాధిస్తారని ఆయా సబ్జెక్టుల నిపుణులు చెబుతున్నారు. మంచి జీపీఏ సాధించేందుకు పలు సూత్రాలు పాటించాలని సూచిస్తున్నారు. అవి వారి మాటల్లోనే..

తెలుగు పద్యాలపై పట్టు సాధించాలి



విద్యార్థులు అవగాహన, ప్రతిస్పందన, స్వీయ రచన, పదజాలం, వ్యాకరణంపై పట్టు సాధించాలి. అక్షరాలు గుండ్రంగా, దోషాలు లేకుండా రాయాలి. ప్రతీ పాఠంలో చుక్క పెట్టిన పద్యాలు, ప్రతిపదార్థాలను బాగా జ్ఞాపకం చేయాలి. పాఠ్యాంశాల సారాంశం, కవి, రచయిత పరిచయాలను క్షుణ్ణంగా చదవాలి. లేఖ, వ్యాసం, సంభాషణ, వచన కవిత తదితర అంశాలపై దృష్టి పెట్టాలి. వ్యాకరణాంశాలకు సంబంధించి ప్రతీ పాఠం వెనకున్న అభ్యాసాలను ప్రాక్టీస్ చేయాలి.

– గాజుల రవీందర్, తెలుగు పాఠ్యపుస్తక రచయిత

గణితంలో సూత్రాలకు బాక్స్ గీయాలి



గణితం సబ్జెక్టుకు సంబంధించి సెక్షన్–1లో ఒకటో చాప్టర్ నుంచి 13వ చాప్టర్ వరకు 6 ప్రశ్నలు ఇస్తారు. వీటిని సాధించాలంటే చిన్న బిట్స్‌పై ఫోకస్ పెట్టాలి. సాంఖ్యక శాస్త్రం నుంచి 10–12 మార్కులు వచ్చే అవకాశాలున్నాయి. సూత్రాలను ఒక బాక్స్‌లో రాయాలి. బహుపదుల నుంచి వర్గ సమీకరణాన్ని గ్రాఫ్ ద్వారా సాధించే 6 మార్కుల ప్రశ్నలపై దృష్టిపెట్టాలి. త్రికోణమితి అనువర్తనాల నుంచి 6 మార్కుల ప్రశ్నలను ప్రాక్టీస్ చేయాలి.

– సయ్యద్ సయీదొద్దీన్, గణిత సబ్జెక్టు నిపుణుడు

హిందీలో సంపూర్ణ వాక్యాలు రాయాలి



హిందీలో పరిచిత, అపరిచిత గద్యం, పరిచిత పద్య భాగాల నుంచి అంశాలను ఇచ్చి, ప్రతీదానికి 5 ప్రశ్నలు ఇస్తారు. అన్నింటికీ వీలైనంత వరకు వరుస క్రమంలో సమాధానాలు రాయడం ఉత్తమం. సంపూర్ణ వాక్యాలు రాయాలి. లఘు సమాధానం ప్రశ్నలు 4 ఉంటాయి. వీటిలో 2 పద్య, 2 గద్య భాగంలో నుంచి ఉంటాయి. ఒక ప్రశ్న కవి లేదా రచయిత పరిచయం ఉంటుంది. నాలుగింటికీ జవాబులు రాయాలి. వ్యాసరూప సమాధానాలు 2, 3 పేరాల్లో విభజించి రాస్తే బాగుంటుంది.

– ఎండీ.ఉమర్ అలీ, హిందీ పాఠ్యపుస్తక రచయిత

ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రశ్నలు మార్చి ఇస్తారు



భౌతిక, రసాయన శాస్త్రాల ప్రశ్నపత్రం 40 మార్కులకు ఉంటుంది. పుస్తకంలోని ప్రశ్నలు యథాతథంగా రావు. వాటిని మార్చి ఇస్తారు. భావనను వివిధ విద్యా ప్రమాణాల మీద అన్వయించుకోవాలి. సమాచార సేకరణకు సంబంధించి అనుబంధ ప్రశ్నలకు జవాబులు రాసేలా ప్రాక్టీస్ చేయాలి. ప్రయోగాల విధానం, జాగ్రత్తలు, పరిశీలన, ఫలితాలపై దృష్టిసారించాలి. వ్యాసరూప ప్రశ్నలకు అవసరమైన చోట పటాలు గీయాలి.

– చాడ జైపాల్ రెడ్డి, ఫిజిక్స్ సబ్జెక్టు నిపుణుడు

ఇంగ్లిష్‌లో స్పెల్లింగ్ తప్పులుండొద్దు



ఇంగ్లిష్ ప్రశ్నపత్రం క్షుణ్ణంగా చదవాలి. రీరైట్ కింద ఇచ్చే ప్రశ్నలకు జవాబులు రాసేందుకు వ్యాకరణ మౌలిక సూత్రాలు పాటించాలి. యాక్టివ్ వాయిస్, పాసివ్ వాయిస్, రిపోర్టెడ్ స్పీచ్, డిగ్రీస్ ఆఫ్ కంపారిజన్, క్వశ్చన్ ట్యాగ్స్, టెన్సెస్ ఫామ్‌పై వచ్చే ప్రశ్నలను ఎక్కువ ప్రాక్టీస్ చేయాలి. అన్‌సీన్ ప్యాసేజ్, పద్యాలపై వచ్చే ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చిన మ్యాటర్‌లోనే దొరుకుతాయి. పదాల స్పెల్లింగ్, విరామ చిహ్నాల్లో తప్పులుండొద్దు.

– చెరుకు ప్రద్యుమ్న కుమార్, ఇంగ్లిష్ పాఠ్యపుస్తక రచయిత

జీవశాస్త్రంలో శాస్త్రీయ పదాలనే వాడాలి



జీవశాస్త్రంలో అన్ని పాఠాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. శాస్త్రీయ పదాలను మాత్రమే వాడుతూ సమాధానాలు రాయాలి. ఉదాహరణలు, భేదాలు, కారణాలు, పోలికలు, ప్రయోగాలకు సంబంధించిన అంశాల్లో ఉద్దేశం, పరికరాలు, రసాయన పదార్థాలు, పరిశీలనలు, ఫలితాలకు సంబంధించిన ప్రశ్నలు ఇస్తారు. సమాచార పట్టికలపైనా అడిగే అవకాశం ఉంది. పటాలు గీయడం, భాగాలు గుర్తించడం, వాటి విధులపై దృష్టి పెట్టాలి.

– కేఎస్.అనంతాచార్య, బయోసైన్స్ రిసోర్స్‌పర్సన్

సాంఘిక శాస్త్రంలో ప్రముఖులపై..



సాంఘిక శాస్త్రంలో వ్యవసాయం, జల సంరక్షణ, అభివృద్ధి, లింగ వివక్ష, వలసలు, ఆహార భద్రత, పర్యావరణం తదితరాలపై దృష్టి పెట్టాలి. ప్రముఖ వ్యక్తులు గాంధీ, నెహ్రూ, అంబేడ్కర్ ఇతరులపై ప్రశ్నలు వస్తాయి. దేశ జనాభా, యుద్ధాలు, జరిగిన నష్టం, రాజ్యాంగ సవరణలు తదితరాలను ప్రాక్టీస్ చేయాలి. ప్రపంచ, దేశ, రాష్ట్ర పటాలు, రాజధానులపై పట్టు సాధించాలి. తెలంగాణ రాష్ట్ర, భారతదేశ పటాలు గీయడం నేర్చుకోవాలి.

– ఆరెల్లి కుమారస్వామి, సోషల్ రిసోర్స్ పర్సన్

'ఎస్సారార్'లో వీడ్కోలు వేడుక



అధ్యాపకులతో ఎస్సారార్ కళాశాల విద్యార్థులు

కరీంనగర్‌సిటీ: జిల్లా కేంద్రంలోని ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ అటానమస్ కళాశాలలో బీకాం ఫైనల్ ఇయర్ విద్యార్థులకు ఫస్టియర్, సెకండియర్ విద్యార్థులు మంగళవారం వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, కామర్స్ హెచ్‌వోడీ రాజయ్య హాజరై, మాట్లాడారు. భవిష్యత్‌లో కష్టపడి, తల్లిదండ్రులు, కళాశాలకు పేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రమోద్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ మల్లారెడ్డి, లెక్చరర్లు ఎ.శ్రీనివాస్, వి.శ్రీనివాస్, ఉమామహేశ్వరి, ఆంజనేయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కరీంనగర్ జిల్లా:
9951602933, 9951602958, 9951602824
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
కరీంనగర్ : రాజశేఖర్ - 9618304759
చొప్పదండి : ముండయ్య - 7997958217
మానకొండూర్ : మహేశ్ - 9573106760
హుజూరాబాద్ : ప్రశాంత్ - 7331119941
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899

క్లుప్తంగా...

ఇకపై సెప్టెంబర్ 17న అధికారికంగా 'హైదరాబాద్ విమోచన దినోత్సవం'

- గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిన కేంద్ర హోం శాఖ

సాక్షి, న్యూఢిల్లీ: ఈ ఏడాది నుంచి ప్రతీ సంవత్సరం సెప్టెంబర్ 17వ తేదీన అధికారికంగా 'హైదరాబాద్ విమోచన దినోత్సవం'గా జరుపుకోవాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. హైదరాబాద్‌ను విముక్తి చేసిన అమరవీరులను స్మరించుకోవడంతో పాటు యువతలో దేశభక్తి జ్వాలలను నింపేందుకు ప్రతి సంవత్సరం 'హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని' తప్పనిసరిగా నిర్వహించాలని కేంద్ర హోం శాఖ స్పష్టం చేసింది. ఈ మేరకు మంగళవారం కేంద్ర హోం మంత్రిత్వ శాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. 1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 13 నెలల పాటు నిజాం పాలనలోనే ఉన్న హైదరాబాద్ ప్రాంతం.. 1948 సెప్టెంబర్ 17న 'ఆపరేషన్ పోలో'అనే పోలీసు చర్య ద్వారా నిజాం పాలన నుంచి విముక్తి పొందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సెప్టెంబరు 17వ తేదీని హైదరాబాద్ విమోచన దినోత్సవంగా నిర్వహించాలన్న ప్రజల డిమాండ్‌కు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్‌లో పేర్కొంది.

సిరిసిల్లలో ప్రణీత్‌రావు అరెస్ట్

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా డీసీఆర్‌బీ డీఎస్పీగా విధుల్లో చేరిన పక్షం రోజులకే సస్పెండ్ అయిన డీఎస్పీ ప్రణీత్‌కుమార్ అలియాస్ ప్రణీత్‌రావును హైదరాబాద్ పంజగుట్ట పోలీసులు మంగళవారం రాత్రి అరెస్ట్ చేశారు. సిరిసిల్లలోని శ్రీనగర్‌కాలనీలో ఓ ఇంటిని ప్రణీత్‌రావు అద్దెకు తీసుకోగా, ఆ ఇంటిని గుర్తించిన పోలీసులు రెండు రోజులుగా నిఘా ఉంచారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ప్రణీత్‌రావు సస్పెండ్ కాగా, నాన్ బెయిలెబుల్ కేసు నమోదైన విషయం తెలిసిందే. బెయిల్ కోసం ప్రయత్నిస్తున్న ఆయన ఆ ఇంటి నుంచి బయటకు రాగానే అదుపులోకి తీసుకొని పోలీసులు హైదరాబాద్‌కు తరలించారు.

సీఎం జగన్‌కు ప్రజలందరూ ఆశీస్సులివ్వాలి

- ఎమ్మెల్సీ, 'మండలి' చీఫ్‌విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు
- వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా ఆవిర్భావ దినోత్సవం



కార్యక్రమంలో మాట్లాడుతున్న జోగి రమేశ్. చిత్రంలో ఉమ్మారెడ్డి, ఆదిమూలపు సురేశ్

సాక్షి, అమరావతి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సృష్టించిన చరిత్రని చెరిపేయటం ఎవరి తరం కాదని ఎమ్మెల్సీ, శాసన మండలి చీఫ్‌విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. ప్రజల అవసరాలే తన ఎజెండా అని చెప్పిన ఏకైక నాయకుడు ఆయనేనని కొనియాడారు. ఇలాంటి నాయకుడికి ప్రజలందరి ఆశీస్సులు ఇవ్వాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ జెండా ఆవిష్కరించి భారీ కేక్‌ను కట్ చేశారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాల నివాళులర్పించారు. పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం జరిగిన సభలో ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. చంద్రబాబుకు అధికారం మీద మాత్రమే ప్రేమ అని.. ప్రజలు, వారి అవసరాల మీద ఏమాత్రం లేదన్నారు. ఈ ఐదేళ్లలో నేను మంచి చేశాననిపిస్తేనే ఓటెయ్యమని సీఎం జగన్ అంటున్నారని.. తన 45 ఏళ్ల రాజకీయ జీవితంలో ఏనాడూ ఇలాంటి నాయకుడ్ని చూడలేదని ఉమ్మారెడ్డి అన్నారు.

చనిపోయినా చిత్రవధ..

పచ్చమూక వేధింపులకు బలైపోయిన బీసీ మహిళ

- నీచమైన కామెంట్లతో మానసికంగా వేధింపు
- భర్తకు కూడా చెప్పుకోలేక రైలు కింద పడి ఆత్మహత్య
- ఇప్పటికీ మసిపూసి మారేడు కాయ చేస్తున్న టీడీపీ
- అఫీషియల్ హ్యాండిల్స్ నుంచే ట్రోలింగ్ అని గుర్తించిన పోలీసులు
- ఇప్పటికే 26 మందిని గుర్తించిన పోలీసులు
- స్పందించిన ముఖ్యమంత్రి.. రూ. 20 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటన
- బాధిత కుటుంబాన్ని పరామర్శించిన పలువురు నాయకులు
- డీజీపీని కలిసిన వాసిరెడ్డి పద్మ, సజ్జల భార్గవ
- ఘటనను తీవ్రంగా ఖండించిన మహిళా సంఘాలు



గుంటూరులో జరిగిన కొవ్వొత్తుల ప్రదర్శన

మధ్య తరగతి కుటుంబం.. ఎంతో విలువలతో కూడిన జీవితం. అత్తమామల మెప్పు పొందింది. పిల్లల అభిమానాన్ని... భర్త అనురాగాన్ని చూరగొంది. ప్రభుత్వం చేసిన సాయానికి పొంగిపోయింది. ఓ సాధారణ మహిళగా తన ఆనందాన్ని అందరితోనూ పంచుకుంది. అదే ఆమె పాలిట శాపమైంది. పచ్చ రాబందుల దుష్ట పన్నాగానికి బలైపోయింది. సోషల్ మీడియా వేదికగా చేసిన నీచాతినీచమైన వ్యాఖ్యలకు తల్లడిల్లిపోయింది. ఆమె ఆనందం ఎంతోసేపు నిలవనివ్వని సోషల్ మాఫియా వేధింపులకు మానసికంగా కలత చెందింది. నలుగురికి తన బాధను చెప్పుకోలేక రైలుకింద పడి ప్రాణం తీసుకుంది. ఇదీ గుంటూరు జిల్లా తెనాలికి చెందిన బీసీ(విశ్వబ్రాహ్మణ) మహిళ గోల్తి గీతాంజలిది. ఇప్పుడు ఆమె చావుపైనా ఆ 'పచ్చ'మూక తప్పుడు ప్రచారానికి పాల్పడుతోంది. ఆ సంఘటనకు తమకేమాత్రం బాధ్యతలేదని తప్పించుకోజూస్తోంది. కానీ పోలీసు యంత్రాంగం రంగంలోకి దిగి వాస్తవాలు వెలికితీస్తోంది. ఆ నీచుల భరతం పట్టేందుకు సమాయత్తమవుతోంది.

సాక్షి ప్రతినిధి, గుంటూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన పథకాలు తెనాలికి చెందిన గోల్తి గీతాంజలి కుటుంబానికి చాలావరకూ వర్తించాయి. ఇటీవలే తనకు ఇంటి స్థలం ఇచ్చారని.. తనకు ఎంతో సంతోషంగా ఉందని, అమ్మఒడి, పింఛన్, వైఎస్సార్ చేయూత వంటి మరెన్నో పథకాలు వచ్చాయని ఇంటి పట్టాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె సోషల్ మీడియాతో ఎంతో అమాయకంగా... మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తూ చెప్పింది. సహజంగానే పచ్చనేతలకు ఆమె చెప్పిన విషయాలు రుచించలేదు. ఆమెపై టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన సోషల్ మీడియా ప్రతినిధులు ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేయటం ప్రారంభించారు. ఆ ట్రోలింగ్‌లు చూసి తట్టుకోలేకపోయింది. ఆమె భర్తను దుర్భాషలాడుతూ, ఆమె వ్యక్తిత్వాన్ని కించపరిచేలా పెట్టిన పోస్టింగులు చూసి విలవిల్లాడిపోయింది. అవమానంతో కుంగిపోయింది. కనీసం ఇంట్లో వారితో కూడా తన బాధను పంచుకోలేక రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడింది. ఇది కచ్చితంగా ఆత్మహత్యకాదు... సోషల్ మీడియా చేసిన హత్యేనని కుటుంబ సభ్యులు స్పష్టం చేస్తున్నారు.

రెచ్చిపోతున్న పచ్చ సోషల్ మూక

సోషల్ మీడియాలో వచ్చే అసభ్యకరమైన పోస్టింగ్‌లపై కేవలం సెక్షన్ 41 నోటీసులు ఇచ్చి వదిలిపెట్టాలని హైకోర్టు ఇచ్చిన ఆదేశాల నేపథ్యంలో సోషల్ మీడియాలో ఐటీడీపీ, జనసేన సోషల్ మీడియా రెచ్చిపోతోంది. వారి దాష్టీకంవల్లే ఆ నిండుప్రాణం బలైపోయింది. ఈ దుర్ఘటన యావత్ రాష్ట్రాన్ని కదిలించింది. పచ్చబ్యాచ్ దుర్మార్గాలపై రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు, కొవ్వొత్తుల ప్రదర్శనలు జరిగాయి. ఆమె కుటుంబానికి పలువురు అండగా నిలిచారు. జరిగిన ఘటనపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. గీతాంజలి కుటుంబానికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. ఆడపిల్లల గౌరవ ప్రతిష్టలకు, మర్యాదలకు భంగం కలిగించే ఏ ఒక్కరినీ కూడా చట్టం వదిలిపెట్టబోమని ప్రకటించారు. వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనర్ సజ్జల భార్గవ, మహిళా కమిషన్ మాజీ చైర్మన్ వాసిరెడ్డి పద్మ మంగళవారం డీజీపీ రవీంద్రనాథ్‌రెడ్డిని కలిసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. గీతాంజలి కుటుంబ సభ్యులను రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఎంపీ నందిగం సురేష్, వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనర్ సజ్జల భార్గవ, ఎమ్మెల్సీ పోతుల సునీత, పార్టీ నేతలు వరుదు కళ్యాణి, వాసిరెడ్డి పద్మ, తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, మహిళా కమిషన్ సభ్యురాలు వెంకటలక్ష్మి తదితరులు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇది సోషల్‌మీడియా టెర్రరిజమని, దీనిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

విచారణ ముమ్మరం

గీతాంజలి ఆత్మహత్యకు పురిగొల్పినవారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. పోలీసులు విచారణ ముమ్మరం చేశారు. సోషల్‌మీడియాలో ఆమెపై అసభ్యంగా ట్రోలింగ్ చేసిన 26 మందిని గుర్తించారు. ప్రైవేటు వ్యక్తులే కాకుండా పార్టీల అఫీషియల్ హ్యాండిల్స్ నుంచి కూడా ఘోరంగా ట్రోల్స్ వచ్చినట్లు పోలీసులు గుర్తించారు. ఈ ఘటనపై కనీసం విచారం వ్యక్తం చేయని తెలుగుదేశం నేతలు... మరింత బరితెగించి ఆమె ఆత్మహత్యకు ప్రయత్నించింది ఏడో తేదీ కాగా, ట్రోలింగ్ ఎనిమిది నుంచి మొదలైందని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. వాస్తవానికి ఆమె వీడియో వైరల్ అయిన ఆరో తేదీనే అజయ్‌చౌదరి సజ్జా, స్వాతీరెడ్డి మరికొందరు నీచాతినీచంగా ట్రోల్ చేశారు. ఒక్కరోజులోనే వందల సంఖ్యలో ట్రోల్స్ వచ్చాయి. ఆమె చనిపోయిందని తెలిసిన వెంటనే ఆ పోస్టులన్నీ డిలీట్ చేశారు. అయితే అప్పటికే పోలీసులు ఈ పోస్టులను సేకరించారు.

> **బాధ్యులపై కఠినచర్యలు తప్పవు**
>
> గీతాంజలిని ట్రోల్ చేసి ఆమెను ఆత్మహత్యకు పురికొల్పిన వారిపై కఠిన చర్యలు తప్పవు. ఇప్పటికే బాధ్యులను గుర్తించాం. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత సోషల్ మీడియాలో ఓవర్‌యాక్షన్ చేసి కొంత మందిని ఇబ్బంది పెట్టిన వారిపై 6,970 సోషల్‌మీడియా బుల్లీయింగ్ షీట్‌లు నమోదు చేశాం. సుమారు 7వేల మందిని అరెస్ట్ చేశాం. సైబర్ క్రైమ్‌కు సంబంధించి 2023 సంవత్సరంలో ఆయా అకౌంట్‌దారులపై 327 కేసులు నమోదు చేశాం. హైకోర్టు జడ్జిని దూషించిన కేసులో 53 మందిపై కేసులు నమోదు చేశాం. దిశ చట్టంలో రాష్ట్ర ప్రభుత్వం స్పష్టంగా సైబర్, సోషల్ మీడియా అంశాలకు సంబంధించి ప్రత్యేక విభాగం ఏర్పాటు చేసింది. కాగ్నిజబుల్, నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేసేలా పొందుపరిచి బిల్లు చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపింది.
>
> – పాలరాజ్, ఐజీ, గుంటూరు రేంజ్

వ్యక్తిత్వ హననానికి బాబే ఆద్యుడు

- ఐటీడీపీ సోషల్ మీడియాకు ఎందరో స్త్రీలు బలి
- ఏపీ చలనచిత్ర అభివృద్ధి సంస్థ చైర్మన్ పోసాని కృష్ణమురళి



సాక్షి, అమరావతి : రాష్ట్రంలో బూతు పదజాలం, వ్యక్తిత్వ హననం వంటి వికృత చర్యలకు టీడీపీ అధినేత చంద్రబాబే ఆద్యుడని ఏపీ చలనచిత్ర అభివృద్ధి సంస్థ చైర్మన్ పోసాని కృష్ణమురళి మండిపడ్డారు. డబ్బు మదంతో బాబు ఐటీడీపీ సోషల్ మీడియాను నడిపిస్తూ ఎంతోమంది మహిళల వ్యక్తిత్వంపై దారుణంగా దాడిచేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ క్రమంలోనే టీడీపీ, జనసేన సోషల్ మీడియా ట్రోల్స్ కారణంగానే గీతాంజలి బలైపోయిందన్నారు. సాక్షి టీవీ చానెల్ చర్చాగోష్టిలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. గీతాంజలి వంటి సామాన్య మహిళనే కాకుండా ప్రధాని మోదీని సైతం గతంలో చంద్రబాబు తూలనాడారని గుర్తుచేశారు. పోసాని ఇంకా ఏమన్నారంటే.. 'చంద్రబాబు అవినీతిపరుడంటూ గతంలో మోదీ విమర్శించారు. పోలవరాన్ని ఏటీఎంలా వాడుకుంటున్నారని బహిరంగ సభలో ఆరోపించారు. అంతే.. వెంటనే చంద్రబాబు మోదీ కుటుంబంపై దాడికి దిగారు. మోదీ భార్యను వదిలేశారని, కొడుకులు లేరని ఇష్టమొచ్చినట్లు మాట్లాడారు. అవినీతికి.. మోదీ కుటుంబానికి ఏం సంబంధం? చంద్రబాబును ఎవరైనా విమర్శిస్తే వెంటనే వాళ్ల కుటుంబ సభ్యులపై వ్యక్తిగత హననం జరుగుతుంది. గీతాంజలి వంటి ఎందరో మహిళలు ఎల్లో సోషల్ మీడియాకు బలైపోయారు. మరెందరో జీవచ్ఛవాల్లా మారిపోయారు. ఎల్లో, సైకో అభిమానుల సోషల్ మీడియా మెసేజ్‌లకు మహిళలు భయపడాల్సిన అవసరంలేదు. ఆత్మస్థైర్యంతో ఎదురుదాడి చేస్తే వాళ్లకే కన్నీళ్లు వస్తాయి. వలంటీర్లు మానవ అక్రమ రవాణా చేస్తున్నారని చెప్పిన నీచులపై సమాజం తిరగబడాలి. బ్రాహ్మణి, భువనేశ్వరిలకు తమ భర్తలు చేస్తున్న నీచత్వాన్ని గురించి మహిళలే రోడ్లపైకి వచ్చి చెప్పాలి'' అని అన్నారు.

దుశ్శాసన పర్వంపై జనం కన్నెర్ర

గీతాంజలి మృతిపై ఏపీ వ్యాప్తంగా మిన్నంటిన ఆగ్రహ జ్వాలలు

సాక్షి, అమరావతి/రేపల్లె రూరల్/తెనాలి రూరల్/ సాక్షి నెట్ వర్క్: 'పురాణాల్లో దుశ్శాసనుడు కూడా ఇంతలా మానవ మృగాల్లా వ్యవహరించి ఉండకపోవచ్చు.. ఇప్పుడు ఆయనే ఉంటే టీడీపీ- జనసేన సైకో మూకల తీరు చూసి సిగ్గు పడేవాడు.. ట్రోలింగ్‌తో వెంటపడి, వేటాడి గీతాంజలి మృతికి కారణమైన ఈ సైకోలందరినీ కఠినంగా శిక్షించాల్సిందే' అంటూ రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం సర్వత్రా నిరసన వ్యక్తమైంది. ఆడబిడ్డ అన్యాయంగా చనిపోయిందనే కనికరం కూడా లేని ఆ పార్టీల అధినేతలు.. మహిళా సాధికారత గురించి మాట్లాడుతుండటం దయ్యాలు వేదాలు వల్లించినట్లుందని నిప్పులు చెరిగారు. సంక్షేమ పాలనకు ప్రజలు విశేషంగా ఆకర్షితులవుతుంటే తట్టుకోలేని ఈ మానవ మృగాల టార్గెట్‌తో ఒక నిండు ప్రాణం బలైపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇద్దరు చిన్నారులు తల్లి ప్రేమ కోల్పోయి దిక్కుతోచని వారయ్యారని, ఇందుకు బాధ్యత వహించాల్సింది చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లేనని స్పష్టం చేశారు.

ఈ వ్యవహారంపై జాతీయ మీడియా సైతం స్పందించింది. మితిమీరిన ట్రోలింగ్‌లకు ముకుతాడు వేయాలని వార్తలు ప్రసారం చేసింది. గీతాంజలి ఆత్మహత్య ఘటనపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటన తనను దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. మృతురాలి కుటుంబాన్ని ఆదుకోవడానికి అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. ఆమె కుటుంబానికి రూ.20 లక్షల పరిహారం ఇవ్వాలని ఆదేశించారు. ఆడపిల్లల గౌరవ ప్రతిష్టలకు, మర్యాదలకు భంగం కలిగించే ఏ ఒక్కరినీ కూడా చట్టం వదిలిపెట్టదని హెచ్చరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల కారణంగా తన కుటుంబానికి ఎంతో మేలు జరిగిందంటూ గీతాంజలి ఇచ్చిన వీడియో ఇంటర్వ్యూపై ప్రతిపక్షాలకు చెందిన సోషల్ మీడియా కార్యకర్తలు అనుచిత వ్యాఖ్యలు పోస్టు చేయడంతోనే ఆమె ఆత్మహత్యకు పాల్పడిందంటూ కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పలువురు నేతలు ఈ ఘటనపై తీవ్రంగా స్పందిస్తూ వేర్వేరు ప్రాంతాల్లో మీడియాతో మాట్లాడారు.

అప్పుడు బీజేపీ.. ఇప్పుడు జనసేన

చంద్రబాబు విష కౌగిలిలో మిత్రపక్షాలు గిలగిల

- 2014లో బీజేపీకి ఇచ్చిన సీట్లలో కోత పెట్టిన బాబు
- మూడు స్థానాల్లో తన అభ్యర్థులనే బీ ఫారం ఇచ్చి మరీ పోటీకి
- ఇప్పుడూ జనసేన సీట్లలో కోత
- మొదట 24 అసెంబ్లీ, 3 లోక్‌సభ స్థానాలు కేటాయింపు
- సోమవారం 3 అసెంబ్లీ స్థానాలు, ఒక లోక్‌సభ స్థానం కోత
- మిగిలింది 21 అసెంబ్లీ, రెండు లోక్‌సభ సీట్లు
- వాటిలో భీమవరానికి టీడీపీ అభ్యర్థి పులవర్తిని జనసేనలోకి పంపిన బాబు
- 2019లో భీమవరంలో పవన్‌పై టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిందీ ఆయనే
- జనసేనకు మిగిలినది 20 అసెంబ్లీ సీట్లే
- పోనుపోను ఇంకెన్ని తీసుకుంటారోనని జనసేన నేతల ఆందోళన



సాక్షి, అమరావతి: చంద్రబాబుతో పొత్తు అంటే విష కౌగిలిలో చిక్కుకున్నట్లే. చంద్రబాబుతో ఒకసారి పొత్తు పెట్టుకున్నాక ఆయన ఇచ్చే షాక్‌లతో మిత్రపక్షాలకు బుర్ర తిరగాల్సిందే. గతంలో ఈ దెబ్బ బీజేపీకి గట్టిగానే తగిలింది. ఇప్పుడు జనసేన వంతు. 2014 ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ పొత్తు పెట్టుకున్నాయి. లోపాయికారీ వ్యవహారంలో భాగంగా జనసేన ఎన్నికల నుంచి దూరంగా ఉంది. టీడీపీ – బీజేపీ కూటమికి మద్దతు తెలిపింది. అప్పట్లో టీడీపీ – బీజేపీ పొత్తు కుదిరిన రోజున బీజేపీకి 5 లోక్‌సభ, 15 అసెంబ్లీ స్థానాలు కేటాయిస్తున్నట్లు చంద్రబాబు చెప్పారు. ఆ తర్వాత వెంటనే ఒక అసెంబ్లీ, ఒక లోక్‌సభ స్థానం తగ్గించేశారు. బీజేపీ 14 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించాక వారు బలమైన అభ్యర్థులు కాదంటూ ఓ కారణం చూపించి, మరో అసెంబ్లీ స్థానంలో టీడీపీనే పోటీ చేస్తుందని అప్పటి బీజేపీ రాష్ట్ర నాయకులను బాబు ఒప్పించారు. ఆ తర్వాత బీజేపీకి మిగిలిన 13 స్థానాల్లో సంతనూతలపాడు, గుంతకల్లు, కడప అసెంబ్లీ నియోజకవర్గాల్లో చంద్రబాబు టీడీపీ నాయకులకు అధికారికంగా బీ ఫారాలు ఇచ్చారు. దీంతో ఆ మూడు చోట్లా రెండు పార్టీల అభ్యర్థులు పోటీ చేశారు. బీజేపీ జాతీయ నాయకత్వం జోక్యం చేసుకున్నా చంద్రబాబు వెనక్కి తగ్గలేదు. ఇలా చివరకు బీజేపీకి 10 అసెంబ్లీ స్థానాలనే మిగిల్చారు. రాష్ట్ర విభజనకు ముందు 2009 ఎన్నికల్లో టీఆర్ఎస్, ఉభయ కమ్యూనిస్టులతో పొత్తు పెట్టుకున్న చంద్రబాబు.. టీఆర్ఎస్‌కు ఇచ్చిన పలు స్థానాల్లో టీడీపీ అభ్యర్థులకు బీ ఫారాలు ఇచ్చి పోటీ చేయించారు. దీంతో ఓట్ల లెక్కింపునకు ముందే టీఆర్ఎస్ ఆ కూటమి నుంచి తప్పుకొంది.

జనసేనకు 20 అయినా మిగులుతాయా అని నేతల ఆందోళన..

ఈసారి పొత్తులో జనసేనకు ఇచ్చిందే 24 అసెంబ్లీ స్థానాలు. ఇంత తక్కువ సీట్లు ఇవ్వడాన్ని జనసేన అభిమానులు, నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారు. తాజాగా సోమవారం జరిగిన చర్చల్లో చంద్రబాబు జనసేనకు ఇచ్చే సీట్లలో 3 అసెంబ్లీ, 1 లోక్‌సభ స్థానానికి కోత పెట్టేశారు. జనసేనకు మిగిలింది 21 అసెంబ్లీ, రెండు లోక్‌సభ స్థానాలు. నామినేషన్ల సమయానికి ఇంకెన్ని కోత పడతాయో తెలియదు. ఇంతలోనే భీమవరం జనసేన అభ్యర్థిగా టీడీపీ నేత పులివర్తి రామాంజనేయులు రంగప్రవేశం చేశారు. ఆయనకు ఆయనే భీమవరం జనసేన అభ్యర్థిగా ప్రకటించుకున్నారు. అంటే ఒక స్థానంలో చంద్రబాబు అభ్యర్థి జనసేన టిక్కెట్టు దక్కించుకున్నట్టే. జనసేనకు మిగిలింది 20 అసెంబ్లీ స్థానాలే. మిగిలిన స్థానాల్లో జనసేన అభ్యర్థుల ప్రకటన పూర్తయినా, వాటిలో సైతం టీడీపీ అధికారికంగానో లేదంటే రెబల్ అభ్యర్థుల రూపంలోనో లేక తన అభ్యర్థులనే వ్యూహాత్మకంగా జనసేనలోకి పంపి పోటీ చేయించడమో చేస్తూనే ఉంటుందని, ఇక అసలైన జనసేన నేతలకు ఎన్ని మిగులుతాయో తెలీదని మధనపడుతున్నారు. మొదటి నుంచి జనసేనకు పనిచేస్తున్న వారిని కాదని, టీడీపీ పంపిన వారిని పోటీకి దింపితే పార్టీలో మరింత గందరగోళం ఏర్పడుతుందని అంటున్నారు.

> **జనసేనలోకి బాబు అభ్యర్థి!**
>
> పొత్తుల్లో భీమవరం అసెంబ్లీ స్థానం జనసేనకే వచ్చింది. కానీ, గత ఎన్నికల్లో అక్కడ పవన్‌కళ్యాణ్ పైనే తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన పులవర్తి రామాంజనేయులే ఇప్పుడూ అక్కడే పోటీ చేస్తున్నారు. ఇదెలా అంటారా..? సింపుల్.. 2014, 2019 రెండు ఎన్నికల్లోనూ టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి, నిన్నటి వరకు అదే పార్టీలో చురుగ్గా పనిచేసిన రామాంజనేయులు జనసేనలోకి జంప్ అయ్యారు. ఈసారి జనసేన అభ్యర్థిగా తెరమీదకు వస్తున్నారు. మంగళవారం జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సమక్షంలో ఆ పార్టీలో చేరారు. భీమవరానికి ఆయన్ని అభ్యర్థిగా అధికారికంగా ప్రకటించకపోయినా, తానే అక్కడి పోటీ చేయబోతున్నట్లు ప్రకటించుకున్నారు. 'చంద్రబాబుతో పొత్తు అంటే ఇలాగే ఉంటుంది. పవన్ కూడా ఆయన చెప్పినట్లే ఆడుతున్నారు' అంటూ జనసేన నేతలు తీవ్రంగా మధన పడుతున్నారు. చంద్రబాబు ఓ ప్రణాళిక ప్రకారం ఒక్కొక్క నేతను జనసేనలోకి పంపుతారని, ఇది ఆంజనేయులుతో మొదలైందని తెలిపారు. కానీ, ఏకంగా తమ అధినేత పవన్‌పై పోటీ చేసిన నేతనే జనసేనలో చేర్పించి అదే స్థానం నుంచి పోటీ చేయిస్తారని కలలో కూడా ఊహించలేదని అంటున్నారు.

హైదరాబాద్‌లో ప్రపంచ వరి సదస్సు

- జూన్ 4 నుంచి 6 వరకు నిర్వహణ: మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు
- 28 దేశాల నుంచి 500 మంది హాజరు



సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ కమోడిటీస్ సంస్థ, అంతర్జాతీయ వరి పరిశోధనాసంస్థ (ఫిలిప్పైన్స్) సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ప్రపంచ వరి సదస్సు నిర్వహిస్తున్నట్లు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వెల్లడించారు. ''వచ్చే జూన్ 4 నుంచి 6 వరకు హైదరాబాద్‌లో ఈ సదస్సు జరుగుతుంది. సదస్సుకు రాష్ట్ర ప్రభుత్వం భాగస్వామిగా ఉంటుంది. సదస్సులో 28 దేశాల నుంచి దాదాపు 500 మంది శాస్త్రవేత్తలు, వ్యాపార సంస్థల ప్రతినిధులు, ఎగుమతి దిగుమతిదారులు, విద్యావేత్తలు, వ్యవసాయ పారిశ్రామిక వేత్తలు, వరి అనుబంధ ఉత్పత్తుల రంగాలకు చెందిన పారిశ్రామిక వేత్తలు, స్టార్టప్ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారు'' అని ఆయన వివరించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణలో పండే వరికి, వరి ఉత్పత్తులను ప్రపంచ దేశాలకు పరిచయం చేయడం ద్వారా డిమాండ్ కల్పించడం, మార్కెటింగ్ సదుపాయాలు కల్పించడమే ఈ సదస్సు ముఖ్య ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. ఈ సదస్సులో ప్రపంచవ్యాప్తంగా పండిస్తున్న వరి రకాలను ప్రదర్శించడమే కాకుండా వాటి ప్రాధాన్యతలను వివరిస్తారని మంత్రి తెలిపారు. మన దేశం నుంచి బియ్యం ఎగుమతులు 1,77,86,092 టన్నులు కాగా, అందులో తెలంగాణ నుంచి కేవలం 22,498 మెట్రిక్ టన్నులేనని పేర్కొన్నారు. తెలంగాణ నుంచి దాదాపు 8000 క్వింటాళ్ల సర్టిఫైడ్ విత్తనాన్ని కూడా వివిధ దేశాలకు ఎగుమతి చేస్తున్నారని వివరించారు. ఈ మధ్యకాలంలో కేంద్ర ప్రభుత్వం సన్నబియ్యం రకాల ఎగుమతులపై విధించిన నిషేధం వల్ల సన్నబియ్యం పండించిన రైతులకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర రాక రైతులు కొనుగోలు సెంటర్లలో అమ్మాల్సిన పరిస్థితి ఏర్పడిందని మంత్రి తుమ్మల ఆందోళన వ్యక్తం చేశారు.

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్న పతంజలిశాస్త్రి

2023 ఏడాదికి వరించిన సాహిత్య పురస్కారం



ఢిల్లీలో పురస్కారం అందుకుంటున్న పతంజలిశాస్త్రి

సాక్షి, న్యూఢిల్లీ : ప్రముఖ తెలుగు కథా, నవలా రచయిత తల్లావఝుల పతంజలి శాస్త్రి మంగళవారం కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాన్ని అందుకున్నారు. ఢిల్లీలోని కామిని ఆడిటోరియంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పతంజలిశాస్త్రికి కేంద్ర సాహిత్య అకాడమీ అధ్యక్షుడు మాధవ్ కౌశిక్ సాహిత్య పురస్కారాన్ని అందజేశారు. పతంజలి శాస్త్రి రచించిన 'రామేశ్వరం కాకులు..మరికొన్ని కథలు'అనే లఘు కథల పుస్తకానికి 2023 ఏడాదికి గాను ఈ అత్యున్నత పురస్కారం దక్కిన విషయం తెలిసిందే. మొత్తం ఐదు భాషల్లో చిన్న కథలు అవార్డులు గెలుచుకోగా వాటిలో ఒకటి తెలుగు కథ కావడం విశేషం.

పిఠాపురంలో జననం.. ఒంగోలులో విద్యాభ్యాసం

1945లో పిఠాపురంలో జన్మించిన పతంజలిశాస్త్రి విద్యాభ్యాసం అంతా ఒంగోలులోనే జరిగింది. పతంజలిశాస్త్రి ఇద్దరు తాతగార్లు తల్లావఝుల శివశంకరశాస్త్రి, మొక్కపాటి నరసింహాశాస్త్రి సాహితీవేత్తలే. కాగా ఎస్వీ యూనివర్సిటీలో ఎంఏ చేసిన అనంతరం పునే నుంచి ఆర్కియాలజీలో పీహెచ్‌డీ చేసిన పతంజలిశాస్త్రి ...ఆ తర్వాత అమలాపురం కళాశాలలో హిస్టరీ లెక్చరర్‌గా, ప్రిన్సిపల్‌గా కూడా పనిచేశారు. 1960 నుంచి కథలు రాయడం ప్రారంభించిన పతంజలి...'వడ్ల చిలుకలు', 'పతంజలిశాస్త్రి కథలు', 'నలుపెరుపు', 'రామేశ్వరం కాకులు'వంటి కథాసంపుటాలను రచించారు. అంతేగాక 'హోరు', 'దేవర కోటేశు', 'గేద మీద పిట్ట'అనే నవలలు కూడా పతంజలి శాస్త్రి రాశారు.

ఇకపై 'టీజీ'

వాహనాల రిజిస్ట్రేషన్‌ను టీఎస్ నుంచి టీజీగా మార్పు

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ రాష్ట్రంలోని వాహనాల రిజిస్ట్రేషన్‌కు ఇకపై 'టీజీ' అని వాడనున్నారు. రాష్ట్ర విభజన తర్వాత ఇన్నేళ్లుగా వాహనాల రిజిస్ట్రేషన్లకు 'టీఎస్' అని వాడుతున్న విషయం తెలిసిందే. అయితే గత నెల ఫిబ్రవరిలో తెలంగాణ కేబినెట్ వాహనాల రిజిస్ట్రేషన్లు మొదలు అన్ని ప్రభుత్వ కార్యాలయాలను టీఎస్ నుంచి టీజీగా మార్పు చేయాలని నిర్ణయం తీసుకుంది. దీనికి అనుబంధంగా మంగళవారం కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది.

15,16,18 తేదీల్లో రాష్ట్రానికి మోదీ

- మల్కాజిగిరిలో రోడ్ షో
- నాగర్‌కర్నూల్, జగిత్యాలల్లో బహిరంగ సభలకు హాజరు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రధాని నరేంద్రమోదీ నిర్వహించే ఎన్నికల ప్రచారానికి సంబంధించిన షెడ్యూల్‌పై స్పష్టత వచ్చింది. ఈ నెల 15, 16, 18 తేదీల్లో మూడు లోక్‌సభ స్థానాల పరిధిలో ఆయన ప్రచారం చేయనున్నారు. 15న మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో ఏకంగా మూడు నాలుగు గంటలపాటు రోడ్ షో నిర్వహించనున్నట్టు పార్టీ వర్గాల సమాచారం. 16న నాగర్‌కర్నూల్‌లో బహిరంగసభ, 18న జగిత్యాలలో జరిగే ఎన్నికల సభల్లో మోదీ ప్రసంగించనున్నారు. వరుసగా ఐదురోజుల పాటు దక్షిణాది రాష్ట్రాల్లో మోదీ సుడిగాలి పర్యటనలు నిర్వహించడంతో పాటు విస్తృతంగా ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఇందులో భాగంగానే తెలంగాణలోని మూడు లోక్‌సభ స్థానాల్లో మొదటి విడతలో.. మళ్లీ కొన్నిరోజుల విరామం తర్వాత మరికొన్ని పార్లమెంట్ సీట్ల పరిధిలో మోదీ బీజేపీ ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కాగా, ఈ నెల 4న ఆదిలాబాద్‌లో, 5న పటాన్‌చెరువులో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడంతో పాటు విడిగా ఏర్పాటు చేసిన రాజకీయ బహిరంగసభల్లో మోదీ పాల్గొని విపక్ష కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించిన సంగతి తెలిసిందే.

టీడీపీ-బీజేపీ కూటమికి మైనారిటీలు, దళితులు ఓట్లు వేయరు

- గతంలో చంద్రబాబు మోదీని టెర్రరిస్టుగా అభివర్ణించారు
- ఏపీ సీఎం జగన్ మంచి మిత్రుడు
- విలేకరుల సమావేశంలో ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ



సాక్షి, హైదరాబాద్: ఏపీ సీఎం వైఎస్ జగన్ తనకు మంచి మిత్రుడని ఏఐఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. జగన్‌తో మంచి స్నేహం ఉందని, అది కొనసాగుతోందని స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని దారుస్సలాంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఏపీ రాజకీయాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. బీజేపీతో టీడీపీ పొత్తు పెట్టుకోవడాన్ని ఆయన తప్పుబట్టారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధాని నరేంద్ర మోదీపై చేసిన విమర్శలు, ఆరోపణలను గుర్తుచేశారు. చంద్రబాబు అప్పట్లో మోదీని ఉగ్రవాది అని విమర్శించాడని, అలాంటి వారికి ఇప్పుడు టీ అందిస్తున్నారని ఎద్దేవా చేశారు. బీజేపీతో చంద్రబాబు ఎలా పొత్తు పెట్టుకుంటారని ప్రశ్నించారు. గతంలో చంద్రబాబు బీజేపీకి ఎందుకు మద్దతిచ్చారో, మళ్లీ ఎందుకు కూటమి నుంచి బయటకు వచ్చారో తనకు అర్థం కాలేద ని పేర్కొన్నారు. ఏపీలో ఉన్న మైనారిటీలు, ఆదివాసీలు, దళితులు, క్రిస్టియన్లు.. టీడీపీ- జనసేన-బీజేపీ కూటమికి ఓటు వేయరని ఒవైసీ తేల్చి చెప్పారు. ఈ 4 సామాజిక వర్గాల ఓటు బ్యాంకు నిర్ణయాత్మక శక్తిగా మారిందని, అభ్యర్థుల గెలుపోటములను ప్రభావితం చేయగలుగుతుందని పేర్కొన్నారు. ఏపీలో పోటీచేసే విషయంలో ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఒవైసీ స్పష్టం చేశారు.

సీఏఏకు వ్యతిరేకమే..

సీఏఏ అమలును అసదుద్దీన్ తీవ్రంగా వ్యతిరేకించారు. గతంలో తెలంగాణ అసెంబ్లీ సైతం సీఏఏకు వ్యతిరేకంగా తీర్మానం చేసిందని గుర్తు చేశారు. కొత్తగా కొలువు తీరిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా వ్యతిరేకిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. సీఏఏపై తమకు తీవ్ర అభ్యంతరాలు ఉన్నాయని. ఇప్పుడు సీఏఏ ఆ తర్వాత ఎన్పీఆర్, ఎన్ఆర్సీ అమలు కావచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం ముస్లిం సమాజాన్ని టార్గెట్ చేయడమే బీజేపీ లక్ష్యమని ఆరోపించారు. సీఏఏ ద్వారా మత ధ్రువీకరణ రాజకీయాలు చేసే ప్రయత్నం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సీఏఏకు వ్యతిరేకంగా బీజేపీని ఓడించాలని ఆయన ప్రజలకు పిలుపు నిచ్చారు.

* స్ఫూర్తి

**వయసు అరవై దాటిందంటే చాలు
'ఇంకా ఏం పనులు చేస్తావు, విశ్రాంతి తీసుకో..' అనే సలహాలు ఇస్తుంటారు.
కొందరు ఆ సలహాలను కూడా సవాళ్లుగా తీసుకుంటారు.
కొన్ని అభిరుచులను జీవితకాల సాధనగా మార్చుకుంటారు.
ఈ మాటలను నిజం చేస్తోంది 71 ఏళ్ల రాధామణి.
ఇప్పటివరకు 11 హెవీ వాహనాల లైసెన్స్‌లను పొంది
మూస పద్ధతులను బద్దలు కొట్టి కొత్త రికార్డులు సృష్టిస్తోంది.
అందరూ మణి అమ్మ అని పిలుచుకునే రాధామణి కేరళవాసి.
సాధనమున ఏవైనా సమకూరుతాయి అని
నిరూపిస్తున్న రాధామణి ఇప్పుడు ఇంజినీరింగ్ డిప్లొమాను అభ్యసిస్తూ
ఈ రంగంలో ఎదగడానికి చేస్తున్న కృషి అందరికీ ఓ స్ఫూర్తి మంత్రం.**

డ్రైవింగ్ మణి @ 71



ట్రక్కు, జేసీబీ, క్రేన్ .. మొదలైన హెవీ వెహికిల్స్ నడుపుతూ..



1984లో కేరళలో హెవీ వెహికిల్ డ్రైవింగ్ లైసెన్స్ పొందిన మొదటి మహిళగా గుర్తింపు పొందిన రాధామణి ఇప్పటికీ 'వయసు ఎప్పుడూ అడ్డంకి కాదు' అని, అందుకు తన జీవితమే ఓ ఉదాహరణగా చూపుతుంది.

స్కూటర్ నుంచి జేసీబీ వరకు

సాధారణంగా మహిళలు స్కూటర్, కార్ డ్రైవింగ్‌తో సరిపెట్టేస్తారు. రాధామణి మాత్రం అంతటితో ఆగలేదు. డ్రైవింగ్ పట్ల తనకు ఆసక్తి కలగడానికి ప్రోత్సాహన్నిచ్చిన భర్తను గుర్తుచేసుకుంటూ "1981లో మొదటిసారి ఓ అంబాసిడర్ డ్రైవింగ్ నేర్చుకున్నాను. ఆ తర్వాత ఐదేళ్లలోపు ఫోర్ వీలర్ లైసెన్స్ పొందాను. ఆ విధంగా కేరళలో హెవీ వెహికల్ లైసెన్స్ పొందిన మొదటి మహిళగా కూడా గుర్తింపు పొందాను. ఎ టు జెడ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెవీ ఎక్విప్‌మెంట్ అనే డ్రైనింగ్ స్కూల్‌ను ప్రారంభించాను' అని వివరిస్తుంది. ఈ వెంచర్‌ను రాధామణి భర్త పదేళ్లకు ముందుగానే ప్రారంభించాడు. అక్కడ నుంచే ఈ జంట డ్రైవింగ్‌లో శిక్షణ ఇవ్వడం మొదలుపెట్టారు. కానీ రాధామణి పేరుతో లైసెన్స్ పొందడానికి స్కూల్ రిజిస్టర్ చేయడానికి కష్టంగా మారింది. దీంతో రాధామణి హెవీ డ్రైనింగ్ లైసెన్స్‌లు పొందాలని ప్రయత్నాలు మొదలుపెట్టారు. కొన్నేళ్ల న్యాయ పోరాటం తర్వాత ఈ జంట కేరళలో హెవీ వెహికల్ డ్రైవింగ్ లెర్నింగ్ స్కూల్‌ను రాధామణి పేరుతో రిజిస్టర్ చేయగలిగారు.

సంకల్పంతో నిలబెట్టింది..

రాధామణి భర్త 2004లో మరణించాడు. ఆ తర్వాత ఈ వెంచర్ మరింత ప్రాముఖ్యతను నింపుకుంది. మణి అమ్మ సంకల్పం ఆ ట్రైనింగ్ స్కూల్‌ను నిలబెట్టడం ఒక్కటే కాదు, దానిని ఒక సంస్థగా మార్చేందుకు కృషి చేయడం కూడా! అందుకే ఆమె అందరికీ ఆదర్శంగా నిలిచింది. ఏ రంగమైనా హెవీ డ్రైవింగ్ అంటే ముందు పురుషులే గుర్తుకు వస్తారు. అలాంటి ఆలోచనకు తావు ఇవ్వకుండా, వయసు నింబధనలను కూడా ధిక్కరిస్తూ ఈ డ్రైవింగ్ స్కూల్‌ను రాధామణి నడుపుతోంది. అందుకు మరింతగా ఎదగడానికి కావాల్సిన జ్ఞానాన్ని పెంచుకోవడానికి ఇంజనీరింగ్ డిప్లొమాను అభ్యసిస్తూ, అందరికీ స్ఫూర్తిగా నిలుస్తోంది.

రికార్డ్‌ల చక్రం

ఆమె అద్భుతమైన నైపుణ్యాలు, అంకితభావాన్ని ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ గుర్తించింది. 'ఇన్స్పిరేషనల్ పర్సనాలిటీ ఆఫ్ ది ఇయర్ 2022' పురస్కారాన్ని ఇచ్చి తనను తాను గౌరవించుకుంది సంస్థ. రాధామణి అంతటితో ఆగలేదు. సోషల్ మీడియాలో కూడా తన ఉనికిని చాటుతోంది. అక్కడ ఆమె తన డ్రైవింగ్ అనుభవాలను పంచుకుంటుంది. వయసు లేదా జెండర్‌తో సంబంధం లేకుండా కలలను పండించుకునేందుకు తగిన ప్రేరణను ఇస్తోంది రాధామణి.

సోషల్ మీడియాలో..

రాధామణి ఇన్‌స్టాగ్రామ్ పేజీకి ఎంతో మంది అభిమానులు ఉన్నారు. జేసీబీలు, ఫోర్క్‌లిఫ్ట్‌లు, క్రేన్లు, ఫెరారీలు, పడవలు, ట్యాంకర్లు, జీప్స్, పెద్ద పెద్ద ట్రక్కుల వరకు ప్రతి వాహనాన్ని డ్రైవ్ చేస్తూ కనిపిస్తుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో తన డ్రైవింగ్ ఇన్‌స్టిట్యూట్‌కు ఉన్న 19కె ఫాలోవర్లు మణి అమ్మను ప్రశంసిస్తుంటారు. ఎంతోమంది చేత సత్కారం పొందుతుంటారు. చాలా మంది మహిళలకు హెవీ డ్రైవింగ్ పరికరాల గురించి చెప్పడం, నేర్పడం చూడచ్చు.

రాధామణి అమ్మ అంటే ఆవేశం, పట్టుదల, శక్తికి నిదర్శనం. ఆమె కేవలం రోడ్డుపైనే కాదు అడ్డంకులను ఛేదించి చక్రాన్ని చేరుకోవడానికి తగిన స్ఫూర్తిని ఇచ్చేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తోంది.

కళ



ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో శ్రద్ధా జైన్

శ్రద్ధగా నవ్విస్తుంది!

**'శ్రద్ధా జైన్ తెలుసా?' అని అడిగితే -
'తెలుసు' అని చెప్పేవారి సంఖ్య తక్కువ కావచ్చుగానీ-
'అయ్యో శ్రద్ధా తెలుసా' అంటే
'అయ్యో... తెలియకపోడం ఏమిటి!' అనే వాళ్ల సంఖ్య ఎక్కువే.
బెంగళూరుకు చెందిన శ్రద్ధా జైన్ అలియాస్ 'అయ్యో శ్రద్ధా'
'ఇంటర్నెట్ సెన్సేషన్'గా పేరు తెచ్చుకుంది.
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా
ఇటీవల 'నేషనల్ క్రియేటర్స్' అవార్డ్ అందుకుంది.**

హాయిగా నవ్వించే వీడియోలతో సోషల్ మీడియాలో బాగా పాపులర్ అయింది శ్రద్ధా జైన్. తులు, కన్నడ, హిందీ, మరాఠీ, ఇంగ్లీష్ భాషలలో ఇన్‌స్టాగ్రామ్‌లో రెగ్యులర్‌గా వీడియోలు పోస్ట్ చేస్తుంటుంది.

2016లో కర్నాటకాలో జరిగిన ఒక ఫెస్టివల్‌కు సంబంధించి ఫేస్‌బుక్ వీడియోను పోస్ట్ చేసింది. వైరల్ అయిన ఈ వీడియో శ్రద్ధాకు వీర లెవెల్లో పేరు తెచ్చింది. ఒక డ్యాన్స్ రియాల్టీ షోకు హోస్ట్‌గా, కొన్ని టీవీ కార్యక్రమాలకు క్రియేటివ్ డైరెక్టర్‌గా అవకాశాలు తెచ్చింది. ఇక కామెడీ షోల సంగతి సరేసరి.

కామెడీ డ్రామా సిరీస్ 'పుష్పవల్లి'తో శ్రద్ధ పేరు హాస్యాభిమానుల అభిమాన పేరు అయింది.

పెద్ద బ్రాండ్స్‌తో కలిసి పనిచేసిన శ్రద్ధ ఇలా అంటుంది...

'కంటెంట్‌లో వెరైటీ ఉండేలా ప్రయత్నించేదాన్ని. ప్రేక్షకుల సంగతి ఏమిటోగానీ కంటెంట్‌లో వెరైటీ లేకపోతే ముందు నాకే బోర్ కొడుతుంది. అది ఎంత పెద్ద హిట్ అయినా సరే ఒకే అంశాన్ని పదేపదే చేయలేను. రియల్ ఎస్టేట్ రంగంలోకి ఉన్న వారికి ఎలాంటి ఇన్‌ఫ్లూయెన్సర్‌ను ఎంపిక చేసుకోవాలో తెలియదు. నేను సృష్టించిన రీనా దలాల్ క్యారెక్టర్‌ను చూసిన తరువాత... రీనా క్యారెక్టర్ పర్‌ఫెక్ట్ అనుకున్నారు. మొదట్లో రియల్ ఎస్టేట్ కోసం కంటెంట్ క్రియేట్ చేసిన అతి కొద్దిమందిలో నేను ఒకరిని' అంటుంది శ్రద్ధ.

ఏ బ్రాండ్ వారు వచ్చినా తమది ఏ బ్రాండ్ అనేది మాత్రమే చెబుతారు. వారికి 'ఐడియా' గురించి బొత్తిగా ఐడియా ఉండదు. ఈ నేపథ్యంలో ఐడియా జెనరేట్ చేయడం నుంచి స్క్రీన్‌ప్లే వరకు ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించడానికి ఎన్నో చేయాల్సి ఉంటుంది. ఇలాంటి అన్ని విద్యల్లో ఆరితేరింది శ్రద్ధ.

పని పట్టాలెక్కడానికి అట్టే టైమ్ పట్టదు. కాన్సెప్ట్ డిస్కషన్ మీటింగ్ తరువాత పని పరుగులు తీస్తుంది.

సాధారణంగా పాపులర్ ఇన్‌ఫ్లుయెన్సర్‌లు ఒక ఫిక్స్‌డ్ స్టైల్‌కే పరిమితం అవుతారు. అది దాటి బయటికి రావడాన్ని రిస్క్ అనుకుంటారు. అయితే ఎప్పటికప్పుడూ కొత్తగా ఆలోచిస్తూ 'ఫిక్స్‌డ్ స్టైల్' అనేది లేకుండా జాగ్రత్త పడింది శ్రద్ధ.

రేడియో జాకీ, డ్యాన్స్ షో హోస్ట్, కమెడియన్, రైటర్, అయిదు లక్షల ఫాలోవర్‌లు ఉన్న ఇన్‌స్టాగ్రామ్ కంటెంట్ క్రియేటర్... ఇలా శ్రద్ధా జైన్ సృజనాత్మక రూపాలు ఎన్నో ఉన్నాయి. 'డాక్టర్ జీ' సినిమాతో బాలీవుడ్‌లోకి కూడా అడుగు పెట్టింది.

'నా నటన, రచనలకు సోషల్ మీడియాలో మంచి గుర్తింపు లభించింది. ఈ గుర్తింపు ద్వారా ఏదైనా సౌత్ ఫిల్మ్‌లో నటించే అవకాశం వస్తుంది అనుకున్నాను. అయితే ఏకంగా బాలీవుడ్ నుంచే పిలుపు రావడం ఆనందంగా అనిపించింది' అంటున్న శ్రద్ధ పోస్ట్-గ్రాడ్యుయేట్ స్టూడెంట్‌గా నటించింది.

'పెర్ఫార్మర్, కంటెంట్ క్రియేటర్‌లకు ఇది మంచి టైమ్. ఏమాత్రం టాలెంట్ ఉన్నా మన స్థాయి ఎక్కడికో వెళ్లిపోతుంది' అంటుంది శ్రద్ధా జైన్.

బ్యూటిప్స్

యాక్నే ట్రీట్‌మెంట్ ఇంట్లోనే...

చర్మగ్రంథుల నుంచి స్రవించే సెబమ్, ఇతర నూనెలు చర్మం మీద ఒక చోట గూడు కట్టుకున్నప్పుడు, వాటికి మృతకణాలు తోడైనప్పుడు మొటిమలు, యాక్నే వంటి సమస్యలు తలెత్తుతాయి. ఇందుకోసం మార్కెట్‌లో దొరికే క్రీమ్‌లకంటే ఇంట్లోనే చేసుకోగలిగిన పరిష్కారాలు మంచి ఫలితాన్నిస్తాయి.



దాల్చినచెక్కతో ఫేస్‌ప్యాక్: ముఖాన్ని క్లెన్సర్‌తో కానీ మామూలు సబ్బుతో కానీ శుభ్రం చేసుకుని తుడిచేయాలి. రెండు టేబుల్ స్పూన్‌ల తేనెలో టీ స్పూన్ దాల్చిన చెక్క పొడి కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి పదిహేను నిమిషాల పాటు ఆరనివ్వాలి. ఇప్పుడు చన్నీటితో ముఖం కడగాలి. ఇలా వారానికి రెండు సార్లు చేస్తుంటే చర్మం మీద మృతకణాలు, నూనెలు, సెబమ్ వంటివి నిలవకుండా ఎప్పటికప్పుడు తొలగిపోతుంటాయి. కాబట్టి కొత్త మొటిమలు రావు. అప్పటికే ఉన్న మొటిమలు, యాక్నే కూడా తగ్గుముఖం పడుతుంది.



గ్రీన్ టీ ప్యాక్: ఒక గ్లాసు నీటిలో గ్రీన్ టీ బ్యాగ్ వేసి నాలుగు నిమిషాల సేపు మరిగించాలి. గ్రీన్‌టీ పూర్తిగా చల్లారిన తర్వాత అందులో కాటన్ బాల్‌ను ముంచి టీని ముఖానికి పట్టించాలి. టీని ముఖానికి కాటన్ బాల్‌తో పట్టించడం కుదరకపోతే స్ప్రే బాటిల్‌లో పోసుకుని ముఖం మీద స్ప్రే చేసుకుని చర్మానికి పట్టేటట్లు వేళ్లతో అద్దాలి. ఆరిన తర్వాత చన్నీటితో శుభ్రం చేయాలి. ఇప్పుడు టీ బ్యాగ్‌ను ఓపెన్ చేసి అందులో రెండు చుక్కల తేనె కలిపి ముఖానికి ప్యాక్ వేయాలి. ఈ ప్యాక్ బాగా ఆరిన తర్వాత చన్నీటితో శుభ్రం చేయాలి. రోజుకోసారి ఇలా చేస్తుంటే వారంలోనే మొటిమలు, యాక్నే పోయి చర్మం కాంతిమంతమవుతుంది.



బీట్‌రూట్‌తో డే క్రీమ్



తొక్కతీసిన అరకప్పు బీట్‌రూట్ ముక్కలను గిన్నెలో వేసి అరగ్లాసు నీళ్లు పోసి ఐదు నిమిషాలు ఉడికించాలి. తరువాత స్టవ్ ఆపేసి బీట్‌రూట్ ముక్కల్లో టీస్పూను సోంపు వేసి పది నిమిషాలు నానబెట్టాలి. పది నిమిషాల తరువాత బీట్‌రూట్ ముక్కల్లో ఉన్న నీటిని వడగట్టి తీసుకోవాలి. ఈ నీటిలో టీస్పూను రోజ్ వాటర్, రెండు టీస్పూన్ల అలోవెరా జెల్ వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని గాజు సీసాలో వేసి రిఫ్రిజిరేటర్‌లో నిల్వ చేసుకోవాలి. వారం రోజులపాటు నిల్వ ఉండే ఈ క్రీమ్‌ను రోజూ ఉదయం పూట రాసుకుంటే.. ముఖం మీద మచ్చలు, ముడతలు, డార్క్ సర్కిల్స్ తగ్గుముఖం పట్టి ప్రకాశవంతముగా కనిపిస్తుంది.

కిచెన్ టిప్స్

ఇలా చేస్తే కనరెక్కదు..



- రెండు స్పూన్ల నీటిలో స్పూను పాలు పోసి చక్కగా కలపాలి. ఈ పాల మిశ్రమాన్ని వంకాయ ముక్కలపై చిలకరిస్తే ముక్కలు చేదుగా మారవు.
- టేబుల్ స్పూను నిమ్మరసం వేసిన నీటిలో తరిగిన వంకాయ ముక్కలు వేస్తే కనరెక్కవు.
- వంకాయ ముక్కలు లేదా కూరగాయ ముక్కలు వేసే నీటిలో టేబుల్ స్పూను వెనిగర్ వేసి కలపాలి. అప్పుడు కూరగాయ ముక్కలు రంగు మారకుండా ఉంటాయి.

యూత్ పల్స్

నాద వినోదం నాట్య విలాసం

ఆరోగ్య భాగ్యం



ప్రతీకాత్మక చిత్రం

భరత నాట్యం నుంచి కూచిపూడి వరకు భారతీయ శాస్త్రీయ నృత్యాలలో వ్యాయామానికి సమానమైన అంశాలు ఎన్నో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈ తరం శాస్త్రీయ నృత్యాలపై ఆసక్తి ప్రదర్శిస్తోంది. నృత్య సాధనతో ఫిట్‌నెస్‌ను సొంతం చేసుకుంటుంది.

ముంబైలో ఎంబీఏ చేస్తున్న శివానీ దీక్షిత్‌కు ఏ చిన్న పనిచేయాలన్న బద్ధకంగా అనిపించేది. దీని వల్ల చదువు కూడా దెబ్బ తినే ప్రమాదం ఏర్పడింది. తన కజిన్ సలహా ప్రకారం అయిష్టంగానే భరతనాట్యం నేర్చుకోవడం మొదలు పెట్టింది. మొదట్లో ఎలా ఉన్నా ఆ తరువాత మాత్రం భరతనాట్యంపై దీక్షిత్‌లో అంతకంతకూ ఇష్టం పెరుగుతూపోయింది.

'నేను ఎప్పుడూ వ్యాయామాలు చేయలేదు. అయితే భరతనాట్యం వల్ల ఎన్నో వ్యాయామాలు ఒక్కసారే చేస్తున్నట్లుగా అనిపించింది. బద్ధకాన్ని వదిలించుకున్నాను. మనసు తేలిక అయినట్లుగా ఉంది' అంటుంది శివానీ దీక్షిత్.

'అధిక బరువుతో బాధ పడుతున్న నాకు కథక్ నృత్యం కాంతి కిరణంలా కనిపించింది. కథక్ నృత్య సాధనతో బరువు తగ్గడం సంతోషంగా ఉంది. కథక్ డ్యాన్స్ అనేది మచ్ మోర్ దెన్ ఏ వెయిట్ లాస్ ఎక్సర్‌సైజ్ అనేది నా అభిప్రాయం. బరువు తగ్గడానికే కాదు బ్రీతింగ్ ఎక్సర్‌సైజ్‌ల విషయంలోనూ కథక్ ఉపయోగపడుతుంది' అంటుంది కోల్‌కతాకు చెందిన ఇరవై రెండు సంవత్సరాల నయనిక.

బరువు తగ్గడానికి ఉపయోగపడే ఒడిస్సీ, జాజ్, కాంటెంపరీ వెస్ట్రన్ డ్యాన్స్‌లను కలిపి ఒక డ్యాన్స్ ఫామ్ రూపొందించినట్లు తెలుసుకున్న నయనిక ప్రస్తుతం ఆ సమ్మేళన నృత్యరూపం గురించి మరిన్ని వివరాలు తెలుసుకునే ప్రయత్నంలో ఉంది.

'కేవలం బరువు తగ్గడానికే కాదు ఏకాగ్రతను పెంచడంలో, జ్ఞాపకశక్తిని మెరుగుపరచడంలో శాస్త్రీయ నృత్యాలు ఉపయోగపడతాయనే విషయాన్ని నృత్యసాధన ద్వారా స్వయంగా తెలుసుకున్నాను. శాస్త్రీయ నృత్యకదలికలకు చేతులు, కళ్ల మధ్య సమన్వయం అవసరం. ఇది ఆటోమెటిగ్గా ఏకాగ్రతను మెరుగుపరచడంలో ఉపయోగపడుతుంది' అంటున్నాడు బెంగళూరు చెందిన ఇంజనీరింగ్ స్టూడెంట్ సందేశ్ సృజన్.

శివానిక్ దీక్షిత్, నయనిక, సందేశ్ సృజన్‌ల మాటలు శాస్త్రీయ నృత్యాల పట్ల యువతరం చూపుతున్న ఆసక్తికి అద్దం పడతాయి.

'మన దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన శాస్త్రీయ నృత్యాల జాబితా పెద్దది. ప్రతి నృత్యానికి తనదైన వేషధారణ, అలంకరణ, సంగీతం ఉంటాయి. శాస్త్రీయ నృత్యాన్ని నేర్చుకునే విధానం చాలా కఠినమైనది. దీనికి తగిన సమయం, శక్తి అవసరం.



క్యాటిల్ బెల్స్‌తో స్టూడెంట్స్‌కు శిక్షణ ఇస్తున్న బెనర్జీ

శాస్త్రీయ నృత్యం నేర్చుకోవడానికి ఆసక్తి మాత్రమే కాదు అంకితభావం చాలా ముఖ్యం, నృత్యం అనేది శారీరక, మానసిక ప్రయోజనాలకు ఉపయోగపడుతుంది. శాస్త్రీయ నృత్య రూపాల శైలి ఒకదానికొకటి భిన్నంగా ఉన్నప్పటికీ అభ్యాస ప్రక్రియ కండరాలను బలోపేతం చేస్తుంది. భరత నాట్యం, కూచిపూడి, మోహినియాట్టంలాంటి శాస్త్రీయ నృత్యరూపాలను సాధన చేయడం ద్వారా మజిల్ ఇంప్రూమెంట్ ఉంటుంది. రెగ్యులర్ ప్రాక్టీస్ శరీరంలోని ఆక్సిజన్ స్థాయిలను పెంచడంలో సహాయపడుతుంది' అంటుంది ప్రొఫెషనల్ క్లాసికల్ డ్యాన్సర్, ట్రైనర్ కీర్తి దివాకరన్. కేరళ కొచ్చీలోని వైనవి నృత్యకళాక్షేత్రం వ్యవస్థాపకురాలు కీర్తి.

'డ్యాన్సింగ్ అనేది న్యూరో-మస్క్యులార్ బ్యాలెన్స్‌ను వృద్ధి చేయడంలో సహాయపడుతుంది' అంటుంది క్లాసికల్ డ్యాన్సర్, ట్రైనర్, కోజికోడ్‌లోని గౌరీశంకరం క్లాసికల్ డ్యాన్స్ థెరపీ ఇన్‌స్టిట్యూట్ మేనేజింగ్ డైరెక్టర్ డా. ప్రియా మేనన్.

శాస్త్రీయ నృత్య రూపకాల వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి ఎన్నో అధ్యయనాలు చెప్పాయి.

ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ అప్లైడ్ రిసెర్చ్ పేపర్ ప్రకారం... ఏదైనా వర్కవుట్ పదినిమిషాల ఒడిస్సీ డ్యాన్స్‌తో సమానం.

బాడీ బయో మెకానిక్స్

బాడీ బయోమెకానిక్స్‌ను బాగా అర్థం చేసుకోవడం డ్యాన్సర్ కమ్యూనిటీకి ముఖ్యం అంటుంది మధుమతి బెనర్జీ. భరతనాట్య కళాకారిణీ అయిన బెనర్జీ ఎన్నో దేశాలలో ప్రదర్శనలు ఇచ్చింది. ఇండియన్ క్లాసికల్ అండ్ ఫోక్ మ్యూజిక్‌లో కూడా ప్రావీణ్యం సాధించింది. శాస్త్రీయ నృత్యాలు నేర్చుకోవడానికి అవసరమైన స్ఫూర్తిని యువతరానికి ఇస్తోంది.

డ్యాన్స్‌లో భాగంగా కాళ్ల నుంచి మెడ వరకు అన్నీ కదులుతాయి. గంట ఒడిస్సీ నృత్యం 250 కేలరీలు ఖర్చు కావడానికి కారణం అవుతుంది.

'సైన్స్ అండ్ జర్నల్'లో ప్రచురితమైన రిసెర్చ్ పేపర్ ప్రకారం నాన్-డ్యాన్సర్‌లతో పోల్చితే కథక్ డ్యాన్సర్‌ల శరీర బరువు, బాడీ మాస్ ఇండెక్స్... మొదలైన వాటికి సంబంధించి బాడీ కంపోజిషన్ మెరుగ్గా ఉంటుంది. కథక్ డ్యాన్స్‌లోని క్విక్ ఫుట్ వర్క్ వల్ల ఒత్తిడి మాయం అవుతుంది.

వ్యాయమాలతో కూడిన డ్యాన్స్ అనగానే ఒకప్పుడు జాజ్, లైన్ డ్యాన్స్, హిప్ హప్, సల్సా... మొదలైన వెస్ట్రన్ డ్యాన్స్‌లు మాత్రమే గుర్తొచ్చేవి. 'ఎక్కడి దాకో ఎందుకు మన దగ్గరే బోలెడు శక్తిసంపద ఉంది' అని గ్రహించిన యువతరం మన శాస్త్రీయ నృత్యాలకు దగ్గరవుతోంది. సాధన చేస్తోంది. ఆరోగ్య భాగ్యానికి చేరువ అవుతోంది.

నృత్యం... ధ్యానసాధనం

'రోల్ ఆఫ్ ఇండియన్ క్లాసికల్ డ్యాన్స్ ఇన్ ఎడ్యుకేషన్' పేరుతో రిమ్లీ భట్టాచార్య ఒక ఆర్టికల్ రాసింది.

'భారతీయ శాస్త్రీయ నృత్యం మన విద్యా విధానంలో భాగంలో కావాలి. ఇది మన సంస్కృతికి సంబంధించిన శక్తిరూపమే కాదు అద్భుతమైన ధ్యాన సాధనం కూడా. విద్యార్థులు ఒత్తిడికి గురి కాకుండా ఉండడానికి ఏకాగ్రత, సృజనాత్మకతను పెంపొందించడానికి శాస్త్రీయ నృత్యం ఉపయోగపడుతుంది. డ్యాన్స్ మూమెంట్స్‌తో శారీరక దృఢత్వం కలుగుతుంది. శరీరంపై నియంత్రణ పెరుగుతుంది. అంతర్గత భావాలను వ్యక్తీకరించే పద్ధతి, ఆత్మవిశ్వాసం పెరుగుతాయి' అంటుంది రిమ్లీ భట్టాచార్య.

మెకానికల్ ఇంజినీరింగ్‌లో గోల్డ్ మెడలిస్ట్ అయిన రిమ్లీ ఎంబీఏ చేసింది. కార్పొరేట్ సెక్టార్‌లో పనిచేసింది. మానసిక ఆరోగ్యంపై ఎన్నో వ్యాసాలు రాసింది. 'ఏ బుక్ ఆఫ్ లైట్' పేరుతో పుస్తకం ప్రచురించింది.



నాలుగో ర్యాంక్‌లో భారత పురుషుల హాకీ జట్టు

అంతర్జాతీయ హాకీ సమాఖ్య పురుషుల ర్యాంకింగ్స్‌లో భారత జట్టు ఒక స్థానం పడిపోయింది. మంగళవారం విడుదలైన తాజా ర్యాంకింగ్స్‌లో హర్మన్‌ప్రీత్ సింగ్ నాయకత్వంలోని టీమిండియా మూడు నుంచి నాలుగో స్థానానికి చేరుకుంది. గత ఏడాది ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకం నెగ్గి భారత జట్టు నేరుగా పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత పొందింది. మరోవైపు భారత మహిళల జట్టు తొమ్మిదో స్థానంలో ఉంది. ఇటీవల జరిగిన క్వాలిఫయింగ్ టోర్నీలో భారత జట్టు విఫలమై పారిస్ ఒలింపిక్స్ బెర్త్ దక్కించుకోలేకపోయింది.

యశస్వి జైస్వాల్‌కు ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ద మంత్' అవార్డు

ఇంగ్లండ్‌తో జరిగిన ఐదు టెస్టుల సిరీస్‌లో 712 పరుగులతో అదరగొట్టిన భారత యువ క్రికెటర్ యశస్వి జైస్వాల్‌కు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) అవార్డు లభించింది. ఫిబ్రవరి నెలకుగాను యశస్వికి ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ద మంత్' పురస్కారం దక్కింది. ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ద మంత్ అవార్డు గెల్చుకున్న ఏడో భారత ప్లేయర్‌గా యశస్వి నిలిచాడు. గతంలో భారత్ నుంచి రిషభ్ పంత్, అశ్విన్, భువనేశ్వర్, శ్రేయస్ అయ్యర్, విరాట్ కోహ్లి, శుబ్‌మన్ గిల్‌లకు ఈ అవార్డులు లభించాయి.



ప్లే ఆఫ్స్‌కు బెంగళూరు

ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన ఎలీస్ పెరీ

- 6 వికెట్లు తీయడంతోపాటు 40 పరుగులు చేసిన ఆర్‌సీబీ ప్లేయర్
- చివరి మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌పై 7 వికెట్లతో నెగ్గిన బెంగళూరు



ఎలీస్ పెరీ



హర్మన్‌ప్రీత్ బౌల్డ్

న్యూఢిల్లీ: ఎలాంటి సమీకరణాలతో సంబంధం లేకుండా దర్జాగా రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టు మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 క్రికెట్ టోర్నీలో ప్లే ఆఫ్స్ దశకు అర్హత సాధించింది. ప్లే ఆఫ్స్ రేసులో నిలవాలంటే గెలవాల్సిన చివరి లీగ్ మ్యాచ్‌లో స్మృతి మంధాన నాయకత్వంలోని ఆర్‌సీబీ జట్టు అదరగొట్టే ప్రదర్శన చేసింది. ఏడు వికెట్లతో డిఫెండింగ్ చాంపియన్ ముంబై ఇండియన్స్‌ను ఓడించిన బెంగళూరు చివరిదైన మూడో ప్లే ఆఫ్స్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. ముందుగా ముంబై ఇండియన్స్ 19 ఓవర్లలో 113 పరుగులకు ఆలౌట్‌కాగా... బెంగళూరు 15 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 115 పరుగులు చేసి గెలిచింది. ఆస్ట్రేలియా స్టార్ ఆల్‌రౌండర్ ఎలీస్ పెరీ అద్భుత ఆటతీరుతో బెంగళూరు విజయంలో కీలకపాత్ర పోషించింది. ముందుగా బంతితో మెరిసిన పెరీ 4 ఓవర్లలో కేవలం 15 పరుగులిచ్చి 6 వికెట్లు పడగొట్టింది. అనంతరం బ్యాట్‌తో అదరగొట్టి 38 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్‌తో అజేయంగా 40 పరుగులు సాధించింది.

నేడు జరిగే చివరి లీగ్ మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్‌తో ఢిల్లీ క్యాపిటల్స్ ఆడుతుంది. ఈ మ్యాచ్‌లో ఢిల్లీ గెలిస్తే 12 పాయింట్లతో లీగ్ టాపర్‌గా నిలిచి నేరుగా ఫైనల్‌కు అర్హత పొందుతుంది. ఫైనల్లో స్థానం కోసం ముంబై, బెంగళూరు జట్ల మధ్య ఎలిమినేటర్ మ్యాచ్ జరుగుతుంది. ఒకవేళ గుజరాత్ చేతిలో ఢిల్లీ ఓడిపోతే... ఢిల్లీ, ముంబై రెండు జట్లలో మెరుగైన రన్‌రేట్ ఉన్న జట్టు ఫైనల్ చేరుతుంది.

ముంబైతో మ్యాచ్‌లో టాస్ గెలిచిన బెంగళూరు ఫీల్డింగ్ ఎంచుకోగా... ఓపెనర్లు హేలీ మాథ్యూస్ (23 బంతుల్లో 26; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), సజన (21 బంతుల్లో 30; 5 ఫోర్లు, 1 సిక్స్) 43 పరుగులు జోడించి ముంబైకు శుభారంభం ఇచ్చారు. అయితే ఆరో ఓవర్ చివరి బంతికి సోఫీ డివైన్ బౌలింగ్‌లో హేలీ అవుటవ్వడంతో ముంబై పతనం మొదలైంది. అనంతరం పెరీ తన పేస్ బౌలింగ్‌తో సజన, హర్మన్‌ప్రీత్ (0), అమెలియా కెర్ (2), అమన్‌జ్యోత్ (4), పూజ వస్త్రకర్ (6), నటాలీ సీవర్ బ్రంట్ (10)లను అవుట్ చేసింది. దాంతో ఒకదశలో 43/0తో ఉన్న ముంబై 82/7తో కష్టాల్లో పడింది. చివర్లో ప్రియాంక బాలా (19 నాటౌట్; 2 ఫోర్లు) రాణించడంతో ముంబై స్కోరు 100 దాటింది. 114 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన బెంగళూరు 39 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి ఇబ్బందుల్లో పడింది. స్మృతి (11; 2 ఫోర్లు), సోఫీ మోలినెక్స్ (9; 2 ఫోర్లు), సోఫీ డివైన్ (4) తక్కు వ స్కోరుకే వెనుదిరిగారు. అయితే రిచా ఘోష్ (28 బంతుల్లో 36 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), పెరీ నాలుగో వికెట్‌కు 76 పరుగులు జోడించి బెంగళూరును విజయతీరాలకు చేర్చారు.

డబ్ల్యూపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
ఢిల్లీ	7	5	2	10	0.918
ముంబై	8	5	3	10	0.024
బెంగళూరు	8	4	4	8	0.306
యూపీ	8	3	5	6	-0.371
గుజరాత్	7	2	5	4	-0.873

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, ర.రే-రన్‌రేట్

విదర్భ లక్ష్యం 538

- ముంబై రెండో ఇన్నింగ్స్‌లో 418 ఆలౌట్
- ముషీర్ ఖాన్ సెంచరీ

ముంబై: ప్రతిష్టాత్మక దేశవాళీ క్రికెట్ టోర్నమెంట్ రంజీ ట్రోఫీ టైటిల్‌ను 42వసారి దక్కించుకునేందుకు ముంబై జట్టు రంగం సిద్ధం చేసుకుంది. రెండుసార్లు విజేత విదర్భ జట్టుకు ఏకంగా 538 పరుగుల లక్ష్యాన్ని ముంబై నిర్దేశించింది. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన విదర్భ మూడో రోజు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో వికెట్ నష్టపోకుండా 10 పరుగులు చేసింది. మరో రెండు రోజుల ఆట మిగిలి ఉంది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 141/2తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ముంబై 130.2 ఓవర్లలో 418 పరుగులకు ఆలౌటైంది. యువ క్రికెటర్ ముషీర్ ఖాన్ (136; 10 ఫోర్లు) సెంచరీతో ఆకట్టుకోగా... కెప్టెన్ అజింక్య రహానే (73; 5 ఫోర్లు, 1 సిక్స్) ఓవర్‌నైట్ వ్యక్తిగత స్కోరుకు మరో 15 పరుగులు జోడించి అవుటయ్యాడు. రహానే పెవిలియన్ చేరాక వచ్చిన శ్రేయస్ అయ్యర్ (111 బంతుల్లో 95; 10 ఫోర్లు, 3 సిక్స్‌లు) దూకుడుగా ఆడి ఐదు పరుగుల తేడాతో సెంచరీని చేజార్చుకున్నాడు. ముషీర్, శ్రేయస్ నాలుగో వికెట్‌కు 168 పరుగులు జోడించారు. శార్దుల్ (0) డకౌట్‌కాగా... చివర్లో షమ్స్ ములానీ (50 నాటౌట్; 6 ఫోర్లు) అర్ధ సెంచరీ సాధించాడు. విదర్భ జట్టు బౌలర్లలో హర్ష్ దూబే 5 వికెట్లు, యశ్ ఠాకూర్ 3 వికెట్లు పడగొట్టారు.



ముషీర్

సింధు శుభారంభం

తొలి రౌండ్‌లోనే ప్రణయ్, శ్రీకాంత్ పరాజయం



బర్మింగ్‌హామ్: ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ తొలి రోజు భారత క్రీడాకారులకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు ప్రిక్వార్టర్ ఫైనల్ చేరగా... ఆకర్షి కశ్యప్ తొలి రౌండ్‌లోనే వెనుదిరిగింది. పురుషుల సింగిల్స్‌లో ప్రణయ్, కిడాంబి శ్రీకాంత్ కూడా తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టారు. వ్యోన్ లీ (బెల్జియం)తో జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో ప్రపంచ 11వ ర్యాంకర్ సింధు తొలి గేమ్‌ను 14 నిమిషాల్లో 21-10తో సొంతం చేసుకుంది. ఈ దశలో గాయం కారణంగా వ్యోన్ లీ వైదొలగడంతో సింధును విజేతగా ప్రకటించారు. ఆకర్షి కశ్యప్ 16-21, 11-21తో పాయ్ యు పో (చైనీస్ తైపీ) చేతిలో ఓటమి పాలైంది. పురుషుల సింగిల్స్‌లో భారత నంబర్‌వన్, ప్రపంచ ఎనిమిదో ర్యాంకర్ ప్రణయ్ 21-14, 13-21, 13-21తో సు లీ యాంగ్ (చైనీస్ తైపీ) చేతిలో అనూహ్యంగా ఓడిపోయాడు. ప్రపంచ నంబవర్ విక్టర్ అక్సెల్‌సన్ (డెన్మార్క్)తో జరిగిన మరో తొలి రౌండ్ మ్యాచ్‌లో శ్రీకాంత్ 9-21, 9-21తో పరాజయం పాలయ్యాడు. 33 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో శ్రీకాంత్ ఏ దశలోనూ డెన్మార్క్ స్టార్‌కు పోటీనివ్వలేకపోయాడు. అక్సెల్‌సన్ చేతిలో శ్రీకాంత్‌కిది 11వ ఓటమి కావడం గమనార్హం.

జొకోవిచ్‌కు షాక్

ఇటలీ ప్లేయర్ లూకా నార్డీ సంచలనం



కాలిఫోర్నియా: ఐదేళ్ల తర్వాత ఇండియన్ వెల్స్ మాస్టర్స్ సిరీస్-1000 టోర్నీలో బరిలోకి దిగిన ప్రపంచ నంబర్ వన్ జొకోవిచ్‌కు ఊహించని పరాజయం ఎదురైంది. టాప్ సీడ్ హోదాలో పోటీపడ్డ ఈ సెర్బియా దిగ్గజం పోరాటం మూడో రౌండ్‌లోనే ముగిసింది. ప్రపంచ 123వ ర్యాంకర్ లూకా నార్డీ మూడో రౌండ్‌లో 6-4, 3-6, 6-3తో జొకోవిచ్‌ను బోల్తా కొట్టించి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. 2 గంటల 20 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో నార్డీ ఆరు ఏస్‌లు సంధించి, ఏడు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. తన సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయి, జొకోవిచ్ సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేశాడు. ఈ గెలుపుతో మాస్టర్స్ సిరీస్, గ్రాండ్‌స్లామ్ టోర్నీలలో జొకోవిచ్‌ను ఓడించిన అతి తక్కువ ర్యాంకర్‌గా నార్డీ గుర్తింపు పొందాడు.



నిశాంత్‌కు నిరాశ

క్వార్టర్ ఫైనల్లో ఓడిన భారత బాక్సర్

బుస్టో అర్సిజియో (ఇటలీ): పారిస్ ఒలింపిక్స్ బాక్సింగ్ వరల్డ్ క్వాలిఫయింగ్ తొలి టోర్నమెంట్ నుంచి తొమ్మిది మంది భారత బాక్సర్లు రిక్తహస్తాలతో వెనుదిరిగారు. బరిలో మిగిలిన చివరి బాక్సర్ నిశాంత్ దేవ్ (71 కేజీలు) క్వార్టర్ ఫైనల్లో ఓడిపోయాడు. అమెరికా బాక్సర్ ఒమారి జోన్స్‌తో జరిగిన క్వార్టర్ ఫైనల్లో నిశాంత్ 1-4తో ఓటమి చవిచూశాడు. మహిళల విభాగంలో భారత్ నుంచి ఇప్పటి వరకు నలుగురు బాక్సర్లు (నిఖత్ జరీన్, ప్రీతి పవార్, పర్వీన్ హుడా, లవ్లీనా) పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత పొందారు. మిగిలిన భారత బాక్సర్లకు ఒలింపిక్స్‌కు అర్హత సాధించేందు రెండో అవకాశం ఉంది. మే 23 నుంచి జూన్ 3 వరకు థాయ్‌లాండ్‌లో జరిగే చివరిదైన రెండో క్వాలిఫయింగ్ టోర్నీలో సెమీఫైనల్ చేరితే భారత బాక్సర్లకు ఒలింపిక్ బెర్త్‌లు లభిస్తాయి.

పంత్ వచ్చేస్తున్నాడు...

ఐపీఎల్ కోసం సిద్ధమని ప్రకటించిన బీసీసీఐ • పూర్తి ఫిట్ అని నివేదిక ఇచ్చిన వైద్యబృందం



న్యూఢిల్లీ: భారత వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ జీవితంలో రెండో ఇన్నింగ్స్‌కు సిద్ధమవుతున్నాడు. 14 నెలల క్రితం కారు ప్రమాదంలో మృత్యువునకు చేరువగా వెళ్లి అదృష్టవశాత్తూ ప్రాణాలతో బయటపడ్డ పంత్ ఇప్పుడు మళ్లీ క్రికెట్ మైదానంలోకి అడుగు పెట్టనున్నాడు. ప్రమాదానంతర గాయాలన్నింటి నుంచి కోలుకొని పంత్ ఇప్పుడు పూర్తి ఫిట్‌గా మారాడని బీసీసీఐ ప్రకటించింది. అతను ఈనెల 22 నుంచి మొదలయ్యే ఐపీఎల్ 17వ సీజన్ టోర్నీలో బరిలోకి దిగే అవకాశం ఉందని స్పష్టం చేసింది. 2022 డిసెంబర్ 30న ఉత్తరాఖండ్‌లోని రూర్కీ వద్ద పంత్ కారు ప్రమాదానికి గురయ్యాడు. ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్‌గానే అతను ఐపీఎల్‌లో ఆడతాడు. 'కారు ప్రమాదం తర్వాత కోలుకునే ప్రయత్నంలో పంత్ 14 నెలల పాటు రీహాబిలిటేషన్‌లో ఉన్నాడు. ఇప్పుడు ఐపీఎల్-2024 కోసం పంత్ వికెట్ కీపర్ బ్యాటర్‌గా పూర్తిగా ఫిట్‌గా మారాడు. ఇటీవలే అతని జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)లో పంత్ ఫిట్‌నెస్ పరీక్షల్లో విజయవంతమయ్యాడు. దాంతో వైద్యబృందం 'రిటర్న్ టు ప్లే' అంటూ ఫిట్‌గా నిర్ధారించింది' అని బోర్డు స్పష్టం చేసింది. ఎన్‌సీఏలో సుదీర్ఘ సమయం పాటు పంత్ బ్యాటింగ్, కీపింగ్ ప్రాక్టీస్ చేస్తూ వచ్చాడు. అన్నీ సవ్యంగా సాగితే ఐపీఎల్ తర్వాత జరిగే టి20 ప్రపంచకప్ కోసం కూడా పంత్ పేరు పరిశీలించే అవకాశం ఉంది. మరోవైపు గతంలో ప్రకటించినట్లుగానే గాయం నుంచి కోలుకుంటున్న మొహమ్మద్ షమీ కూడా ఐపీఎల్‌కు దూరం కాగా... ఇటీవలే రంజీ ట్రోఫీ మ్యాచ్‌లో గాయపడిన పేసర్ ప్రసిధ్ కృష్ణ కూడా ఐపీఎల్ నుంచి తప్పుకున్నట్లు బోర్డు వెల్లడించింది.

సినిమా



• మృణాల్ ఠాకూర్, విజయ్ దేవరకొండ

కల్యాణి... వచ్చా వచ్చా...

'కల్యాణి.. వచ్చా వచ్చా...' అంటూ పాట పాడేస్తున్నారు విజయ్ దేవరకొండ. ఆయన హీరోగా పరశురామ్ పెట్ల దర్శకత్వం వహించిన చిత్రం 'ఫ్యామిలీ స్టార్'. మృణాల్ ఠాకూర్ హీరోయిన్. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌పై 'దిల్' రాజు, శిరీష్ నిర్మించారు. గోపీ సుందర్ సంగీతం అందించిన ఈ మూవీ నుంచి 'కల్యాణి.. వచ్చా వచ్చా...' అంటూ సాగే రెండో పాటని విడుదల చేశారు మేకర్స్. వివాహ వేడుకల్లో భాగంగా వచ్చే ఈ పాటకు అనంత శ్రీరామ్ సాహిత్యం అందించగా, మంగ్లీ, కార్తీక్ పాడారు. 'కల్యాణి... వచ్చా వచ్చా, పంచ కల్యాణి తెచ్చా తెచ్చా.. సింగారీ చెయ్యందించా, ఏనుగంబారీ సిద్ధంగుంచా..' అంటూ ఈ పాట సాగుతుంది. ''వినోదాత్మకంగా రూపొందిన చిత్రం ఇది. ఏప్రిల్ 5న తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ఈ చిత్రాన్ని రిలీజ్ చేస్తాం'' అన్నారు మేకర్స్. ఈ చిత్రానికి కెమెరా: కేయూ మోహనన్, క్రియేటివ్ ప్రొడ్యూసర్: వాసూ వర్మ.



అది ఉద్దేశపూర్వకంగా చేసినది కాదు

- అల్ పచినో

ఆస్కార్ అవార్డ్స్ ప్రదానోత్సవంలో నంబర్ వన్ అవార్డుగా 'ఉత్తమ చిత్రం' విభాగాన్ని భావిస్తారు. అందుకే ఈ విభాగాపు అవార్డును వేడుకలో చివరిగా ప్రకటిస్తారు. అలాగే వేడుకలో చివరి మూమెంట్స్ కాబట్టి ఏదో ఒక డ్రామా క్రియేట్ చేస్తారు. కానీ అలాంటి డ్రామా గడిచిన ఆదివారం (భారత కాలమానం ప్రకారం సోమవారం) లాస్ ఏంజిల్స్‌లో జరిగిన 96వ ఆస్కార్ అవార్డ్స్ వేడుకలో కనిపించలేదు. 'ఉత్తమ చిత్రం' అవార్డును ప్రకటించిన ప్రముఖ నటుడు అల్ పచినో చాలా సాదాసీదాగా వెల్లడించేశారు. పోటీలో ఉన్న పది చిత్రాల పేర్లు చెప్పకుండా.. అవార్డు సాధించిన చిత్రాన్ని ప్రకటించేశారు. కవర్‌ని మెల్లిగా తెరుస్తూ.. 'నా కళ్లకు 'ఆపెన్‌హైమర్' కనిపిస్తోందని సింపుల్‌గా ప్రకటించారు. ఇలా చేయడం పట్ల హాలీవుడ్‌లోని కొందరు నటీనటులు, ఇతర ప్రముఖులు విముఖత వ్యక్తపరుస్తున్నారు. ఈ విషయంపై మంగళవారం అల్ పచినో స్పందించారు. ''ఆస్కార్ వేడుకలో అవార్డు ప్రెజెంటర్‌గా పాల్గొనడాన్ని నేను గౌరవంగా భావిస్తున్నాను. ఇక వేడుకలో ఉత్తమ చిత్రం విభాగంలో విజేతగా నిలవడానికి పోటీ పడ్డ పది చిత్రాల పేర్లను నేను చదవకపోవడం పట్ల విమర్శలు వస్తున్నాయని తెలిసింది. కానీ ఇది నేను ఉద్దేశపూర్వకంగా చేసినది కాదు. అది ఆస్కార్ ప్రొడ్యూసర్ల నిర్ణయం. వేడుక ఆద్యంతం ఈ పది సినిమాల యూనిట్ వాళ్లు హైలైట్ అవుతూనే ఉన్నందువల్ల వారు ఇలా నిర్ణయించి ఉండొచ్చు. ఆస్కార్‌కు నామినేట్ కావడం అనేది ఎవరి జీవితంలోనైనా ఓ మంచి మైల్‌స్టోన్. ఫిల్మ్ ఇండస్ట్రీ వ్యక్తిగా నాకు ఈ విషయం తెలుసు. వారి పేర్లు ప్రస్తావించకపోవడం అనేది బాధకు గురి చేసే విషయమే. ఈ ఘటన పట్ల బాధపడిన వారికి నా సానుభూతిని తెలియజేస్తున్నాను'' అని చెబుతూ ఓ స్టేట్‌మెంట్‌ను విడుదల చేశారు అల్ పచినో. ఇక ఉత్తమ చిత్రం విభాగంలో 'ఆపెన్‌హైమర్', 'అమెరికన్ ఫిక్షన్', 'అనాటమీ ఆఫ్ ఎ ఫాల్', 'బార్బీ', 'ది హోల్డోవర్స్', 'కిల్లర్స్ ఆఫ్ ది ఫ్లవర్ మూన్', 'మేస్ట్రో', 'పాస్ట్ లీవ్స్', 'పూర్ థింగ్స్', 'ది జోన్ ఆఫ్ ఇంట్రెస్ట్' సినిమాలు పోటీ పడగా, 'ఆపెన్‌హైమర్' అవార్డు దక్కించుకుంది.



• ఫరియా అబ్దుల్లా, 'అల్లరి' నరేశ్

మరింత నవ్వించాలనే ఈ సినిమా చేశాను

- 'అల్లరి' నరేశ్

''నాన్నగారి (ఈవీవీ సత్యనారాయణ) 'ఆ ఒక్కటీ అడక్కు' సినిమాకి, మా 'ఆ ఒక్కటీ అడక్కు' చిత్రానికి ఎటువంటి సంబంధం లేదు. జీవితంలో సెటిల్ కాకుండా పెళ్లి చేసుకునే హీరో కథ నాన్నగారి సినిమాలో ఉంటుంది. మా మూవీలో జీవితంలో స్థిరపడినా పెళ్లి కాని హీరో కథ. నా బలం వినోదం. ఈసారి మరింత నవ్వించాలని 'ఆ ఒక్కటీ అడక్కు' సినిమా చేశాను'' అని 'అల్లరి' నరేశ్ అన్నారు. మల్లి అంకం దర్శకత్వంలో 'అల్లరి' నరేశ్, ఫరియా అబ్దుల్లా జంటగా నటించిన చిత్రం 'ఆ ఒక్కటీ అడక్కు'. రాజీవ్ చిలక నిర్మించారు. భరత్ లక్ష్మీపతి సహ నిర్మాతగా వ్యవహరించిన ఈ సినిమా ఈ వేసవిలో విడుదల కానుంది. కాగా ఈ మూవీ టీజర్‌ని హైదరాబాద్‌లో రిలీజ్ చేశారు. ఈ వేడుకలో 'అల్లరి' నరేశ్ మాట్లాడుతూ– ''ఆరోగ్యకరమైన కామెడీ ఉన్న ఎంటర్‌టైనర్ ఇది. మల్లిగారు క్లియర్ విజన్‌తో ఈ సినిమా తీశారు. రాజీవ్‌గారు ప్యాషన్‌తో నిర్మించారు'' అన్నారు. ''నిర్మాత కావాలన్న నా ఇరవై ఏళ్ల కల ఈ సినిమాతో నెరవేరింది'' అన్నారు రాజీవ్ చిలక. ''ఫ్యామిలీతో కలసి ఆనందంగా నవ్వుకుంటూ చూడదగ్గ చిత్రమిది'' అన్నారు మల్లి అంకం. ''ఈ సినిమాకి డైలాగ్స్ రాస్తున్నప్పుడు ఒక కిక్ వచ్చింది'' అన్నారు రచయిత అబ్బూరి రవి.

ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ షురూ



• సందీప్ కిషన్

సందీప్ కిషన్ హీరోగా కొత్త సినిమా ప్రకటన వచ్చింది. ఆయన నటించనున్న 30వ సినిమాకి 'ధమాకా' ఫేమ్ త్రినాథరావు నక్కిన దర్శకత్వం వహించనున్నారు. 'ఎస్‌కే 30' (వర్కింగ్ టైటిల్) పేరుతో ఈ చిత్రాన్ని ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్, హాస్య మూవీస్‌పై రాజేశ్ దండా నిర్మించనున్నారు. ''పూర్తి స్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందనున్న చిత్రమిది. ఈ మూవీకి ప్రసన్న కుమార్ బెజవాడ కథ, స్క్రీన్‌ప్లే, డైలాగ్స్ అందిస్తున్నారు. ఈ మూవీలో త్రినాథరావు నక్కిన, ప్రసన్న కుమార్‌ల మార్క్ వినోదం ఉంటుంది'' అన్నారు మేకర్స్.



• అనుపమ

ప్రేమలు చూసి నవ్వుతూనే ఉన్నాను

- ఎస్ఎస్ రాజమౌళి



• నస్లేన్, మమిత, రాజమౌళి, కార్తికేయ, అనిల్

''సాధారణంగా నేను ప్రేమకథలు, రొమాంటిక్ కామెడీ చిత్రాలను ఇష్టపడను. నాదంతా యాక్షన్, ఫైట్స్ స్టైల్. మలయాళ 'ప్రేమలు' సినిమా బాగుంది.. తెలుగులో రిలీజ్ చేస్తున్నానంటూ మా అబ్బాయి కార్తికేయ చెప్పడంతో.. ఏదో ఉత్సాహపడుతున్నాడులే అనుకున్నాను. సినిమాకి వెళ్లాక తొలి పది హేను నిమిషాల తర్వాతి నుంచి చివరి వరకూ నవ్వుతూనే ఉన్నాను'' అన్నారు ప్రముఖ దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి. నస్లేన్ కె. గఫూర్, మమిత బైజు, శ్యామ్ మోహన్, మాథ్యూ థామస్ కీలక పాత్రల్లో గిరీష్ ఏడీ దర్శకత్వం వహించిన చిత్రం 'ప్రేమలు'. మలయాళంలో హిట్‌గా నిలిచిన ఈ మూవీని ఎస్ఎస్ కార్తికేయ ఈ నెల 8న తెలుగులో విడుదల చేశారు. ఈ సందర్భంగా మంగళవారం సక్సెస్‌మీట్‌కి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఎస్ రాజమౌళి మాట్లాడుతూ– ''ప్రేమలు' మూవీకి డైలాగులను అద్భుతంగా రాశాడు ఆదిత్య. కొంచెం అసూయ, కొంచెం బాధతో ఈ మాటను ఒప్పుకోవాలి. మలయాళ నటీనటులందరూ చాలా బాగా యాక్ట్ చేస్తారు. 'ప్రేమలు'లోని నటీనటులు అద్భుతంగా నటించారు'' అన్నారు. ఈ కార్యక్రమంలో అతిథులుగా పాల్గొన్న సంగీతదర్శకుడు ఎంఎం కీరవాణి, దర్శకులు అనిల్ రావిపూడి, అనుదీప్ కూడా మాట్లాడారు.

సుబ్రమణ్యం వినోదాలు



• రావు రమేష్

వైవిధ్యమైన పాత్రలు, విలక్షణ నటనతో ప్రేక్షకుల్ని అలరిస్తున్న రావు రమేష్ 'మారుతినగర్ సుబ్రమణ్యం' సినిమాతో హీరోగా మారారు. లక్ష్మణ్ కార్య దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రావు రమేష్ సరసన ఇంద్రజ నటించారు. పీబీఆర్ సినిమాస్, లోకమాత్రే సినిమాటిక్స్‌పై బుజ్జి రాయుడు పెంట్యాల, మోహన్ కార్య నిర్మించారు. కాగా ప్రేక్షకులే ముఖ్య అతిథులుగా 'మారుతినగర్ సుబ్రమణ్యం' ఫస్ట్ లుక్ విడుదల చేశారు. ఈ సందర్భంగా రావు రమేష్ మాట్లాడుతూ– ''మా సినిమా భలే గమ్మత్తుగా చాలా బాగుంటుంది. నటుడిగా నాకు ఈ స్థాయిని, ఈ స్థానాన్ని ఇచ్చిన తెలుగు ప్రేక్షకులే మా మూవీ ఫస్ట్ లుక్ ఆవిష్కరిస్తే బాగుంటుందని రిలీజ్ చేయించాం'' అన్నారు. ''పూర్తి స్థాయి వినోదాత్మకంగా రూపొందిన చిత్రం ఇది. చక్కని భావోద్వేగాలు కూడా ఉన్నాయి'' అన్నారు లక్ష్మణ్ కార్య, బుజ్జి రాయుడు పెంట్యాల, మోహన్ కార్య. ఈ చిత్రానికి కెమెరా: ఎంఎస్ బాల్ రెడ్డి, లైన్ ప్రొడ్యూసర్: శ్రీహరి ఉదయగిరి, సహ నిర్మాతలు: రుషి మర్ల, శివప్రసాద్ మర్ల.

బహుమతిలాంటి సినిమా

విక్రమ్ తనయుడు ధ్రువ్ విక్రమ్, హీరోయిన్ అనుపమా పరమేశ్వరన్ జోడీగా నటించనున్నారు. ఈ స్పోర్ట్స్ డ్రామాలో ధృవ్‌కు జోడీగా అనుపమా పరమేశ్వరన్ నటించనున్నట్లు మంగళవారం చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఈ సినిమాకు మారి సెల్వరాజ్ దర్శకుడు. రజనీకాంత్‌తో 'కాలా', 'కబాలి' వంటి సినిమాలు తీసిన దర్శకుడు పా. రంజిత్ ఈ సినిమాకు ఓ నిర్మాత. ఈ నెలలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. ''నా కెరీర్‌కు ఓ మంచి బహుమతిలా ఈ చిత్రం ఉంటుందని భావిస్తున్నాను'' అని పేర్కొన్నారు అనుపమా పరమేశ్వరన్. ''కబడ్డీ ఆట మూలాలను తెలియజేసేలా ఈ సినిమా ఉంటుంది. మా టీమ్ సభ్యుల కెరీర్‌లో ఓ మైల్‌స్టోన్‌లా ఈ చిత్రం ఉంటుంది'' అని మారి సెల్వరాజ్ పేర్కొన్నారు. కబడ్డీ ప్లేయర్ మానతీ గణేశన్ జీవితం ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కుతోందనే టాక్ కోలీవుడ్‌లో వినిపిస్తోంది.

కాంబినేషన్ సెట్



• సల్మాన్ ఖాన్



• ఏఆర్ మురుగదాస్

బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్, తమిళ స్టార్ డైరెక్టర్ ఏఆర్ మురుగదాస్ కాంబినేషన్‌లో ఓ యాక్షన్ మూవీ ఖరారైంది. ''ప్రతిభావంతులు ఏఆర్ మురుగదాస్, నా మిత్రుడు, నిర్మాత సాజిద్ నడియాడ్‌వాలాతో నేను చేయనున్న ఈ కొత్త సినిమా నాకు చాలా స్పెషల్. 2025 ఈద్‌కు సినిమాను రిలీజ్ చేస్తాం'' అని సల్మాన్ ఖాన్ 'ఎక్స్'లో షేర్ చేశారు. ''సల్మాన్, సాజిద్‌లతో సినిమా చేయనుండటం హ్యాపీగా ఉంది'' అన్నారు ఏఆర్ మురుగదాస్.

వారసురాలు వస్తోంది

ప్రముఖ గాయకురాలు ఆశా భోంస్లే మనవరాలు జనై భోంస్లే నటిగా కెరీర్‌ను మొదలుపెట్టారు. హిందీలో 'భూమి', 'జునైద్' వంటి సినిమాలను నిర్మించిన సందీప్ సింగ్ దర్శకుడిగా మారి మెగాఫోన్ పట్టిన తొలి సినిమా 'ది ప్రైడ్ ఆఫ్ భారత్: ఛత్రపతి శివాజీ'. ఈ సినిమాలో లీడ్ రోల్ చేయనున్నారు జనై భోంస్లే. ''ఆశా భోంస్లే వారసురాలిగా జనై భోంస్లేను నా సినిమాతో పరిచయం చేస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది. జనై వాయిస్ చాలా బాగుంటుంది. సంగీతంలో ప్రావీణ్యం ఉంది. మంచి డ్యాన్సర్ కూడా. ఈ చిత్రంలో ఆమె ఛత్రపతి శివాజీ భార్య రాణి సాయి బాయీ పాత్రలో కనిపిస్తారు'' అని చెప్పుకొచ్చారు సందీప్. 2026లో ఈ సినిమా విడుదల కానుంది.



• జనై భోంస్లే

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	165	73,667
నిఫ్టీ ▲	3	22,336

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	16,196	▲	177
డోజోన్స్	38,923	▲	153
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,747	▲	79
డాక్స్	17,965	▲	219
షాంఘై	3,056	▼	13
నికాయ్	38,792	▼	23

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	65,566	▼	80
బంగారం (99.5 స్వచ్ఛత)	65,303	▼	80
వెండి (కేజీ)	72,675	▼	128

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	80.94	84.63
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	103.45	108.39
€	యూరో	ఒకటి	88.29	92.79
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	43.00	69.00
AUS$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	52.37	57.23
S$	సింగపూర్ డాలర్	ఒకటి	59.88	64.57
SAR	సౌదీ రియాల్	ఆమోదనీయత	21.16	22.74
UAE D	యూఏఈ దిర్హామ్	ఆమోదనీయత	21.64	23.43
¥	చైనా యువాన్	ఆమోదనీయత	10.41	12.49

మార్చి 18 నుంచి ఫ్లై91 సర్వీసులు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రాంతీయ విమానయాన రంగంలోకి ప్రవేశించిన ఫ్లై91.. వాణిజ్య సేవలను మార్చి 18 నుంచి ప్రారంభిస్తోంది. దీనిని పురస్కరించుకుని గోవా–అగట్టి మధ్య ప్రత్యేక విమానాన్ని మంగళవారం నడిపింది. తొలి దశలో గోవా, హైదరాబాద్, బెంగళూరు, సింధుదుర్గ్ మధ్య విమాన సర్వీసులు నడుపనున్నట్టు ఫ్లై91 ఎండీ, సీఈవో మనోజ్ చాకో తెలిపారు. ఆ తర్వాత అగట్టి (లక్షద్వీప్), పుణే, జల్గావ్, నాందేడ్ మధ్య సర్వీసులను జోడిస్తామన్నారు.

ఫార్మా సంస్థలకు కొత్త కోడ్



న్యూఢిల్లీ: హెల్త్‌కేర్ ప్రొఫెషనల్స్ లేదా వారి కుటుంబ సభ్యులకు బహుమతులు, విహార యాత్రలు వంటివి ఇవ్వకుండా ఫార్మా కంపెనీలు, వాటి పంపిణీదారులు, హోల్‌సేలర్లు, రిటైలర్లపై ఆంక్షలు విధిస్తూ కేంద్ర ఫార్మా విభాగం కొత్త నియమావళిని ప్రకటించింది. యూనిఫార్మ్ కోడ్ ఫర్ ఫార్మాస్యూటికల్స్ మార్కెటింగ్ ప్రాక్టీసెస్ (యూసీపీఎంపీ) 2024ను నోటిఫై చేసింది. దీని ప్రకారం ప్రిస్క్రైబ్ చేసేందుకు అర్హత లేని వారికి ఉచిత శాంపిల్స్ ఇవ్వడాన్ని కూడా నిషేధించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

13-3-2024	
విశాఖ	450–00
చిత్తూరు	483–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	433–00
విజయవాడ	433–00
రిటైల్ ధర (డజను)	72.00
12-3-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	410–00
వరంగల్	412–00
రిటైల్ ధర	4.70

జలన్ కల్రాక్ చేతికి జెట్ ఎయిర్‌వేస్

- యాజమాన్య బదిలీకి అనుమతి
- ఎన్‌సీఎల్‌ఏటీ బెంచ్ ఆదేశాలు



న్యూఢిల్లీ: ఆర్థిక సమస్యలతో మూతపడిన జెట్ ఎయిర్‌వేస్ రుణ పరిష్కార ప్రణాళికను దివాలా పరిష్కార అప్పీలేట్ ట్రిబ్యునల్(ఎన్‌సీఎల్‌ఏటీ) తాజాగా అనుమతించింది. జలన్ కల్రాక్ కన్సార్షియంకు కంపెనీ యాజమాన్యాన్ని బదిలీ చేసేందుకు ఎన్‌సీఎల్‌ఏటీ బెంచ్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. బదిలీని 90 రోజుల్లోగా పూర్తిచేయవలసిందిగా జెట్ ఎయిర్‌వేస్ పర్యవేక్షణ కమిటీకి సూచించింది. దీంతోపాటు పెర్ఫార్మెన్స్ బ్యాంక్ గ్యారంటీగా జలన్ కల్రాక్ కన్సార్షియం(జేకేసీ) చెల్లించిన రూ. 150 కోట్లను సర్దుబాటు చేయమంటూ జెట్ ఎయిర్‌వేస్ రుణదాతలను ఎన్‌సీఎల్‌ఏటీ బెంచ్ ఆదేశించింది. జెట్ ఎయిర్‌వేస్ కొనుగోలుకి గతంలో విజయవంతమైన బిడ్డర్‌గా జేకేసీ నిలిచిన సంగతి తెలిసిందే. అయితే జెట్ ఎయిర్‌వేస్ రుణదాతలు, జేకేసీ మధ్య యాజమాన్య బదిలీపై తలెత్తిన న్యాయ వివాదాలు ఏడాదికాలంగా కొనసాగుతున్నాయి.

ఇంతక్రితం కంపెనీ రుణదాతలు ఈ అంశంపై సుప్రీం కోర్టును ఆశ్రయించినప్పటికీ జోక్యం చేసుకునేందుకు తిరస్కరించింది. అంతేకాకుండా నిర్ణయాధికారాన్ని ఎన్‌సీఎల్‌ఏటీకి అప్పగించింది. ఆర్థిక సవాళ్లతో జెట్ ఎయిర్‌వేస్ సర్వీసులు 2019 ఏప్రిల్ నుంచి నిలిచిపోగా.. 2021లో జేకేసీ విజయవంత బిడ్డర్‌గా నిలిచింది. కాగా.. కోర్టు అనుమతించిన రుణ పరిష్కార ప్రణాళిక(రూ. 350 కోట్ల ఆర్థిక మద్దతు)లో భాగంగా జెట్ ఎయిర్‌వేస్‌కు గతేడాది జలన్ కల్రాక్ కన్సార్షియం రూ. 100 కోట్ల పెట్టుబడులను సమకూర్చింది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది(2024)లో కార్యకలాపాలను తిరిగి ప్రారంభించాలని జెట్ ఎయిర్‌వేస్ యోచిస్తోంది.

ఆర్‌బీఐ అంబుడ్స్‌మన్ స్కీములకు ఫిర్యాదుల వెల్లువ

2022-23లో 68% అప్..



ముంబై: రిజర్వ్ బ్యాంక్ అంబుడ్స్‌మన్ స్కీముల కింద వివిధ సమస్యలపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. 2022–23లో ఇవి 68 శాతం పెరిగి 7.03 లక్షలుగా నమోదయ్యాయి. మొబైల్/ఎలక్ట్రానిక్ బ్యాంకింగ్, రుణాలు, ఏటీఎం కార్డులు, క్రెడిట్ కార్డులు, పింఛను చెల్లింపులు, రెమిటెన్సులు మొదలైన వాటికి సంబంధించిన ఫిర్యాదులు వీటిలో ఉన్నాయి. ప్రజల్లో అవగాహన పెంచేందుకు చర్యలు తీసుకోవడం, ఆర్‌బీఐ–సమీకృత అంబుడ్స్‌మన్ స్కీము (ఆర్‌బీ–ఐవోఎస్) కింద దాఖలు చేసే ప్రక్రియను సరళతరం చేయడం తదితర అంశాలు ఫిర్యాదుల నమోదుకు దోహదపడ్డాయని అంబుడ్స్‌మన్ స్కీము వార్షిక నివేదిక పేర్కొంది. అత్యధికంగా 83.78 శాతం ఫిర్యాదులు (1,93,635) బ్యాంకులపై వచ్చాయి. అంబుడ్స్‌మన్ ఆఫీసులు 2,34,690 ఫిర్యాదులను హ్యాండిల్ చేశాయి. సమస్య పరిష్కారానికి పట్టే సమయం సగటున 33 రోజులకు మెరుగుపడింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం ఇది 44 రోజులుగా ఉంది.

రూ. 10 లక్షల నుంచి రీట్స్‌లో పెట్టుబడులు

స్మాల్ రీట్స్ నిబంధనలపై నోటిఫికేషన్



న్యూఢిల్లీ: రియల్టీ అసెట్స్‌లో కనీసం రూ. 10 లక్షల నుంచి పెట్టుబడి పెట్టేందుకు వీలు కల్పిస్తూ చిన్న, మధ్య స్థాయి రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్‌ల (ఎస్‌ఎం రీట్స్) ఫ్రేమ్‌వర్క్‌ను మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నోటిఫై చేసింది. ఇందుకోసం రీట్స్ నిబంధనలను సవరించింది. తాజా నోటిఫికేషన్ ప్రకారం ఎస్‌ఎం రీట్‌లో యూనిట్ కనీస ధర రూ. 10 లక్షలు లేదా సెబీ సూచించే విధంగా ఉంటుంది. అలాగే సదరు స్కీము కింద కొనుగోలు చేసే అసెట్ విలువ రూ. 50 కోట్లు–రూ. 500 కోట్ల మధ్యలో ఉండాలి.

ద్రవ్యోల్బణం దారికి... పరిశ్రమ పక్కకు!

- ఎకానమీ మిశ్రమ గణాంకాలు
- నాలుగు నెలల కనిష్టానికి ఫిబ్రవరి రిటైల్ ధరలు
- 3.8 శాతానికి పరిమితమైన జనవరి పారిశ్రామిక ఉత్పత్తి



న్యూఢిల్లీ: భారత్ స్థూల ఆర్థిక రంగానికి సంబంధించి మంగళవారం మిశ్రమ ఫలితాలు వెలువడ్డాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ద్రవ్య పరపతి విధాన కమిటీ కీలక రెపో రేటు (ప్రస్తుతం 6.5 శాతం) నిర్ణయానికి ప్రాతిపదిక అయిన రిటైల్ ద్రవ్యోల్బణం ఫిబ్రవరిలో 5.09 శాతంగా నమోదయ్యింది. గడచిన నాలుగు నెలల్లో ఇంత తక్కువ స్థాయి రిటైల్ ద్రవ్యోల్బణం ఇదే తొలిసారి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ)కి కేంద్రం నిర్దేశిస్తున్న వాస్తవిక లక్ష్యానికి (ప్లస్ 2 లేదా మైనస్ 2తో 4 శాతం) ఇంకా అధికంగా ఉన్నప్పటికీ.. నాలుగు నెలల కనిష్టానికి సూచీ దిగిరావడం గమనార్హం. అలాగే గరిష్ట లక్ష్యానికన్నా (6 శాతం) దిగువన ఉండడం హర్షణీయ పరిణామం. కాగా, జనవరిలో 8.3 శాతంగా ఉన్న ఫుడ్ బాస్కెట్ ధర, సమీక్షా నెల ఫిబ్రవరిలో 8.66 శాతానికి ఎగసింది. ఇక పారిశ్రామిక ఉత్పత్తికి సంబంధించిన సూచీ (ఐఐపీ) వృద్ధి 2024 జనవరిలో 3.8 శాతానికి మందగించింది. 2023 ఇదే నెలలో ఈ వృద్ధి రేటు 5.8 శాతంగా ఉంది. మొత్తం పారిశ్రామిక ఉత్పత్తిలో 70 శాతం వెయిటేజ్ ఉన్న తయారీసహా మైనింగ్, విద్యుత్ రంగాలు పేలవ పనితనాన్ని ప్రదర్శించినట్లు గణాంకాలు ,కార్యక్రమాల అమలు మంత్రిత్వశాఖ విడుదల చేసిన లెక్కలు తెలిపాయి. 2023 డిసెంబర్‌లో ఐఐపీ వృద్ధి రేటు 4.2 శాతంకాగా, నవంబర్‌లో 2.4 శాతం.

వివిధ రంగాలు ఇలా...(వృద్ధి/క్షీణ రేట్లు శాతాల్లో)

పరిశ్రమ	2024 జనవరి	2023 జనవరి	2023 డిసెంబర్
తయారీ	3.2	4.5	3.9
విద్యుత్	5.6	12.7	1.2
మైనింగ్	5.9	9.0	- 5.1
క్యాపిటల్ గూడ్స్	4.1	10.5	- 3.2
కన్జూమర్ డ్యూరబుల్స్	10.9	-8.2	4.8
కన్జూమర్ నాన్–డ్యూరబుల్స్	- 0.3	6.5	2.1
మౌలిక/నిర్మాణ	- 4.6	11.3	- 4.1
ప్రైమరీ గూడ్స్	2.9	9.8	4.6
ఇంటర్మీడియట్ గూడ్స్	4.8	1.4	3.4

- 2023 ఏప్రిల్ నుంచి 2024 జనవరి వరకూ చూస్తే... ఐఐపీ 5.9 శాతం పురోగమించింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఈ సూచీ 5.5 శాతంగా ఉంది.

మార్కెట్.. గణాంకాల అప్రమత్తత

స్వల్ప లాభాల ముగింపు

ముంబై: రిటైల్ ద్రవ్యోల్బణం, పారిశ్రామిక ఉత్పత్తి గణాంకాల వెల్లడి నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించడంతో సూచీలు మంగళవారం స్వల్ప లాభాలతో ముగిశాయి. ట్రేడింగ్‌లో 662 పాయింట్ల పరిధిలో కదలాడిన సెన్సెక్స్ చివరికి 165 పాయింట్ల లాభంతో 73,667 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 502 పాయింట్లు పెరిగి 74,004 వద్ద గరిష్టాన్ని అందుకుంది. నిఫ్టీ 197 పాయింట్ల రేంజ్‌లో కదలాడి 22,256 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని నమోదు చేసింది. ఆఖరికి మూడు పాయింట్ల లాభంతో 22,336 వద్ద నిలిచింది.



- ఇంటిగ్రేటెడ్ మార్కెటింగ్ సేవల సంస్థ ఆర్‌కే స్వామి లిస్టింగ్ నిరాశపరిచింది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర (రూ.288)తో పోలిస్తే 12.50% డిస్కౌంట్‌తో రూ.252 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్‌లో 14% నష్టపోయి రూ.248 వద్ద కనిష్టాన్ని తాకింది. చివరికి 9% నష్టంతో రూ.263 వద్ద స్థిరపడింది. కంపెనీ విలువ రూ.1,329 కోట్లుగా నమోదైంది.
- భారత్ హైవేస్ ఇన్విట్ ఐపీఓ లిస్టింగ్ పర్వాలేదనిపించింది. ఎన్‌ఎస్‌ఈలో ఇష్యూ ధర(రూ.100)తో పోలిస్తే ఒక శాతం ప్రీమియంతో రూ.101 వద్ద లిస్టయ్యింది. చివరికి 3% లాభపడి రూ.103 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ వాల్యుయేషన్ రూ. 4,567 కోట్లుగా నమోదైంది.



యుటిలిటీ వాహనాలదే హవా

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా 2024 ఫిబ్రవరిలో తయారీ కంపెనీల నుంచి డీలర్లకు చేరిన (హోల్‌సేల్) ప్యాసింజర్ వాహనాలు 3,70,786 యూనిట్లు నమోదయ్యాయి. 2023 ఫిబ్రవరితో పోలిస్తే హోల్‌సేల్‌లో గత నెలలో ప్యాసింజర్ వాహనాల అమ్మకాలు 11 శాతం పెరిగాయి. యుటిలిటీ వాహనాలకు బలమైన డిమాండ్ ఈ జోరుకు కారణమని సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫాక్చరర్స్ (సియామ్) తెలిపింది. సియామ్ గణాంకాల ప్రకారం.. హోల్‌సేల్‌లో ఫిబ్రవరిలో దేశవ్యాప్తంగా యుటిలిటీ వెహికల్స్ 38 శాతం దూసుకెళ్లి 1,91,435 యూనిట్లకు చేరాయి. ప్యాసింజర్ కార్లు 18 శాతం క్షీణించి 1,15,937 యూనిట్లకు పరిమితం అయ్యాయి.

భవిత

ఇకపై ఈ ప్రముఖ సాక్షి ఎడ్యుకేషన్ వాట్సప్ చానల్‌లో.. ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాల సమాచారం, ప్రవేశ పరీక్షలు, ఎడ్యుకేషన్ న్యూస్, టిప్స్, ఇంటర్ సమాచారం.. ఇలా ఎన్నో.. తాజా అప్‌డేట్స్ కోసం ఈ చానల్ ఫాలో అవ్వండి. ఇంకెందుకు ఆలస్యం ఇప్పుడే.. ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.. చానల్ ఫాలో అవ్వండి. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

ప్రభుత్వ ఉద్యోగాల సమగ్ర సమాచారం జాబ్ పాయింట్ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

జాబ్ పాయింట్

యూపీఎస్సీ–ఈఎస్ఐసీలో 1930 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులు

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ).. ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సురెన్స్ కార్పొరేషన్‌లో నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 1930
» అర్హత: బీఎస్సీ(ఆనర్స్) నర్సింగ్/బీఎస్సీ నర్సింగ్/పోస్ట్ బేసిక్ బీఎస్సీ నర్సింగ్ ఉత్తీర్ణత ఉండాలి. స్టేట్ నర్సింగ్ కౌన్సిల్‌లో నర్సు లేదా నర్సు, మిడ్‌వైఫ్‌గా రిజిస్టరై ఉండాలి లేదా డిప్లొమా(జనరల్ నర్సింగ్ మిడ్‌వైఫరీ), స్టేట్ నర్సింగ్ కౌన్సిల్‌లో నర్సు లేదా నర్సు, మిడ్‌వైఫ్‌గా రిజిస్టరై ఉండాలి. కనీసం యాభై పడకల ఆసుపత్రిలో ఒక సంవత్సరం పనిచేసిన అనుభవం ఉండాలి.
» వయసు: 27.03.2024 నాటికి అన్‌రిజర్వ్‌డ్/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 30 ఏళ్లు, ఓబీసీ అభ్యర్థులకు 33 ఏళ్లు, ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు 35 ఏళ్లు, దివ్యాంగ అభ్యర్థులకు 40 ఏళ్లు మించకూడదు.
» ఎంపిక విధానం: రాతపరీక్ష, సర్టిఫికేట్ వెరిఫికేషన్, మెడికల్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు. పెన్–పేపర్ విధానంలో పరీక్ష జరుగుతుంది. పరీక్ష సమయం రెండు గంటలు. పరీక్ష మాధ్యమం ఇంగ్లిష్.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 27.03.2024.
» దరఖాస్తు సవరణ తేదీలు: 28.03.2024 నుంచి 03.04.2024.
» వెబ్‌సైట్: https://upsc.gov.in

ఏపీపీఎస్సీ 37 ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ).. ఏపీ ఫారెస్ట్ సర్వీస్‌లో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 37
» అర్హత: అగ్రికల్చర్, బోటనీ, కెమిస్ట్రీ, కంప్యూటర్ అప్లికేషన్స్ / కంప్యూటర్ సైన్స్, ఇంజనీరింగ్ (అగ్రికల్చర్ / కెమికల్/ సివిల్/ కంప్యూటర్ /ఎలక్ట్రికల్ / ఎలక్ట్రానిక్స్/ మెకానికల్), ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఫారెస్ట్రీ, జియాలజీ, హార్టికల్చర్, మ్యాథమేటిక్స్, ఫిజిక్స్, స్టాటిస్టిక్స్, వెటర్నరీ సైన్స్, జువాలజీ సబ్జెక్ట్‌ల్లో డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. దీంతోపాటు శారీరక/వైద్య ప్రమాణాలు కలిగి ఉండాలి.
» వయసు: 01.07.2024 నాటికి 18 నుంచి 30 ఏళ్లు ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్‌కు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్లు సడలింపు ఉంటుంది.
» పరీక్ష విధానం: మొత్తం 150 మార్కులకు పరీక్ష ఉంటుంది. స్క్రీనింగ్ టెస్ట్ ఆఫ్‌లైన్ విధానంలో(ఓఎంఆర్) జరుగుతుంది. జనరల్ స్టడీస్–మెంటల్ ఎబిలిటీ అండ్ మ్యాథమేటిక్స్–75 మార్కులు, జనరల్ ఫారెస్ట్రీ–1, 2 సబ్జెక్ట్స్‌లో ఆబ్జెక్టివ్ టైప్ ప్రశ్నలు అడుగుతారు. మెయిన్ పరీక్ష సీబీటీ విధానంలో జరుగుతుంది.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:15.04.2024.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:05.05.2024
» వెబ్‌సైట్: https://psc.ap.gov.in

ఏపీపీఎస్సీ అసిస్టెంట్ డైరెక్టర్ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ).. ఏపీ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ సర్వీస్‌లో అసిస్టెంట్ డైరెక్టర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 07
» అర్హత: బీ.ఆర్క్ లేదా బీఈ(సివిల్) లేదా బీప్లానింగ్/బీటెక్(ప్లానింగ్) లేదా ఎంఏ(జాగ్రఫీ), పీజీ డిగ్రీ లేదా టౌన్ ప్లానింగ్‌లో డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
» పే స్కేల్: నెలకు రూ.61,960 నుంచి రూ.1,51,370.
» వయసు: 01.07.2024 నాటికి 18 నుంచి 42 ఏళ్లు ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్‌కు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్లు సడలింపు ఉంటుంది.
» ఎంపిక విధానం: కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ), కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్(సీపీటీ) ద్వారా ఎంపికచేస్తారు. మొత్తం 450 మార్కులకు పరీక్ష ఉంటుంది. ఆబ్జెక్టివ్ టైప్ ప్రశ్నలు ఉంటాయి. పేపర్–1(జనరల్ స్టడీస్ –మెంటల్ ఎబిలిటీ)–150 మార్కులు, పేపర్ –2(టౌన్ ప్లానింగ్–1)–150 మార్కులు, పేపర్–3(టౌన్ ప్లానింగ్–2)–150 మార్కులు ఉంటాయి. కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్ 100 మార్కులకు ఉంటుంది.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభ తేది: 21.03.2024
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది: 10.04.2024.
» వెబ్‌సైట్: https://psc.ap.gov.in

సెంట్రల్ వర్సిటీల్లో.. డిగ్రీకి మార్గం

ఇంటర్మీడియెట్ పూర్తి చేసుకొని ప్రముఖ విద్యాసంస్థల్లో బ్యాచిలర్ డిగ్రీలో చేరాలనుకునే విద్యార్థులకు చక్కటి అవకాశం.. కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్–అండర్ గ్రాడ్యుయేట్ (సీయూఈటీ–యూజీ)! ఈ పరీక్షలో స్కోర్‌తో దేశంలోని అన్ని సెంట్రల్ యూనివర్సిటీల్లోని డిగ్రీ కోర్సుల్లో ప్రవేశం పొందొచ్చు. డిగ్రీ కోర్సుల్లో చేరాలనుకునే విద్యార్థులకు ఉత్తమ వేదికలు సెంట్రల్ యూనివర్సిటీలు!! తాజాగా 2024-25 ప్రవేశాలకు సంబంధించి సీయూఈటీ–యూజీ–2024 నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నేపథ్యంలో.. సీయూఈటీ యూజీ వివరాలు, పరీక్ష విధానం, రాత పరీక్షలో రాణించేందుకు ప్రిపరేషన్ తదితర వివరాలు..

» సీయూఈటీ–యూజీ 2024 నోటిఫికేషన్ విడుదల
» మే 15 నుంచి 31వ తేదీ వరకు పరీక్షలు
» ఒకే స్కోర్‌తో పలు వర్సిటీలకు దరఖాస్తు అవకాశం

దేశంలో ప్రస్తుతం 44సెంట్రల్ యూనివర్సిటీలు ఉన్నాయి. వీటిల్లో చేరేందుకు వేర్వేరు పరీక్షలు రాయాల్సిన అవసరం లేదు. ఒకే ఒక్క పరీక్ష (సీయూఈటీ–యూజీ)లో స్కోర్ ఆధారంగా అన్ని కేంద్రీయ విశ్వవిద్యాలయాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. దీనివల్ల విద్యార్థులకు ఆర్థిక భారం, సమయాభావం వంటి సమస్యల నుంచి విముక్తి లభిస్తుంది.

అర్హతలు

ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత ఉండాలి. ఈ ఏడాది ద్వితీయ సంవత్సరం పరీక్షలకు హాజరవుతున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఎలాంటి గరిష్ఠ వయో పరిమితి నిబంధన లేదు.

సీయూఈటీ–యూజీ ఇలా

- సీయూఈటీ–యూజీ పరీక్ష.. మొత్తం 61 సబ్జెక్ట్‌లు/విభాగాల్లో పరీక్ష ఉంటుంది. 33 లాంగ్వేజ్‌లు, 27 డొమైన్ సబ్జెక్ట్స్, ఒక జనరల్ టెస్ట్ నిర్వహిస్తారు. పరీక్ష నాలుగు సెక్షన్‌లలో 200 మార్కులకు ఉంటుంది. సెక్షన్–1ఎ(లాంగ్వేజెస్)–50 ప్రశ్నలు, సెక్షన్–1బి(లాంగ్వేజెస్)–50 ప్రశ్నలు, సెక్షన్–2 (డొమైన్ సబ్జెక్ట్స్)–50 ప్రశ్నలు, సెక్షన్–3 జనరల్ టెస్ట్–60 ప్రశ్నలకు పరీక్ష నిర్వహిస్తారు.
- లాంగ్వేజ్ సబ్జెక్ట్ విభాగాలు, డొమైన్ సబ్జెక్ట్ విభాగంలో 50 ప్రశ్నలకు గాను 40 ప్రశ్నలు చొప్పున సమాధానం ఇస్తే సరిపోతుంది. జనరల్ టెస్ట్ పేరుతో 60 ప్రశ్నలు అడుగుతారు. వీటిలో 50 ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలి. పరీక్షకు లభించే సమయం 45 నిమిషాలు. మ్యాథమెటిక్స్, అప్లైడ్ మ్యాథమెటిక్స్, అకౌంటెన్సీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఎకనామిక్స్, కంప్యూటర్ సైన్స్, ఇన్ఫర్మేషన్ ప్రాక్టీసెస్‌ను ఎంచుకున్న వారికి జనరల్ టెస్ట్‌తో కలిపి 60 నిమిషాల్లో పరీక్ష రాసే అవకాశం కల్పిస్తారు. ప్రతి ప్రశ్నకు అయిదు మార్కులు కేటాయిస్తారు. ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కు నెగెటివ్ మార్కింగ్ నిబంధన ఉంటుంది.
- అభ్యర్థులు లాంగ్వేజెస్, డొమైన్ సబ్జెక్ట్స్, జనరల్ టెస్ట్ మూడు విభాగాలు కలిపి.. గరిష్ఠంగా ఆరు సబ్జెక్ట్‌లను ఎంచుకునే అవకాశం ఉంది. ఈ సబ్జెక్ట్‌లలో అభ్యర్థులు తమ అర్హతకు సరితూగే సబ్జెక్ట్‌లను ఎంచుకోవచ్చు. డొమైన్ సబ్జెక్ట్స్‌లో గరిష్ఠంగా ఆరు సబ్జెక్ట్‌లను ఎంచుకునే వీలుంది. నిబంధనలను అనుసరించి 4 లేదా 5 డొమైన్ సబ్జెక్ట్‌లను, ఒక జనరల్ టెస్ట్, ఒకటి లేదా రెండు లాంగ్వేజ్‌లను ఎంచుకోవచ్చు.

డొమైన్ సబ్జెక్ట్‌లు

మొత్తం 27 డొమైన్ సబ్జెక్ట్‌లు అందుబాటులో ఉన్న నేపథ్యంలో వాటి వివరాలు.. అకౌంటెన్సీ/బుక్ కీపింగ్; అగ్రికల్చర్; ఆంత్రోపాలజీ; బయాలజీ/బయోలాజికల్ స్టడీస్/బయోటెక్/బయోకెమిస్ట్రీ; బిజినెస్ స్టడీస్, కెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్, కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మాటిక్స్ ప్రాక్టీసెస్; ఎకనామిక్స్/బిజినెస్ ఎకనామిక్స్; ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్;ఫైన్ ఆర్ట్స్/విజువల్ ఆర్ట్స్/కమర్షియల్ ఆర్ట్; జాగ్రఫీ /జియాలజీ; హిస్టరీ; హోమ్‌సైన్స్; నాలెడ్జ్ ట్రెడిషన్ ప్రాక్టీసెస్ ఇండియా; లీగల్ స్టడీస్; మాస్ మీడియా/మాస్ కమ్యూనికేషన్; మ్యాథమెటిక్స్; పెర్ఫార్మింగ్ ఆర్ట్స్; ఫిజికల్ ఎడ్యుకేషన్/ఎన్‌సీసీ/యోగా; ఫిజిక్స్, పొలిటికల్ సైన్స్; సైకాలజీ; సంస్కృతం; టీచింగ్ ఆప్టిట్యూట్.



లాంగ్వేజ్ సబ్జెక్ట్‌లు

అస్సామీ, బెంగాలీ, ఇంగ్లిష్, గుజరాతీ, హిందీ, కన్నడ, మళయాలం, మరాఠీ, తమిళం, పంజాబీ, ఒడియా, తెలుగు, ఉర్దూ లాంగ్వేజ్ సహా మొత్తం 33 లాంగ్వేజ్ సబ్జెక్ట్‌లు అందుబాటులో ఉన్నాయి.

సెంట్రల్ వర్సిటీల ప్రవేశ విధానం

సీయూఈటీ–యూజీ స్కోర్ ఆధారంగా సెంట్రల్ యూనివర్సిటీలకు వేర్వేరుగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అభ్యర్థుల దరఖాస్తులను పరిశీలించిన తర్వాత ఆయా కేంద్రీయ విశ్వవిద్యాలయాలు అందుబాటులో ఉన్న సీట్లు, సీయూఈటీ స్కోర్ తదితరాల ఆధారంగా ప్రవేశాలు ఖరారు చేయనున్నాయి.

44 వర్సిటీలు.. తెలుగు రాష్ట్రాల్లో 5

సీయూఈటీ–యూజీ–2024 స్కోర్ ఆధారంగా జాతీయ స్థాయిలో మొత్తం 44 సెంట్రల్ యూనివర్సిటీల్లో ప్రవేశ అవకాశం లభిస్తుంది. తెలుగు రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్‌లో.. సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, నేషనల్ సాంస్క్రిట్ యూనివర్సిటీ; తెలంగాణలో యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, ఇంగ్లిష్ అండ్ ఫారెన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ, మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీలు ఈ ఏడాది సీయూఈటీ- యూజీ స్కోర్‌ను పరిగణనలోకి తీసుకోనున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

మరెన్నో ఇన్‌స్టిట్యూట్స్

సీయూఈటీ–యూజీ స్కోర్‌తో సెంట్రల్ యూనివర్సిటీలతోపాటు మరెన్నో ప్రముఖ ఇన్‌స్టిట్యూట్స్ కూడా ప్రవేశాలు కల్పిస్తున్నాయి. టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్, ఎన్ఐఐటీ యూనివర్సిటీ, బీఎంఎల్ ముంజాల్ యూనివర్సిటీ తదితర 50కు పైగా డీమ్డ్, ప్రైవేట్ యూనివర్సిటీలు కూడా ఈ పరీక్షలో స్కోర్ ఆధారంగానే గత ఏడాది ప్రవేశాలు కల్పించాయి.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 2024, మార్చి 26
- దరఖాస్తు సవరణ అవకాశం: మార్చి 28 -మార్చి 29
- అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్: మే రెండో వారంలో
- సీయూఈటీ–యూజీ పరీక్ష తేదీలు: మే 15 నుంచి మే 31 వరకు
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://exams.nta.ac.in/CUETUG

బెస్ట్ స్కోర్ సాధించాలంటే

పదో తరగతి, ఇంటర్మీడియెట్ అకడమిక్ పుస్తకాలను ఔపోసన పట్టాలి. డొమైన్ సంబంధిత సబ్జెక్ట్‌ల కోసం ఎన్‌సీఈఆర్‌టీ 12వ తరగతి పుస్తకాలను అధ్యయనం చేయాలి. లాంగ్వేజ్ సబ్జెక్ట్‌ల కోసం సంబంధిత లాంగ్వేజ్‌ల గ్రామర్‌పై అవగాహన పెంచుకోవాలి. అదే విధంగా వాక్య నిర్మాణం, ప్రెసిస్ రైటింగ్, ప్యాసేజెస్ రీడింగ్ ప్రాక్టీస్ చేయడమే కాకుండా.. సంబంధిత ప్రశ్నలను సాధన చేయాలి. దీంతోపాటు రీడింగ్ కాంప్రహెన్షన్, సంబంధిత లాంగ్వేజ్‌లో లిటరరీ ఆప్టిట్యూడ్, వొకాబ్యులరీలలో పట్టు సాధించాలి.

జనరల్ టెస్ట్

ఇందులో జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్, జనరల్ మెంటల్ ఎబిలిటీ, న్యూమరికల్ ఎబిలిటీ, క్వాంటిటేటివ్ రీజనింగ్, లాజికల్ అండ్ అనలిటికల్ రీజనింగ్ నైపుణ్యాలను పరిశీలించే విధంగా ప్రశ్నలు ఉంటాయి. అభ్యర్థులు హిస్టరీ, జాగ్రఫీ, పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్ పుస్తకాలను చదవాలి. అదే విధంగా కరెంట్ ఈవెంట్స్‌పై అవగాహన ఏర్పరచుకోవాలి. క్వాంటిటేటివ్ రీజనింగ్, జనరల్ మెంటల్ ఎబిలిటీ, న్యూమరికల్ ఎబిలిటీ, లాజికల్ అండ్ అనలిటికల్ రీజనింగ్ అంశాల్లో రాణించడానికి అర్థ గణిత అంశాలు, కోడింగ్–డీకోడింగ్, బ్లడ్ రిలేషన్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్, టైమ్ అండ్ డిస్టెన్స్, టైమ్ అండ్ వర్క్, నంబర్ సిస్టమ్స్‌పై అవగాహన పెంచుకోవాలి.




సెల్‌ఫోన్‌లతో పారాయణం!

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏటా రుత్వికులు ఆలయ ఆవరణలో వెయ్యి పారాయణాలు పఠనం చేస్తారు. ఈ ఏడాది 4వేల పారాయణాలు చేయాలని నిర్ణయించారు. ఈ క్రమంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకున్న రుత్విక్కులు సెల్‌ఫోన్‌లలో చూస్తూ పారాయణం చేయడం భక్తులకు ఆసక్తి కలిగించింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, యాదాద్రి భువనగిరి

బెస్ట్ ఇంగ్లిష్ స్పీకర్స్ ఉన్న దేశాలు

టుడేస్ గ్రాఫిక్





యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం గరుడ ముద్దలను గరుత్మంతుడి పటం వద్ద ధ్వజస్తంభం పైకి ఎగురవేసే పూజలు చేశారు. అనంతరం ఉత్సవాలకు దేవతలను మంత్రపూర్వకంగా ఆహ్వానించే పూజలను జరిపించారు.



మహిళల ప్రయాణం ఇక టీ-సేఫ్

- సురక్షితంగా గమ్యం చేరే వరకు పోలీసు పర్యవేక్షణ
- దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో డయల్ 100/112, యాప్, వెబ్‌పేజీ సేవలు
- స్మార్ట్‌ఫోన్లతో పాటు సాధారణ ఫోన్‌తోనూ టీ-సేఫ్ వినియోగం



టీ-సేఫ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో మంత్రులు సీతక్క, పొంగులేటి, కోమటిరెడ్డి, తుమ్మల,జూపల్లి, సురేఖ, రాజనర్సింహ, సీఎస్ శాంతికుమారి, డీజీపీ రవిగుప్తా, అదనపు డీజీ శిఖాగోయల్

సాక్షి, హైదరాబాద్: ఒంటరిగా ప్రయాణించే పౌరులు, ముఖ్యంగా మహిళలు సురక్షితంగా గమ్యస్థానం చేరే వరకు పర్యవేక్షించేలా దేశంలోనే మొదటి సారిగా తెలంగాణ పోలీసులు టీ-సేఫ్ సేవలను అందుబాటులోకి తెచ్చినట్టు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తెలిపారు. స్మార్ట్‌ఫోన్ లేకపోయినా, సాధారణ మొబైల్ ఫోన్ ఉన్నా..ఈ టీ-సేఫ్ సేవలను వినియోగించుకునే వీలుందని పేర్కొన్నారు. ఇది కేవలం ఒక యాప్ మాత్రమే కాదని, కీలకమైన సర్వీస్ అని అన్నారు. ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెడుతున్న మహిళా శక్తి విధానం ఆవిష్కరణలో భాగంగా మంగళవారం సచివాలయంలో టీ-సేఫ్‌ను సీఎం ప్రారంభించారు. మంత్రులు దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, డి.అనసూయ (సీతక్క), తుమ్మల నాగేశ్వర్‌రావు, జూపల్లి కృష్ణారావు, సీఎస్ శాంతికుమారి, డీజీపీ రవిగుప్తా, హోంశాఖ ముఖ్య కార్యదర్శి జితేందర్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 100 లేదా 112 నంబర్లకు డయల్ చేసి ఐవీఆర్ ఆప్షన్‌లో 8 నంబర్‌ను నొక్కడం ద్వారా టీ-సేఫ్ సేవలను వినియోగించుకోవచ్చని ముఖ్యమంత్రి తెలిపారు.

ఒక్కసారి సమాచారం ఇస్తే చాలు

స్మార్ట్ ఫోన్లు ఉన్న వారు గూగుల్ ప్లే స్టోర్ నుంచి యాప్ డౌన్‌లోడ్ చేసుకోవడం, లేదా టీ-సేఫ్ వెబ్‌పేజీ ద్వారా వీటిని వినియోగించుకోవచ్చని సీఎం తెలిపారు. దేశంలోనే తొలిసారిగా మహిళలు, చిన్నారుల సురక్షిత ప్రయాణం కోసం ఈ సేవలను అందుబాటులోకి తెచ్చిన తెలంగాణ పోలీస్ శాఖకు సీఎం అభినందనలు తెలిపారు. టీ-సేఫ్‌కు డయల్ 100 ద్వారా లేదా యాప్ ద్వారా ఒకసారి సమాచారం ఇస్తే సరిపోతుందని, మళ్లీ మళ్లీ అత్యవసర సేవల కోసం 100 నంబర్‌కు ఫోన్ చేయాల్సిన పని లేకుండా పోలీసులే నిర్ధారిత సమయంలోపు పౌరులను సంప్రదిస్తూ వారు సురక్షితంగా గమ్యం చేరే వరకు పర్యవేక్షిస్తారని తెలిపారు. అవసరమైతే లైవ్ ట్రాకింగ్ లింక్ ఆ పరిధిలోని ప్యాట్రో వాహనాలకు సైతం వెళుతుందని వివరించారు.

లైవ్ లొకేషన్ పంపే వీలు

టీ-సేఫ్ యాప్‌ను వినియోగించే పౌరులు ఆపదలో ఉన్నప్పుడు వారి లైవ్ లొకేషన్‌ను పోలీసులకు పంపే వీలు కూడా ఉందని రేవంత్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 791 ప్యాట్రో కార్లు, 1,085 బ్లూకోల్ట్స్ వాహనాలకు టీ-సేఫ్ అనుసంధానమై ఉంటుందని చెప్పారు. భవిష్యత్తులో మరింత సురక్షిత ప్రయాణం కోసం టీ-సేఫ్ యాప్ సేవలను ఇతర క్యాబ్, ప్రైవేటు ట్రాన్స్‌పోర్ట్ సేవల యాప్‌లకు అనుసంధానిస్తామని మహిళా భద్రత విభాగం అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సీఐడీ, మహిళా భద్రత విభాగం అదనపు డీజీ శిఖాగోయల్, ఇంటెలిజెన్స్ అదనపు డీజీ శివధర్‌రెడ్డి, శిక్షణ విభాగం అదనపు డీజీ అభిలాష బిస్త్, శాంతిభద్రతల అదనపు డీజీ సంజయ్ జైన్, ఇతర సీనియర్ ఐపీఎస్ అధికారులు కూడా పాల్గొన్నారు.

అత్యుత్తమ పర్యాటక నగరాల్లో హైదరాబాద్ ఒకటి

లైట్ అండ్ సౌండ్ లేజర్‌షోను ప్రారంభించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



లేజర్ షోను ప్రారంభిస్తున్న కిషన్‌రెడ్డి. చిత్రంలో జూపల్లి, వందేమాతరం శ్రీనివాస్, సునీత



రాంగోపాల్‌పేట(హైదరాబాద్): దేశంలోనే అత్యుత్తమ పర్యాటక నగరాల్లో హైదరాబాద్ ఒకటని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. మంగళవారం నెక్లెస్‌రోడ్డులోని సంజీవయ్య పార్కులో కేంద్ర పర్యాటక శాఖ సెంట్రల్ ఫైనాన్షియల్ అసిస్టెన్స్ స్కీమ్‌లో భాగంగా రూ.50 కోట్ల నిధులతో ఏర్పాటు చేసిన లైట్ అండ్ సౌండ్ లేజర్‌షోను రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి కిషన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రాడ్ కాస్ట్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్ సంస్థ ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేసిందన్నారు. ప్రస్తుతమున్న కోహినూర్ వజ్రపు కథ స్థానంలో మరిన్ని కథలను తీసుకొస్తూ మార్పులు చేసేందుకు రాష్ట్ర పర్యాటక శాఖ చొరవ తీసుకోవాలని కోరారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ టూరిజం అభివృద్ధి చెందితే ఆదాయంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. కోహినూర్ కథను రాజ్యసభ సభ్యుడు, సినీ రచయిత విజయేంద్ర ప్రసాద్ పర్యవేక్షణలో రచయిత కంచి రాయగా, సింగర్ సునీత గాత్రం, వందేమాతరం శ్రీనివాస్ సంగీతం అందించారు. ఇక్కడే నిర్మించిన మల్టీ పర్పస్ బాంక్వెట్ హాల్‌ను మంత్రులు ప్రారంభించారు.



ఆన్‌లైన్ గేమింగ్‌కు బానిసై.. మిషన్ భగీరథ ఏఈ మోసాల బాట

- పనులిప్పిస్తానని కాంట్రాక్టర్ల నుంచి రూ.8కోట్లు వసూలు
- నకిలీ వర్క్ ఆర్డర్లతో డబ్బు దండుకున్న వైనం
- ఉద్యోగం పోయి విదేశాలకు పరారవుతూ ఢిల్లీలో పోలీసులకు చిక్కిన నిందితుడు



రాహుల్‌బాబు

కీసర: ఆన్‌లైన్ గేమింగ్‌కు బానిసై డబ్బు కోసం అడ్డదారుల్లో అక్రమాలకు పాల్పడిన మిషన్ భగీరథ ఏఈని కీసర పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. పంచాయతీ రాజ్ శాఖలో మిషన్ భగీరథ ప్రాజెక్ట్ కీసర విభాగంలో ఏఈగా పనిచేస్తున్న గడ్డం రాహుల్ బాబు (33) క్రికెట్, క్యాసినో వంటి ఆన్‌లైన్ గేమ్స్‌లో బెట్టింగ్‌కు డబ్బులు పెట్టేవాడు. మొదట్లో లాభాలు రావడంతో ఆన్‌లైన్ గేమింగ్ ద్వారా రూ.కోట్లు ఆర్జించాలని అత్యాశకు పోయాడు. వర్క్ ఆర్డర్‌లో 50 నుంచి 70% వరకు పెట్టుబడి పెట్టాలని షరతు విధించాడు. డీఈఈ స్థాయిలో వర్క్ ఆర్డర్ రూ.2 లక్షల విలువగల పనులకే ఇస్తారు. కానీ, ఇతను రూ. 5లక్షల పనులకు వర్క్ ఆర్డర్లు సిద్ధం చేయాలని నిర్ణయించుకొన్నాడు. తిరిగి చెల్లిస్తానని చెప్పి కాంట్రాక్టర్ల నుంచి రూ.2.50లక్షల నుంచి రూ.3.50 లక్షల వరకు పనినిబట్టి వసూలు చేశాడు. ఈ డబ్బును ఎస్‌బీఐ ఉప్పల్ బ్రాంచ్‌లో డిపార్ట్‌మెంట్ ఖాతాలో జమ చేయించాడు. ఎస్ బీఐ సికింద్రాబాద్ హిమ్మత్‌నగర్ బ్రాంచ్‌లో ఇతడి స్నేహితురాలు సాయి ధరణికి అకౌంట్ ఉంది. పాత అధికారిక మొబైల్ నంబర్‌ను వినియోగించి సంబంధిత అధికారులకు తెలియకుండా ఈమె ఖాతా ద్వారా పై ఖాతాలో జమ చేసిన డబ్బును వాడుకునేవాడు. సాయిధరణితో డీఈఈ సంతకాన్ని ఫోర్జరీ చేసి కాంట్రాక్టర్లకు నకిలీ వర్క్ ఆర్డర్లు ఇచ్చాడు. దీంతో తాము మోసపోయామని తెలుసుకున్న కాంట్రాక్టర్ గోవింద్ అలియాస్ దలియాతో పాటు కొంతమంది డబ్బు వాపసు చేయాలని ఒత్తిడి చేశారు. ఉప్పల్ బ్రాంచ్‌లో జమచేసిన డబ్బును డ్రా చేసుకునేందుకు డీఈఈ గోకరి శ్రీవాణి సంతకం అవసరమైంది. ఆమె సంతకం చేసేందుకు రూ.లక్ష డిమాండ్ చేయడంతో చెల్లించాడు. కాంట్రాక్టర్లకు డబ్బు వాపసు ఇవ్వకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రాహుల్ ఉద్యోగం పోయింది. ఈ క్రమంలో విదేశాలకు పారిపోయేందుకు ప్రయత్నిస్తుండగా ఢిల్లీ విమానాశ్రయంలో సోమవారం రాత్రి పోలీసులకు చిక్కాడు. కాంట్రాక్టర్లు నుంచి రాహుల్ సుమారు రూ. 8 కోట్ల వసూలు చేసినట్లు సమాచారం. ఈ కేసులో డీఈఈ శ్రీవాణి, సాయి ధరణి కూడా నిందితులుగా ఉన్నారు.



Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.